ఈనాడు

విజయవాడ 7-12-2025 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 117

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 18+28

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



"నేను సిఫార్సు చేస్తున్నాను సెన్సొడైన్ ప్రోనామెల్ టూత్‌పేస్ట్"
రోజువారీ ఉపయోగించే ఎనామెల్ ప్రొటెక్షన్ టూత్‌పేస్ట్
నోటి యొక్క మంచి ఆరోగ్యం బలమైన ఎనామెల్‌తో ప్రారంభమవుతుంది. కానీ ఆహారం మరియు పానీయాలలోని ఆమ్లాలు ప్రతిరోజూ దానిని బలహీనపరుస్తాయి. మీ ఎనామెల్ అరిగిపోయిన తర్వాత, మీరు సున్నితత్వం, పసుపు రంగులోకి మారడం మరియు క్యావిటీ వంటి దంత సమస్యలను ఎదుర్కొంటారు.
సున్నితత్వం
పసుపు రంగు
క్యావిటీలు
డాక్టర్. ఆనంద్. ఎస్
పిహెచ్‌డి, పాలియన్ ఆర్ &డి నిపుణుడు
20 సంవత్సరాలకు పైగా చేసిన పరిశోధన ఆధారంగా, సెన్సొడైన్ ప్రోనామెల్ యొక్క అధునాతన శాస్త్రీయ ఫార్ములా ఖనిజాలు ఎనామెల్‌లోకి లోతుగా గ్రహించడంలో సహాయపడుతుంది, ఇది మీకు 2X స్ట్రాంగర్ ఎనామెల్ ప్రొటెక్షన్‌ను అందిస్తుంది.
HALEON
SENSODYNE PRONAMEL
Fresh Breath
Advanced Enamel Protection
DENTIST RECOMMENDED BRAND
2X స్ట్రాంగర్ ఎనామెల్ ప్రొటెక్షన్*
డైలీ ఎనామెల్ ప్రొటెక్షన్ టూత్‌పేస్ట్
Advanced Enamel Protection: Helps Rebuild, Strengthen & Refresh*
ప్రోనామెల్
గురించి మరింత తెలుసుకోండి

ఈనాడు




విజయవాడ 7-12-2025 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 117
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 8-00 పేజీలు 18+28 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఆ అంకెలు.. ఆందోళనా..?

సాగర్ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. ఆరోగ్యంపై శ్రద్ధ ఎక్కువే. కొలతలు వేసినట్లు ఆహారం తీసుకుంటారు. రోజూ వ్యాయామం చేస్తారు. బీపీ, షుగర్, బరువు చూసుకునే డిజిటల్ పరికరాలు కూడా ఇంట్లోనే పెట్టుకున్నారు.

ఇటీవల సాగర్ ఓ షాపింగ్ మాల్‌లో బీపీ చెక్ చేయిస్తే 140/90 కనిపించేసరికి ఆందోళన ఎక్కువైంది. ఇంటికి వచ్చిన తర్వాత కాసేపు విశ్రాంతి తీసుకొని మరోసారి చూసుకున్నారు. ఇప్పుడు సాధారణ స్థితికి రావడంతో హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు.



- ఎంతోమంది ఇలాంటి ఆందోళనకు గురవుతుంటారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిన తర్వాత చాలామంది ఇళ్లలో బీపీ, మధుమేహం, బరువు చూసుకునేందుకు డిజిటల్ పరికరాలు కొని పెట్టుకుంటున్నారు.
- తరచూ కొలతలు చూసుకుంటుంటారు. కొందరు మధుమేహులైతే ఉదయం, సాయంత్రం గ్లూకో మీటర్‌లో చెక్ చేసుకొని మందుల మోతాదు నిర్ణయించుకుంటారు.
- ఇలా చూసుకోవడం మంచిదైనా, అతి పనికిరాదంటున్నారు వైద్యనిపుణులు. తరచూ కొలతలు చూసుకోవడం, ఒకట్రెండు పాయింట్లు అటు, ఇటు అయితే ఆందోళన పడడం మంచిది కాదంటున్నారు.
- ఏ పరీక్షకైనా కొన్ని పద్ధతులు ఉంటాయని, వాటిని అనుసరిస్తేనే సరైన ఫలితాలు తెలుసుకోవచ్చని వివరిస్తున్నారు.

ఇంట్లోనే బీపీ చూసుకుంటున్నారా...



- రక్తపోటును చెక్ చేసుకునే డిజిటల్ బీపీ మానిటర్ ఇప్పుడు ప్రతి ఇంట్లో ఉంటోంది. అయితే దాన్ని వాడడంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే, లెక్కల్లో తేడా లేకుండా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.
- దుస్తులపై బీపీ కఫ్ కట్టడం వల్ల రక్తపోటు సిస్టాలిక్/డయస్టాలిక్ యూనిట్లలో తేడా వస్తుంది.
- బీపీ చూసుకునే ముందు కొన్ని నిమిషాలపాటు ప్రశాంతంగా ఉండాలి. చెకింగ్ సమయంలో మాట్లాడినా 10 యూనిట్ల వరకు తేడా వస్తుంది.
- చేతిని గుండెకు సమాంతరంగా ఉంచుకోవాలి. కూర్చొనే భంగిమ (మిగతా 3లో)


గిరిజనుల ఆదాయం పెంపునకు చర్యలు తీసుకోవాలి
అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం 13 లో

శ్రీవారి సొమ్ము కొట్టేసిన దొంగతో సెటిల్మెంట్ ఏంటి?

జగన్‌కు బాబాయ్ హత్యే చిన్నదైనప్పుడు పరకామణిలో చోరీ పెద్దది ఎలా అవుతుంది?

వైకాపా అధినేతకు దేవుడన్నా, భక్తుల మనోభావాలన్నా లెక్కలేదు

ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపాటు



ఈనాడు - అమరావతి

వైకాపా అధ్యక్షుడు జగన్‌కు.. సొంత బాబాయి హత్యే చిన్న విషయమైనప్పుడు, తిరుమల పరకామణిలో చోరీ ఘటన పెద్ద విషయం ఎలా అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. ఏమాత్రం నైతికత లేనివాళ్లే అలాంటి వ్యాఖ్యలు చేస్తారని మండిపడ్డారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు శనివారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పరకామణిలో చోరీ చాలా చిన్నదంటూ జగన్ చేసిన వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించగా.. "జగన్ వ్యాఖ్యలు భక్తుల మనోభావాల్ని దెబ్బతీసేలా ఉన్నాయి. జగన్‌కు దేవుడన్నా, భక్తులన్నా, ఆలయాల పవిత్రతన్నా లెక్కలేదు. దొంగతనం తప్పుకాదని చెప్పే వాళ్లను ఏమనాలి? దొంగతనం చేసిన వ్యక్తి డబ్బులు కట్టాడు కదా, తప్పేముందని జగన్ అనైతికంగా వాదిస్తున్నారు. బాబాయి హత్య అంశాన్నే జగన్ సెటిల్ చేసుకుందామని చూశారు. పరకామణిలో చోరీ వ్యవహారాన్నీ సెటిల్ చేయాలనుకున్నారు. స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలు, ముడుపులు కొట్టేసిన దొంగతో సెటిల్మెంట్ ఏంటి? రూ.72 వేలు చిన్న దొంగతనమని జగన్ అంటున్నారు. చోరీ చేసిన వ్యక్తి స్వామివారికి రూ.14 కోట్ల విలువైన ఆస్తులు రాసిచ్చేందుకు సిద్ధపడ్డారంటే ఎంత దోచేసి ఉంటారు? దేవుడి హుండీలో చోరీ చిన్న తప్పా? దాన్ని సెటిల్ చేయడం మహాపాపం కాదా?" అని మండిపడ్డారు. జగన్ వ్యాఖ్యలపై అన్ని వర్గాల ప్రజల్లోనూ తీవ్ర ఆవేదన కనిపిస్తోందని, వర్గాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా అందరూ ఆ వ్యాఖ్యల్ని తప్పు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. శ్రీవారి ఆలయంలో ప్రతి అంశం భక్తుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉందన్నారు.

ప్రశాంతంగా ఉండే జిల్లాలనూ నేరస్థులకు అడ్డాలుగా మార్చేశారు

రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో ఎలాంటి మొహమాటాలు లేవని, ఎవరు తప్పు చేసినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నేరస్థులను పెంచి పోషించారని, ప్రశాంతంగా ఉండే ప్రాంతాలను కూడా నేరమయం చేశారని (మిగతా 3లో)

నకిలీ మద్యం తయారీ కేంద్రాలు పెట్టించింది జోగి రమేషే

అద్దేపల్లి జనార్దన్‌రావు, మిగతా నిందితులతో కలిసి నేరపూరిత కుట్ర

నకిలీ మకిలిని కూటమి ప్రభుత్వానికి పూయాలనే దురుద్దేశం

ప్రలోభపెట్టి జనార్దన్‌రావును పావుగా వాడుకున్న జోగి

ప్రాథమిక అభియోగపత్రంలో సిట్ వెల్లడి



ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ములకలచెరువు, ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం తయారీ కేంద్రాలు ఏర్పాటుచేయించింది వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేషేనని (ఏ-18) సిట్ నిగ్గుతేల్చింది. ప్రధాన నిందితుడైన అద్దేపల్లి జనార్దన్‌రావుకు (ఏ-1) రూ.3 కోట్లు ఇస్తానని ప్రలోభపెట్టి పావుగా వాడుకుని నేరపూరిత కుట్ర నడిపించినట్లు గుర్తించింది. ఈ నకిలీ మకిలిని కూటమి ప్రభుత్వానికి పూయాలనే దురుద్దేశంతో ఈ కుట్రకు పాల్పడినట్లు వెల్లడించింది. నకిలీ మద్యం తయారీ కేంద్రాల ఏర్పాటు సమాచారాన్ని ఎక్సైజ్ అధికారులకు చేరవేసి వాటిపై దాడులు చేయించడం, అంతకుముందే అద్దేపల్లి జనార్దన్‌రావును ఆఫ్రికాకు పంపించడం లాంటివన్నీ జోగి రమేషే చేశారని తెలిసింది. ఈ మేరకు తాజాగా దాఖలుచేసిన 55 పేజీల ప్రాథమిక అభియోగపత్రంలో సిట్ ఈ వివరాలన్నీ ప్రస్తావించింది. 8 మంది నిందితులపై అభియోగాలు మోపింది. నకిలీ మద్యం దందా వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.9కోట్ల నష్టం వాటిల్లినట్లు పేర్కొంది.

వైకాపా హయాంలోనూ..

జోగి రమేష్, అద్దేపల్లి జనార్దన్‌రావు కుటుంబాలు చిన్నతనం నుంచే ఇబ్రహీంపట్నంలో ఒకేచోట ఉండేవి. వీరిమధ్య సన్నిహిత సంబంధాలున్నాయి. జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాము (ఏ-19) 2006-19 మధ్య స్వర్ణబార్‌లో భాగస్వాములు. 2019లో దాని పేరు చెర్రీస్ బార్‌గా మార్చారు. వీరిద్దరి సహకారంతోనే జనార్దన్‌రావు 2013లో బాలాజీ బార్‌ను కొన్నారు. తర్వాత దాని పేరును ఏఎన్ఆర్ రెస్టారెంట్ అండ్ బార్‌గా మార్చారు. 2017లో ఇబ్రహీంపట్నం బార్ యజమానులంతా సిండికేట్‌గా ఏర్పడ్డారు. అందులో జోగి రమేష్, రాములు కీలకం. 2019 ఎన్నికలు జరిగేవరకూ ఈ సిండికేట్ కొనసాగింది. (మిగతా 14లో)

స్మార్ట్ ప్రశ్న.. క్లిక్కుతో జవాబు



ప్రభుత్వ బడుల్లో క్లికర్ ఆధారిత అభ్యసనం

రియల్‌టైంలో విద్యార్థి సామర్థ్యం మదింపు

తల్లిదండ్రులకు లీప్‌యాప్‌లో హోం వర్క్ నోటిఫికేషన్

3,921 తొలుత పాఠశాలల్లో అమలు

ఈనాడు - అమరావతి

తరగతిలో ఎంత మంది విద్యార్థులు పాఠాలు అర్థం చేసుకుంటున్నారు? ఎవరెవరికి పునశ్చరణ తరగతులు అవసరం? చదువులో ఎంతమంది ఏ స్థాయిలో ఉన్నారు?.. ఇవన్నీ తెలుసుకోవాలంటే ఇకపై నెలవారీ పరీక్షల వరకు ఆగాల్సిన పని లేదు. చెప్పిన పాఠాన్ని విద్యార్థులు ఎంతవరకు అర్థం చేసుకున్నారో తెలుసుకోవడానికి క్లికర్ విధానాన్ని తీసుకొస్తున్నారు. పాఠం చెప్పి, దానిపై వీడియో చూపించి, పిల్లల్ని ప్రశ్నలడుగుతారు. ప్రతి విద్యార్థీ తమ చేతిలో ఉన్న క్లికర్‌తో సమాధానం చెప్పాలి. ప్రపంచప్రఖ్యాత హార్వర్డ్, ఎంఐటీ విశ్వవిద్యాలయాలు.. సింగపూర్, ఫిన్లాండ్‌లాంటి దేశాల్లో పాఠశాలల్లో వినియోగిస్తున్న క్లికర్ ఆధారిత ఇంటరాక్టివ్ క్లాస్‌రూమ్ రెస్పాన్స్ సిస్టంను సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ (మిగతా 3లో)

ప్రయోజనాలేంటి?
- ప్రతి విద్యార్థి స్పందన తెలుసుకోవచ్చు
- విద్యార్థి అభ్యసన సామర్థ్యం, అవగాహన స్థాయిపై రియల్‌టైంలో అంచనా
- తక్షణ ఫీడ్‌బ్యాక్
- తప్పు జవాబు చెప్పిన విద్యార్థికి అవసరమైతే మళ్లీ ఆ కాన్సెప్ట్ వివరించి చెప్పొచ్చు

జనవరి నాటికి శ్రీకారం
- జనవరి నాటికి 3,921 ప్రభుత్వ పాఠశాలల్లోని తొమ్మిదో తరగతి విద్యార్థులకు అమలు
- ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని తరగతుల్లో అమలుకు ప్రణాళిక



ఇండిగో మూల్యం చెల్లించాల్సిందే



- నేటి ఉదయం 8లోపు సొమ్ము వాపసు జరగాలి
- 48 గంటల్లోపు ప్రయాణికుల ఇళ్లకే లగేజీ చేర్చాలి
- దర్యాప్తు నివేదిక ఆధారంగా చర్యలు
- 'ఈనాడు-ఈటీవీ'తో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ఈనాడు, దిల్లీ: విమానయాన సిబ్బంది పనిగంటలపై పరిమితులు (ఫ్లైట్ డ్యూటీ టైం లిమిటేషన్స్-ఎఫ్‌డీటీఎల్) విధిస్తూ 2024 జనవరిలో జారీ చేసిన నిబంధనలను ఈ నవంబరు 1 నుంచి అన్ని విమానయాన సంస్థలూ అమలు చేసినప్పటికీ ఒక్క ఇండిగోతోనే సమస్య వచ్చిందని పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఆ సంస్థ ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోవడమే దీనికి కారణమన్నారు. ప్రయాణికులను ఇబ్బందిపెట్టిన ఇండిగో తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని హెచ్చరించారు. డీజీసీఏ విచారణ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇండిగోకు తాత్కాలికంగా ఎఫ్‌డీటీఎల్ నుంచి మినహాయింపు ఇచ్చామని, ఫిబ్రవరి నుంచి వాటిని కచ్చితంగా అమలు చేయాల్సిందేనని స్పష్టంచేశారు. ఇండిగో విమానాల రద్దు కారణంగా మూడురోజులుగా తలెత్తిన పరిస్థితులపై ఆయన శనివారం 'ఈనాడు-ఈటీవీ'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లో..

గుత్తాధిపత్యం కారణం కాదు

విమానయానరంగంలో గుత్తాధిపత్యం కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందన్న ప్రతిపక్షాల విమర్శలు వాస్తవం కాదు. (మిగతా 3లో)

రూ.లక్షవరకు చేరిన ఛార్జీల్ని ఎలా నియంత్రిస్తారు?

మిగతా విమానయాన సంస్థలు అమాంతం ఛార్జీలు పెంచకుండా వాటిపై పరిమితి విధిస్తూ ఉత్తర్వులు జారీచేశాం. 500 కి.మీ., 500-1,000 కి.మీ., 1,000-1,500 కి.మీ., 1,500 కి.మీ.పైన ఉన్న వాటిని వేర్వేరుగా విభజించి వరసగా రూ.7వేలు, రూ.12వేలు, రూ.15వేలు, రూ.18వేల గరిష్ఠ పరిమితి విధించాం. అన్ని ఎయిర్‌లైన్స్‌కూ ఇవి వర్తిస్తాయి. సోమవారానికల్లా విమాన సర్వీసులను సాధారణ స్థితికి తీసుకురావాలని ఇండిగోకు షరతు విధించాం. ఆ సంస్థ మరో రెండ్రోజుల గడువు కోరుతోంది.

ఛార్జీలు పెంచితే కఠిన చర్యలు

- విమాన టికెట్ల ధరలపై కేంద్రం ఆగ్రహం
- కొనసాగుతున్న సంక్షోభం.. ఇండిగో సీఈవోకు షోకాజ్
- ఐదో రోజూ 800కు పైగా విమాన సర్వీసుల రద్దు
- రంగంలోకి రైల్వే.. 84 ప్రత్యేక రైళ్లు నడపాలని నిర్ణయం

దిల్లీ/ముంబయి: ఇండిగో ఎయిర్‌లైన్స్ సంక్షోభం కొనసాగుతోంది. ఆ సంస్థ విమాన సర్వీసులకు వరుసగా ఐదో రోజూ తీవ్ర అంతరాయం కలిగింది. 800కు పైగా విమానాలను ఆ సంస్థ శనివారం రద్దు చేసింది. ఈ సంఖ్యను రానున్న రోజుల్లో గణనీయంగా తగ్గిస్తామని తెలిపింది. ప్రభుత్వం కూడా అంతరాయాలపై కీలక ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో సాధారణ పరిస్థితి నెలకొందని పౌర విమానయాన శాఖ (మిగతా 3లో)

మనదే సిరీస్



విశాఖలో చెలరేగిన టీమ్‌ఇండియా

దక్షిణాఫ్రికాపై ఘనవిజయం

కలిసొచ్చిన విశాఖపట్నంలో టీమ్‌ఇండియా రెచ్చిపోయింది. సిరీస్ ఫలితాన్ని తేల్చిన మూడో వన్డేలో 9 వికెట్ల తేడాతో ఘనవిజయం నమోదు చేసింది. మొదట క్వింటన్ డికాక్ (106; 89 బంతుల్లో 8×4, 6×6) శతకం సాయంతో దక్షిణాఫ్రికా 270 పరుగులు చేసింది. లక్ష్యాన్ని భారత్ 39.5 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (116 నాటౌట్; 121 బంతుల్లో 12×4, 2×6) వన్డేల్లో తొలి సెంచరీ సాధించగా.. సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ (75; 73 బంతుల్లో 7×4, 3×6), విరాట్ కోహ్లి (65 నాటౌట్; 45 బంతుల్లో 6×4, 3×6) అర్ధశతకాలతో అదరగొట్టారు. ఈ విజయంతో సిరీస్‌ను భారత్ 2-1తో సొంతం చేసుకుంది. విశాఖలో 11 వన్డేలాడిన భారత్‌కు.. ఇది 8వ విజయం.

వివరాలు ఛాంపియన్ లో..

ఇదీ సంగతి!



చోరీసొత్తు తిరిగిచ్చినందుకు నాకు శాలువాకప్పి సన్మానం చేయాల్సిందిపోయి నన్నే దొంగ అంటారా?!

మొక్కకూ ఓ లెక్కుంది!

- కొనే వేళ.. ఆరోగ్యంగా ఉందా లేదా సరి చూసుకోండి!
- జాగ్రత్తతోనే నకిలీలకు అడ్డుకట్ట
- కూరగాయ పంటల నారుకు రసీదులు తీసుకోవాలి
- నర్సరీల నియంత్రణ చట్టం పరిధిలోనే కొనాలి

ఈనాడు - అమరావతి

మిరప, టమాటా, కొబ్బరి, ఆయిల్‌పామ్, కోకో సహా చాలారకాల ఉద్యాన, పండ్ల తోటల సాగుకు రైతులు నర్సరీలపైనే ఆధారపడుతున్నారు. కొద్దిపాటి నేలలో సేద్యం చేయాలన్నా మొక్కల కొనుగోలుకే రూ.వేలల్లో వెచ్చిస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు, కూలీ ఖర్చులు వెరసి పెట్టుబడి రూ.లక్షల్లో అవుతుంది. ఆ మొక్క నిర్ణీత కాలానికి పూత, పిందె, కాయ, ఫలం అందిస్తేనే.. (మిగతా 3లో)



తల్లి మొక్క చరిత్ర చదవాలి

పండ్ల మొక్కల విషయంలో తల్లి మొక్క (మదర్ ప్లాంట్) చరిత్ర కీలకం. చాలా నర్సరీలు అందుబాటులో ఉన్న రకాలతో అంటుకట్టి మొక్కల్ని అమ్మేస్తున్నాయి. కానీ, సాధారణ నర్సరీలతో పోలిస్తే అంటుకట్టిన మొక్కలు అమ్మే నర్సరీలకు ప్రత్యేక లైసెన్స్ ఉండాలి.

➤ ప్రతి పండ్లజాతి మొక్కకు సంబంధించి దాని తల్లి మొక్క రికార్డు ఉండాలి. కాయ పరిమాణం, రంగు, రుచి, దిగుబడి కాలం, మొక్క జీవితకాలం, తెగుళ్ల నిరోధకత, పెరిగే విస్తీర్ణం తదితర వివరాలన్నీ నమోదై ఉండాలి.

➤ నర్సరీలో అంటుకట్టిన ప్రాంతం భూమిపైనే ఉండాలి. నాటాక కూడా నేలపైనే ఉండాలి. అక్కడ వేరు, కాండం, తల్లి మొక్క భాగం పూర్తిగా కలిసిపోయి ఉండాలి. చీలి, ఉబ్బి ఉండకూడదు.

➤ మామిడి, బత్తాయి, నిమ్మ, సపోట, జీడిమామిడి తదితర పండ్ల మొక్కలైతే ఏడాది నుంచి ఏడాదిన్నర వయసున్న వాటిని ఎంచుకోవాలి. కొబ్బరి మొక్క ఆకులు విచ్చుకోకూడదు. టెంక పూర్తిగా భూమిలో ఉండకూడదు.

➤ మొక్కలు బలహీనంగా, ఒకవైపు వంగి ఉండకూడదు. కాండం బలంగా ఉండాలి. మూడడుగులపైన కొమ్మలు(పంగ) వచ్చిన మొక్కల్ని ఎంచుకోవాలి.

➤ పాలీ కవర్లలో పెంచినవే కొనాలి. నేలలో పెంచినవైతే తవ్వేటప్పుడు వేర్లు తెగిపోయే ప్రమాదముంది.



ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డికి శిక్ష

నెల రోజుల జైలు, రూ.2వేల జరిమానా

- కోర్టు ఉత్తర్వులంటే ఆయనకు గౌరవం తక్కువ
- కనికరం చూపితే న్యాయవ్యవస్థకు నష్టం
- హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- అప్పీల్‌కు వీలుగా తీర్పు అమలు సస్పెన్షన్



ఈనాడు, అమరావతి: కోర్టు ఉత్తర్వులను ధిక్కరించినందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి(వీసీ) ప్రసాదరెడ్డిపై హైకోర్టు కన్నెర్ర చేసింది. కోర్టుధిక్కరణ కేసులో ఆయనకు నెలరోజుల సాధారణ జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించింది. కోర్టు ఉత్తర్వులంటే ప్రసాదరెడ్డికి లెక్కలేదని, విచారణ సందర్భంగా సొంత తెలివితేటలు వాడుతూ, మొండివైఖరి అవలంబించారని ఆక్షేపించింది. కోర్టు ఆదేశాలను వరుసగా ఉల్లంఘించారని, ఇలాంటి వ్యవహార శైలి న్యాయ పరిపాలనకు తీవ్ర నష్టమని తెలిపింది. కోర్టు ఆదేశాలంటే ఆయనకు గౌరవం తక్కువని వ్యాఖ్యానించింది. వీసీ బాధ్యతల నుంచి వైదొలిగేవరకు కోర్టు ఉత్తర్వులను అమలుచేయలేదని పేర్కొంది. కొత్త వీసీ వచ్చాక కోర్టు ఉత్తర్వులను అమలుచేశారని (మిగతా 3లో)

గవర్నర్‌తో చంద్రబాబు భేటీ



ఈనాడు, అమరావతి: గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. లోక్‌భవన్‌లో శనివారం ఈ భేటీ జరిగింది. రాష్ట్రంలో తాజాగా చోటుచేసుకున్న పరిణామాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది.

60.72% ఎంబీబీఎస్ సీట్లు అమ్మాయిలకే

కన్వీనర్, యాజమాన్య కోటాల్లోనూ వీరిదే హవా

ఈనాడు, అమరావతి: తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నీట్‌లో మంచి ర్యాంకుల కోసం అమ్మాయిలు కష్టపడి చదివారు. అధికశాతం ఎంబీబీఎస్ సీట్లు దక్కించుకున్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ ప్రవేశాల్లో 60.72% సీట్లు అమ్మాయిలకే దక్కాయి. గత రెండేళ్లతో పోలిస్తే ఈసారి అమ్మాయిల ప్రవేశాలు 3.66% పెరిగాయి. ఆ మేరకు అబ్బాయిల ప్రవేశాలు తగ్గాయి. కన్వీనర్ కోటా (61.50%), యాజమాన్య కోటా (59.17%)లోనూ అమ్మాయిల ప్రవేశాలే అధికం. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ముగిసింది. ఆయా వివరాలు వర్సిటీ రిజిస్ట్రార్ రాధికారెడ్డి ప్రభుత్వానికి నివేదించారు.

మూడేళ్లలో ఎంబీబీఎస్ ప్రవేశాలు ఇలా..

విద్యా సంవత్సరం	మొత్తం సీట్లు	అబ్బాయిలు(%)	అమ్మాయిలు(%)
2023–24	6,028	2,589 (42.95)	3,439 (57.05)
2024–25	6,035	2,537 (42.04)	3,498 (57.96)
2025–26	6,430	2,526 (39.28)	3,904 (60.72)

37 మంది ఎమ్మెల్యేల పనితీరు మెరుగుపడాలి

- ప్రతి నియోజకవర్గంలోనూ నాలుగైదు మార్గాల్లో సర్వే చేయిస్తున్నా..
- వారంలో లోక్‌సభ కమిటీ సభ్యుల పేర్లు నిర్ణయించాలి
- పార్టీ ముఖ్యనేతలతో చంద్రబాబు భేటీ
- తనపై రాజకీయ ప్రేరేపిత తప్పుడు కేసులనే.. కోర్టులు కొట్టివేస్తున్నాయని వ్యాఖ్య

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గం నుంచి నాలుగైదు మార్గాల్లో సర్వే చేయించి నివేదికలు తెప్పించుకుంటున్నా. దాని ప్రకారం ఇంకా 37 మంది ఎమ్మెల్యేల పనితీరు మెరుగుపడాల్సి ఉంది. ఆయా నియోజకవర్గాల మీద ప్రత్యేకదృష్టి పెట్టామ'ని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. నిరంతర సమీక్షలు, ఒక్కొక్కరితో ముఖాముఖి సమావేశాల ఫలితంగా ఎమ్మెల్యేలు, నేతల పనితీరు మెరుగైందని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ప్రతి శుక్రవారం పార్టీ నాయకులతో సమావేశాలు, ప్రజల నుంచి వినతుల స్వీకరణ, పింఛన్ పంపిణీ తదితర ప్రభుత్వ కార్యక్రమాల్లో వారి భాగస్వామ్యం పెరిగిందని పేర్కొన్నారు. నేతలకు క్యాడర్‌తో వచ్చిన అంతరం తగ్గిందని వివరించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సహా బ్యాక్ ఆఫీస్ ప్రతినిధులతో శనివారం చంద్రబాబు సమావేశమయ్యారు. అంతకుముందు ఉండవల్లి నివాసంలో పార్టీ కీలక బృందంతోనూ రెండున్నర గంటల పాటు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కీలక ఆదేశాలిచ్చారు.

✦ పార్టీ లోక్‌సభ నియోజకవర్గ కమిటీల నియామకంలో జరుగుతున్న జాప్యంపై చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే శనివారం నాటికల్లా సభ్యుల పేర్లు నిర్ణయించాలని ఆదేశించారు. 'పార్టీ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యుల ఎంపిక కోసం ముగ్గురు నేతలతో కమిటీలు వేశాం. వాళ్లు ఒక్కో నియోజకవర్గానికి వెళ్లి మూడేసి పేర్లు సిఫార్సు చేశారు. ఇప్పటికే అధ్యక్ష, కార్యదర్శుల పేర్లు నిర్ణయించాం. 32 మంది సభ్యుల పేర్లు పెండింగ్‌లో ఉన్నాయి. త్రిసభ్య కమిటీని పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించండి. ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ వారం రోజుల్లో లోక్‌సభ నియోజకవర్గ కమిటీ సభ్యుల తుది జాబితా పూర్తి చేయండి' అని అధినేత దిశానిర్దేశం చేశారు.

ఆరెస్సెస్ ప్రతినిధుల మాదిరిగా..

'పార్టీ పట్ల అంకితభావం, సిద్ధాంతాలపై అవగాహన, విద్యార్హతలు, వయసు, సీనియర్ల అభిప్రాయాలు, బ్యాక్ ఆఫీస్ డేటా.. వీటన్నింటినీ పరిశీలించాకే రాష్ట్ర కమిటీలోకి తీసుకోవాలి. ఆరెస్సెస్ వాళ్లు సిద్ధాంతానికి కట్టుబడి ఏ పదవులూ ఆశించకుండా భాజపా కోసం పనిచేస్తున్నారు. మనం కూడా అలాంటి క్యాడర్‌ను తయారుచేయాలి. పార్టీ సిద్ధాంతం ఆధారంగానే నాయకులు పనిచేయాలి. అప్పుడే భవిష్యత్తు నాయకత్వం తయారవుతుంది' అని చంద్రబాబు సూచించారు. బీసీల్లో నిమ్నవర్గాల నుంచి కొత్త తరం నాయకులను ప్రోత్సహించాలన్నారు. 'రజక, వడ్డెర, బోయ వంటి బీసీ వర్గాలు జనాభాపరంగా ఎక్కువగా ఉన్నాయి. వారి నుంచి కొత్త నాయకత్వం రావడం లేదు. ఆయా వర్గాల నుంచి నాయకుల్ని తయారుచేయాలి' అని అధినేత సూచించారు.

అవి తప్పుడు కేసులు కాబట్టే..

గత వైకాపా ప్రభుత్వం రాజకీయ ప్రేరేపితంగా, ఎలాంటి సాక్ష్యాలూ, ఆధారాలూ లేకపోయినా తనపై బనాయించిన అక్రమ కేసులను మాత్రమే న్యాయస్థానాలు కొట్టి వేస్తున్నాయని చంద్రబాబు అన్నారు. 'ఓ మాజీ సీఎంను అరెస్టు చేయాలంటే చట్టపరంగా కొన్ని విధివిధానాలు పాటించాలి. అప్పట్లో ఇవేమీ పాటించలేదు. ఒక్క కేసులోనూ ఆధారం లేదు. తప్పుడు కేసులు కాబట్టే కోర్టులు వాటిని తీసేస్తున్నాయి. అంతేగానీ నేను సీఎంగా ఉన్నందువల్ల కాదు. అలాగైతే జగన్ కూడా తన మీద కేసులు తొలగించుకునే వారుగా?' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాజకీయ దురుద్దేశంతోనే వైకాపా తప్పుడు ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టారు.

విజ్ఞత లేని వ్యక్తి మాటలకు విలువ లేదు

'జగన్ నెలకోసారి రాష్ట్రానికి వచ్చి, మూడు గంటల పాటు విజ్ఞత లేకుండా మాట్లాడుతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను వాడూవీడూ అంటున్నారు. అలాంటి వ్యక్తికి విలువ లేదు. వాటికి ఎక్కువగా స్పందించాల్సిన అవసరమూ లేదు. ప్రజలే ఆయనకు బుద్ధి చెబుతారు' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న శ్రీవారి పరాకామణిలో చోరీ కేసు అంటే జగన్‌కు చులకనగా ఉందా. . అని ఆగ్రహించారు.

త్వరలో స్కూల్ ఇన్నోవేటివ్ పార్టనర్‌షిప్ సమిట్

విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికి తీయడానికి స్కూల్ ఇన్నోవేటివ్ పార్టనర్‌షిప్ సమిట్ పేరుతో ఓ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ భాగస్వామ్యంతో ఇది చేద్దాం. పాఠశాలల్లో 'క్లికర్' ఆధారిత అభ్యసనం ద్వారా విద్యార్థుల్లో రియల్ టైం నాలెడ్జ్‌ను గుర్తించాలి. ఆన్‌లైన్‌లో పరీక్షలు రాసేలా, నైపుణ్యాలు మెరుగుపరిచేలా వారిని తయారుచేయాలి. చాలామంది విద్యార్థులకు ఎన్నో వినూత్న ఆలోచనలుంటాయి. వీరు స్కూల్ ఇన్నోవేటర్లు. వారి ఆలోచనలకు రూపమివ్వాలి. ఓ పాఠశాల విద్యార్థి గుండెపోటు ముప్పును గుర్తించడానికి ఓ యాప్‌ను కనిపెట్టాడు. అలాంటి వారి ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించాలి'' అని తెలిపారు. విద్యార్థులకు 4 శాతం వడ్డీకి రుణాలిచ్చి విదేశాల్లో చదువుకునేందుకు పంపాలని, వారికి 40 ఏళ్లు వచ్చేవరకూ ఆ రుణం తీర్చే వెసులుబాటు ఇవ్వాలని సూచించారు.

బాధితుల గోడు విని.. పరిష్కారం చూపి

- ప్రజల నుంచి వినతులు స్వీకరించిన చంద్రబాబు

ఈనాడు, అమరావతి: పలు సమస్యలతో మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి వచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి సీఎం చంద్రబాబు శనివారం వినతులు స్వీకరించారు. స్వయంగా వారి వద్దకు వెళ్లి గోడు విన్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని ఆయా శాఖలకు రిఫర్ చేశారు. పలువురు వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు తమకు ఆర్థిక సాయమందించి ఆదుకోవాలని సీఎంకు వినతిపత్రాలు అందజేశారు.

✦ సుప్రీంకోర్టు స్టే ఆర్డర్ ఉన్నా, అధికారులు పట్టించుకోకుండా తమ ఇళ్లను కూలగొట్టారని విజయవాడ జోజినగర్‌కు చెందిన బాధితులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

✦ ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న జూనియర్ ఇంజినీర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల సంఘాల ప్రతినిధులు కోరారు.

✦ మొక్కజొన్న పంట మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400 కాగా, దళారులు రూ.1,800లకు మాత్రమే కొంటున్నారని నందిగామకు చెందిన పలువురు రైతులు సీఎంకు ఫిర్యాదు చేశారు. రైతులు నష్టపోకుండా మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టాలని కోరారు.



తెదేపా కేంద్ర కార్యాలయానికి వచ్చిన దివ్యాంగుల నుంచి వినతి పత్రాలు తీసుకొని, సమస్య తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు



..అప్పటివరకూ ప్రయత్నిస్తూనే ఉండండి

ముందుగా మీకు తోచిన రీతిలో ప్రయత్నించండి. ఎదురుదెబ్బ తగిలితే, ఇంకోసారి ప్రయత్నించండి. అయితే ఈసారి భిన్నంగా ప్రయత్నించండి. అవసరమైతే ఇతరుల సాయం తీసుకొని మరీ ప్రయత్నించండి. విజేతల మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకొని శాయశక్తులా ప్రయత్నించండి. మీరు చేస్తున్నదాన్ని శ్రమలా అనుకోకుండా, సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తున్న భావనతో గట్టిగా ప్రయత్నించండి. అలా విజయం సాధించేవరకూ ప్రయత్నిస్తూనే ఉండండి.

– బిల్లీ జీన్, కంటెంట్ క్రియేటర్

గ్రహం అనుగ్రహం 7–12–2025 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళపక్షం
తదియ: రా.10-58 తదుపరి చవితి; **ఆర్ద్ర:** ఉ.10-34 తదుపరి పునర్వసు **వర్జ్యం:** రా.9-59 నుంచి 11-30 వరకు; **అమృత ఘడియలు:** లేవు **దుర్ముహూర్తం:** సా. 3-53 నుంచి 4-37 వరకు; **రాహుకాలం:** సా. 4-30 నుంచి 6-00 వరకు; **సూర్యోదయం:** ఉ.6.21; **సూర్యాస్తమయం:** సా.5.21

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	15.6	29.0
విజయనగరం	17.0	28.0
శ్రీకాకుళం	18.0	28.0
విశాఖపట్నం	18.4	28.8
అనంతపురం	18.4	30.0
కడప	19.0	28.0
రాజమహేంద్రవరం	19.5	33.0
విజయవాడ	19.8	29.7
నరసాపురం	19.9	31.6
కర్నూలు	20.2	29.5
గుంటూరు	21.0	29.0
ఒంగోలు	21.3	30.3
నెల్లూరు	22.0	28.1
తిరుపతి	22.8	28.0
తాడేపల్లిగూడెం	25.0	29.0

ఆ అంకెలు.. ఆందోళనా..?

(మొదటి పేజీ తరువాయి)

సక్రమంగా లేకున్నా సరే.. అంకెలు మారిపోతాయి.

- ఆహారం తీసుకున్న 30 నిమిషాలలోపు రక్తపోటు కొలవకూడదు. ఆల్కహాల్, ధూమపానం, కెఫిన్‌లకు దూరంగా ఉండాలి.
- వ్యాయామం, డ్రైవింగ్, స్నానం చేసిన వెంటనే బీపీ చెక్ చేసుకుంటే ఎక్కువగా చూపుతుంది. దీంతో బీపీ ఎక్కువ ఉన్నట్లు ఆందోళన చెందకూడదు.
- కచ్చితమైన బీపీ రీడింగ్ తెలుసుకునేందుకు కనీసం నిమిషం తేడాతో మూడుసార్లు బీపీని కొలవాలి. మూడు రీడింగ్‌ల సగటు లెక్కించాలి.
- చెక్ చేసుకోవడానికి ముందు కనీసం 5 నిమిషాల పాటు విశ్రాంతి తీసుకోవాలి. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు దూరంగా ఉండాలి. నిద్ర సక్రమంగా లేకపోయినా బీపీ తేడా చూపుతుంది.

మధుమేహం చూసుకునే ముందు ఇలా...

- డయాబెటిస్ రోగులు ఇంట్లో రీడింగ్ చెక్ చేసుకునే ముందు కొన్ని జాగ్రత్తలు తప్పకుండా తీసుకోవాలి.
- చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. చేతులపై పంచదార, నూనె వంటివి ఉంటే రీడింగ్‌లో తేడా వస్తుంది.
- టెస్ట్ స్ట్రిప్స్‌కు గడువు తేదీ ఉంటుంది. చాలాసార్లు పాత లేదా తేమతో కూడిన స్ట్రిప్స్ వాడతారు. ఇది తప్పుడు రీడింగ్‌కు కారణమవుతుంది.
- స్ట్రిప్స్‌ను ఎల్లప్పుడూ పొడి, చల్లని ప్రదేశంలో ఉంచాలి.



గడువు తేదీని తనిఖీ చేస్తూ ఉండాలి.

- రక్త నమూనా తీసేందుకు ప్రతిసారీ ఒకే వేలు వినియోగించడం వల్ల అక్కడ చర్మంగట్టి పడి రక్తం తీయడం కష్టమవుతుంది. తరచూ మారుస్తూ ఉండాలి.
- వేలిపై సూదిని గుచ్చినప్పుడు రక్తం బయటకు రాకపోతే, వేలిని గట్టిగా నొక్కుతుంటారు. దీనివల్ల కణజాల ద్రవం రక్తంలో కలిసిపోయి రీడింగ్‌లో మార్పు కన్పిస్తుంది. అందుకే మృదువుగా గుచ్చాలి. వేలిని కిందికి వంచడం వల్ల రక్తం సులువుగా బయటకు వస్తుంది.
- ఖాళీ కడుపుతో, భోజనం చేసిన 2 గంటల తర్వాత నిద్రపోయే ముందు రక్తంలో చక్కెరను తనిఖీ చేసేందుకు సరైన సమయం. ఎప్పుడు పడితే అప్పుడు చెక్ చేయడం వల్ల రీడింగ్‌లో తేడా చూపుతుంది.
- బీపీ, గ్లూకోమీటర్, బరువు తూచే యంత్రాల్లో బ్యాటరీని చెక్ చేస్తూ ఉండాలి. యంత్రానికి విద్యుత్తు సరఫరా తగ్గితే.. అంకెల్లో కూడా తేడా కన్పిస్తుంది.

3-5 శాతం రీడింగ్‌లలో తేడా ఉంటుంది.. ఆందోళన వద్దు

ఇంట్లో వాడే డిజిటల్ పరికరాల్లో 3-5 శాతం వరకు లెక్కలు అటు ఇటు ఉంటాయనేది గుర్తించాలి. బీపీ చెక్ చేసుకునే ముందు రకరకాల పరిస్థితుల బట్టి అంకెల్లో తేడా ఉంటుంది. ముందు రోజు సక్రమంగా నిద్ర లేకపోయినా.. ఎక్కడ నుంచో వచ్చి వెంటనే బీపీ చెక్ చేసినా ఎక్కువే చూపుతుంది. అంతమాత్రనా బీపీ ఉన్నట్లు కాదు. వెంటనే మందులను వాడేయకూడదు. మధుమేహం లేని వారు చెక్ చేసుకుంటే కొన్నిసార్లు ఫాస్టింగ్‌లో 100 ఎంజీ/డీఎల్ దాటి ఉంటే ఆందోళన పడుతుంటారు. ఒక్కసారి అంకెలు చూసి మధుమేహం వచ్చేసిందని నిర్ధారణకు రాకూడదు. నిపుణుల సూచనలతో పలుసార్లు చెక్ చేసుకున్న తర్వాతే షుగర్, బీపీ ఉందా? లేదా? అని నిర్ధారణకు రావాలి. ఇప్పటికే బీపీ, షుగర్ ఉన్నవారు సైతం చెక్ చేసుకునే ముందు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. బీపీ ఎల్లప్పుడూ 120/80, షుగర్ ఫాస్టింగ్‌లో 70-120 ఎంజీ/డీఎల్, భోజనం తర్వాత 2 గంటలకు 180 ఎంజీ/డీఎల్ వరకు ఉండేలా చూసుకోవడం శ్రేయస్కరం.

–డాక్టర్ శ్రీభూషణ్‌రాజు, ప్రొఫెసర్, నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్

గుర్తుపెట్టుకోండి...



ఇంట్లో తల్లిదండ్రులకు బీపీ, షుగర్ ఇతర అనారోగ్య సమస్యలు ఉంటే...వారి పిల్లలు 30 ఏళ్ల వయసు నుంచే అప్రమత్తం కావాలి. కనీసం 6 నెలలకు ఒకసారైనా పరీక్షలు చేయించుకోవడం మేలు.



వారసత్వంగా సమస్యలు లేకున్నా...అధిక బరువు ఉన్న వాళ్లు, పొగ, మద్యపానం అలవాట్లున్నవారు, ఒకేచోట కూర్చొని పనిచేసేవాళ్లు, జంక్ ఫుడ్ తీసుకునే వారు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి.

బీపీ, డయాబెటిస్ శరీరంలో నిశ్శబ్దంగా విధ్వంసం సృష్టిస్తాయి. డిజిటల్ పరికరాలతో పరీక్షలు చేసుకుంటున్నప్పుడు పదేపదే బీపీ 140/90 స్థాయి చూపిస్తున్నా, షుగర్ లెవెల్స్ 200 దాటుతున్నా వెంటనే అప్రమత్తం కావాలి. తదుపరి పరీక్షల కోసం వైద్య నిపుణులను సంప్రదించాలి. డిజిటల్ కొలతల్లో తేడా మామూలే కదా...అని విడిచి పెడితే అవి తీవ్రమైన అనారోగ్య సమస్యకు దారితీస్తాయి.

- ఈనాడు, హైదరాబాద్

శ్రీవారి సొమ్ము కొట్టేసిన దొంగతో సెటిల్మెంట్ ఏంటి?

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మండిపడ్డారు. "నెల్లూరు వంటి చోట్ల లేడీ డాన్లను ఎప్పుడైనా చూశామా? నెల్లూరు, విజయనగరం వంటి జిల్లాలు ప్రశాంతతకు మారుపేరుగా ఉండేవి. గత వైకాపా ప్రభుత్వంలోని పాలకుల నిర్వాకం వల్ల ఆ జిల్లాల్లోను నేరస్థులు తయారయ్యారు'' అని ఆయన మండిపడ్డారు. "అన్నీ ప్రక్షాళన చేస్తున్నాం. నేరస్థులను ఏరేస్తున్నాం'' అని పేర్కొన్నారు.

రాజధాని రైతులు సంతోషంగానే ఉన్నారు..: రాజధాని రైతుల సమస్యలన్నీ పరిష్కరిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. వారితో తాను సమావేశమయ్యాక రైతులు పూర్తిగా సహకరిస్తున్నారన్నారు. "రెండో దశ భూసమీకరణకు రైతులు ముందుకు రావడం మంచి పరిణామం. ప్రజలు, రైతులు, ప్రభుత్వం.. అంతా సంతోషంగానే ఉన్నారు. అది చూసి కొందరికి కడుపు మండుతోంది'' అని ఆయన వ్యాఖ్యానించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ఇప్పటి పాలకులూ గుర్తిస్తున్నారని, ఇప్పుడు కోకాపేట వంటి ప్రాంతాల్లో భూములు రికార్డు స్థాయిలో ధర పలుకుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

జగన్ గుంజీలు తీయాలి: మాధవ్

ఈనాడు, అమరావతి: 'ఏం పోయింది.. ఆరు నోట్లే కదా పోయాయి' అని పరకామణిలో చోరీపై వైకాపా అధ్యక్షుడు జగన్ తేలిగ్గా మాట్లాడడం సరికాదని, ఆయన చేసిన తప్పులకు లెంపలేసుకుని గుంజీలు తీయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మండిపడ్డారు. 'పరకామణిలో చోరీ కేసు రాజీ వ్యవహారంలో రూ.200 కోట్లకు పైగా పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. దీంతోపాటు జగన్ ప్రభుత్వంలో జరిగిన లడ్డూ కల్తీ, భూముల అన్యాక్రాంతం తదితర కుట్రలన్నింటిపైనా విచారణ జరగాలి' అని మాధవ్ డిమాండ్ చేశారు.

శంషాబాద్ విమానాశ్రయంలో ఆందోళనలు

ఈనాడు, హైదరాబాద్, శంషాబాద్, న్యూస్‌టుడే: ఇండిగో ఎయిర్‌లైన్స్ నిర్లక్ష్యం ప్రయాణికుల పాలిట సంకటంగా మారింది. సాంకేతిక కారణాలు, ప్రతికూల వాతావరణం అంటూ చెప్పిందే చెబుతూ ఇండిగో సంస్థ పదుల సంఖ్యలో విమానాలను రద్దు చేస్తుండటంతో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఇక్కడినుంచి బయల్దేరాల్సిన 74 విమానాలను రద్దు చేయగా, రావాల్సిన 70 విమానాలూ రద్దయ్యాయి. ఇండిగో సంస్థ ప్రకటనల ప్రకారం రీషెడ్యూల్ చేసిన విమానాలు బయల్దేరతాయన్న ఆశతో కొందరు ప్రయాణికులు ఉదయం నుంచి రాత్రి వరకూ ఎదురుచూడగా.. మరికొందరు విమానాల రద్దు పట్ల నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. ప్రయాణికుల పరిస్థితి ఇంత దయనీయంగా ఉంటే మరోవైపు ఇండిగో ఎయిర్‌లైన్స్ సహా ఇతర ఎయిర్ లైన్స్ సంస్థలు దోపిడీకి తెగబడ్డాయి. హైదరాబాద్ నుంచి దిల్లీకి రూ.30 వేలు, గువాహటికి రూ.40 వేలు, చెన్నై, ముంబయి, కోల్‌కతాలకు రెట్టింపు ధరలు వసూలు చేశాయి.

- అధికారిక పనులపై హైదరాబాద్ వచ్చిన ఏపీ మంత్రి పార్థసారథి విశాఖపట్నం వెళ్లడానికి ముందస్తు టికెట్ తీసుకుని శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చారు. ఆయన వెళ్లాల్సిన విమాన సర్వీస్ ఆఖరి నిమిషంలో రద్దు కావడంతో ఎయిర్‌లైన్స్ ప్రతినిధుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

డాలస్ చేరుకున్న లోకేశ్

ఈనాడు, అమరావతి: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ శనివారం రాత్రి (భారత కాలమానం ప్రకారం) డాలస్ చేరుకున్నారు. ఆయనకు ప్రవాసాంధ్రులు ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. డాలస్‌లో నిర్వహించే తెలుగు డయాస్పోరా సమావేశంలో లోకేశ్ ప్రసంగించనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా అమెరికా, కెనడాల్లో ఈ నెల పదో తేదీ వరకు లోకేశ్ పర్యటించనున్నారు.

ఇండిగో మూల్యం చెల్లించాల్సిందే



(మొదటి పేజీ తరువాయి)

దేశంలో 850 విమానాలున్నాయి. మరో 1,750 విమానాలకు ఆర్డర్లు ఉన్నాయి. విమానాల్లో 80% లీజ్‌మీద తీసుకున్నవే. దీనికి చట్టబద్ధత కల్పించి వేగంగా విమానాలను అందుబాటులోకి తెచ్చేలా ఇటీవలే చట్టం చేశాం. దీనివల్ల ఎక్కువ విమానాలు రావడానికి అవకాశం ఉంటుంది. ఇండిగో సంస్థకు ప్రభుత్వం లొంగిపోయిందన్న రాజకీయ విమర్శల్లో వాస్తవం లేదు. ప్రస్తుత పరిస్థితులకు బాధ్యులైన వారిని విడిచిపెట్టే ప్రశ్నే లేదు. ప్రస్తుతం ప్రయాణికుల ప్రయోజనాలే అత్యంత ముఖ్యం. సమస్యపై డీజీసీఏ లోతుగా విచారణ జరుపుతుంది. వారంలోపే నివేదిక వస్తుందని భావిస్తున్నాం. దాని ఆధారంగా ఇండిగోపై కచ్చితంగా కఠిన చర్యలు ఉంటాయి.

ప్రస్తుత సమస్య ఎందుకు వచ్చింది?

ఎఫ్‌డీటీఎల్ నిబంధనల ప్రకారం మిగతా సంస్థలు కొత్త పైలట్లు, సిబ్బంది నియామకం చేపట్టి ఆపరేషన్స్‌కి ఇబ్బంది లేకుండా చూసుకున్నాయి. ఇండిగో కూడా నవంబరు 1 నుంచి డిసెంబరు 2వరకు సర్వీసులు బాగానే నడిపింది. 3వతేదీన అకస్మాత్తుగా సమస్య తలెత్తింది. దాని ప్రభావం కనిపించిన వెంటనే క్షేత్రస్థాయిలో అందర్నీ అప్రమత్తం చేసి త్వరగా సాధారణ పరిస్థితులు తీసుకురావడానికి అన్ని రకాల చర్యలూ తీసుకుంటూ వస్తున్నాం.

ఎఫ్‌డీటీఎల్‌ను ఇండిగో ఎందుకు అమలు చేయలేకపోయింది?

దీన్ని సూక్ష్మంగా పరిశీలించడానికి నలుగురు సభ్యులతో విచారణ కమిటీ ఏర్పాటుచేశాం. ఎఫ్‌డీటీఎల్ నుంచి తాత్కాలికంగా ఆ సంస్థకు మినహాయింపునివ్వడానికి ప్రధాన కారణం ప్రయాణికుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడమే. ఇండిగో తప్పుల కారణంగా ప్రయాణికులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతోనే తాత్కాలికంగా మినహాయింపునిచ్చాం. ఫిబ్రవరిలోపు ఎఫ్‌డీటీఎల్‌ను ఎలా అమలుచేయబోయేదీ ప్రతి వారం డీజీసీఏకి చెప్పాలని నిర్దేశించాం. విచారణ కమిటీకి ఇండిగో సమాధానం చెప్పాల్సిందే.

ప్రయాణికుల ఇబ్బందులు తొలగించడానికి ఏం చర్యలు తీసుకున్నారు?

ప్రయాణికులను గమ్యస్థానాలకు పంపడానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల అన్ని ప్రధాన విమానాశ్రయాల్లో రద్దీ తగ్గింది. సర్వీసుల రద్దు గురించి ప్రయాణికులకు ముందుగానే సమాచారం అందించాలని గట్టిగా చెప్పాం. అందుకే ఆ సంస్థ విమానాశ్రయాల వారీగా రద్దుచేసిన విమానాల వివరాలను బహిరంగంగా ప్రకటించింది. సర్వీసులు రద్దయిన ప్రయాణికులకు ఆదివారం ఉదయం 8 గంటలకల్లా సొమ్ము వాపసు చేయాలని ఆదేశించాం. ప్రత్యామ్నాయ బుకింగ్ అవసరమైతే ఆ ఏర్పాట్లు చేయాలని చెప్పాం. 48 గంటల్లోపు ప్రయాణికుల లగేజీని ఇళ్లకే చేర్చాలని ఆదేశించాం. ప్రధాన నగరాలనుంచి 36 రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటుచేయిస్తున్నాం.

ఎఫ్‌డీటీఎల్ అమలుకు మానవ వనరులు అందుబాటులో ఉన్నాయా?

ఎయిరిండియా, స్పైస్‌జెట్, ఆకాశలాంటి విమానయాన సంస్థలకు రాని సమస్య ఇండిగోకి మాత్రమే రావడానికి ప్రధాన కారణం ఆ సంస్థ సరిగా వ్యవహరించకపోవడమే. ఇండిగో వద్ద 5వేల మంది పైలట్లు ఉన్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం మరికొంతమందిని నవంబరు 1 నుంచి నియమించుకోవాలి. కొత్తగా విమానాలు వచ్చినప్పుడు అదనపు సిబ్బంది అవసరమవుతారు. అందుకోసం విమానయాన శిక్షణ సంస్థలను ప్రోత్సహిస్తున్నాం. ప్రస్తుతం మార్గదర్శకాల కారణంగా పైలట్లకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. భవిష్యత్తు డిమాండుకు తగ్గట్టు దేశీయంగానే పైలట్లను తయారుచేయాలన్నది మా ప్రభుత్వ లక్ష్యం.

గుత్తాధిపత్యం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందా?

ఈ విమర్శల్లో నిజం లేదు. దేశానికి కనీసం ఐదు పెద్ద విమానయాన సంస్థలు ఉండాలన్నది మా లక్ష్యం. ఒక్కోదానివద్ద 100కి తగ్గకుండా విమానాలు ఉండాలని కోరుకుంటున్నాం. డిమాండ్‌ను అందుకోవడానికి మరిన్ని ఎయిర్‌లైన్స్ రావాలి. చిన్న విమానయాన సంస్థలను పెద్దవిగా చేయడానికి అన్ని రకాలుగా చేయూత ఇస్తున్నాం.

ఛార్జీలు పెంచితే కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించింది. ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపింది. చెక్ ఔట్, చెక్ ఇన్ కూడా సాఫీగా సాగుతున్నట్లు పేర్కొంది. ఇండిగో సర్వీసుల రద్దు కారణంగా, పెరుగుతున్న విమాన టికెట్ల ఛార్జీలపై కేంద్రం ఆగ్రహం వ్యక్తంచేసింది.



ముంబయి విమానాశ్రయంలో ఇండిగో కౌంటర్ వద్ద నెలకొన్న రద్దీ

ధరలపై గరిష్ఠ పరిమితులు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిమితులను దాటి వసూలు చేస్తే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించింది. ప్రయాణికులకు సకాలంలో ఇండిగో రీఫండ్లు ఇవ్వకపోవడంపైనా అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆదివారం సాయంత్రంలోపు పెండింగులో ఉన్న రీఫండ్లను జారీ చేయాలని పౌర విమానయాన మంత్రిత్వశాఖ ఆదేశించింది. దీంతో బేషరతుగా రీఫండ్లు జారీ చేస్తామని ఇండిగో తెలిపింది. విమానాల రద్దుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు రైల్వే రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా అన్ని జోన్లలో కలిపి 89 ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది.

ఇలాంటి సమయంలో అవకాశవాదమా?

దూరాన్ని బట్టి గరిష్ఠంగా రూ.7,500 నుంచి రూ.18,000 మధ్య విమాన టికెట్ల ధరలు ఉండాలని శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పౌర విమానయాన మంత్రిత్వశాఖ పేర్కొంది. బిజినెస్ తరగతికి, ఉడాన్ విమానాలకు ఇవి వర్తించవని పేర్కొంది. ధరల పరిమితి ఎకానమీ తరగతికే వర్తిస్తుందా.. లేక ప్రీమియం తరగతికీ వర్తిస్తుందా అనే విషయంలో మంత్రిత్వశాఖ స్పష్టత నివ్వలేదు. "అంతరాయాల సమయంలో అసాధారణంగా ఛార్జీలను పెంచడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఈ తరహా అవకాశవాద ప్రవర్తన నుంచి ప్రయాణికులను రక్షించేందుకు చర్యలు చేపడుతున్నాం. కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకొనేవరకు కొత్తగా సూచించిన పరిమితులను కచ్చితంగా పాటించాలి'' అని వెల్లడించింది.

వాడీవేడిగా సమావేశం.. వివరణకు ఆదేశం

కేంద్రం ఏర్పాటు చేసిన విచారణ కమిటీ నివేదిక అందిన తర్వాత ఇండిగో సంస్థపై తగిన చర్యలు తీసుకుంటామని ఓ ప్రభుత్వాధికారి తెలిపారు. పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు శనివారం అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ఈ సమావేశంలో ఇండిగో కార్యనిర్వహణాధికారి (సీఈవో) పీటర్ ఎల్బెర్స్ కూడా పాల్గొన్నారు. పౌర విమానయాన కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా, డీజీసీఏ అధిపతి ఫైజ్ అహ్మద్ కిద్వాయ్ కూడా హాజరైన ఈ సమావేశం వాడీవేడిగా సాగినట్లు సమాచారం. తర్వాత ఎల్బెర్స్‌కు డీజీసీఏ షోకాజ్ నోటీసు జారీచేసింది. భారీస్థాయిలో అంతరాయాలపై సమాధానమివ్వాలని ఆదేశించింది. "కార్యకలాపాల్లో భారీ వైఫల్యం.. మీ ప్రణాళికలో, పర్యవేక్షణలో, వనరుల నిర్వహణలో లోపాన్ని చాటుతోంది. సంస్థ సమర్థ నిర్వహణకు సీఈవోగా మీరు జవాబుదారీ. సకాలంలో ఏర్పాట్లు చేయడంలో, ప్రయాణికులకు సదుపాయాల కల్పనలో మీరు విఫలమయ్యారు. దీనిపై 24 గంటల్లో సమాధానమివ్వండి'' అని దానిలో పేర్కొంది.

మళ్లీ క్షమాపణ చెప్పిన ఇండిగో

ప్రయాణికులకు ఇండిగో సంస్థ మరోసారి క్షమాపణ చెప్పింది. శుక్రవారం ఆ సంస్థ సీఈవో పీటర్ ఎల్బెర్స్ బహిరంగంగా క్షమాపణ చెప్పిన సంగతి తెలిసిందే. 95 శాతం నెట్‌వర్క్ కనెక్టివిటీని పునరుద్ధరించామని పేర్కొంది. తాము ఆపరేట్ చేసే 138 గమ్యస్థానాల్లో 135 గమ్యస్థానాలకు విమానాలను నడపగలుగుతున్నామని తెలిపింది. 1,500 విమాన సర్వీసులు శనివారం నడిపామని పేర్కొంది. శుక్రవారం మాత్రం 700 విమానాలను మాత్రమేఆపరేట్ చేశామని, 1,600కు పైగా సర్వీసులను రద్దు చేశామని వెల్లడించింది.

- విమాన ప్రయాణాన్ని సులభతరం చేస్తామని చెప్పిన ప్రధాని మోదీ ఇప్పుడు ప్రయాణాలను నిలిపివేస్తున్నారని కాంగ్రెస్ శనివారం ఆరోపించింది. పోటీతత్వాన్ని అణచివేసి జాతీయ విమానయాన రంగాన్ని కొన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలన్న భాజపా ప్రభుత్వ నిర్ణయం వల్లే ఇండిగో సంక్షోభం తలెత్తిందని ఆరోపించింది.

విశాఖలో తొమ్మిది సర్వీసులు రద్దు

విశాఖపట్నం(ఎన్ఏడీ కూడలి), గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విశాఖలోనూ శనివారం 9 సర్వీసులు రద్దయ్యాయని విమానాశ్రయ డైరెక్టర్ తెలిపారు. 11 నడిచాయన్నారు. కొన్ని ఆలస్యంగా నడుస్తుండడంతో చాలామంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టులోనే పడిగాపులు కాస్తున్నారు. విమానాల తాజా స్టేటస్ తెలుసుకుని ఎయిర్‌పోర్టుకు రావాలని ప్రయాణికులకు ఏఏఐ సందేశాల ద్వారా సూచిస్తోంది. విజయవాడ విమానాశ్రయంలోనూ శనివారం ఇండిగోకు చెందిన పలు విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. దిల్లీ-విజయవాడ సర్వీసును అనివార్య కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది.

మొక్కకూ ఓ లెక్కుంది!

(మొదటి పేజీ తరువాయి)

రైతుకు ప్రతిఫలం కనిపిస్తుంది. లేదంటే నిండా మునగడమే! ఈ తరుణంలో నర్సరీల్లో మొక్కలు, నారు కొనేటప్పుడే జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు ఉద్యాన శాఖ అధికారులు. నకిలీ విత్తనాలతో పెంచిన నారు, మొక్కలు నాటితే.. ఖర్చుతో పాటు శ్రమ, పంటకాలం కూడా నష్టపోతారని హెచ్చరిస్తున్నారు. ఇంటి పెరడు, మిద్దె తోటల కోసం పూలు, పండ్ల మొక్కలు కొనేవారు కూడా ఈ జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

మీ వాతావరణానికి అనువైనవేనా?

పరిచయస్థులు చెప్పారని కాకుండా, ఉద్యాన అధికారుల సూచన మేరకు మొక్కలు కొనాలని సూచించారు రాష్ట్ర ఉద్యానశాఖ జేడీ దేవముని రెడ్డి. ఆ మొక్కలు మీరు సాగు చేసే వాతావరణానికి అనువైనవో, కావో నిర్ధారించుకోవాలని చెప్పారాయన.

- తల్లిమొక్కను చూసి రకాల్ని ఎంచుకోవాలి. దాని లక్షణాలే అంటుకట్టిన మొక్కలకూ వస్తాయి.
- నర్సరీల విశ్వసనీయతను పరిశీలించాలి. నర్సరీల్లో విత్తనాలిచ్చి నారు పెంచుకునే రైతులు.. విత్తన కొనుగోలు రసీదుల్ని దాచుకోవాలి. పెంచిన మొక్కలను తీసుకునేటప్పుడు కూడా నర్సరీ యజమానుల నుంచి రసీదులు తీసుకోవాలి. మొక్కల్లో లోపాలుండి, దిగుబడి రాకపోతే.. రసీదు ఆధారంగా పరిహారం పొందవచ్చు.
- తెగుళ్లను పరిశీలించాలి. ఒక మొక్క ద్వారా మొత్తం తోటకు వ్యాపించవచ్చు. ఆయా మొక్కలను ఎలాంటి తెగుళ్లు ఆశిస్తాయి? నివారించే మార్గాలేంటో నర్సరీ యజమానిని అడగాలి. నర్సరీ యజమానులు చెప్పిన ప్రమాణాలు లేకున్నా, దిగుబడి రాకున్నా ఉద్యాన అధికారులకు ఫిర్యాదు చేయాలి.

ఈ ప్రమాణాలు పరిశీలించండి

ఉద్యాన నర్సరీలు ప్రభుత్వం వద్ద నమోదై ఉండాలి. వాటికి లైసెన్స్ తప్పనిసరి. అక్కడ విత్తనాలు, మట్టి, నీరు, పురుగుమందుల వాడకం నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉండాలి.

- తల్లిమొక్కల వివరాలు అందుబాటులో ఉంచాలి. మొక్కలపై ట్యాగింగ్, లేబిలింగ్ చేయాలి. విత్తన రకం, ధర వివరాలు అందుబాటులో ఉంచాలి.
- నర్సరీ బయట మొక్కల స్టాక్, విక్రయ వివరాల రికార్డు నిర్వహించాలి. లైసెన్సు నంబరు, జిల్లా ఉద్యాన అధికారి ఫోన్‌నంబర్లతో బోర్డులు పెట్టాలి.
- నారుమడిలో పెంచే మొక్కల వివరాల్ని బోర్డుపై రాయాలి. తెగుళ్లు లేని మొక్కలనే అమ్ముతున్నట్లు ధ్రువీకరణ ఇవ్వాలి.
- ఉద్యాన అధికారులు తమ పరిధిలోని నర్సరీల లైసెన్స్‌లు, అక్కడ అమ్మకాలు, లావాదేవీలను తనిఖీ చేయాలి. చట్టవిరుద్ధంగా నిర్వహిస్తుంటే లైసెన్స్ రద్దు చేసి, జరిమానా విధించవచ్చు. ఇతర రాష్ట్రాల నుంచి తెగులు సోకిన మొక్కల సరఫరా, అమ్మకాల్ని నిరోధించాలి.

లైసెన్స్ ఎవరు తీసుకోవాలి?

ఏపీ ఉద్యాన నర్సరీల నమోదు(నియంత్రణ) చట్టం-2010 కింద ప్రభుత్వ, ప్రైవేటు నర్సరీలు చట్టపరిధిలోకి వస్తాయి. పండ్లు, కూరగాయలు, పూల, ఆకర్షణీయ మొక్కల నారు ఉత్పత్తి చేసే వారు లైసెన్స్ తీసుకోవాలి. ఉద్యాన అధికారి కార్యాలయంలో రూ.1,000 చలానాతో పట్టాదారు పాసుపుస్తకం, 1బీ/కౌలు అంగీకారపత్రం, ఆధార్, భూమి స్కెచ్, భూసార, నీటి పరీక్ష పత్రాలతో దరఖాస్తు చేయాలి. లైసెన్స్ కాలవ్యవధి మూడేళ్లు. తర్వాత ఏటా రూ.500 చెల్లించి రెన్యువల్ చేసుకోవాలి.

పత్రిక, వాట్సప్ గ్రూపుల ద్వారా అవగాహన

–చలపతిరావు, అధ్యక్షుడు, ఏపీ నర్సరీల సంఘం

మొక్కలు కొనేటప్పుడు దానికి సంబంధించిన అన్ని వివరాలు రైతుకు చెప్పాల్సిన బాధ్యత నర్సరీల యాజమాన్యంపై ఉంది. ఎప్పటికప్పుడు కొత్త తెగుళ్లు ఆశిస్తుంటాయి. వాటిపై రైతులతో పాటు నర్సరీల యజమానులకూ అవగాహన కల్పించేందుకు విశ్రాంత శాస్త్రవేత్తల సహకారంతో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నాం. 'నర్సరీ పాఠశాల' అనే పత్రిక, వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి సలహాలు అందిస్తున్నాం.

ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డికి శిక్ష

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. ఇలాంటి వ్యక్తిపై కనికరం చూపితే న్యాయవ్యవస్థకు నష్టమని ఘాటుగా వ్యాఖ్యానించింది.

అప్పీల్‌లో స్టే రాకపోతే 22న లొంగిపోవాలి

జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించాక ప్రసాదరెడ్డి తరఫు న్యాయవాది అప్పీల్ దాఖలు చేసుకునేందుకు వీలుగా తీర్పు అమలును సస్పెండ్ చేయాలని కోరారు. అందుకు న్యాయమూర్తి సానుకూలంగా స్పందిస్తూ ఆరు వారాలు సస్పెండ్ చేశారు. అప్పీల్ దాఖలు చేయకపోయినా, దాఖలు చేసిన అప్పీల్లో స్టే రాకపోయినా ఈ నెల 22న సాయంత్రం 5గంటలలోపు హైకోర్టు రిజిస్ట్రార్ వద్ద లొంగిపోవాలని ప్రసాదరెడ్డిని ఆదేశించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

- ఏయూ సైన్స్, టెక్నాలజీ కళాశాల-బోటనీ విభాగంలో బోధనా సిబ్బందిగా నూకన్నదొర 2006 జులైలో నియమితులయ్యారు. తర్వాత అసిస్టెంట్ ప్రొఫెసర్(ఒప్పంద)గా కొనసాగారు. 17 ఏళ్లపాటు సేవలు అందించారు. నూకన్నదొరను విధుల నుంచి తొలగిస్తూ ఏయూ వీసీ 2022 నవంబరు 18న ఉత్తర్వులిచ్చారు. 2022 మే నుంచి చెల్లించాల్సిన జీతం బకాయిలను నిలిపేశారు. తనను విధుల నుంచి తొలగించడాన్ని సవాలు చేస్తూ నూకన్నదొర 2023లో హైకోర్టులో పిటిషన్ వేశారు. 2023 మార్చి 7న విచారణ జరిపిన న్యాయమూర్తి.. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పిటిషనర్‌ను కొనసాగించాలని నిర్దిష్ట కాలానికి మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఆ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో అప్పటి వీసీ ప్రసాదరెడ్డిపై నూకన్నదొర హైకోర్టులో కోర్టుధిక్కరణ కేసు దాఖలు చేశారు. ఇటీవల ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి.. ఉద్దేశపూర్వకంగా ప్రసాదరెడ్డి కోర్టు ఉత్తర్వులను అమలుచేయలేదని తేల్చారు. జైలుశిక్ష, జరిమానా విధిస్తూ ఈ ఏడాది నవంబర్ 20న తీర్పు ఇచ్చారు. తీర్పు ప్రతి తాజాగా అందుబాటులోకి వచ్చింది.

తీర్పును అమలుచేయాల్సిందే

ఒకసారి కోర్టు ఉత్తర్వులిచ్చాక దానిని యథాతథంగా అమలుచేయడమే అధికారుల విధి అని న్యాయమూర్తి తీర్పులో స్పష్టంచేశారు. ఉత్తర్వులు చట్టవిరుద్ధంగా ఉన్నాయని భావిస్తే అప్పీల్ దాఖలు చేసుకోవచ్చని, అంతేతప్ప కోర్టు ఉత్తర్వులకు విభిన్న అర్థం చెప్పడానికి వీల్లేదన్నారు. కోర్టు ఉత్తర్వులు సరైనవా? కాదా? అనే విషయాన్ని కోర్టు ధిక్కరణ వ్యాజ్యంలో తేల్చలేరని, ఆ ఉత్తర్వులకు కట్టుబడి వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

స్మార్ట్ ప్రశ్న.. క్లిక్కుతో జవాబు

(మొదటి పేజీ తరువాయి)

బడుల్లో ప్రవేశపెడుతున్నారు.

క్లికర్ విధానం అంటే?

- తరగతి గదిలో ప్రతి విద్యార్థికీ ఒక సాంకేతిక పరికరం (క్లికర్) ఇస్తారు.
- పాఠం పూర్తయ్యాక తరగతిలోని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీల్లో దానిలోని కాన్సెప్ట్ వీడియోలను ప్రదర్శిస్తారు.
- అనంతరం వాటిపై ఉపాధ్యాయులు ప్రశ్నలు అడుగుతారు. వాటికి ఏ, బీ, సీ, డీ సమాధానాలు ఉంటాయి.
- విద్యార్థి తన దగ్గరున్న క్లికర్‌లో వాటిలో ఏదో ఒకటి నొక్కి సమాధానం చెప్పాలి.
- తరగతిలోని అన్ని క్లికర్‌ల నుంచి సిగ్నల్స్‌ను ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీ స్వీకరించి, ప్రాసెస్ చేస్తుంది.
- మొత్తం సమాధానం ఇచ్చిన విద్యార్థులు.. తప్పు, ఒప్పులు చెప్పిన వారి శాతం ఎంతో చూపిస్తుంది.

వారం వారం విశ్లేషణ

సోమవారం నుంచి శనివారం వరకు సేకరించిన క్లికర్ డేటా అంతా విశ్లేషిస్తారు. విద్యార్థులు తరచుగా ఏ అంశంలో ఇబ్బంది పడుతున్నారో గుర్తిస్తారు. ఎవరికి అదనపు ప్రాక్టీస్ అవసరం ఉందో తెలుసుకుంటారు.

- వెనుకబడిన విద్యార్థులకు హోం వర్క్ ఇస్తారు. లీప్ యాప్ ద్వారా దానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను తల్లిదండ్రుల లాగిన్‌కు పంపిస్తారు.
- పునశ్చరణ కోసం వీడియో లింక్ కూడా పంపిస్తారు.
- ఒక పేజీ పీడీఎఫ్ వివరణ, రెండు, మూడు ప్రాక్టీస్ ప్రశ్నలు ఇస్తారు.
- ఇంటి వద్ద అదనంగా ప్రాక్టీస్ చేయించడం ద్వారా పిల్లల సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తారు.

ప్రకటన

ఈనాడు దినపత్రికను కొందరు వ్యక్తులు తెల్లవారే సరికి ఆన్‌లైన్ నుంచి ఈనాడు ఈపేపర్‌ను పీడీఎఫ్‌గా డౌన్‌లోడ్ చేసుకుని సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇందుకోసం ప్రత్యేక టెలిగ్రామ్, వాట్సప్ గ్రూపులు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ విధమైన అనుమతి లేని చర్యలు కాపీరైట్ చట్టానికి విరుద్ధం మరియు శిక్షార్హమైన నేరం. ఎవరైనా వ్యక్తులు, సంస్థలు లేదా గ్రూపులు ఈనాడు పత్రికను, వ్యాసాలను పీడీఎఫ్‌లుగా అనుమతి లేకుండా అప్‌లోడ్ చేయడం, షేర్ చేయడం నేరం. అట్టి చర్యలను ఈనాడు చాలా తీవ్రంగా పరిగణించి బాధ్యులపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరిక జారీచేయడమైంది.

అలాగే ఈనాడు, ఈనాడు.నెట్‌లోని వార్తలను కొందరు పూర్తిగా/పాక్షికంగా కాపీ చేసి తమ వాణిజ్య ప్రయోజనాల కోసం (వెబ్‌సైట్లలో, న్యూస్ యాప్‌లలో, యూట్యూబ్ ఛానళ్లలో) వినియోగిస్తున్నట్లు కూడా మా దృష్టికి వచ్చింది. అట్టి చర్యలను ఈనాడు తీవ్రంగా పరిగణించి, బాధ్యులపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరిక జారీచేయడమైంది.

ఇట్లు/- వెల్లంకి రత్నకుమార్
చీఫ్ మేనేజర్, లీగల్ డిపార్ట్‌మెంట్


ఈనాడు

ఉందిలే మంచికాలం ముందు ముందూనా...

అన్యాయాలు, అఘాయిత్యాలు, అణచివేతలు, దురాక్రమణలు, ఆక్రందనలు... ఇంతేగా మానవ చరిత్ర! 'రణరంగం కానిచోటు భూస్థలమంతా వెదికిన దొరకదు, గతమంతా తడిసె రక్తమున, కాకుంటే కన్నీళులతో...' అంటూ దాన్ని శ్రీశ్రీ సమీక్షిస్తుంటే- కాదనడానికి ఆధారాలేవి? యుగాలతోపాటు ఆకారాలు అలంకారాలు ఆయుధాలు మారుతున్నాయి అంతే... ఆలోచనలు మాత్రం అవే! కన్నీటి ప్రవాహాల మధ్యలోంచి వినవస్తే మానవ రక్తచరిత్ర సన్నని విషాదస్వరం తప్ప తక్కినదంతా శ్మశాన నిశ్శబ్దమే! అది చాలక కుల మత విభేదాలతోనూ మనుషులు ఒకరినొకరు చంపుకోవడం ఇంకా అమానుషం. ఆట సాగినంత సేపే రాజు బంటు తేడాలు. చదరంగం ముగియగానే పావులన్నీ పెట్టెలోకే, మనుషులంతా మట్టిలోకే. ఈ కాస్త బతుక్కే ఇంతటి విభేదాలు అవసరమా? బలహీనుణ్ని బలవంతుడు బలంగా తొక్కి పెట్టడమే- మానవజాతి ప్రస్తుతం పాటిస్తున్న రీతి, నీతి! ఇంతకన్నా 'ఏమున్నది గర్వకారణం? మానవజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం!' కవి జొన్నవిత్తుల చెప్పినట్లు, 'ఇది మనుజాళి దనుజాళి మసి చరిత్ర'.. అంతే!

ఈ నాణేనికి రెండోవైపు లేదా మరి? అంటే- ఉంటూనే ఉంది. 'విలయ పయోధి మగ్నమయే విశ్వ మహీ వలయంబు' అని భారతంలో ఎర్రాప్రగడ చెప్పిన స్థాయి ప్రళయంలో సైతం చల్లారిపోనిదే- ఆదిన యజ్ఞ వేదికల్లోంచి సన్నగా లేచే తెల్లని పొగలా ఒక శాంతిపోతం రెక్కలు విప్పుతుంటుంది. చల్లని గాలులకే బుగ్గలపై వచ్చిన కన్నీటి చారికలను ఆరబెడుతుంది. ఊరడిస్తుంది. ఆశకు ఊపిరి పోస్తుంది. మనిషిని తేరుకునేలా చేసే ఆ శాంతిపోతానికి మరో పేరే- మానవత్వం! దాని అసలు పేరు దివ్యత్వం! ఎక్కడైనా చూడండి- తెల్లని బూడిదలోంచి చల్లని చిరునవ్వులు మొలిపించడానికి అది కృషి చేస్తూనే ఉంటుంది. ఆ మానవత్వమే- మనిషి అసలు మతం! అదే జనం అభిమతం. మనిషిని చెట్టుతో పోల్చడం- కవి సమయం. సుయోధనుణ్ని- రోషతరువని, ధర్మజుణ్ని- ధర్మతరువని అన్నాడు వ్యాసముని. మనిషిచెట్టుకు మానవత్వమే తల్లివేరు. ఉండుండీ మాను చుట్టూ కులమతాల పిచ్చితీగలు అల్లుకుంటాయి. ఆ తీగలను చూసి పొంగిపోతూ- ఆ చెట్టు కూడా తీగల జాతిదేనని మత మౌఢ్యం చంకలు గుద్దుకుంటుంది. తన బలం పెరిగిందని భ్రమపడుతుంది!

నిజానికి ఆ తీగలకు చెట్టు ఆధారం తప్ప- తీగల బలంతో చెట్టు బతకడం లేదని లోకంలోని శాంతికపోతాలు హితబోధలు చేస్తాయి. 'పందిరి మందిరమూ కాదు, గ్రహణం శాశ్వతమూ కాదు' అని ధైర్యం చెబుతాయి. 'పశ్చిమాన పొంచి ఉండి రవిని మింగ అసురసంధ్య ఒక్కనాడు నెగ్గలేదురా' అని నచ్చచెబుతాయి. శాంతిపోతాల మాటల్లోని సత్యం సజ్జనులను కదిలిస్తుంది. 'మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును' అనే నిజం నిలకడ మీద తేలుతుంది. తాజాగా అలా జ్ఞానజ్యోతిని మానవత్వపు తైలంతో ఎగదోసిన మాజీ సైనికుడు- కుల్దీప్‌శర్మ! ఒక పోలీస్ అధికారి దుశ్చర్యను ఎండగట్టిన పాపానికి అర్షాద్ అహ్మద్ అనే పాత్రికేయుడి ఇంటిని 'జమ్మూ డెవలప్‌మెంట్ అథారిటీ' కూల్చేసింది. దాంతో తీవ్ర ఆవేదనకు గురైన శర్మ- అర్షాద్ కోసం తన భూమిని ఇచ్చేశారు. పెద్దగా ఉన్నవాడే కాదాయన, మనసున్నవాడంతే. మత విభేదాలను పట్టించుకోని ఆ మనసే ఓ కశ్మీరీ వ్యాపారిని ఆకట్టుకుంది. ఆయన స్పందించి శర్మకు కోటి రూపాయల విలువైన భూమిని ఉచితంగా ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఓ జ్ఞాన దీపం మరోదాన్ని వెలిగించింది. కులమతాలకు అతీతంగా శాంతిపావురానికి స్వాగతం పలికింది. మానవత్వానికి వైతాళిక గీతం పాడింది!



వినడం ఒక పెద్ద పని. పక్షుల కిలకిలలు ఎలా వింటామో అలా ఏ అభిప్రాయమూ లేకుండా మనుషుల్నీ వినాలి. సగం వినగానే వాళ్ల మీద ఒక అభిప్రాయం ఏర్పరచుకోవడం, మనకు తోచింది చెప్పడం మంచి శ్రోతల లక్షణం కాదు. ఏకాగ్రతతో ఆస్వాదించి అర్థం చేసుకోవడానికే వినాలి. అప్పుడే మనలో మార్పు స్పష్టంగా తెలుస్తుంది.

– జిడ్డు కృష్ణమూర్తి

నువ్వేమిటో నీకు తెలియాలి!

మనిషి తన జీవితంలో 'ఎరుక'ను విస్మరిస్తున్నాడు. ఎక్కడెక్కడో దేనికోసమో నిరంతరం అన్వేషిస్తున్నాడు. కానీ, తనను తాను తెలుసుకోలేకపోతున్నాడు. వెతుకుతున్నది తన దగ్గరే ఉందని గ్రహించడం లేదు. రామాయణ, భారత, భాగవతాలు చెప్పింది ఇదే. 'తెలుసుకోవడం' దగ్గరనే తడబాటు. మహాత్ములు, మహర్షుల కథల నుంచో, ప్రవచనాలు వినో తనని తాను తెలుసుకోవడం లేదు. సాధారణ వ్యక్తులే కాదు. బుద్ధుడు సహితం ఈ విషయం ఆలస్యంగానే గ్రహించాడు. సమాధానం గ్రహించి అవతార పురుషుడయ్యాడు.

మోక్షం కోసం, జ్ఞానసిద్ధి కోసం, దుఃఖం లేని లోక నిర్మాణం కోసం తన శరీరాన్ని శుష్కింపజేసుకున్నాడు. మరణం కొద్ది రోజులలో తథ్యమనిపించింది. అటువంటి సమయంలో ఓ కళాకారుల బృందం అటుగా ఏ జాతరకో వెళ్తోంది. ఆ గుంపులో ఓ కుర్రాడు తన తంబురాను సవరిస్తున్నాడు. అతణ్ని ఓ వృద్ధ కళాకారుడు హెచ్చరిస్తూ 'ఒరేయ్ అబ్బాయ్... ఆ తీగల్ని మరీ గట్టిగా బిగిస్తే తెగిపోతాయి. మరీ వదులుగా వదిలేస్తే అపస్వరాలు పలుకుతాయి. ఎలా ఉన్నవాటిని అలానే ఉంచితే కమ్మని స్వరాల్ని వినిపిస్తాయి' అన్నాడు. శరీరం శుష్కించి, నీరసంగా ఉన్న బుద్ధుడి చెవులను తాకాయి ఆ మాటలు. వాటిలోని సత్యాన్ని ఆయన మనసు గ్రహించింది. తనకు అన్వయించుకుంది. 'నేనూ ఆ తీగ వంటివాడినే. నిన్నటి వరకు రాకుమారుడిగా సుఖాలను అనుభవించాను. వదులైన తీగనయ్యాను. తరవాత శరీరాన్ని కఠోర నియమాలతో శుష్కింపజేశాను. బిగించిన తీగలా అయ్యాను. రెండూ తప్పే. శరీరాన్ని శరీరంలా చూసుకోవాలి' అనుకున్నాడు. జీవితంలో ధ్యానం కాదు... జీవితమే ధ్యానమని గ్రహించాడు బుద్ధుడు. ఆ దిశగా తనను తాను తెలుసుకుని ప్రసిద్ధుడయ్యాడు. ఆ తరవాత ఆయన దగ్గరికి పలు సమస్యలు, కష్టాల గురించి చెప్పుకోవడానికి వచ్చిన వారిని 'జీవితం పట్ల మీకు ఎరుక ఉందా' అని ప్రశ్నించేవాడు.



అంతర్యామి

ఇది జెన్ కథ కావచ్చు. కానీ... వర్తమానంలో ప్రతి ఒక్కరూ ఒక్క క్షణమైనా పునరాలోచన చేసుకోవాలి. అందరూ తమ గురించి తమకు బాగా తెలుసనుకుంటారు. కానీ... నిజంగా 'ఎరుక' అనేది వారికి తెలియదు. అదే ఉంటే అసలు సమస్యలకు, కష్టాలకు పరిష్కారం ఎవరి దగ్గర ఉందో తెలిసిపోవాలి కదా! రాముడు, కృష్ణుడు తదితర అవతారాల్లోని మూల సూత్రాన్ని దేవదేవుడు ముందుగానే నిర్ణయించుకోబట్టే కదా ఆయా లక్ష్యాలను పూర్తి చేశారు. భగవంతుడి కథలలో తెలుసుకోవాల్సిన నీతి - ఎవరిని వారు తెలుసుకోవడమే! అది జరగనంత వరకు మనిషి తనను తాను గుర్తించలేడనేది బుద్ధ భగవానుడి ఉవాచ. 'నిన్ను నువ్వు ప్రేమించాలంటే.. నువ్వేమిటో నీకు తెలియాలి. తెలియకపోతే ప్రేమించలేవు'. ఆ ఎరుక ఇప్పుడు అందరికీ అవసరం.

– భమిడిపాటి గౌరీశంకర్

సునామీ ముప్పు... సన్నద్ధతే రక్షరేకు!



సముద్ర గర్భాల్లోని అగ్నిపర్వతాలు బద్దలు కావడం వంటి విపరిణామాల వల్ల సునామీలు సంభవిస్తుంటాయి. వాటిని సకాలంలో గుర్తించడం శాస్త్రవేత్తలకు ఇప్పటికీ ఒక సవాలుగానే మిగిలిపోయింది. దేశాలన్నీ కలిసికట్టుగా పరిశోధనలు సాగించడానికీ, సునామీ ప్రభావిత జనావళిని కాపాడటానికీ 'యునెస్కో' సంయుక్త కార్యాచరణను రూపొందిస్తోంది. ఈ తరుణంలో భారత్ సహా ప్రపంచ దేశాల్లో సునామీ సమాచారాన్ని కచ్చితంగా, వేగంగా అందించే వ్యవస్థలు ఏర్పాటవుతున్నట్లు ప్రముఖ శాస్త్రవేత్త, ఆస్ట్రేలియాలోని ఇండియన్ ఓషన్ సునామీ వార్నింగ్ అండ్ మిటిగేషన్ సిస్టం సెక్రెటేరియేట్ అధిపతి డాక్టర్ శ్రీనివాస కుమార్ తుమ్మల వెల్లడించారు. గతంలో భారత మహా సముద్రాల సమాచార సేవల జాతీయ కేంద్రం (ఇన్‌కాయిస్) డైరెక్టర్‌గా పనిచేసిన ఆయనతో 'ఈనాడు' ప్రతినిధి బి.ఎన్.జ్యోతిప్రసాద్ ముఖాముఖి...



సునామీ సమాచార మార్పిడికి సంబంధించి అంతర్జాతీయ సహకారం ఎలా ఉంది?


సునామీ హెచ్చరికలు చేయడానికి నార్త్-ఈస్ట్ అట్లాంటిక్ మెడిటేరియన్, కరేబియన్, పసిఫిక్, హిందూ మహాసముద్ర వ్యవస్థలున్నాయి. అయితే మనం హిందూ మహాసముద్ర దేశాల కోసం ప్రాంతీయంగా 'ఇండియన్ ఓషన్ సునామీ వార్నింగ్ అండ్ మిటిగేషన్ సిస్టం'ను ఏర్పాటు చేసుకున్నాం. భారతదేశంతో పాటు ఆస్ట్రేలియా, ఇండోనేసియాలు కూడా తమ సునామీ హెచ్చరికలను ఇతర దేశాలతో పంచుకునేలా అత్యాధునిక వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాయి. హిందూ మహాసముద్రంలో ఎక్కడ సునామీ వచ్చినా 27 దేశాలను అప్రమత్తం చేయగలగుతున్నాం. ఈ దేశాల నుంచి హెచ్చరికలను స్వీకరించి, తదనుగుణంగా స్పందించే వ్యవస్థలను కూడా ఏర్పాటు చేసుకున్నాం. పైగా అన్ని వ్యవస్థల మధ్య సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునే విధానముంది. యునెస్కో ఏమో నాలుగు ప్రాంతాల వ్యవస్థలను అనుసంధానం చేసేలా పర్యవేక్షిస్తుంది. సునామీ హెచ్చరికలను ఎలా అర్థం చేసుకోవాలి? వాటి ప్రభావం, ఎలా స్పందించాలి? వంటి అంశాలపై సభ్యదేశాల్లోని సంబంధిత విభాగాలకు శిక్షణ ఇస్తుంది. సునామీ హెచ్చరికలను ప్రజల దగ్గరికి చేర్చడానికి యునెస్కో సారథ్యంలో ప్రభుత్వాల మధ్య సమన్వయం ఉంది. యునెస్కో ఆధ్వర్యాన 152 దేశాలతో ఇంటర్ గవర్నమెంటల్ ఓషనోగ్రాఫిక్ కమిషన్ (ఐవోసీ) పనిచేస్తోంది. సునామీ సమయాల్లో తీరప్రాంత ప్రజలను కాపాడటానికి ఈ సంస్థ కృషి చేస్తుంది.

సునామీ హెచ్చరికల విధానం ఇప్పుడు ఎలా ఉంది?

సముద్రాల్లో సంభవించే భూకంపాలను 3-4 నిమిషాల్లోనే గుర్తించగలుగుతున్నాం. వాటి మూలంగా సునామీ వచ్చే అవకాశంపై మొదటి ప్రాథమిక హెచ్చరికను జారీచేయడానికి పది నిమిషాలు పడుతోంది. భూకంపం తీరు ఆధారంగా, సునామీ ప్రభావం ఏయే ప్రాంతాల్లో ఏవిధంగా ఉంటుంది, అలలు ఎంత ఎత్తున ఎగసిపడవచ్చు అనే హెచ్చరికలు చేయడానికి మరో పది నిమిషాలు పడుతోంది. మొత్తంగా 20 నిమిషాల్లో సునామీ సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నాం.

సునామీలను గుర్తించడానికి ఎలాంటి వ్యవస్థలు పనిచేస్తున్నాయి?

ప్రపంచంలో 85శాతం సునామీలకు సముద్ర భూకంపాలే కారణం. మన దేశంలో ఐఎండీ ఏర్పాటుచేసిన సీస్మిక్ స్టేషన్లు ఆ డేటాను ఇన్‌కాయిస్ వంటి హెచ్చరిక వ్యవస్థలకు అందజేస్తాయి. అక్కడ వారు విశ్లేషించి, సునామీల రాకపై అందర్నీ అప్రమత్తం చేస్తారు. వాస్తవానికి ఇన్‌కాయిస్ యాభై వరకు ఉపరితల సెన్సర్లను ఏర్పాటు చేసింది. మన దగ్గర భూకంపాలను గుర్తించేందుకు 17 సీస్మిక్ స్టేషన్లు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా మరో 400 స్టేషన్లు పనిచేస్తున్నాయి. వీటి డేటాను విశ్లేషించిన మీదటే సునామీ హెచ్చరికలు చేయగలుగుతున్నాం. ఇంకా ప్రపంచవ్యాప్తంగా 200 టైడ్‌గేజ్‌లు పనిచేస్తున్నాయి. వాటిలో 50 మనవే. ఇవే కాకుండా- బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో ఏడు సునామీ బోయిజ్‌లను ఏర్పాటు చేసుకున్నాం. ఇవి అలల తీవ్రతను గుర్తిస్తాయి. భూకంపం సంభవిస్తే భూమి ఎంతమేర పైకి వస్తుంది? అలల తీవ్రత ఎంతవరకు ఉంటుంది? ఏ సమయంలో సునామీ రావచ్చు? అనే విషయాలను అంచనా వేస్తాం. ఇందుకు ఇన్‌కాయిస్‌లోని అత్యాధునిక 'తరంగ్' కంప్యూటర్ సాయపడుతోంది.



'సునామీ సన్నద్ధత గుర్తింపు' ఏంటి?

ఇది ఐవోసీ ప్రారంభించిన కార్యక్రమం. దీనిలో భాగంగా 12 ప్రధాన అంశాలపై అవగాహన కలిగిన తీరప్రాంత గ్రామాలకు సునామీ సన్నద్ధత గుర్తింపు ఇస్తారు. సునామీ అంటే ఏంటి? ఎంత వరకు నీళ్లు వస్తాయి? సునామీకి ఎలా స్పందించాలి? జాప్యం చేయకుండా సురక్షిత ప్రాంతాలకు ఏయే మార్గాల్లో వెళ్లాలి?... ఇలాంటి ప్రశ్నలుంటాయి. సునామీ వచ్చినప్పుడు ఎలా స్పందించాలనే దానిపై ఏడాదికి ఒకసారి డ్రిల్ నిర్వహిస్తారు. మరోవైపు, గ్రామస్థాయిలో సునామీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక ఉండాలి. ఇలా మన దగ్గర ఒడిశాలో 26 గ్రామాలు 'సునామీ రెడీ రికగ్నిషన్' గుర్తింపు పొందాయి. ఒక్క సునామీకి సన్నద్ధమయ్యామంటే ఇక అన్ని విపత్తులకూ సమాయత్తం అయినట్లేనని గుర్తించాలి.

ఇప్పుడు మనముందున్న సవాళ్లేంటి?

ప్రకృతి గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. ఒకసారి వచ్చిన విపత్తు మళ్లీ అలాగే వస్తుందని చెప్పలేం. కాబట్టి, అన్నింటికీ సిద్ధపడి ఉండాలి. ఇప్పటికే '2020-30 దశాబ్ద సముద్ర సునామీ ప్రోగ్రాం(ఓడీటీపీ)' కింద 70 కార్యక్రమాలు చేపడుతున్నాం. రాబోయే అయిదేళ్లలో సునామీలను ఎదుర్కోవడానికి వంద శాతం సర్వసన్నద్ధంగా ఉండాలన్న లక్ష్య సాధనకు ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ఉపగ్రహ సమాచారాన్ని మరింతగా వినియోగించుకోవడానికీ; సముద్రంలో కేబుళ్లకు సెన్సర్లను ఏర్పాటుచేసి అక్కడి మార్పులను త్వరగా గుర్తించడానికీ కసరత్తు జరుగుతోంది. సముద్ర గర్భంలో అగ్నిపర్వతాల విస్ఫోటనం, కొండ చరియలు విరిగిపడటం వంటి పరిణామాలపై లోతైన పరిశోధనలుసాగించాలి. దీంతోపాటు సునామీ వంటి విపత్తులను దీటుగా ఎదుర్కోవడానికీ మనం సర్వసన్నద్ధం కావాలి. ★

విదేశీ భాషల్లో వచ్చిన గొప్ప సాహిత్యాన్ని స్థానిక భాషల్లోకి అనువదించుకుని ప్రపంచమంతా చదువుతోంది. అలాగే ఆంగ్లంలో రాసి అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన భారతీయ రచయితలూ ఉన్నారు. వారి పుస్తకాలు భారతీయ భాషల్లోకే కాకుండా రష్యన్, జర్మన్, ఫ్రెంచ్ లాంటి పలు విదేశీ భాషల్లోకీ అనువాదమయ్యాయి. అలాంటి రచయితల్లో ముల్క్‌రాజ్ ఆనంద్ ఒకరు. తండ్రి సైన్యంలో ఉద్యోగం చేయడం వల్ల పలు ప్రాంతాల్లో నివసించింది వారి కుటుంబం. దాంతో ముల్క్‌రాజ్‌కి పెరిగే వయసులోనే వివిధ ప్రాంతాల, వర్గాల ప్రజల జీవన స్థితిగతులు బాగా అర్థమయ్యాయి. పీడిత ప్రజానీకం అగచాట్లను ప్రతిబింబిస్తూ, నవసమాజ సృష్టికి సాహిత్యాన్ని ఆయుధంగా మలచుకోవాలనుకుని కలం పట్టిన ప్రజాస్వామిక రచయితల్లో తానొకరయ్యారు.

ఓ బడుగుజీవి కథ



ముల్క్‌రాజ్ రాసిన వందకు పైగా పుస్తకాల్లో రెండోదైన 'కూలీ' 1936లో ప్రచురితమై, ఇరవైకి పైగా ఇతర భాషల్లోకి అనువాదమైంది. అటు బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలనను, ఇటు భారతీయ కులవ్యవస్థను తీవ్రంగా విమర్శిస్తుందీ పుస్తకం.

తల్లినీ తండ్రినీ కోల్పోయి మేనమామ ఇంటికి చేరిన పద్నాలుగేళ్ల అనాథ 'మునూ' ఈ పుస్తకంలో కథానాయకుడు. తన తండ్రికి కొంచెం పొలం ఉండేది. అప్పు కింద దాన్ని భూస్వామి లాక్కున్న వైనం ఆ చిన్ని మనసుకు తెలుసు. కళ్లముందే అమ్మానాన్నలు ప్రాణం విడవడం చూసిన మునూకి మేనమామ నాలుగురోజులు నీడ నివ్వగలిగాడు కానీ ఆ బిడ్డ కోరుకునే ప్రేమనీ, మంచి జీవితాన్నీ మాత్రం ఇవ్వలేకపోయాడు. భార్య పోరు పడలేక పట్టణం తీసుకెళ్లి ఒక బ్యాంకు ఉద్యోగి ఇంట నౌకరుగా చేరుస్తాడు. ఆ ఇంటి యజమాని భార్య మునూను పెట్టే కష్టాలు ఇన్నీఅన్నీ కావు. క్షణం కూర్చోనివ్వకుండా చేయించుకునే చాకిరీ చాలదన్నట్లు అడుగడుగునా అవమానాలూ ఈసడింపులూ. వాళ్లమ్మాయి షీలా స్నేహంలో కాస్త సాంత్వన పొందుతూ ఆటలో మైమరచి ఆ అమ్మాయిని గాయపరుస్తాడు మునూ. దాంతో చావచితగ్గొడతారు యజమానులు. అక్కడి నుంచి పారిపోయి రైలెక్కుతాడు. రైల్లో పరిచయమైన వ్యక్తి తీసుకెళ్లి తన ఫ్యాక్టరీలో పనిలో పెట్టుకుంటాడు. ఇక్కడ మరో రకం చాకిరీ. పైగా కంపుకొట్టే పరిసరాలు. రోజంతా పనిచేసినా కడుపు నిండా తిండి ఉండేది కాదు. కొన్నాళ్లకు ఫ్యాక్టరీ మూతపడటంతో మునూ మళ్లీ రోడ్డునపడతాడు. ఒక సర్కస్ కంపెనీతో కలిసి బొంబాయి చేరతాడు. అక్కడ బట్టల మిల్లులో చేరి కార్మికుల సమ్మె కారణంగా మరోసారి ఉపాధి కోల్పోతాడు. కారు ఢీకొని గాయపడిన మునూని ఒక బ్రిటిష్ వనిత సిమ్లా తీసుకెళ్లి తన రిక్షా లాగే పనిలో పెట్టుకుంటుంది. చుట్టూ కొండలు కనిపించడంతో ఊరు గుర్తొచ్చి మునూ కాస్త సేదతీరుతుండగా క్షయ లక్షణాలు బయటపడతాయి. పదహారేళ్ల జీవితంలో అడగడుగునా శ్రమదోపిడీకి గురై పేదరికంతో, ఆకలితో, రోగంతో పోరాడుతూనే ముగుస్తుంది మునూ జీవితం.

నిజానికి ఇది ఒక్క మునూ కథ కాదు... అలాంటి ఎందరో పిల్లలకు, యువకులకు ప్రతీకగా ఆ పాత్రను మలిచారు రచయిత. దాదాపుగా ఆయన నవలల ఇతివృత్తాలన్నీ సమాజంలోని అట్టడుగు ప్రజల వ్యథలే. నాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులూ; సామాజిక అంతరాలూ కళ్లకు కట్టేలా పాత్రల్ని నడిపిస్తారు ఆనంద్.

– మిహిర

సత్వర న్యాయం... ఒక ఎండమావి!

'మన న్యాయవ్యవస్థ తీవ్రమైన కేసుల్లో కూడా స్లోమోషన్ సిండ్రోమ్‌తో బాధపడుతోంది. న్యాయబద్ధంగా నిష్పాక్షికంగా జరగాల్సిన విచారణలకు అది ప్రాణాంతకమైనది. సత్వర న్యాయమనేది సామాజిక న్యాయంలో భాగం' అంటూ విఖ్యాత న్యాయమూర్తి జస్టిస్ కృష్ణయ్యర్ ఓ తీర్పులో స్పష్టంగా రాసి 47 ఏళ్లు దాటిపోయింది. 'మనిషి ఆయుర్దాయం స్వల్పమే కానీ, వ్యాజ్యం మాత్రం చిరాయువు అన్న జస్టిస్ కృష్ణయ్యర్ మాటలు గుర్తొస్తున్నాయి నాకు. ఎంత నిజమది! ఇంకా చెప్పాలంటే- దావాలు దీర్ఘకాలం పాటు అక్షరాలా దేకుతూ ఉంటాయి. వితరణలో ఆలస్యమయ్యే కొద్దీ న్యాయం అపహాస్యమవుతుంది. సంబంధిత వ్యక్తులకు అది అన్యాయంగా పరిణమిస్తుంది' అని భారత రాష్ట్రపతిగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ హెచ్చరించి పద్దెనిమిదేళ్లు అయ్యింది. అప్పటికీ ఇప్పటికీ ఏం మారిందంటే- పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లు తయారైంది బాధితుల గతి! పరమ ఘోరమైన అకృత్యాలకు బలవుతున్న అసహాయులకు సైతం అంత త్వరగా సులభంగా న్యాయం దొరకని దయనీయావస్థ దేశాన్ని వెనక్కి నడిపిస్తోంది. రాజ్యాంగం ప్రసాదించిన పౌరహక్కుల మీద ప్రజల్లో నమ్మకాన్ని అది క్రమేణా చంపేస్తోంది!

పదహారేళ్ల వెనక్కి వెళ్తే- షహీన్ మాలిక్ అనే 26 ఏళ్ల యువతి... ఓచోట పనిచేస్తూ ఎంబీయే చదువుతోంది. ఆమె ఆత్మవిశ్వాసం, పనిలో సమర్థత చూసి సహోద్యోగుల్లో ఎవరికో బాగా కన్నుకుట్టింది. అంతే... మొహానికి కర్చీఫ్ కట్టుకున్న ఆగంతకుడు ఒకడు ఓరోజు ఆఫీసు బయటే షహీన్‌పై యాసిడ్ పోశాడు. ఆ హేయ వికృత దాడి తరవాత బయటి ప్రపంచంలోకి రావడానికి ఆమె పాతిక ఆపరేషన్లు చేయించుకోవాల్సి వచ్చింది. నాలుగేళ్ల వరకు ఆ కేసులో కదలికే లేదు. 2013లో దిల్లీ కోర్టుకు అది బదిలీ అయ్యింది. అప్పటి నుంచి కేసు ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఈ నత్తనడక విచారణపై సుప్రీంకోర్టు తాజాగా తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తంజేసింది. 'న్యాయవ్యవస్థను అపహాస్యం చేయడమిది! జాతికి సిగ్గుచేటు అయిన విషయమిది!' అంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. షహీన్ ఒక్కరే కాదు... ఆమెలా యాసిడ్ దాడుల బాధితులు ఇంకెందరో న్యాయంకోసం సంవత్సరాల తరబడి ప్రాణాలను కళ్లలో పెట్టుకుని ఎదురుచూస్తున్నారు. పాశవిక అత్యాచారాలకు గురైన మరెందరో అభాగ్యురాళ్లు కూడా ఇలాగే కళ్లులేని ఆ న్యాయదేవత ముందు నిలబడి ఉన్నారు. తమ జీవితాలను సర్వనాశనం చేసిన కీచకులను కఠినంగా శిక్షించాలని కన్నీళ్లతో కోరుకుంటున్నారు. వాంగ్మూలాలు తీసుకోవడం నుంచి విచారణ పూర్తిచేయడం వరకు ఎక్కడికక్కడ అంతులేని ఆలస్యం జరుగుతున్న వ్యవస్థలో వారి గోడంతా అరణ్యరోదనగా మిగిలిపోతోంది. 'సాక్ష్యాలు చెరిపేయడానికి, బాధితురాలిని బెదిరించడానికి నిందితుడికి అవకాశం కల్పించేలా ట్రయల్ కోర్టు తీరు ఉంది' అంటూ సర్వోన్నత న్యాయస్థానమే ఇటీవల ఒక కేసులో తప్పుబట్టింది. సత్వర న్యాయమనే సంవిధాన వెలుగును మింగేసే చిమ్మచీకటి ఎక్కడికక్కడ ఎంత దట్టంగా అలుముకుపోతోందో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు!



నేరగాళ్లను సత్వరం సహేతుకంగా శిక్షించాలని, నిరపరాధులను రక్షించాలని జనసామాన్యం కోరుకుంటుంది. అలాంటి న్యాయం దొరకని సమాజంలో ధైర్యం చచ్చిపోతుంది. అన్యాయం వ్యవస్థీకృతమైన దేశంలో ప్రజానీకం నిరాశా నిస్పృహల్లో కూరుకుపోతుంది. వాతావరణం అలా నిర్లిప్తమయ్యే కొద్దీ ప్రగతి దీపాలు కొండెక్కిపోతూ ఉంటాయి. అంతేనా! అబ్దుల్ కలామ్ నిలదీసినట్లు- 'నేరన్యాయ వ్యవస్థలో జరుగుతున్న జాప్యం మూలంగా నిజమైన నేరస్థులు ఏళ్ల తరబడి శిక్షల నుంచి తప్పించుకుంటూ ఉంటే... వాళ్లను చూస్తూ కొత్తగా నేరాలకు పాల్పడేవారు విపరీతంగా పెరిగిపోరా'? అదే జరుగుతోంది కదా ఇప్పుడు దేశంలో! హత్యలూ అత్యాచారాలూ అవినీతి అక్రమాలు... ఇలా ఎన్నో పాతకాలకు ఒడిగట్టిన ప్రబుద్ధులు కూడా కడుపులో చల్ల కదలకుండా హాయిగా సేదతీరుతున్నారు. సమాజంలో స్వేచ్ఛావిహారం చేస్తూ కొత్త నేరగాళ్లకు స్ఫూర్తిప్రదాతలవుతున్నారు. ప్రజల బాగోగుల పట్ల బాధ్యతగా మెలగాల్సిన రాజకీయ నాయకులు పొద్దస్తమానం భ్రష్టాచారాల బురదలో మునిగి తేలుతున్నారంటే తప్పెవరిది? అవినీతి చక్రవర్తులుగా వాసికెక్కిన నేతలపై నమోదైన సీబీఐ, ఈడీ కేసులు ఏళ్లకేళ్లు జీడిపాకంలా సాగుతుంటే ఇంకెవరికి భయముంటుంది? ఆర్థిక నేరాల్లో ఆరితేరిన తాలునేతా జాతిరత్నంగా ప్రజల్లో పరువుమాసిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పన్నెండేళ్లుగా బెయిల్ మీద స్వేచ్ఛాజీవితం గడుపుతున్నారు. జగన్‌పై నమోదైన సీబీఐ, ఈడీ కేసుల్లో విచారణ ఇంకా డిశ్చార్జ్ పిటిషన్ల దశలోనే ఉంటే- అదే అదనుగా ఆయనేమో అరాచక రాజకీయాలకు మారుపేరయ్యారు. ప్రజాప్రతినిధులపై కేసులు కూడా త్వరగా తెమలకపోతే- నేరచరిత నేతల విజృంభణలో ప్రజాస్వామ్యమే చచ్చుబడిపోతుంది!

సకాలంలో తగిన వైద్యం అందకపోతే రోగి ప్రాణం నిలబడదు. న్యాయమూ అంతే! జరగాల్సిన సమయంలో అది జరగకపోతే జీవితాలే తెల్లారిపోతాయి. అందుకు సాక్ష్యాలుగా ఎంతోమంది బతుకులు జైళ్లలోనే ముగిసిపోతున్నాయి. పోచయ్య అని సిద్దిపేట జిల్లా వాసి... సొంత తల్లిని హత్య చేశాడనే నేరాభియోగాల మీద 2013లో అరెస్టయ్యాడు. ఆపై రెండేళ్లకు యావజ్జీవ కారాగారశిక్ష పడింది. 2015లో హైకోర్టుకు అప్పీలు చేసుకుంటే- నిరుడు అతను నిర్దోషి అనే తీర్పు వచ్చింది. కానీ, అంతకు ఆరేళ్ల మునుపే జైలులోనే పోచయ్య చనిపోయాడు... నేరస్థుడనే అపవాదును నెత్తినమోస్తూ! ప్రస్తుతం దేశవ్యాప్తంగా కింది కోర్టుల్లో 4.84 కోట్ల కేసులు అపరిష్కృతంగా పడిమూలుగుతున్నాయి. హైకోర్టుల్లో 63.62 లక్షల కేసులు పెండింగ్‌లో ఉంటే- సుప్రీంకోర్టులో అలాంటి వాటి సంఖ్య 90వేలకు పైబడింది. ఈ కేసుల గుట్టలన్నీ కరిగేసరికి ఎన్నేళ్లు పడుతుందో, ఆలోపు కొత్తగా వచ్చే వ్యాజ్యాల గతేంటో ఆ న్యాయదేవతకే తెలియాలి! ఒక పట్టాన కొలిక్కిరాని కేసుల మూలంగా ఇండియా ఏడాదికి తన జీడీపీలో రెండుశాతం దాకా కోల్పోతోందని అంచనా. ఈ ఆర్థిక నష్టమంతా ఒక ఎత్తు... బాధితులు అనుభవించే మానసిక వేదన అయితే మాటల్లో చెప్పలేనిది, రూపాయల్లో కొలవలేనిది! దానికి ఎవరు పరిహారం చెల్లిస్తారు? న్యాయాధికారుల పోస్టుల భర్తీ నుంచి దిగువస్థాయి న్యాయస్థానాల్లో మౌలిక వసతులు, సిబ్బంది కొరతను తీర్చడం వరకు ప్రభుత్వాలు తలచుకుంటే కోర్టులపై పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడానికి ఎన్నో మార్గాలున్నాయి. మాటల మంత్రదండాలతో జనాన్ని మభ్యపెట్టడంలోనే ఏలినవారికి తీరికలేకుండా ఉన్నప్పుడు ఇవన్నీ వారు పట్టించుకుంటారా? మరి అలాంటివారితో ప్రజలకు ఒరిగేదేంటి అంటారా... సున్నకుసున్న హళ్లికిహళ్లి! అంతే!!

– శైలేష్ నిమ్మగడ్డ

పుణ్యభూమి

మేఘాలు అలా.. ఆకారాలు ఎలా?

నేస్తాలూ... పొద్దున్నుంచి రాత్రిలోపు మనం ఒక్కసారైనా తప్పకుండా చూసే వాటిలో ఆకాశంలోని అందమైన మేఘాలు కూడా ఉంటాయి. అందరికన్నా ముందుగా మన ఫ్రెండ్స్‌గా మారేవి అవే. ఎందుకంటే, మనం ఇంట్లో నుంచి బయటపడి బడికెళ్లేదాకా మన వెంటే వస్తాయి. మళ్లీ ఇంటికి వచ్చేటప్పుడు తోడుగా వస్తాయి. ఒక్కసారికూడా మాట్లాడుకోకపోయినా... పైన అవి, కింద మనం ఇంతకన్నా మంచి స్నేహితులు ఎవరుంటారు చెప్పండి! వెనకాల అల్లంత నీలిరంగు, వాటిపై తెల్లగా తేలిపోయే మేఘాలను చూస్తుంటే అందమైన పెయింటింగ్‌లా అనిపిస్తుంటుంది కదూ!



మీరంతా బొమ్మలు వేసేటప్పుడు ఒక్కసారైనా ఆకాశ సముద్రంలో దూదిపింజల్లా ఈదులాడే మేఘాల చిత్రాలు గీసే ఉంటారు. రోజూ మనతో పాటే ఉంటూ, మనతోనే గడుపుతూ, కలవకుండానే మనకు మంచి నేస్తాలైన మేఘాల విశేషాలేమిటో తెలుసుకుందామా?

మనం జాగ్రత్తగా గమనిస్తే, ఏ రెండు మేఘాలూ ఒకేలా కనిపించవు కదూ! అవును, అన్నీ విభిన్న ఆకారాల్లో ఉంటాయి. ఎందుకంటే, మేఘాలు వేర్వేరు ఎత్తులు, విభిన్న ఉష్ణోగ్రతల వద్ద ఏర్పడతాయి... విభిన్న రేణువులతో కూడి ఉంటాయి. ఇలాంటి కారణాల వల్లే అవి వేర్వేరు ఆకారాలతో ఏర్పడుతుంటాయి.


హాయ్! బుజ్జీ!!

అత్యంత ఎత్తులో ఉండే మేఘాలను 'నాక్టిలుసెంట్' లేదా నైట్‌షైనింగ్‌గా పిలుస్తారు. ఇవి సుమారు 30-50 మైళ్ల ఎత్తులో ఏర్పడతాయి. 'మదర్ ఆఫ్ పర్ల్' మేఘాలు 12-18 మైళ్ల ఎత్తులో ఉంటాయి. ఇవి దుమ్ము, నీటి బిందువులతో కలిసి ఏర్పడతాయి. ఇవి సూర్యాస్తమయం, రాత్రివేళ, సూర్యోదయానికి ముందు మాత్రమే కనిపిస్తాయి. 'సిరస్' అనే మేఘాలు భూమికి అయిదారు మైళ్ల ఎత్తులో ఉంటాయి. ఇవి ఈకల్లా ఉండి, కొద్దిపాటి మంచుతో కూడి ఉంటాయి. కొంచెం కింద ఉండే మేఘాలు చిన్న మంచు బిందువులతో ఏర్పడతాయి. కాలిఫ్లవర్ ఆకారాల్లో ఉండే మేఘాలు కుంభవృష్టిని తెస్తాయి.

ఎడారులు, పొడిబారిన నేలల ఉపరితలం, అగ్నిపర్వతాల నుంచి దుమ్ము రేణువులు ఎగురుతాయి. సముద్రాల నుంచి సన్నని ఉప్పురేణువులు వెలువడుతుంటాయి. బొగ్గు వంటివాటిని మండించినప్పుడు సాలిడ్ పార్టికల్స్ వెలువడతాయి. మనకు విభిన్న రకాల మేఘాలు కనిపించడానికి ఇవన్నీ కారణమే. ఎందుకంటే, నీటి ఆవిరి బిందువుల్లా ఘనీభవించి విభిన్న రకాల రేణువుల చుట్టూ చేరడంతో మేఘాలు ఏర్పడతాయి.

– శ్రీజన్

నేర్చుకుందాం.. మార్చుకుందాం..



పట్నాలో..


బెజవాడలో..

బిహార్ రాజధాని పట్నాలోని చాలా పైవంతెనల కింద ఖాళీగా ఉండే ప్రదేశాన్ని.. నగరవాసులకు ఆహ్లాదం పంచే కేంద్రాలుగా మార్చేశారు. ఉదయం నడక నుంచి బ్యాడ్మింటన్, టెన్నిస్, క్రికెట్ లాంటివి ఆడుకునే చిన్న క్రీడామైదానాలుగా మార్చారు. కొన్నిచోట్ల పిల్లలు ఆడుకునేలా క్రీడా పరికరాలను సమకూర్చారు. నగరవాసులకు ఆటస్థలాలు, పార్కులు లేని కొరతను.. అక్కడి సర్కారు ఇలా తీర్చింది. మన విజయవాడలోనూ.. బెంజిసర్కిల్, కనకదుర్గ పైవంతెనలు.. ఆరు వరుసలతో విశాలంగా ఉండడంతో వాటి కింద కూడా అంతే స్థలం ఖాళీగా ఉంది. ఈ స్థలాలను కనీసం ఒక్కచోట కూడా సరిగా వినియోగించుకున్నది లేదు. నిరుపయోగంగా వదిలేశారు. దీంతో ట్రావెల్స్ సంస్థలు, ఇతర ప్రైవేటు వాహనాల పార్కింగ్‌గా ఈ స్థలాలను అనధికారికంగా వాడుకుంటున్నారు. విజయవాడలో చిన్నారులు ఆడుకునేందుకు.. సరైన క్రీడా స్థలాలు లేవు. నగరవాసులకు సైతం ఉదయం నడక, బ్యాడ్మింటన్ వంటివి ఆడుకునేందుకు స్థలాలు లేవు. దీంతో ప్రైవేటుగా ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ వంటి వాటికి గంటకు రూ.800కు పైగా చెల్లించాల్సి వస్తోంది. ఖాళీగా ఉన్న పైవంతెనల కింద ఉండే స్థలాలను.. పట్నాలో మాదిరిగా అత్యంత తేలికగా, అతి తక్కువ ఖర్చుతోనే క్రీడాస్థలాలుగా మార్చొచ్చు. పాలకులు దీనిపై దృష్టిసారిస్తే.. నగరవాసులకు ఎంతో ప్రయోజకరంగా ఉంటుంది. - ఈనాడు, అమరావతి

నాయకుడివై నడిపించు..!

★ విద్యాలయాల్లో 'లీడర్‌షిప్' సంస్కృతి



సంతోష్‌కు చిన్నప్పట్నుంచీ బిడియం, భయం ఎక్కువ. ఎవరికైనా ఏదైనా చెప్పాలంటే మొహమాటం. విశ్వవిద్యాలయంలో అడుగు పెట్టాక అతని ఆలోచనా విధానమే మారిపోయింది. లీడర్‌షిప్ క్వాలిటీపై ఇచ్చిన శిక్షణలో రాటుదేలాడు. స్టూడెంట్ కౌన్సిల్‌లో మంచి నాయకుడిగా ఎదిగాడు. - ఈనాడు, అమరావతి

గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన వెంకట్‌కు.. అమరావతిలోని ఓ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో అడుగు పెట్టగానే అక్కడి వాతావరణం చూసి భయం పట్టుకుంది. తోటి విద్యార్థులతో మెలగడంలోనూ ఇబ్బంది పడ్డాడు. సాఫ్ట్ స్కిల్స్ మీద శిక్షణ ఇవ్వడం, వెబ్‌నార్లలో పాల్గొనడం ద్వారా తనలోని భయాన్ని పోగొట్టుకున్నాడు. కౌన్సిల్‌లోని కొన్ని కమిటీల్లో వివిధ స్థాయిల్లో అవకాశాలు దక్కించుకుంటూ రెండేళ్లలోనే ప్రెసిడెంట్ స్థాయికి ఎదిగాడు.

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.. ఎంతో మంది విద్యార్థులు తమను తాము మలచుకోవడం ద్వారా సరికొత్త జీవితం వైపు అడుగులేస్తున్నారు. నాయకుడిగా ఎదిగి వృత్తి జీవితంలోనూ.. వ్యక్తిగతంగానూ రాటుదేలుతున్నారు.

ప్రైవేటు సంస్థలో పదిమంది ఉద్యోగులను సమర్థంగా నడిపించాలన్నా.. విద్యాలయంలో వందలాదిమంది విద్యార్థులకు మార్గదర్శకంగా నిలబడాలన్నా.. నాయకత్వం చాలా ముఖ్యం. కార్పొరేట్ రంగంలో ప్రతీ విభాగంలోనూ లీడర్ల అవసరం చాలా ఉంది. ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటూ, బృందాన్ని స్నేహపూర్వకంగా విజయాలవైపు తీసుకెళ్లే తత్వాన్ని పెంపొందించాలి. అలాంటి లీడర్ల తయారీకి విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయి.

సబ్జెక్టుగా.. అమరావతిలోని కొన్ని ప్రైవేటు విద్యాలయాల్లో లీడర్‌షిప్ క్వాలిటీపై బోధిస్తున్నారు. ఇతరుల ఆలోచనలను ఎలా గౌరవించాలి? బృందంగా ఎలా పని చేయాలి? విజయాన్ని ఎలా అందుకోవాలి? పబ్లిక్ స్పీకింగ్, గ్రూప్ వర్క్, బృంద చర్చల ద్వారా రాటుదేలేలా చేస్తున్నారు. బీటెక్, బీబీఏ, బీసీఏ విద్యార్థులకు తొలి రెండేళ్లు సబ్జెక్టుగా నేర్పిస్తున్నారు.

వెబినార్లతో శిక్షణ.. రాణింపు

విద్యార్థుల్లో నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించడానికి.. భవిష్యత్తులో కార్పొరేట్ రంగంలో దక్షత రాణించడానికి అవసరమైన వెబినార్లు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు సంస్థల ద్వారా వారంలో రెండు నుంచి మూడు రోజులపాటు ఈ శిక్షణ ఉంటోంది. కృత్యాధార పద్ధతిలో ఓ అంశాన్ని ఇచ్చి మాట్లాడించడం.. విద్యార్థుల నుంచే సరికొత్త నమూనాలు రూపొందించేలా మార్గనిర్దేశం చేయడం చేస్తున్నారు.

స్టార్టప్‌లకూ ప్రోత్సాహం

ఏటా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌తో మూడు నెలలపాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. స్టార్టప్‌లు కూడా చేయించి.. బాగా చేసిన వారికి పెట్టుబడులు సమకూర్చేందుకు సహాయపడుతున్నారు. విద్యార్థులకు చెబుతున్నారు.

కమిటీల్లోనూ అవకాశం.. వివిధ కమిటీల్లోనూ విద్యార్థులకు కీలక పాత్ర పోషించేలా అవకాశాలు కల్పిస్తున్నారు. స్టూడెంట్ కౌన్సిల్, మెస్ కమిటీ, క్రమశిక్షణ కమిటీ.. ఇలా అనేకం ఉన్నాయి. వీటిల్లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, కన్వీనర్, కో కన్వీనర్ సహా సభ్యులుంటారు. వీరు విద్యాలయంలోని పరిస్థితిని పరిశీలించడం, సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతస్థాయికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

అందుబాటులో గోనె సంచులు

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో 1,50,000 మెట్రిక్ టన్నుల ఖరీఫ్ ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు 18,75,000 గోనె సంచులు అవసరం. ప్రస్తుతం 18,89,900 సంచులు అందుబాటులో ఉన్నట్టు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సతీష్ తెలిపారు. శనివారం వరకు 7,037 మంది రైతుల నుంచి 51,552.240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. రూ.106.59 కోట్లను 24 గంటల్లోపే బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు వివరించారు.



చూడచెక్కని గిన్నెలు.. ఆరోగ్యానికి వన్నెలు





పూర్వం మట్టి పాత్రలు, చెక్కతో చేసిన పాత్రలు, జాడీలు వాడేవారు. ఆధునిక కాలంలో స్టీలు, అల్యూమినియం, ప్లాటినం గిన్నెలు వాడుతున్నారు. ప్లాస్టిక్‌తో తయారైన స్పూన్లు, గ్లాసులు, ప్లేట్ల వాడకమే ఎక్కువ. ఇవి ఆరోగ్యానికి హాని కలిగించేవే. ఇప్పుడు మళ్లీ చెక్కతో చేసిన వంట పాత్రలు అందుబాటులోకి వస్తున్నాయి. అదీ వేప, దేవదారి చెక్కతో చేసినవి. వేప చెక్కతో చేసిన పాత్రలు ఆరోగ్యానికి మంచిదనే సంగతి తెలిసిందే. రకరకాల అందమైన ఆకృతుల్లో భోజనం ప్లేట్లు, గ్లాసులు, టీ కప్పు, సాసరు, స్పూన్లు తయారుచేసి విక్రయిస్తున్నారు. విదేశాలకూ ఎగుమతి చేస్తున్నామని నిర్వాహకురాలు గౌసియాబేగం తెలిపారు. శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటైన స్టాల్స్‌లో ఈ చెక్క పాత్రలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. - ఈనాడు, అమరావతి

కళారూపాలు.. కనుల దీపాలు!





చూడగానే ఇట్టే ఆకట్టుకుంటాయి. బొమ్మకుండే పుల్లను తిప్పితే కాళ్లు, చేతులు కదిలిస్తూ నృత్యం చేస్తాయి. పురాణ ఘట్టాలను దృష్టిలో ఉంచుకొని తోలుతో రామ, లక్ష్మణుల బొమ్మలు.. అలాగే పక్షులు, జంతువులు, కీటకాల బొమ్మలు రూపొందించారు. ఇంటి ముందు గుమ్మాలకు అందంగా అలంకరించే తోలుతో చేసిన సహజ రంగుల బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. బెడ్‌లైట్ స్టాండ్లలో విద్యుద్దీపాలను ఉంచితే అందమైన రూపాలు మనసు దోచేస్తాయి. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఈ బొమ్మలు తయారు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన స్టాల్స్‌లో ఈ తోలు బొమ్మలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. -ఈనాడు, అమరావతి

మేలుకోకుంటే... కారుచీకట్లే!

నిర్వహణ లోపాలే కారణం


వీరవల్లి వద్ద వాహనం నుంచి ఎగసిపడుతున్న మంటలు

జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడ దుర్గగుడికి శనివారం ఓ కుటుంబం కారులో వస్తుండగా.. బాపులపాడు మండలం వీరవల్లి పైవంతెన సమీపంలో వాహనం ఆగిపోయింది. వెంటనే మంటలు వ్యాపించాయి. ప్రయాణికులు కిందకు దిగడంతో ప్రాణాపాయం తప్పగా.. వాహనం పూర్తిగా ఆహుతైంది. – ఈనాడు, అమరావతి

సజావుగా సాగుతున్న కారు ఒక్కసారిగా ఆగిపోతోంది. దట్టమైన పొగ కమ్మేస్తుంది. వెనువెంటనే మంటలు వ్యాపిస్తాయి. ఏమైందని తేరుకునేలోపే కాలి బూడిదవుతుంది. అందులో ప్రయాణిస్తున్న వారు అప్రమత్తం కాకుంటే... ప్రాణాల మీదకొస్తుంది. కారు నిర్వహణలో చిన్నపాటి లోపాలే ప్రాణాంతక ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. శనివారం బాపులపాడు పరిధిలో ప్రమాదం అక్షరాలా ఇలాంటిదే.. అసలెందుకు ఇలా అవుతుంది.. ఏం జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

కారణాలు ఎన్నో...

✦ డీజిల్, సీఎన్జీ వాహనాలతో పోలిస్తే పెట్రోల్ వాహనాల్లోనే ప్రమాదాలకు అవకాశం ఎక్కువ. విద్యుత్తు వాహనాల తయారీలో లోపాలతో మాత్రమే ప్రమాదాలు జరుగుతాయి.

✦ కారులో ఎగ్జాస్ట్ మానిఫోల్డ్ దగ్గర లీక్ ఉంటే దాని ద్వారా వచ్చిన వేడితో విద్యుత్తు వైర్లు కాలి మంటలు వ్యాపిస్తాయి. ✦ ప్రస్తుత వాహనాల్లో ఫ్యూజ్ సిస్టమ్ ఉంది. ఫ్యూజ్ షార్ట్‌సర్క్యూట్‌కి గురైనా ప్రమాదం జరగొచ్చు. ✦ బ్యాటరీ కేబుల్, పోల్‌కు మధ్య సాకెట్ లూజ్ అయినా స్పార్క్ వచ్చి.. ఇంజిన్‌పైన ఉండే మ్యాట్‌కు అంటుకుని.. పొగలు వస్తాయి. ✦ హెడ్‌లైట్‌లో ఫిలమెంట్ రాలిపోతే రెండో లైట్ వేసి వాహనం నడిపితే రాలిపోయిన ఫిలమెంట్ నుంచి స్పార్క్ వచ్చి షార్ట్ సర్క్యూట్ అవుతుంది. ✦ బ్రేక్, స్టీరింగ్ హైడ్రాలిక్ ఆయిల్ కంటైనర్ మూత లూజ్ అయినప్పుడు ఆయిల్ చింది ఎగ్జాస్ట్ మానిఫోల్డ్ మీద పడినా మంటలు రావచ్చు. ✦ పెట్రోల్ పైపులు ఎక్కువ కాలం వాడితే పగుళ్లిచ్చి ఇంధనం లీకై సైలెన్సర్‌పై పడి మంటలు రావచ్చు.

చిన్న జాగ్రత్తలు.. పాటిస్తే మేలు..

✷ కారు వాడేవారు.. చాలామంది నెలల పర్యంతం సాధారణ నిర్వహణను విస్మరిస్తున్నారు. విద్యుత్తు వైర్లు, బ్యాటరీ కేబుల్‌ను తరచూ పరీక్షించుకోవాలి. ✷ పెట్రోల్ పైపు పనితీరుపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి. అనుమానం ఉంటే వెంటనే మార్చేయాలి. ✷ ఒక హెడ్‌లైట్ ఫిలమెంట్ మరమ్మతులకు గురైతే వెంటనే సరిచేయించడం లేదా దాని కనెక్షన్ తొలగించాలి. ✷ బ్రేక్, స్టీరింగ్ నుంచి ఆయిల్ లీకవకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలి. ✷ మరమ్మతుల సమయంలో నాసిరకం పరికరాలను కాకుండా నిర్దేశిత కంపెనీవి, నాణ్యత ఉన్నవి చూసి అమర్చుకోవాలి. ✷ 5 వేల కిలోమీటర్లకు ఒకసారి ఇంజిన్ ఆయిల్ మార్చుకుంటే మేలు. ✷ ఈతరహా ప్రమాదాలు జరిగితే... వెంటనే 100, 101 డయల్ చేసి పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.



హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం శనివారం పోలీస్ పరేడ్‌గ్రౌండ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ రాజశేఖర్‌బాబు హోంగార్డుల గౌరవవందనం స్వీకరించి.. పరేడ్‌ను పర్యవేక్షించారు.

తీగ జాతి మొక్క.. అల్లుకుంటోంది ఎంచక్కా..



హోయా రూఫ్ తీగజాతి మొక్కను చూడండి ఆకులతోనే అల్లుకున్న జడలా ఎంత అందంగా ఉందో..! ఈమొక్క వయసు నాలుగేళ్లు. చల్లని ప్రాంతాల్లో త్వరగా ఎదిగే ఈ తీగజాతి మొక్క.. దేశంలో కేరళ ప్రాంతంలో బయట వాతావరణానికి, మన రాష్ట్రంలో ఇంటి వరండాలో, ఎండ తక్కువగా తగిలే ప్రాంతంలో వేలాడ దీస్తే చాలు ఇంటికి ఎంతో అందాన్ని ఇస్తుంది. దీని ఖరీదు రూ.3500కు అమ్ముతున్నామని స్టాల్ యజమాని కె.వెంకటరాజు తెలిపారు. రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడ సిద్దార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫల పుష్ప ప్రదర్శనలో ఈ మొక్క యువత, మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటుంది. - ఈనాడు, అమరావతి

ఊళ్లు లేవు.. పేర్లు ఉన్నాయి

నందిగామ మండలంలో పలుచోట్ల ఊర్లులేకున్నా వీటి పేర్లు మిగిలాయి. పూర్వం పల్లెలుగా వెలుగొంది ప్రస్తుతం రెవెన్యూ గ్రామాలుగా మిగిలాయి. పల్లగిరి పంచాయతీ శివారు సత్యవరం రెవెన్యూ గ్రామంలో నివాస గృహాలు లేవు. 700 ఎకరాల భూములున్నాయి. అదే విధంగా చందాపురం శివారు కురగంటివారికండ్రిక (కె.కండ్రిక) గ్రామం రికార్డుల్లో ఉంది. దీని పరిధిలో 62 సర్వే నంబర్లలో 250 ఎకరాల భూములున్నాయి. చందాపురం, అడవిరావులపాడు, హనుమంతుపాలెం వరకు ఈ రెవెన్యూ గ్రామం ఉంది. కె.కండ్రికలో ప్రస్తుతం దాసాంజనేయస్వామి విగ్రహం ఉంది. పూర్వం ఇక్కడ ఊరు ఉందనడానికి ఆ విగ్రహమే నిదర్శనంగా మిగిలింది. ఇళ్లు, ప్రజలు లేనప్పటికీ ఆయా గ్రామాల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో భద్రంగా ఉన్నాయి.

– నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

కసితో కదిలి.. కృషితో మెరిసి

న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు


సాధించిన పతకంతో సంవేద్

చిన్నతనంలో ఇంటి దగ్గర్లో ఓ గేమ్స్ క్లబ్‌లో టేబుల్ టెన్నిస్ సాధన చేయడం చూసి ఆ కుర్రాడు దానిపై మక్కువ పెంచుకున్నాడు. అందులో కఠోర సాధనతో ఎదిగి.. ఆటతీరు మెరుగు పరుచుకున్నాడు. అంచెలంచెలుగా ఎదిగి గత నెలలో జమ్ము- కశ్మీర్‌లో జరిగిన జాతీయ స్కూల్ గేమ్స్ అండర్- 19 పోటీల్లో తలపడి సత్తా చాటాడు. అతనే తేలప్రోలు సంవేద్. ఈ ప్రతిభతో జాతీయ స్కూల్ గేమ్స్ అండర్- 19 బాలుర విభాగంలో తొలి పతకం సాధించిన తెలుగు రాష్ట్ర క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు. వన్‌టౌన్ ఇస్లాంపేటకు చెందిన సందీప్, మానస దంపతుల కుమారుల్లో పెద్దవాడు సంవేద్. ఏడేళ్లలో శిక్షకులు పీవీ పాండురంగారావు, కె.రుత్విక్ పర్యవేక్షణలో సాధన మొదలు పెట్టి.. నిత్యం రెండు గంటలు సాధన చేశాడు. 2017లో రాజమండ్రిలో రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టీటీ టోర్నీలో అండర్- 10 కేటగిరిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. అదే ఏడాది విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి టీటీ ఛాంపియన్‌షిప్‌లో అండర్- 10 కేటగిరిలో పసిడి పతకం, 2018లో ఇండోర్‌లో జాతీయ టీటీ ఛాంపియన్‌షిప్‌లో అండర్- 11 కేటగిరిలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు.

సారథ్యం: గత ఏడాది కాంగ్రా (హిమాచల్‌ప్రదేశ్)లో జరిగిన జాతీయ సీబీఎస్ఈ టీటీ ఛాంపియన్‌షిప్‌లో స్కూల్ జట్టుకు సారథ్యం వహించి జట్టు కాంస్య పతకం సాధించేందుకు దోహదపడ్డాడు. గత నెల 21 నుంచి 25 వరకు జమ్ము- కశ్మీర్‌లో జరిగిన 69వ జాతీయ స్కూల్ గేమ్స్ అండర్- 19 టోర్నీలో జట్టు రజత పతకం సాధించడానికి కృషి చేశాడు. సీబీఎస్ఈ, జాతీయ స్కూల్ గేమ్స్ అండర్- 19లో తలపడి తొలి సారిగా పతకం దక్కించుకున్నాడు.

బండెనక బండి కట్టి..



ట్రాక్టరు వెనుక మరో ట్రాక్టరును కట్టుకుని డ్రైవరు లేకుండానే రయ్యమని దూసుకుపోతోన్న దృశ్యం గుంటూరు-విజయవాడ వారధిపై కనిపించింది. గమ్యస్థానానికి ఒకే బోద పడుతో చేరుకోవచ్చని అనుకున్నారో ఏమో ఇలా సాహసం చేసి తీసుకెళ్లారు. -ఈనాడు, అమరావతి

ఆన్‌లైన్ లేదట.. చిల్లర తేవాలట!



కౌంటర్ ముందు అంటించిన కాగితం

చాలా మంది జనాభా కలిగిన విజయవాడ నగరంలో విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం ఆర్టీసీ సిటీ బస్సుల్లో రాకపోకల కోసం బస్‌పాస్ సౌకర్యం వినియోగించుకుంటారు. వీరికోసం విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ప్రత్యేకంగా కౌంటర్లు సైతం ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం కారణంగా మహిళలు, విద్యార్థులకు బస్‌పాస్‌ల సంఖ్య తగ్గిపోయింది. అయినా కూడా ప్రతి నెలా 2500 నుంచి 3వేల మంది బస్ పాస్ కోసం వస్తుంటారు. కానీ ఇప్పటికీ ఆన్‌లైన్ చెల్లింపుల సదుపాయం అందుబాటులో లేదంటూ..బస్ పాస్‌కు సరిపడా చిల్లర తెచ్చుకోమని కౌంటర్ల ముందు ఏర్పాటు చేసిన కాగితాలను చూసి అవాక్కవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహిస్తుంటే..ఫోన్‌పే ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌ల ద్వారా చెల్లించే వైపు జనం మారినా, ఇంకా ఆర్టీసీ అధికారులు మాత్రం చిల్లర కావాలి అని ఉన్నారు. బస్ పాస్‌కు సరిపడా చిల్లర లేక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఆన్‌లైన్ సదుపాయం తీసుకురావాలని కోరుతున్నారు. -ఈనాడు, అమరావతి

విద్యుత్తు సేవలకు గడువుందిగా..!

సూర్యారావుపేట, న్యూస్‌టుడే

ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ(ఏపీ సీపీడీసీఎల్) వినియోగదారులకు అందించే సేవల విషయంలో జవాబుదారీతనంతో పనిచేసేందుకు నియమిత గడువు విధించింది. దీని కోసం సిటిజన్ చార్టర్(పౌర సేవల సమయపాలన పట్టిక) ఏర్పాటు చేసుకుంది. ఇందులో పేర్కొన్న గడువు ప్రకారం సేవలు అందించాల్సి ఉంది. లేనిపక్షంలో సదరు వినియోగదారునికి పరిహారం కూడా చెల్లించాల్సి ఉంటుంది. సేవలను బట్టి రోజుకు రూ.100 నుంచి రూ.500 వరకు పరిహారం కూడా వినియోగదారులు పొందొచ్చు. ఏయే రకాల సేవలకు ఏంతెంత గడువో చూద్దామా...

సేవ పేరు	నిర్ణీత గడువు: పట్టణాల్లో (గంటల్లో)	గ్రామాల్లో
సాధారణ ఫ్యూజ్ ఆఫ్ కాల్స్	4	12
ఓవర్ హెడ్ లైన్ బ్రేక్ డౌన్	6	24
ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యం	24	48
మీటరు ఫిర్యాదులు	7 రోజులు	15 రోజులు

కాలిపోయిన మీటరు మార్పిడి	7 రోజుల్లోపు
వినియోగదారుడి కారణంగా మీటరు కాలిపోతే..	
రుసుము చెల్లించాక	7 రోజుల్లోపు
కొత్త కనెక్షన్	దరఖాస్తు అందిన 3 పనిదినాల్లోపు
విద్యుత్తు సరఫరా (ఎల్‌టీ)	
రుసుము చెల్లించిన తరువాత	7 రోజుల్లోపు
విద్యుత్తు సరఫరా	
11 కేవీ నుంచి	15 రోజుల్లోపు
33 కేవీ నుంచి	30 రోజుల్లోపు
ఎక్స్‌ట్రా హెచ్‌టీ నుంచి..	45 రోజుల్లోపు
యాజమాన్యం టైటిల్ బదిలీ..	
సూచించిన ఛార్జీలు అందిన	7 రోజుల్లోపు
కేటగిరీ మార్పు	7 రోజుల్లోపు
ఎల్‌టీ (ఫేజ్ I నుంచి 3 ఫేజ్)	30 రోజుల్లోపు
ఎల్‌టీ నుంచి హెచ్‌టీకి..	60 రోజుల్లోపు

నాటి యాత్రా వ్యయం.. ఆమోదానికి యత్నం?

పాలకపక్షం తీరుపై విమర్శల వెల్లువ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కౌన్సిల్‌లో వైకాపా పాలక పక్షం తీరు.. అనుసరిస్తున్న వైఖరి పలు విమర్శలకు దారితీస్తోంది. కార్పొరేటర్ల బృందంతో కలిసి కేజీయూరు పద్దును అధ్యయనం పెట్టుకుని కౌన్సిల్ ఆమోదం లేకుండానే కార్పొరేటర్ల బృందం విజ్ఞాన యాత్ర పేరిట ఈ ఏడాది ఏప్రిల్, మే నెల్లో దేశంలోని పలు ప్రాంతాలను తిరిగొచ్చింది. అందుకు రూ.లక్షల్లో కార్పొరేషన్ నిధులను ఖర్చు చేసింది. రూ.50 లక్షలు మించి ఖర్చు చేసేందుకు కచ్చితంగా కౌన్సిల్ ఆమోదం పొందాలి. కానీ ఆమోదం లేకుండానే మేయర్ ద్వారా ముందస్తు అనుమతి అంటూ యాత్రకెళ్లి వచ్చారు. ఇప్పుడు తీరిగ్గా నాటి వ్యయం ప్రతిపాదనను రాత్రికి రాత్రే కౌన్సిల్ ఆమోదానికి తెస్తున్నారు. నగర కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, సహాయకుల బృందం వెరసి 47 మంది.. ఈ ఏడాది ఏప్రిల్ 21 నుంచి మే 3వ వరకు విజ్ఞానయాత్ర పేరిట బెంగళూరు, మైసూర్, త్రివేండ్రం, కొచ్చిన్, నాగర్‌కోల్, మధురై ప్రాంతాల్లో 13 రోజులపాటు తిరిగి వచ్చారు. ఒక్కొక్కరిపై రూ.1,28,259 చొప్పున ఖర్చు చేశారు. ఇలా మొత్తం రూ.60,28,173 వ్యయం అయ్యింది. దీని అంచనా ప్రతిపాదనను కౌన్సిల్ ముందుగా ఆమోదించుకోవాలి. కానీ మేయర్ ద్వారా ముందస్తు అనుమతి పొందారు. దీన్ని ఇప్పుడు కౌన్సిల్ ఆమోదానికి తీసుకొచ్చారు. అత్యవసర పనుల కోసం మాత్రమే మేయర్ నుంచి ముందస్తు అనుమతి పొందాలి. కానీ కార్పొరేటర్ల యాత్ర కోసం ఖర్చుకు మేయర్ ముందస్తు అనుమతి ఇవ్వడంతో ప్రతిపాదన తెస్తుండడం విమర్శలకు దారితీస్తోంది.

రూ.25 లక్షలు ఏమయ్యాయో..

కార్పొరేటర్లు మరోసారి ఈ ఏడాది నవంబరు 6 నుంచి విజ్ఞానయాత్ర పేరిట ముంబయి, అరేబియా సముద్రగర్భంలోని ఎలిఫెంటా కేవ్స్, పూణే, నాసిక్, సూరత్, బరోడా, సోమనాథ్, ద్వారక, అహ్మదాబాద్, గుజరాత్, రాజస్థాన్‌లో పలు ఆలయాలు, పర్యాటక ప్రాంతాలను చుట్టొచ్చేందుకు సిద్ధం అయ్యారు. వారి యాత్రకు ఆ మధ్య స్థాయీ సంఘం అనుమతి పొందినా యాత్రకు వెళ్లొచ్చే వ్యయానికి మాత్రం ఎటువంటి ఆమోదం పొందలేదు. అయినా రూ.25 లక్షలు అధికారుల నుంచి అడ్వాన్సుగా డ్రా చేసుకున్నారు. చివర్లో తెదేపా సభ్యులు యాత్ర వెళ్లేందుకు విముఖత చూపడంతో యాత్ర అర్ధాంతరంగా రద్దు అయ్యింది. దీంతో పాలకపక్ష సభ్యులు అడ్వాన్సుగా డ్రా చేసుకున్న సొమ్ము మొత్తాన్ని ఖజానాకు వెంటనే జమ చేయాలంటూ కమిషనర్ ఆదేశించారు. అయినా ఇప్పటికీ పూర్తి సొమ్ము ఖజానాకు జమ కాలేదన్న ప్రచారం జరుగుతోంది.

సస్పెక్ట్‌షీటర్ హత్యపై సమగ్ర విచారణ

నందిగామ, జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : జగ్గయ్యపేటలో సస్పెక్ట్ షీటర్ నవీన్‌రెడ్డి హత్య కేసులో నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసును ఏసీపీ బాలగంగాధర్‌తిలక్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు విచారణ చేస్తున్నారు. ధర్మవరప్పాడు తండా వద్ద పుట్టిన రోజు వేడుకలో విజయవాడ భవానీపురానికి చెందిన సస్పెక్ట్ షీటర్ అలవాల నవీన్‌రెడ్డిని, కృష్ణలంకకు చెందిన రౌడీషీటర్ సాయికృష్ణ అలియాస్ పిల్ల సాయి బీరు సీసాతో పొడిచి హత్య చేసిన విషయం విదితమే. వీరిద్దరు పలు నేరాలకు పాల్పడి తమ నేర ప్రవృత్తిని కొనసాగిస్తునే ఉన్నారు. కృష్ణలంక రాణి గారి తోటలో కొంత మందితో కలిసి రౌడీషీటర్ సాయి నేరాలు చేస్తుంటాడు. గంజాయి, మద్యానికి అలవాటు పడి పలు నేరాలు చేయడంతో విజయవాడలో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కొంత కాలంగా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లులో ఉంటున్నారు. తమపై ఎవరికి అనుమానం రాకుండా స్థానికులతో కలివిడిగా ఉంటున్నారు. స్థానికుల పిల్లలతో ప్రతిరోజు ఆడుకుంటూ వారికి దగ్గరయ్యారు. వీరందరితో కలిసి హంతకుడు, నవీన్‌రెడ్డి స్నేహంగా ఉంటూ తరచూ మందు పార్టీలు చేసుకుంటున్నారు. విజయవాడకు చెందిన పోలీసులు ఆరా తీస్తే హంతకుడు తాను హైదరాబాద్, బెంగుళూరులో ఉన్నట్లు చెప్పి తప్పించుకు తిరుగుతున్నాడు. హత్యకు ముందు రోజు రౌడీషీటర్ పిల్ల సాయి తన జన్మదినం సందర్భంగా చిల్లకల్లులోనే ఈ నెల 3న స్నేహితులకు మందు పార్టీ ఇచ్చాడు. అక్కడ మత్తులో బీరు సీసాలతో సాయి, నవీన్‌రెడ్డి పరస్పరం దాడులు చేసుకోగా నవీన్‌రెడ్డి హత్యకు గురయ్యాడు. ఈ క్రమంలో పార్టీలో పాల్గొన్న వారందరిని పోలీసులు విచారిస్తున్నారు. దీనిపై ఏసీపీ తిలక్, జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లను సంప్రదించగా నిందితుడిని పట్టుకునేందుకు గాలిస్తున్నట్లు తెలిపారు.



కర్ణాటక సంగీత కచేరి నిర్వహిస్తున్న వాగేష్‌కృష్ణ

అలరించిన సంగీత నీరాజనం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: రెండు రోజుల పాటు నిర్వహించే కృష్ణవేణి సంగీత నీరాజనం-2025 మూడో దశ కార్యక్రమం శనివారం తొలిరోజు తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో వైభవంగా సాగింది. కార్యక్రమంలో భాగంగా రోజంతా సాగిన సంగీత కచేరీలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. రెండు రోజుల పాటు మొత్తం 98 మంది కళాకారులతో 19 కచేరీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. విభిన్న కర్ణాటక సంగీత శైలులను విద్వాంసులు ఆవిష్కరించారు. సంగీత కచేరీలతోపాటు హస్త కళలు, నూలు వస్త్రాలు, స్థానిక వంటలు, పర్యాటక ప్రాంతాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవం ఆదివారం ముగుస్తుందని నిర్వాహకులు వెల్లడించారు.

రబీ సాగుకు ఎరువులు సిద్ధం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రబీ పంటల అవసరానికి అనుగుణంగా వివిధ ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, ఈవిషయమై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఎరువుల వినియోగంలో వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలని, భూసార పరీక్షల ఆధారంగా వీటిని వినియోగించాలని సూచించారు. నానో, జీవన ఎరువుల వాడకంపైనా దృష్టి కేంద్రీకరించాలన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. రబీలో 33,765 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేయనున్నట్టు తెలిపారు. ఈనేపథ్యంలో డిసెంబరు నెలలో 17,812 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ప్రస్తుతం 27,542 మెట్రిక్ టన్నుల మేర అందుబాటులో ఉన్నట్టు వెల్లడించారు. యూరియా 7,815 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1,983, పొటాష్ 1,720, కాంపెక్స్ ఎరువులు 13,659, ఎస్.ఎస్.పి. 2,365 మెట్రిక్ టన్నుల మేర అందుబాటులో ఉన్నట్టు వివరించారు. ఎరువుల విషయంలో అపోహలు నమ్మకుండా, ఏ సమాచారం కావాలన్నా విజయవాడ కలెక్టరేట్‌లో తెలుసుకోవచ్చన్నారు. జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నట్టు తెలిపారు. జేసీ ఎస్.ఇలక్కియా పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్టులపై అప్రమత్తత అవసరం



జ్యోతి వెలిగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టుల పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి అన్నారు. శనివారం బెంజిసర్కిల్ సమీపంలోని ఓ కల్యాణ మండపంలో ఆసరా ఏడో జాతీయ సమ్మిట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ ఆధునిక యుగంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టులు అనే వ్యవస్థ లేకపోయినా ఆ పేరుతో దేశ వ్యాప్తంగా మోసాలు జరుగుతున్నాయన్నారు. వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని, వారికి సత్వరమే న్యాయం అందించేలా న్యాయస్థానాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు న్యాయవాది, అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ ప్రతినిధి హబీబ్ సుల్తాన్ మాట్లాడుతూ వినియోగదారులకు న్యాయం చేయడానికే తమ సంస్థ పనిచేస్తోందని, న్యాయస్థానాల్లో వారి తరఫున కేసులు వేసి న్యాయ సహాయం అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 2300 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, తొమ్మిది రాష్ట్రాల్లో వెయ్యికి పైగా వాలంటీర్లు పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ సమన్వయకర్త క్రిస్టి, దిల్లీ అధ్యక్షుడు రాహుల్ సాధాన్, జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పొందుగలలో ఆరోగ్యశాఖ అధికారుల సర్వే

మైలవరం, న్యూస్‌టుడే: జి.కొండూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రెండున్నరేళ్ల బాలుడు రాకేష్‌కు స్క్రబ్ టైఫస్ నిర్ధారణ అయిన విషయం తెలిసిందే. ఆ బాలుడు వెంకటాపురంలో నివసిస్తున్నా.. అతని తాత, నానమ్మలు మైలవరం మండలంలోని పొందుగలలో ఉంటున్నారు. ఇటీవల బాలుడు కొన్ని రోజుల పాటు వారి వద్దే ఉండటంతో, వ్యాధి ఏ గ్రామంలో సోకిందన్న విషయం తెలియడం లేదు. దీంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ అధికారులు శనివారం పొందుగలలో జ్వరాలపై సర్వే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించారు. ప్రస్తుతం ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేదని చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారిణి ప్రియాంక తెలిపారు.

ఎన్టీఆర్ వికాసంలో 42 మంది ఎంపిక



నియామక ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆంధ్రా లయోలా కళాశాల సహకారంతో ఎన్టీఆర్ వికాసం ద్వారా శనివారం 'పూల్ క్యాంపస్ డ్రైవ్' నిర్వహించారు. మహిళల ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించడం, పరిశ్రమల అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా డ్రైవ్ సాగింది. ఇంటర్ నుంచి బీటెక్ వరకు అర్హతతో మొబైల్ ఆపరేటర్ ఉద్యోగానికి టాటా ఎలక్ట్రానిక్స్ నియామకం చేపట్టింది. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.19,000 నుంచి రూ.21,000 వేతనం ప్యాకేజీతో పాటు ఉచిత ఆహారం, వసతి కల్పిస్తారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి మొత్తం 68 మంది అభ్యర్థులు పాల్గొనగా వీరిలో 42 మంది ఎంపికయ్యారని ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధులు లావణ్య, పూజ, మోహన్ బాబులు తెలిపారు. జిల్లా నైపుణ్యాధికారి ఎస్.శ్రీనివాసరావు, లయోలా ప్రిన్సిపల్ మిల్కీ యోహార్, ప్లేస్‌మెంట్ అధికారి జి.సహాయ భాస్కరన్‌లు పాల్గొని నియామక ఉత్తర్వులు అందజేశారు.

విదేశీ పర్యటనకు కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టర్ జి.లక్ష్మీశ వ్యక్తిగతంగా విదేశీ(దుబాయి) పర్యటనకు వెళుతున్నారు. ఈక్రమంలో ఈనెల 7వ తేదీ నుంచి 14 వరకు ఆయన సెలవులో ఉంటారు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియాను ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా నియమించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 149, 158, 169 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

త్రుటిలో తప్పిన ప్రమాదం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : జగ్గయ్యపేట మండలం గరికపాడు సమీపంలో రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న రామాపురం అడ్డరోడ్డు ప్రాంతంలో శనివారం ఒక భారీ లారీ వేగంతో అదుపు తప్పింది. రోడ్డు అంచులు దాటి నివాస ప్రాంతాల్లోకి దూసుకెళ్లింది. ఈ నేపథ్యంలో చెట్లకు తగిలి ఆగిపోవడంతో ఆస్తి, ప్రాణ నష్టం తప్పినట్లు తెలిసింది.



రామాపురం అడ్డరోడ్డు వద్ద నివాసాల్లోకి దూసుకెళ్లిన లారీ

సమన్వయంతో సాగుదాం.. సకల వసతులు కల్పిద్దాం..

పలు తీర్మానాలకు పాలకమండలి ఆమోదం ● రెండు ప్రతిపాదనలు వాయిదా



సమావేశంలో సభ్యులతో చర్చిస్తున్న ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: పాతబస్తీ బ్రాహ్మణ వీధిలోని ఇంద్రకీలాద్రి అతిథి గృహంలోని హాల్లో దుర్గగుడి పాలకమండలి రెండో సమావేశం శనివారం నిర్వహించారు. ఈనెల 11 నుంచి 15 వరకు భవానీ దీక్షల విరమణ దేవస్థానం నిర్వహిస్తున్నందున ఏర్పాట్లకు అవసరమైన అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

● సాంకేతిక విభాగపు అధికారులు చేసిన బారీకేడ్లు డ్రైవర్లు, కండక్టర్లు, షామియానాల ఏర్పాటు అంశాలను ఆమోదించారు.

● స్టోర్స్ నుంచి వచ్చిన పడితరం, అన్నదాన విభాగానికి అవసరమైన ఆవు నెయ్యి, కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదనకు పచ్చ జెండా ఊపారు.

● భవానీ దీక్షాధారులు వదిలి వేసే మాలలు పోగు చేసుకోవడానికి హెచ్చు టెండరుదారుకు కేటాయించేందుకు అంగీకారం తెలిపారు.

● కొండ రాళ్లు జారి పడకుండా మెష్ ఏర్పాటు ప్రతిపాదనలు, అన్నప్రసాదం పంపిణీ, ట్రాన్స్‌పోర్టు వాహనాలకు అవసరమైన 14 మంది డ్రైవర్లను అవుట్‌సోర్సింగ్ పద్ధతిపై నియమించేందుకు ఆమోదం లభించింది.

● దుర్గమ్మ దర్శనానికి వచ్చే దీక్షాధారులతో పాటు వారి వెంట వచ్చే చిన్నారులకు తల్లి పాలు ఇచ్చేందుకు అవసరమైన గదులు ఏర్పాటు చేయాలని సభ్యురాలు పద్మావతి ఠాకూర్ చేసిన ప్రతిపాదనకు పాలకమండలి సానుకూలంగా స్పందించింది.

● బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా భోజనం అందించే ప్రతిపాదన, గిరిజన కార్పొరేషన్ ద్వారా అరకు కాఫీ ఏర్పాటుపై ప్రతిపాదన సభ్యులు వాయిదా వేశారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, సభ్యులు ధర్మారావు, శ్రీనివాసరావు, సరోజినీదేవి, సరిత, రమాదేవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజయ వీచిక.. అభ్యాస దీపిక



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు, జేసీ ఇలక్కియా, దుర్గగుడి ఈవో శీనానాయక్ తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇటీవల దసరా ఉత్సవాలను ఎన్నో సవాళ్లను అధిగమించి వినూత్నంగా నిర్వహించాం. ఇదే స్ఫూర్తితో భవానీ దీక్షల విరమణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన విజయ వీచిక..అభ్యాస దీపిక.. పుస్తకాన్ని (డాక్యుమెంటు) కలెక్టరేట్‌లో జిల్లా పోలీసు కమిషనర్ (సీపీ) ఎస్.వి.రాజశేఖరబాబు, జేసీ ఎస్.ఇలక్కియా, దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్‌లతో కలిసి శనివారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ..శరన్నవరాత్రుల ఉత్సవాల నిర్వహణలో ఎదురైన సవాళ్లు, వాటిని వినూత్నంగా ఎదుర్కొంటూ విజయతీరాలకు చేరిన తీరు, సూచనల సమాహారంతో డాక్యుమెంటు రూపొందించినట్టు వివరించారు. భవిష్యత్తు ఉత్సవాలకు రిఫరెన్స్‌గా ఉండాలనే ఉద్దేశంతో పుస్తకాన్ని వెలువరించినట్టు చెప్పారు. సీపీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ..వివిధ ఉత్సవాలకు చేసే హోమ్ వర్క్‌కు ఇలాంటి డాక్యుమెంట్లు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో డీఐపీఆర్వో కె.వి.రమణరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, ఆడియో, విజువల్ సూపర్‌వైజర్ వేమూరి ప్రసాద్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు జిల్లా సమన్వయకర్త డాక్టర్ జె.సుమన్, కలిమిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు ఎనలేనివి



పరేడ్ కమాండర్ సాయికుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీపీ రాజశేఖరబాబు



మహాత్మాగాంధీరోడ్డులో ప్రదర్శన

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణతోపాటు అనేక ఇతర శాఖల్లో హోంగార్డులు అందిస్తున్న సేవలు ఎనలేనివని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. శనివారం పోలీస్ పరేడ్‌గ్రౌండ్స్‌లో హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీ రాజశేఖరబాబు పోలీస్‌శకటంపై నిలబడి హోంగార్డుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో 1000 మంది హోంగార్డులు శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, నేర పరిశోధన, సీఐడీ, టాస్క్‌ఫోర్స్, డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లుగా, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్నారని తెలిపారు. పోలీసుశాఖతో సమానంగా అన్ని విభాగాల్లో విస్తృత సేవలు అందించారని కొనియాడారు. ప్రాణాలు కోల్పోయిన నలుగురు హోంగార్డుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేశామని తెలిపారు. ఉద్యోగ విరమణ చేసిన 13 మందికి వారి కాంట్రిబ్యూషన్ నుంచి రూ.5 లక్షల చొప్పున చెల్లించినట్లు తెలిపారు. కేంద్రం ఇచ్చే అవార్డులను సైతం సీనియారిటీ ప్రాతిపదికన ఇస్తున్నట్లు వివరించారు.

కనువిందు చేసిన పరేడ్..ఈ సందర్భంగా పరేడ్ కమాండర్ ఎన్.సాయికుమార్ నేతృత్వంలో హోంగార్డులు లయబద్ధంగా నిర్వహించిన పరేడ్ కనువిందు చేసింది. వివిధ పోటీల్లో గెలుపొందిన హోంగార్డులకు సీపీ బహుమతులు అందించారు. వచ్చే ఏడాది ఉద్యోగ విరమణ చేసే పలువురిని సత్కరించారు. అనంతరం మహాత్మాగాంధీరోడ్డులో హోంగార్డులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డీసీపీలు కృష్ణప్రసన్న, ఎస్.వి.డి.ప్రసాద్, హోంగార్డ్సు కమాండెంట్ టి.ఆనందబాబు, క్రైం ఏడీసీపీ రాజారావు, ఏఆర్‌ఏడీసీపీ కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత భూసమీకరణ సరికాదు: వడ్డే

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి కోసం రెండో విడత భూసమీకరణ సరికాదని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికీ న్యాయం జరగలేదని, మళ్లీ భూసమీకరణ చేస్తామని చెప్పడం విచారకరమన్నారు. అమరావతి రైతులపై గత ప్రభుత్వంలో పెట్టిన కేసులను ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం ఎందుకు ఎత్తేయలేదని ప్రశ్నించారు. ఐదు వేల ఎకరాల్లో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, 2500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ కట్టడం అనవసరమన్నారు. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం కోసం తీసుకున్న కొందరి భూముల ప్లాట్ల సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదని గుర్తు చేశారు. రైతుల భూముల్లో గోడ నిర్మాణం చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. రాజధానిలో నిర్మాణాలపై అన్ని రాజకీయపక్షాలు, ప్రజా సంఘాలు, మేధావులతో సమావేశాలు నిర్వహించి తుది నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైల్‌పై సరైన నిర్ణయం తీసుకోవాలని, రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, పోలవరం ప్రాజెక్టును 46 మీటర్ల ఎత్తుకు పెంచాలని సమావేశంలో తీర్మానించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తులసిరెడ్డి, సుంకర పద్మశ్రీ, రాష్ట్ర అభివృద్ధి కమిటీ సామాజిక కార్యకర్త కుర్రా వసుంధర, అమరావతి రైతు బుచ్చి తరుపతిరావు, సీపీఐ నాయకురాలు అక్కినేని వనజ, ప్రొఫెసర్ రామచంద్రయ్య తదితరులు ప్రసంగించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: జిల్లాలో సీజనల్ వ్యాధులు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. శనివారం నగరంలోని కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఎం.సుహాసిని సారథ్యంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. వ్యాధులు పెరుగుతున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏడీడీ, జ్వరాలు, మలేరియా, స్క్రబ్ టైఫస్, లెప్టోస్పిరోసిస్ వంటి వ్యాధులపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ ఆరోగ్య సేవల్లో వారాంతపు సమన్వయ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ఏదైనా అనుమానిత వ్యాప్తి ప్రాంతానికి ఆర్‌ఆర్‌టీ బృందాలు వెంటనే వెళ్లాలని, ఆరోగ్య సౌకర్యాలకు ఆలస్యం లేకుండా కేసులను నివేదించాలని సూచించారు. సకాలంలో నమూనా సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ ఏవీ రావు, వైద్యులు ప్రశాంతి, ఇందిరాదేవి, అనిల్, గోవింద్, స్నేహసమీరా తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

వాలీబాల్ పోటీల్లో కాంస్య పతకం

మైలవరం: కృష్ణ విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు కాంస్య పతకం గెలుచుకున్నట్లు స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మన్నె స్వామి తెలిపారు. విజయవాడలోని శాతావాహన కళాశాలలో నిర్వహించిన పోటీల్లో 18 జట్లు పాల్గొనగా, తమ విద్యార్థులు సత్తా చాటారని పేర్కొన్నారు. పతకం సాధించిన వారిని ఎఫ్ఏసీ ప్రిన్సిపల్ పి.రంగారావు అభినందించారు.



పతకం సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



✧ తిరువూరు పట్టణంలోని 14వ వార్డులో మురుగు పారుదలకు ఆటంకం ఏర్పడిందని స్థానికుడు కరీమ్ ఫిర్యాదు చేశారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్.. తమ సిబ్బందిని పంపించి మురుగు కాలువలను శుభ్రం చేయించారు. ✧ పట్టణ 11వ వార్డులోని మురుగు కాల్వలో బురద, చెత్త పేరుకుపోయిందని స్థానికుడు బ్రహ్మం చేసిన ఫిర్యాదుపై మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

? స్థానిక గుడి సెంటర్‌లో మురుగు కాలువల్లో పూడిక తీయక పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. తక్షణమే చర్యలు చేపట్టాలి. **- నాగేశ్వరరావు, గ్రామస్థుడు**

✔ సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- బసవలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, – తిరువూరు టౌన్, జి.కొండూరు

పూర్వ విద్యార్థికి రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీనారాయణ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థిని గుడిపూడి గాయత్రి అనారోగ్యం బారిన పడటంతో చికిత్స నిమిత్తం విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది రూ. 2.50 లక్షలు సేకరించారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్లు రాధాకృష్ణారెడ్డి, కోటిరెడ్డి ఈ మొత్తాన్ని గాయత్రి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం విజయవాడ శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఎంఎన్ఆర్ ఫౌండేషన్ నేతృత్వంలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి, ఐఏఎస్ అకాడమీ ఏవోఎం కల్యాణ్‌దత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గాయత్రి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న నాగేశ్వరరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, కోటిరెడ్డి

స్టడీ మెటీరియల్ వితరణ

తిరువూరు, తిరువూరు టౌన్, గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని మునుకుళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని సంఘం నాయకులు సూచించారు. ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, ఉపాధ్యాయులు రామకృష్ణ, భరతకుమారి, నాగరత్నం, కృష్ణారావు, వేణి కృష్ణమ్మ, ప్రవీణ్‌కుమార్‌ల వితరణతో వీటిని అందజేసినట్లు తెలిపారు.

రబీ వరి సాగుకు అన్నదాతలు సమాయత్తం

ఇప్పటికే బోర్ల కింద సిద్ధమవుతున్న నారు

గంపలగూడెం, న్యూస్‌టుడే

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో మాగాణి రైతులు రబీ వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఖరీఫ్ వరి నూర్పిడులు పూర్తయిన భూములను దుక్కి దున్ని సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు రైతులు దమ్ము నారుతో, ఇంకొందరు వెదజల్లే పద్ధతిలో రబీ వరి సాగు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. తిరువూరు, గంపలగూడెం మండలాల్లోని పలు గ్రామాల్లో బోర్ల కింద నారు కూడా నాలుగైదు అంగుళాల ఎత్తు పెరిగింది. డిసెంబరు నెలాఖరులోపు దాళ్వా నాట్లు ప్రారంభించాలని సాగుదారులు ఉత్సాహంగా ఉన్నారు. చెరువుల్లోనూ నీరు పుష్కలంగా ఉండటంతో ఆయకట్టు రైతులు వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. వాతావరణ పరిస్థితులు సానుకూలంగా ఉంటే వచ్చే ఏడాది మార్చి నాటికి దాళ్వా వరి నూర్పిడులు కూడా ప్రారంభిస్తారు.

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో 2025-26 రబీలో వరి సాగు సాధారణ విస్తీర్ణం (హెక్టార్లలో)..

మండలం	సాధారణం
గంపలగూడెం	1694
ఎ.కొండూరు	1137
తిరువూరు	5288
విస్సన్నపేట	1034
రెడ్డిగూడెం	956

25 వేల ఎకరాల్లో..

అన్నదాతలు ఖరీఫ్ వరి కంటే రబీ వరి సాగుకు అధిక ఆసక్తి చూపిస్తున్నారు. పంట దిగుబడి, పెట్టుబడి వ్యయం, నికర ఆదాయంలో సార్వా కంటే దాళ్వా సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులు తెలిపారు. ఈ నేపథ్యంలో మాగాణి భూముల్లో ఆరుతడి పంటలపై ఆసక్తి చూపడం లేదు. రెండో పంట కూడా వరి అయితేనే ఎకరాకు 40 బస్తాల వరకు దిగుబడి సాధించి ఆదాయం పెంచుకోవచ్చని భావిస్తున్నారు. మరోవైపు వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు రబీ వరి సాగు చేయొద్దని సూచిస్తున్నారు. నీటి ఎద్దడి తలెత్తితే పంట మధ్యలో అవసరమైన తడులు అందక నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా మాగాణిలో రెండో పంటగా మొక్కజొన్న, మినుము, పెసర తదితర ఆరుతడి పంటలు వేయాలని చెబుతున్నారు. రెవెన్యూ డివిజన్‌లోని ఐదు మండలాల్లో గతేడాది దాళ్వా వరి 20 వేల ఎకరాల వరకు సాగు చేయగా ఈ ఏడాది రబీ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం 25 వేల ఎకరాల వరకు ఉండనుంది.



తిరువూరు మండలం చింతలపాడు సమీపంలో బోరు కింద సిద్ధం చేస్తున్న వరి నారు

ఆరుతడి పంటల సాగు మేలు



రబీ సీజన్‌లో మాగాణి భూముల్లో ఆరుతడి పంటలుగా మొక్కజొన్న, మినుము, పెసర, నువ్వులు సాగు చేయడం మేలు. తద్వారా రైతులకు తక్కువ పెట్టుబడితో నికర ఆదాయం లభిస్తుంది. పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు వస్తాయి. **- ఎస్‌కే.టిప్పుసుల్తాన్, విస్సన్నపేట వ్యవసాయాధికారి**

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేస్తున్న ఆధార్ క్యాంపుల్లోని సేవలను పుర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాకీర్ హుస్సేన్ కళాశాల ప్రిన్సిపల్ జాఫర్ సాదిక్ సూచించారు. ఇబ్రహీంపట్నం జాకీర్ హుస్సేన్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, ప్రజల కోసం వారం రోజుల పాటు దీన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గోపాలపురంలో రూ.32 లక్షల అంచనాతో నిర్మించనున్న పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎ.కొండూరు మండలంలో గోపాలపురంతో పాటు కేశ్యాతండా, మత్రియా తండాలకు పంచాయతీ కార్యాలయాల భవనాల నిర్మాణానికి అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. స్థల దాత బత్తిన వెంకటేశ్వరరావు, వెంకటరమణలను సన్మానించారు. సర్పంచి కె.శ్రీను, నరేగా పీడీ రాము, డీపీవో లావణ్యకుమారి, ఎస్ఈ బాపిరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ లక్ష్మి, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వి.మునియ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

ప్రసంగించి.. ప్రశంసలు పొంది

మైలవరం: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఉపన్యాస పోటీలు అలరించాయి. 'కృత్రిమమేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ద్వితీయ సంవత్సరం వృత్తివిద్యా కోర్సు విద్యార్థిని పి.ఉదయశ్రీ, సీనియర్ బైపీసీ విద్యార్థిని డి.వీరలక్ష్మి, జూనియర్ హెచ్ఈసీ విద్యార్థిని కె.నందినిలు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బి.హైమవతి, అధ్యాపకులు బహుమతులు అందజేశారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థినులతో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ హైమవతి, అధ్యాపకులు

బండ పడితే.. బతుకులు రోడ్డుపాలే

గడ్డమణుగు లోయ నుంచి అధిక లోడుతో బండ రాళ్లను తీసుకెళ్తున్న టిప్పర్‌లు వాహనదారుల పాలిట మృత్యుశకటంలా మారాయి. ఇక్కడి నుంచి మైలవరం, తిరువూరు, గన్నవరం, నూజివీడు తదితర ప్రాంతాలకు రాళ్లను తరలిస్తుంటారు. ఈ క్రమంలో టిప్పర్లు అధిక లోడ్ వేసుకుని ఎలాంటి భద్రత నియమాలు పాటించకుండా రాకపోకలు సాగిస్తుండటంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. టిప్పర్లపై పట్టాలు కప్పకపోవడంతో ఆ వాహనం గుంతల్లో నుంచి వెళ్లినప్పుడల్లా రాళ్లు కిందపడుతున్నాయని వారు వాపోతున్నారు. అదే సమయంలో పక్కన వెళ్లే వారిపై పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. **- జి.కొండూరు, న్యూస్‌టుడే**



మునగపాడు బైపాస్ రోడ్డులో టిప్పర్‌పై పట్టాలు కప్పకుండా తీసుకెళ్తున్నారిలా..

ప్రభుత్వమే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు మాధవరెడ్డి చిత్రంలో కృష్ణారెడ్డి తదితరులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వం రైతుల ధాన్యం కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.మాధవరెడ్డి కోరారు. రెడ్డిగూడెం అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రెడ్డిగూడెం మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. ఏ సమయంలో వాతావరణం ఎలా మారుతుందోనని ఆందోళనకు గురవుతున్న రైతులు.. ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించి నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. తేమ శాతాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు కృష్ణారెడ్డి, అప్పిరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలి

గొల్లపూడి, న్యూస్‌టుడే: పింఛనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ఇంజినీరింగ్ విభాగం విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టి.వి.బి. బుచ్చిరాజు డిమాండ్ చేశారు. విజయవాడ గ్రామీణ మండల కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరాజు మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులకు పీఆర్సీ కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించాలని కోరారు. బకాయిలు చెల్లించడంతో పాటు రూ.5 లక్షల ఆరోగ్య బీమా కార్డులు మంజూరు చేయాలన్నారు. సంఘం ఉపాధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి కూర్మారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు బుచ్చిరాజు

8, 9 తేదీల్లో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండల స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలను నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పీడీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులకు 8న క్రికెట్, ఉపాధ్యాయినులకు 9న త్రోబాల్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.



తోటమూలలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, నాయకులు



గొల్లపూడిలో.. రైల్వే డీఎస్పీ రత్నరాజు, ఎం.సుబ్రహ్మణ్యం



మైలవరంలో.. తెదేపా నాయకులు

అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడు

అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడు అని వక్తలు కొనియాడారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా తిరువూరు, మైలవరం నియోజకవర్గాల వ్యాప్తంగా వివిధ రాజకీయల పార్టీల నాయకులు, దళిత సంఘాల నేతలు, అధికారులు, విద్యార్థులు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగం రూపకల్పనలో ఆయన చేసిన కృషిని వివరించారు. గంపలగూడెం మండలం తోటమూలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తిరువూరులో బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ పేరిట కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి, ఉచితంగా శిక్షణ ఇవ్వడం ద్వారా సుమారు 100 మందికి ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు. అంతకుముందు గంపలగూడెం నుంచి తోటమూల వరకు ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. **- న్యూస్‌టుడే, బృందం**



విస్సన్నపేటలో.. కూటమి శ్రేణులు



జి.కొండూరులో.. తెదేపా గ్రామ అధ్యక్షుడు విజయ్, నాయకులు



తిరువూరు బోసుబొమ్మ సెంటర్‌లో.. కూటమి నాయకులు, దళిత సంఘాల నేతలు



మైలవరం మండలం గణపవరంలో అంబేడ్కర్ కమిటీ ఆధ్వర్యంలో..



ఇబ్రహీంపట్నం శక్తినగర్ వద్ద.. తెదేపా నాయకులు, కౌన్సిలర్లు



ఎన్టీటీపీఎస్ సమావేశ మందిరంలో..

అంతర కళాశాలల పోటీల్లో చీరాల జట్టు ప్రతిభ



మహిళల వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన చీరాల జట్టుతో ఎమ్మెల్యే ఎం.కొండయ్య, నిర్వాహకులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జేఎన్టీయూ కాకినాడ అంతర కళాశాలల మహిళల వాలీబాల్ పోటీల్లో బాపట్ల జిల్లా చీరాలకు చెందిన సెయింట్ ఆన్స్ కళాశాల విన్నర్స్‌గా నిలిచి ట్రోఫీని గెలుచుకుంది. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కేతనకొండలోని ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫైనల్స్‌లో చేబ్రోలుకు చెందిన సెయింట్ మేరీస్ జట్టుపై చీరాల జట్టు విజయం సాధించింది. మూడు, నాలుగో స్థానాల్లో భీమవరం, బుడంపాడు జట్లు నిలిచాయి. పోటీల్లో పాల్గొన్న 20 కళాశాలలకు చెందిన జట్లలో నుంచి ప్రతిభ చూపిన క్రీడాకారులను నిర్వాహకులు జేఎన్టీయూ కాకినాడ జట్టుకు ఎంపిక చేశారు. చీరాల ఎమ్మెల్యే, ఆర్కే కళాశాల ఛైర్మన్ మద్దులూరి మాలకొండయ్య విజేతలకు బహుమతులు అందజేశారు. కోశాధికారి మద్దులూరి గౌరీ అమర్నాథ్, ప్రిన్సిపల్ రామకృష్ణ, జేఎన్టీయూ కాకినాడ ఐసీటీ కార్యదర్శి జీపీ రాజు పాల్గొన్నారు.

వేణుగోపాలుడి ఆలయ ఆదాయం రూ.18.46 లక్షలు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను అధికారులు శనివారం లెక్కించారు. ఈ ఏడాది సెప్టెంబరు 3 నుంచి ఇప్పటివరకు వచ్చిన కానుకలు లెక్కించగా రూ.18,46,236 నగదు, 10.880 గ్రాముల బంగారం, 1,778 గ్రాముల వెండి, 26 యూఎస్ డాలర్ల ఆదాయం లభించినట్లు తెలిపారు. దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ ఎన్.షణ్ముగం, పాలకవర్గ అధ్యక్షురాలు కె.శశిరేఖ, ఆలయ అధికారి ఎన్.సంధ్య పర్యవేక్షించారు.



లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

కాలువలో దూకి యువకుడి బలవన్మరణం

కొండపల్లి, న్యూస్‌టుడే: ఈలప్రోలు వద్ద బుడమేరు కాలువలో దూకి యువకుడు బలవన్మరణం చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై పురుషోత్తమ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్లికి చెందిన షేక్ మహమ్మద్ రఫీ(28) స్థానిక ఖిల్లా రోడ్డు సెంటర్‌లో చిరు వ్యాపారం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఇంట్లో వారితో ముభావంగా ఉంటూ బయటకు వెళ్లొస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం అతని సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. అయితే ఈలప్రోలు వద్ద బుడమేరు కాలువలో వ్యక్తి మృతదేహం ఉందంటూ శనివారం సామాజిక మాధ్యమాల్లో వచ్చిన చిత్రాన్ని కుటుంబీకులు చూశారు. పోలీసుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి మృతుడు రఫీనేనని వారు నిర్ధారించారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు

తిరువూరు టౌన్: వెనుకబడిన విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసే ఆలోచనతోనే కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడానికి నిర్ణయించిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ విమర్శించారు. తిరువూరు పట్టణంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండో రోజైన శనివారం కొనసాగిన ఎస్ఎఫ్ఐ జిల్లా 53వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కుమారస్వామి, వెంకటేశ్వరరావు, కుమార్‌నాయక్, ప్రణీత, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని రెడ్డిగూడెం బేతేలు చర్చి ఆవరణలో ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వేముల వెంకట్రావు అనే దాత వీటిని అందజేసినట్లు సొసైటీ అధ్యక్షుడు సీహెచ్.విజయ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థుల శ్రమదానం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేటలోని పుట్రేలరోడ్డు సమీపంలో వ్యవసాయ భూముల్లోకి వెళ్లే రహదారికి ఇరువైపులా పెరిగిన కంప చెట్లు, పిచ్చి మొక్కలను వికాస్ విద్యాసంస్థలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం యూనిట్ 1, యూనిట్ 2 విద్యార్థులు శనివారం తొలగించారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా శ్రమదానం ద్వారా సమాజ సేవలో భాగస్వాములు కావడం అభినందించదగ్గ విషయమని ఛైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి తెలిపారు.

మైలవరంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

మైలవరం: మండలంలోని పొందుగలలో ఒక బాలుడికి స్క్రబ్‌టైఫస్ సోకిందన్న అనుమానంతో మేజర్ పంచాయతీ మైలవరంలో శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. చంద్రాల పీహెచ్‌సీ అధికారులు సరఫరా చేసిన రసాయనాలను పంచాయతీలోని మురుగు కాలువల్లో పిచికారీ చేశారు. ఎవరైనా జ్వరాలతో బాధపడుతుంటే వైద్యులను సంప్రదించాలని సిబ్బంది సూచించారు.



రసాయనాలను పిచికారీ చేస్తున్న సిబ్బంది

AUTO

VEHICLES FOR SALE

FOR SALE: Tippers & Millers (Swing Setter), 3 Tippers - Bharat Benz 12 Tyres, 2 Tippers 10 Tyres, 2 Millers - Ashok Leyland Ltd, 2019 Model. ✆ 94401 72901.

2022 Bolero NEO, 7 seater Two vehicles for sale contact for more deals: 93919 89999

మంచి కండీషన్‌లో ఉన్నMaruthi Dzire VXI 2018 మోడల్ 85000 కిమీ తిరిగిన పెట్రోల్ కార్ అమ్మకం న్యూబ్యాటరీ ✆ 91003 63437

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

COURIERS

USA,UK, కెనడా, ఆస్ట్రేలియా & ఇతర దేశాలకు పచ్చళ్ళు, స్వీట్స్, బట్టలు, డాక్యుమెంట్స్, మెడిసిన్స్, మొ|| కొరియర్ చేయబడును. SV Express - ICL కొరియర్. గురునానక్ నగర్, VJA. 94410 27788

WANTED DEALERS/AGENTS

చిన్న పెట్టుబడితో ప్రపంచ ఆరోగ్యమైన సిరి ధాన్యాల రెడీ టు ఈట్ & కుక్ ఫుడ్‌ప్రోడక్ట్స్‌కి AP & TG అన్నిజిల్లాలకి, డీలర్స్ DSA స్త్రీ/పు అవకాశాలు: 949494 9937/24

BUSINESS OFFER

విశాఖపట్నం కాంప్లెక్స్ ఎదురుగా రన్నింగ్‌లో వున్న 100 బెడ్స్ గల డార్మెటరీ & 40 సిట్టింగ్ వున్న మెస్ బిజినెస్ ఇవ్వబడును. Ct: 92466 15866.

WANTED

నెల్లూరుసిటిలో మిలాన్ లైఫ్‌స్టైల్ బిల్డింగ్ ట్రంకురోడ్డు నందు 4000 SFT గ్రౌండ్ ఫ్లోర్ ఉన్నది. మల్టి బ్రాండ్ స్పోర్ట్స్ ఫ్రాంచైజ్ కావలెను. ✆ 77803 80268, 93986 44232

FOR SALE

విజయవాడ - కేదారేశ్వరపేటలో మంచి రన్నింగ్ లో ఉన్న మెడికల్ స్టోర్, ఫర్నిచర్ మరియు మెటీరియల్ తో సహా అమ్మకానికి కలదు. Ph: 84650 18694.

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001:2015 Certified Co. Household goods shifting any time any where. ✆ 97043 64389

BUILDING CONSTRUCTION

Raghava Associates. We Do Building Contracts for VMC/ APCRDA/ LRS/BPS Approvals, Elevations & Structural Designs. 98851 12999

TDR
AP & TELANGANA BONDS BUY & SALE
KAMESH
92 92 15 15 15

ఇల్లు కట్టబడును: మెటీరియల్ కాంట్రాక్ట్ పద్ధతిలో బ్యాంక్‌లోన్, ప్లాన్ అప్రూవల్‌తో కలిపి ఇల్లు కట్టించి ఇవ్వబడును. ✆ 85260 82222.

ARCHITECT & ENGINEERS

ఈశ్వర్ అసోసియేట్స్: BPS ప్లాన్స్ Govt. లైసెన్స్డ్ M.Tech. ఇంజినీర్‌చే VMC & CRDAలో అప్లై చేయబడును. ✆ 89777 71989.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

WATER PROOFING

Tarun Slab Leakage Works ★ 25Yrs. Exp. ★ 5Yrs. Warranty ★ Bathroom Leakage, Grouting Epoxy Works. ✆ 9494002285, 9951607504

EDUCATION

SPOT admissions by Govt AP 12/12: M.Com/ MA English/ MSW only Rs 5000 per sem, PLNM Degree College, 91774 08565.

TUITIONS

ప్రశాంతి (ఆన్‌లైన్ & హోమ్) ట్యూషన్ LKG to 10th, Inter Degree B.Tech Hobby Projects available. ✆ 62815 11922.

HOME TUITIONS

ప్రత్యూష (ఆన్‌లైన్ & హోమ్) ట్యూషన్స్ LKG to PG All Objective సబ్జెక్ట్స్, NEET, IIT ట్యూటర్స్‌కు ✆ 92900 05677, 74165 35749.

FINANCIAL SERVICES

సేల్‌డీడ్ హామీపై ఇళ్ళు, స్థలాలు, పొలాలు, అపార్టుమెంట్స్‌పై ఫైనాన్స్ ఇవ్వబడును. Contact: 94401 48114, 80852 83056.

మీ ఇళ్ళు బిల్డింగ్స్ కాంప్లెక్స్‌ల మీద తనఖా పద్ధతిలో రూ.1 వడ్డీకి ఫైనాన్స్ ఇప్పించబడును. వేరే ఏ బ్యాంకులో ఉన్ననూ విడిపించబడును. ✆ 83099 11995.

INVESTMENTS

హామీపై ఇళ్ళు, స్థలాలు, పొలాలు, అపార్టుమెంట్స్‌పై ఫైనాన్స్ ఇవ్వగల ఇన్వెస్టర్స్ కావలెను. Contact: 94401 48114, 80852 83056.

HOME NEEDS

HOME APPLIANCES

KITCHEN APPLIANCES FOR SALE
SS COMERCIAL KITCHEN EQUIPMENTS - 2 All KUTLERY ITEMS, WATER COOLER, STAINLESS STEEL FREEZER 2, CENTRIFUGAL BLOWER 2, COMMERCIAL LPG SYSTEM, ACRYLIC LED BOARD, THERMAL POS PRINTERS EPSON 4, TOUCH POS SYSTEMS 4, 35 KVA DIESEL GENERATOR, ACs 3 Nos.
98496 36969

MOSQUITO SCREENS

మెష్‌డోర్స్, కర్టన్ రాడ్స్, కప్‌బోర్డ్స్, UPVC విండోస్ బ్లైండ్స్, వాల్‌పేపర్, Anti Bird మెష్. ఇన్విజిబుల్ గ్రిల్స్, దుర్గాప్రసాద్. 98495 69111.

PEST CONTROL

Tarun Pest ★ 25Yrs. Exp., 5Yrs. Warranty ★ Smell Less ★ Bayers Chemicals (Pest & Other Insects Control). ✆ 94940 02285, 99516 07504.

INDUSTRY

MACHINERY FOR SALE

Tablet Section, Capsule Section, Ointment & Liquid Sections For Pharma Use All Machines Working Cond. ✆ 98660 75977.

VJA, కానూరు, న్యూ ఆటోనగర్‌లో మంచి రన్నింగ్ కండీషన్‌లో ఉన్న DEF ఆయిల్/ AD Blue పుల్లీ ఆటోమేటెడ్ మిషనరీ ప్లాంట్ అమ్మకము. ✆ 94937 66969

PERSONAL INTEREST COURSES

TAILORING

జయ టైలరింగ్ ఇన్‌స్టిట్యూట్ ★ టైలరింగ్, బ్యూటీషియన్ షార్ట్ టర్మ్ కోర్సులు ఉదయం, సాయంత్రం బ్యాచెస్‌లో నేర్పబడును. ఆడవారికి మాత్రమే. ✆ 96523 09860

PEOPLE CARE

OLD AGE HOME

బాలాజీ గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 96038 53355, 9704741122

మాతృశ్రీ హోమ్‌కేర్: మంచంపై పెద్దలకు, పేషెంట్లకు, బేబికేర్, ఇంటి/ వంటపనికి ఆయాలు, అటెండర్స్, నర్సులు 24 గం. పంపగలం. ✆ 99895 58736, 83176 01335.

రమణ మహర్షి ఓల్డ్‌ఏజ్ హోమ్: వృద్ధులను, బెడ్‌పేషెంట్లను చేర్చుకొనబడును. ఇంటి వాతావరణంతో కూడిన వృద్ధాశ్రమం. ✆ 97012 54793, 63027 93978

REAL ESTATE

గుంటూరుసిటీ, గోరంట్ల రెడ్డిపాలెం లాం, అగతవరప్పాడు, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కొప్పురావూరు, కంతేరు, కాజాలలో ప్లాట్లు అ/కొ. సం|| 89195 62183.

గుంటూరుసిటీలో, గోరంట్ల, లాం, JKC రోడ్డు, ఇన్నర్‌రింగ్‌రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజా,మంగళగిరి, తాడికొండలోని ప్లాట్లు అమ్మదలచినవారు 93999 55545.

అమరావతి సీఆర్డీఏ & బ్యాంకింగ్ ఆఫీసులకి, క్వాంటమ్ కంప్యూటర్స్‌కి 8km దగ్గర గః 10500/-, హౌస్ 60 లక్షలు ఎకరం 80 లక్షలు 90523 45356.

కొనబడును, అమ్మబడును: వ్యవసాయ భూములు, ఇళ్ళ స్థలాలు, వెంచర్లు, పాత వెంచర్లు, ఓపెన్ ప్లాట్స్ & పార్మ్‌ల్యాండ్స్ కొనుగోలు మరియు అమ్మకానికి. ✆ 93926 02024.

డెవలప్‌మెంట్ ఇవ్వబడును. గన్నవరంలో 1512గజాలు ఉడాలే అవుట్ స్థలము తూర్పు, పడమర 6 ప్లాట్లు గన్నవరం రాయ్‌నగర్‌లో 5సెంట్లు ఇల్లు అమ్మకం. Y. శ్రీనివాస్. ✆ 80998 36999.

దర తక్కువ పాత అపార్టుమెంట్స్, ఇండ్ల మధ్య ఓపెన్ ప్లాట్స్ మరియు షాపులు అమ్మబడును. ✆ 80089 75044

FLAT FOR SALE

Luxury 3 BHK Flat with 2,350 Sft for sale in Prime Locality, Near Novotel Hotel, Bharathi Nagar, Vja. ✆ 78427 28111.

2450 Sft. 3 BHK Each Floor single flat, P&T Colony, Phase 3, Patamata High School backside, VJA. ✆ 76888 86666, 94948 31631

ఫ్లాట్ (2BHK), పాత భాను అపార్ట్‌మెంట్స్, మధు గార్డెన్స్, మొఘల్రాజపురం, విజయవాడ - 520010. Ph: 78939 77344.

3BHK ఫ్లాట్స్ అమ్మకం.3rd & 5th ఫ్లోర్స్. ఫ్లింత్: 1350Sft, మొత్తం: 1795Sft, బ్రైండ్‌సెట్ మిడోస్, మధురానగర్,VJA. ✆89777 88889, 89777 77797

పటమట డొంకరోడ్ విజయ హాస్పిటల్ రోడ్ నందు 2 BHK & 3 BHK ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆ 94405 24430

డైరెక్ట్‌సేల్ విజయవాడ ఆయూష్ హాస్పటల్ వెనుక రామచంద్రనగర్‌లో అన్ని సౌకర్యములతో పుల్లీఫర్నిష్డ్ న్యూ 3BHK 1760SFtతో డీలక్స్ ఫ్లాట్స్ అమ్మకం. ✆ 95648 79999.

2 BHK ఫ్లాట్స్ కానూరు శ్రీరామ్‌నగర్‌లో అమ్మకం, 3BHK 3 ఫ్లోర్స్ ఇండిపెండెంట్ ఫ్లాట్స్ కానూరులో 80 Ft రోడ్‌ఫేస్ అమ్మకం ✆ 98484 81701, 93460 22299

VJA రామవరప్పాడు తూర్పు/ పడమర, రోడ్లతో ఫ్లోర్‌కి ఒక్క ఫ్లాట్ చొప్పున నిర్మించిన 3 BHK ఫ్లాట్స్ గృహ ప్రవేశమునకు సిద్ధముగా కలదు. ✆ 98485 98331.

బందరురోడ్డు టైం హాస్పిటల్ ఎదురు అశోక్ నగర్ యార్లగడ్డ అప్పారావు వీధిలో తూర్పు ఫేస్ న్యూ 3BHK ఫ్లాట్స్ అమ్మకం. ✆ 93462 36699,92464 93335.

VJA, కరెన్సీనగర్‌లో 2.8 ఎకరాల ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్లో 2& 3& 4BHK లగ్జరీ ఫ్లాట్స్ అమ్మబడును. సంప్ర|| ✆ 86884 66789.

విజయవాడ, NTR కాలనీలో అన్ని సౌ|| తో గృహప్రవేశంకు సిద్ధముగా ఉన్న ఈస్ట్ ఫేసింగ్ 3 BHK ఫ్లాట్స్ ✆ 93946 26067, 94903 53541

VJA, పాలఫ్యాక్టరీ, K.L.రావు పార్క్ దగ్గర, జయతిపెరల్స్ అపార్ట్‌మెంట్ 4th ఫ్లోర్, E/F, 2B/R ఫ్లాట్ (1175 SFT), కార్, 2వీలర్ పార్కింగ్‌తో అమ్మబడును. ✆92913 23563

Vijayawada Porenki 100 Feet Road Brand New Flat 3rd and 4th floor 3000 Sft North/ East facing 1 Car Parking. Per Sft 7500 Slightly Negotiable Ready to Occupy Cont: 73965 44066

3BHK Flat Sale Open Kitchen Cupboards, Balcony, Lift & Generator Car Parking, Bhaskarapuram, Machilipatnam. ✆ 91103 82362.

FLAT FOR SALE
2620 Sq.ft 3 BHK
Ready to move
Fully Furnished (2 Floor),
Floor Wise Flat
SRI SESHADRINILAYAM
Near Sentini Hospital, VJA.
PH.9848120049

నందిగామ రైతుపేట సెంటర్ నందు నిర్మించిన ★ విఘ్నేష్ ప్లాజా నందు కమర్షియల్ షాప్స్ & 2 BHK ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆ 73829 81107.

విజయవాడ లబ్బీపేట గ్రీన్‌ల్యాంగ్ ఫంక్షన్ హాల్‌ఎదురు వైష్ణవి రెసిడెన్సీ ఫ్లాట్ నెం201 ఈస్ట్‌ఫేసింగ్ 1324SFT 3బెడ్‌రూమ్ ఫ్లాట్ అమ్మబడును. 9160002359.

EENADU Classifieds

VJA కృష్ణలంక, గీతనగర్ 2వ లైన్‌లో (SBI రోడ్), 2వ అంతస్తులో 2 BHK ఫ్లాట్ అమ్మకమునకు కలదు. ✆ 72078 93551, 90105 63685.

గన్నవరం సెయింట్ జాన్స్ స్కూల్ శ్రీనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన భాను ఎంపైర్ నందు 2BHK ఫ్లాట్స్ 2 మాత్రమే అమ్మకమునకు కలవు. 98481 47485.

FLATS for SALE
4 BHK Premium FLATS - 2850 Sft.
(2 Cars Parking)
beside Bhashyam School, KANURU
✆ **9989855219**
8977162616

బ్యాంక్ ఆక్షన్‌లో విజయవాడ, వెటర్నరీ కాలనీ, గొల్లపూడి, తాడిగడప, పాయకాపురం, KLU వడ్డేశ్వరం, ఉప్పులూరులో అమ్మకమునకు కలవు. ✆ 63040 00712, 70134 39314.

పోరంకి, ప్రియ ఫుడ్స్ ఎదురు రోడ్, శ్రీనివాస రెసిడెన్సీ 3BHK, 5th ఫ్లోర్ ప్రీమియం క్వాలిటీ ఫ్లాట్ కబోర్డ్స్‌తో క్లాస్ లొకేషన్. రెడీ టూ మూవ్. ✆ 76740 82458.

2 & 3BHK డీలక్స్ ఫ్లాట్స్. 2BHK @ 36L& 3BHK @ 55L గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నవి. CRDA అప్రూవ్డ్ ఓపెన్‌ప్లాట్స్ M.P. డెవలపర్స్ ✆89856 50007

VJA, సత్యనారాయణపురం, కేదారేశ్వరపేట, 2 BHK డీలక్స్ ఫ్లాట్స్ గృహప్రవేశానికి సిద్ధంగా కలవు. ✆ 98666 01999, 96528 84144.

మొఘల్‌రాజపురం మోడరన్ సూపర్ మార్కెట్ వెనుక SBI కాలనీ, 4th లైన్‌లో రెడీటు ఆక్యుపై దేవీ రెసిడెన్సీనందు 3 BHK (2650 Sft.) అమ్మబడును. ✆ 99497 46789.

3 BHK ఫ్లాటు (1600Sft- చ||గ|| 63) అమ్మకం.గొల్లపూడి హైవేకు 2వ బిట్, కుసుమ ఎలైట్, 5వ ఫ్లోర్, తూర్పు ఫేస్, పూర్తి ఫర్నిచర్& కారు పార్కింగ్‌తో ఉన్న ఫ్లాటుసంప్ర: 98481 23489

3 BHK LUXURIOUS FLATS FOR SALE
Patamata @JD Nagar
❖ 2100 Sft. ❖ NO GST
❖ 85 sq.yds UDS
❖ 2 Car Parking
❖ Ready to Occupy
Year Ending Offer
FREE REGISTRATION
✆ **94401 72044**

విజయవాడ, పటమటలంక, శ్రీనివాస ఎవెన్యూ అపార్ట్‌మెంట్, 2ndఫ్లోర్, తూర్పుఫేస్, 2B/R ఫ్లాట్ (1150 S.Ft) లిఫ్ట్, కార్‌పార్కింగ్‌తో అమ్మబడును ✆ 94948 88812

నిడమానూరులో గృహప్రవేశానికి సిద్ధంగా, తూర్పు ఫేస్ 2BHK (1250 SFt), 3BHK (1450 SFt) ఫ్లాట్స్, లిఫ్ట్, జనరేటర్, కార్‌పార్కింగ్ సౌకర్యములతో అమ్మకమునకు కలవు. ✆ 80087 67979, 80744 99872.

విజయవాడ, సింగినగర్, తోట వారి వీధి, ఆంధ్రప్రభ కాలనీ చంద్రహాస అపార్ట్మెంట్ 4ఫ్లోర్, D2, 2BHK, 1200SFT ఫ్లాట్ అమ్మకానికి కలదు. 89853 17009.

3బెడ్ రూమ్స్, East facing, A Block, 4th floor ఫ్లాట్ అమ్మకానికి కలదు. శ్రీ ప్రకాశ్ టవర్స్, శిఖమని సెంటర్, ప్రజాశక్తి నగర్ విజయవాడ: ✆ 94404 87971

ఆటోనగర్ బస్‌టెర్మినల్ దగ్గర బందరురోడ్డు, వశిష్ఠ ఎన్‌క్లేవ్‌లో E/F డీలక్స్ 3BHK ఫ్లాట్ 2030 Sft, లిఫ్ట్‌కార్ పార్కింగ్‌తో అమ్మకం. ✆ 98663 09134

విజయవాడ ఎనికేపాడులో 2nd ఫ్లోరునందు 1100 Sft. గల 2 BHK ఫ్లాట్ వెస్ట్‌ఫేస్, కార్‌పార్కింగ్‌తో 35 లక్షలకే అమ్మకం. ✆ 86396 33455.

విజయవాడ నిడమానూరులో 62 లక్షలకే న్యూ 3BHK ఫ్లాట్, కబోర్డ్స్‌తో ★ సంక్రాంతి లోపు బుక్‌చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్ ఫ్రీ . ✆ 91822 43342

రమేష్ హాస్పటల్ వెనుక LIC కాలనీలో 1100 SFt ఈస్ట్ ఫేస్ 45 గ|| లు షేర్‌తో ఫ్లాట్ అమ్మకం East West రోడ్‌తో ✆ 78423 88856

విజయవాడ భారతినగర్ రోడ్డు నెం: 14 బృందావనం అపార్టుమెంట్ ఫ్లాట్‌నెం: 201 2nd ఫ్లోర్ 1100SFt కార్ పార్కింగ్‌తో అమ్మకం. ✆ 8374985819

VJA, కబేళా దగ్గర గ్రూప్ హౌస్‌లో గ్రౌండ్ ఫ్లోర్ నందు N/F, 2B/R ఫ్లాట్స్ (725 Sft), 2వీలర్ పార్కింగ్‌తో, అమ్మకమునకు కలదు. ✆ 92913 23563

KANURU

3BHK - 1470SFT North, 2BHK-1240SFT East, Ready to move at Srinivasa Residency, Near Sitapuram Colony, Aravapalli Purnaiah Veedi, Opp. Priya Foods, Poranki, VJA. (C) 77028 76445.

2BHK Ground Floor Flat No: 101 With Car Parking is For Sale in Suvarna Residency, Kanuru. ✆ 98223 53889, 99122 46799.

కానూరు కెనడీ స్కూల్ దగ్గర్లో 3&4 BHK డీలక్స్ ఫ్లాట్స్ మరియు తాడిగడప మనోజ్‌నగర్‌లో G+2 హౌస్ (లిఫ్ట్ సౌకర్యంతో) అమ్మకం. ✆ 70750 17255.

న్యూ 3 BHK ఫ్లాట్స్
కానూరు విజయలక్ష్మి థియేటర్ దగ్గర **మైత్రినగర్‌లో**
1895 S.Ft. గల **3 BHK**
ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా ఉన్నవి.
99497 16957

3BHK తూర్పు ఫేస్ డీలక్స్ ఫ్లాట్స్ అన్ని సౌకర్యములతో అమ్మకం. బల్లెం వారి వీధి, గౌరిశంకర్ నగర్, కానూరు ✆ 97017 98726, 89196 79256.

కానూరు మురళీనగర్ బల్లెంవారివీధి మెడ్‌ప్లెస్ ఎదురు రోడ్డులో చైతు సాయి నివాస్ FF-1 నందు 2Yrs ఓల్డ్ 2BHK ఫ్లాట్ లిఫ్ట్ కార్ పార్కింగ్‌తో అమ్మకం (నో బ్రోకర్స్). ✆ 76619 62999

కానూరు, మురళీనగర్, బల్లెంవారివీధిలో అక్షయమెడోస్ నందు న్యూ 3 BHK (1400 Sft) ఫ్లాట్స్ అన్ని సౌ||తో 53 లక్షలు మాత్రమే. గుడ్ లోకేషన్ ✆ 89195 70872

TADIGADAPA

అపార్ట్‌మెంట్ ఫ్లాట్ అమ్మకానికి. గేటెడ్ కమ్యూనిటీ 2B2HK 2 బెడరూమ్స్ & 2 హాల్స్ 2nd హాల్ ఓపెన్ కిచెన్. యనమలకుదురు విజయవాడ. ఫోన్: 93476 84440.

GANNAVARAM

Vijayawada - Near Gannavaram Gandhi Center, a few yards from the highway, 1.5 km from the airport and HCL, 3 bed 3 bath, new first floor apartment, 1660 sq.ft.; Phone: 83338 65529

గన్నవరంలో సెమీ ఫర్నిషెడ్ 3 BHK (1719Sft) ఫ్లాట్ అమ్మకం /అద్దెకు. మాడ్యులర్ కిచెన్, చిమ్ని, గ్యాస్ స్టవ్ పైప్ కనెక్టెడ్,సోలార్ పవర్ : ✆93921 90501

TADEPALLI

4 BED ROOM LUXURY FLATS
SITE 1477 YARDS
TOTAL FLATS 10 ONLY
EACH FLAT 4260 SQ FEET
UDS 137 YARDS
(INCLOUD 3 CAR PARKINGS)
20X15 BED ROOMS 4
10X15 & 10X8 BATH ROOMS 4
20X15 KITCHAN
20X15 DINNING HALL
20X15 DRAWING HALL
20X10 HOME THEATER
60X17 LIVING HALL
Prime Locality
Beside SIT Office
Prathuru Road, Tadepalli
CONTACT
gn-fab DOORS&WINDOWS
92464 95788 / 99

తాడేపల్లి ఆశ్రమంరోడ్డు గేటెడ్ కమ్యూనిటీలో 2BHK ఈస్ట్ ఫేస్ 1233SFT కబోర్డ్స్ స్విమింగ్‌పూల్ కారుపార్కింగు ఫంక్షన్‌హాలుతో సేలెకి కలదు. 79959 96624.

SATYANARAYANAPURAM

2 BHK Flat in SN Puram, VJA for Sale 24 Yrs Old around 1350 S/ft including Free Space. No Car Parking. ✆ 81798 00259.

2 Bhk Aptmnt ready to occupy, 50 L, Lakshmi ngr SN puram, Vijayawada. no brokers. Cont: 94908 50334

VJA, సత్యనారాయణపురం BRTS రోడ్ దగ్గరలో 1,200 S.Ftతో న్యూ 2BHK ఫ్లాట్స్ Upto 90% బ్యాంక్ లోన్‌తో అమ్మబడును. ✆ 80992 13888.

HOUSE FOR SALE

Independent House for sale. Nethaji St, Sitharampuram, Next right to Visalandhra office-Vijayawada, East Face, 279 Sq.Yd. Clear title, Prime location. Ph: 87902 77465

బందరురోడ్ హరివిల్లు గేటెడ్ కమ్యూనిటీలో గండిగుంట వద్ద 195గ|| 1400S.Ft 2BHK 67L నుండి క్లబ్ హౌస్, ఫెసిలిటీతో ప్లాట్స్. ✆ 95427 56666

బిల్డింగ్ అమ్మకము
సత్తెనపల్లి నడిబొడ్డున NGO హోమ్ సెంటర్‌లో రన్నింగ్ హాస్పిటల్ వున్న బిల్డింగ్ అన్ని వసతులు గల కమర్షియల్ బిల్డింగ్ (360 చ॥గ 74.6 పొడవు, 43.9 వెడల్పు) అమ్మబడును.
93971 66333
Ph: 94402 01051
99660 78933

గుడివాడలోని పెదయెరుకపాడులో 4900 చదరపు అడుగుల స్థలంలో నార్త్-వెస్ట్ ఫేస్‌లో 1200 SFTలో నిర్మించిన 2BHK ఇల్లు అమ్మకానికి కలదు. ఫోన్: 91132 38451

విజయవాడ పైపుల రోడ్డు దగ్గరలో గృహ ప్రవేశానికి సిద్ధంగా 125చ||గ||లలో న్యూ 3ఫ్లోర్ల బిల్డింగ్ అమ్మకం/అద్దెకు కలదు. ✆ 807462 3884, 83176 37676

246 చ.గ.ల్లో G+3+పెంట్‌హౌస్ గల బిల్డింగ్ 80,000 అద్దెలు. లిఫ్ట్ పూర్తి ప్లాన్ అప్రూవల్ E/Fతో ప్రసాదంపాడులో అమ్మకం. రేటు 3.25Cr. 94403 73594

ఇల్లు అమ్మబడును
విజయవాడ 1 టౌన్, KL రావు నగర్, చర్చి ఎదురు రోడ్‌లో Right Side కార్నర్ బిల్డింగ్ నార్త్, వెస్ట్ పెద్ద పెద్ద రోడ్లతో 83.30 గజాల G+3 బిల్డింగ్ అమ్మబడును.
98491 80345
93467 20854

అమరావతి రాజధాని మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలో 4.5 సెంట్లు 217.8 చ||గ|| దక్షిణంఫేస్ RCC బిల్డింగ్‌తో సహ అమ్మకము PH:88858 44666.

గుడివాడ పట్టణంలో కవిరాజ భవనం ఎదురుగా ఉన్న న్యూ ఆంజనేయ రెస్టారెంట్ రోడ్‌లో లెమన్ ఎల్లో కలర్ బిల్డింగ్ అమ్మబడును. ✆ 89853 14179.

ఇల్లు అమ్మబడును
విజయవాడ, 1 టౌన్ శ్రీనివాస మహల్ వెనుక రోడ్‌లో, రోడ్‌కి అనుకొని, **198 గజాల G+1 (8 పోర్షన్‌ల ఇల్లు)** అమ్మబడును. No Brokers.
✆ **98491 80345**
93467 20854

బందరు రోడ్డు కంకిపాడు వద్ద పునాదిపాడులో కోలవెన్ను వెళ్ళే బస్సు రోడ్డు ప్రక్కన 120 చ||గ||ల్లో 2 BHK ఇండివిడ్యువల్ హౌస్ 45 లక్షలకే. 90000 88199

CURRENCY NAGAR

Vja, Ramavarapadu Ring: E/F G+1+1 House in 214 Sq. Yards & 190Sq.Yards Open Plot Sale ✆ 98800 79199, 97406 05740

LAND FOR SALE

కాకినాడ 100 అ.పోర్టు హైవేని అనుకొని, అచ్చింపేట-లైటుహౌసు దారిలో, N/F, 535/500/310చ.గ విడిగా/కలిపి మంచి వాణిజ్య స్థలం అమ్మబడును-9347073899.

Uppaluru (Vi), Kankipadu (Mdl.) Krishna(dt.) Total land: 3.16 Acres, R.S.No:4-2C-1 Acres, R.S.No:4-2B-1 Acres R.S.No: 4-2A-1A-Ac0.895Cs, R.S.No: 4-2A-1B-Ac0.18Cs, R.S.No: 4-2A-2-Ac 0.085CS and Total land (S.Yards) :653.35 Sy. Yards. Rs .No. 4/1C-283.98S.Yrds R.S. 4/1C-369S.Yrds. 97012 51090, 90141 12000

1Acr Farm Land with N/E Facin 1000 Sft. House Nr. Pusapatirega 4KM from NH-5 Nr. Bhogapuram Airport. 8125499995/ 8499961919

తక్షణ అమ్మకానికి భూమి
తాడికొండ మండలంలో
SRM యూనివర్సిటీ సమీపంలో
1.20 సెంట్ల భూమి
తక్షణ అమ్మకానికి ఉంది.
ఆసక్తిగలవారు మాత్రమే సంప్రదించగలరు.
93981 42337

గుంటూరు దగ్గరలో కాటూరి మెడికల్ కాలేజ్ హాస్పిటల్ ప్రక్కన NH16కి 450మీ. దూరంలో 5 ఎ||ల కమర్షియల్ పొలము నీటివసతితో అమ్మకం. 94419 41717

9 ఎకరాల మామిడితోట అమ్మబడును. విస్సన్నపేట దగ్గర తారు రోడ్డు ఫేసింగ్, ఔటర్ రింగ్‌రోడ్డు లోకేషన్ ఎకరం 35 లక్షలు. ✆77807 25157/ 94915 86009

గుడివాడ మండలం, కొమరవోలు శివారు తటివర్రు గ్రామము నందు 20ఎకరములు మాగాణి పొలము అమ్మకం. సంప్ర: 93462 81147, 83676 38755,

గుండిమెడ దగ్గర 3 ఎ & పరిసర ప్రాంతాలలో పొలములు & జగ్గయ్యపేట 17 ఎ. లయోలా కాలేజ్ దగ్గర 267 గ.లలో ఇల్లు అమ్మకము. ✆ 98496 33982.

ప్రకాశం జిల్లాలో పండ్ల తోటలకు మరియు సోలార్ ప్రాజెక్ట్స్ అనుకూలమైన భూమి 50 నుండి 500 ఎకరాలు వరకు అతి తక్కువ ధరకు లభించును. ✆ 86391 34168/ 81429 13512

పొలము అమ్మకం
బాపట్ల జిల్లా
చుండూరు మండలం
కూచిపూడి గ్రామ పరిధిలోని
4 ఎకరాల వ్యవసాయ భూమి
క్లియర్ టైటిల్‌తో అమ్మకం.
✆ **93478 23475**

వీర్లపాడు మండలం పల్లెంపల్లి గ్రామములో మెయిన్ రోడ్డుకు ఆనుకొని 11 ఎకరాలు, పామాయిల్ తోట అమ్మకమునకు కలదు. సంప్రదించండి. ✆ 98498 09063.

LAND FOR SALE
రొయ్యల సాగు భూమి విక్రయానికి
కృష్ణా జిల్లా, గుడివాడ డివిజన్, కైకలూరు మండలం, సీతనపల్లి గ్రామంలో ఉన్న సర్వే నంబర్లు 23-2, 23-3, 23-4, 23-5 కలిపి మొత్తం 5.55 1/2 ఎకరాల రొయ్యల సాగు భూమి విక్రయానికి ఉంది. ఆసక్తి ఉన్న కొనుగోలుదారులు సంప్రదించండి.
సతీష్.సి.హెచ్
కాంటాక్ట్ నెంబర్: +91-8978739620

వీరవల్లి నుండి ఆగిరిపల్లి వెళ్లే తారురోడ్డుని ఆనుకొని PMG ఇండస్ట్రీ ప్రక్కన 3 ఎ||20 సెంట్లు లేఅవుటుకు అనువైన భూమి అమ్మకం ✆ 94901 79329.

కంకిపాడు ప్రొద్దుటూరు గాయత్రి విహార్ రోడ్డు PRL గార్డెన్స్ ఎదురుగా 1 ఎకరం ల్యాండ్ అమ్మకమునకు కలదు. ✆ 90003 33366.

GANNAVARAM

గన్నవరం అవుటర్ రింగ్‌రోడ్ దగ్గరలో ఎకరా 17 సెంట్లు తారురోడ్ ఫేసింగ్‌తో అమ్మకంనకు కలదు. Cont: 79817 54685.

PLOT FOR SALE

VJA పటమట బందరు రోడ్డు ఆనుకొని E/S ఫేసింగ్‌తో 548 చ.గ. (49x99) బిల్డింగు అమ్మబడును. ✆ 92471 72577, 94411 94126, 92981 55240, 81434 76070

బందరురోడ్డు 6లైన్ హైవేకి దగ్గరలో 100FT రోడ్డుని ఆనుకొని CRDA ప్లాట్ అమ్మకం 80% బ్యాంక్‌లోన్. గజం కేవలం 18K మాత్రమే ✆ 94905 14626

పామర్రు, హైవే పక్కన, వాసవి నగర్ ఓల్డేజ్ హోమ్ దగ్గరలో 300 చ.గ. ఓపెన్ ప్లాట్ (6.2 సెంట్స్) తూర్పు ఫేసింగ్ రూ. 21,00,000/-.(7000/- చ.గ.). ✆ 80089 63269.

కేతనకొండ గ్రామపంచాయతీ పరిధిలో 400గజాలు కమర్షియల్ స్థలము అమ్మకము హైదరాబాద్ హైవేకు దగ్గరలో కలదు. ✆ 99088 74037.

కానూరు - ఆటోనగర్ రోడ్డులో Scotspine International School దగ్గర 1084 చ||గ|| ఈస్ట్‌ఫేస్ స్థలము అమ్మకము. ✆ 76610 34433.

విజయవాడ - నూజివీడు రోడ్డులో నున్న గ్రామములో 1306 చ.గ. స్థలము వెస్ట్‌ఫేస్ అమ్మకమునకు కలదు. Contact: 76610 34433.

పునాదిపాడు చైతన్య కాలేజ్ రోడ్డులో మద్దాలి తిరుమలరావు గారి వెంచరులో ప్లాటు నెం. 6, 400 చ.గ. W/F స్థలము అమ్మకము. Contact: 76610 34433.

ఓపెన్ ప్లాట్ 169 గ|| మంచి ప్రైమ్ లొకేషన్, రామలింగేశ్వరనగర్, బెంజ్‌సర్కిల్ దగ్గర, తక్కువ ధరకే, బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. ✆ 91778 57001.

కానూరు, పోరంకి, గంగూరు, ఈడుపుగల్లు, కంకిపాడులో మీ ప్లాట్ అమ్మాలన్నా కొనాలన్నా సం|| ఖచ్చితమైన ధర ఇప్పించగలను. మీ R.K. 94942 87778, 73824 22777

VJA సీతారామపురం, రామానాయుడువీధిలో స్వాతి ఆఫీసుకు దగ్గరలో పడమర ముఖంగల 387 గజాల స్థలము అమ్మకమునకు కలదు. ✆ 78427 28111.

కృష్ణాజిల్లా ఉయ్యూరు (మం), చిన ఓగిరాలలో 9 సెంట్లు, 35 సెంట్లు 2 ఇళ్ళస్థలాలు, 50 సెంట్లు, 60 సెంట్లు 2 పొలాలు అమ్మబడును. (Owner) ✆ 9848305991

మచిలీపట్నం, పరాసుపేట మెయిన్ సెంటర్ KKR గౌతమ్ స్కూల్ రోడ్‌లో ఉత్తర ఫేసింగ్ గల 378 చ.గ. (57.2x59.6) ప్లాట్ అమ్మబడును. ✆ 94929 39220

హరివిల్లు ప్రీమియం Gatedలో హై రిటర్న్స్ ప్లాట్స్ @ పరిటాల, గన్నవరం, అంబాపురం, పెనమలూరు, ఆకునూరు పోర్ట్ మచిలీపట్నంలో ప్లాట్స్ డైరెక్ట్ ✆ 78937 66996

విజయవాడ ఇబ్రహీంపట్నం ఫెర్రీ లేఅవుట్‌లో పడమర ఫేస్ ప్లాటు నెం: 139 నందు 240చ||గ||లు అమ్మకం ✆72760 66096, 92902 05752

కంకిపాడు బందరురోడ్డుకు దగ్గరలో పునాదిపాడు శ్రీలక్ష్మి శ్రీనివాస అవెన్యు నందు ప్లాట్స్ & ఉప్పులూరు వైభవి అవెన్యులో CRDA ప్లాట్స్ అమ్మకం. ✆ 95335 43444.

For Sale: 323 Sq. Yds Residential Site in Patamata Vijayawada. ✆ 98490 02025, 93460 02025.

For Sale: 253 Sq. Yds Site in Srinivasa Nagar, Bank Colony, Near Mahanadu Road, Vijayawada. ✆ 98490 02025, 93460 02025.

256 Sq Yards E/F Plot for Sale in Kankipadu near Petrol Bunk and Gannavaram. Immediate Sale:- 89396 91031

నివేశన స్థలం అమ్మబడును
గుంటూరు జిల్లా, ఉండవల్లి నందు
D.No. 3-324 లో
581 చ॥గ॥ నివేశన స్థలం అమ్మబడును.
✆ **98663 97115**

392 చ.గ.ల కమర్షియల్ సైటు కేసరపల్లి to కంకిపాడు 100 అ.రోడ్డు ఫేసింగ్, గన్నవరం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కి దగ్గరలో అమ్మకం. ✆99851 51976

బందరురోడ్డు కంకిపాడు గాయత్రి విహార్‌లో E/F 230గ|| పునాదిపాడు సాయిచలపతి ఫేజ్-2లో W/F 228గ|| G.కొండూరు హైవే ఫేస్ 150గ|| అం|| 78938 37539

VJA, బందరురోడ్డు, రేడియో స్టేషన్ ఎదురు, సబ్‌కలెక్టర్ ఆఫీస్ రోడ్డు, పున్నమ్మతోట Ist లైన్‌లో, 336గ.లలో ఉన్న పాతఇల్లు, స్థలం అమ్మబడును. ✆ 9290461580

విజయవాడ నేతాజీ రోడ్, సీతారాంపురం, మొగల్రాజపురం 318 Sq.Yds ఖాళీ స్థలం, పడమర దిక్కు రోడ్, అమ్మకమునకు కలదు. 94409 18842.

పామర్రు, పరిటాలలో హైవేకి ఆనుకొని CRDA అప్రూవ్ లేఅవుట్ నందు లోన్ సదుపాయంతో ప్లాట్లు కలవు. ✆ 92473 90000.

విజయవాడ- హైదరాబాద్ హైవే ఆనుకొని నందిగామ సమీపంలో అప్రూవ్ ప్లాట్లు కలవు. గజం: 8,499/- & 5,499/- Ph.: 9030746514, 9177839181.

వేగంగా అభివృద్ధి చెందుతున్న AP CRDA, SRM, అమృత యూనివర్సిటీ ప్రాంతంలో 90 చ||గ|| కమర్షియల్ ప్లాట్ అమ్మబడును. 95059 80074.

బందరురోడ్డు, పోరంకిలో 35 ఎ||, ఆకునూరులో 50 ఎ|| ఓపెన్ ప్లాట్లు, హౌస్‌లు & పల్నాడు జిల్లా వినుకొండలో 20,25,50 సెంట్లు ఫామ్‌ల్యాండ్ సేల్. 97012 84449

VJA, వినాయక థియేటర్ బ్యాక్ సైడ్, లైలా గార్డెన్స్‌లో, తూర్పుఫేస్ 375 చ||గ|| ఖాళీ స్థలం అమ్మబడును. కావల్సిన వారు కాల్ చేయగలరు. ✆ 99483 44723.

పోరంకి సెంటర్ బందరు రోడ్డు హైవేకి ఫర్లాంగు దూరంలో వెస్ట్ ఫేసింగ్ 950 చ||గ||లు అమ్మకం. గజం: 33000/- రూ. సంప్ర: 90003 33366.

చ.గ. 6999/-, 13999/- అంబాపురం వెస్ట్‌బైపాస్, కంకిపాడు, G.కొండూరు, గన్నవరంలలో ఓపెన్ ప్లాట్లు & 2/3 BHK విల్లాస్ కలవు. ✆ 83749 36634.

హరివిల్లువారి అన్ని CRDA లేఅవుట్స్‌లో పెనమలూరు, గండిగుంటలో 194, 240, 300,400 గ. మంచిప్లాట్లు కంపెనీ డైరెక్ట్ సేల్‌కై. సంప్ర ✆92464 73929

పోరంకి CRDA గేటెడ్ కమ్యూనిటీలో వెంటనే ఇల్లు కట్టుకునే 220, 330, 550, 1050 గ.ల ప్లాట్లు బ్యాంక్‌లోన్ సదుపాయంతో కలవు. ✆ 93922 56567

విల్లాలు, అపార్ట్‌మెంట్స్, I.హౌసెస్, ప్లాట్స్, ఎయిర్‌పోర్ట్, స్కూల్ హైవే దగ్గర ఉడా లేఅవుట్ ప్లాట్స్ లోను సౌకర్యంతో కలవు. ✆ 94401 20033.

నున్న రెడ్లబజార్ తూర్పుఫేస్ 156గ||, కానూరు కామినేని హస్పిటల్ ఎదుట 140గ|| ప్లాట్స్ అమ్మబడును. గవర్నర్‌పేట, బిగ్ బజార్ వెనుక కార్నర్ 10x12 రూమ్ అద్దెకు కలదు ✆ 93989 37722

బందరు రోడ్ నేషనల్ హైవే ఫేసింగ్ నార్త్ సైడ్ కంకిపాడు దగ్గరలో 450 చ.గ. ప్లాట్ అమ్మకమునకు కలదు. ✆ 98483 43355.

పోరంకి బందరురోడ్డు పద్మావతి గార్డెన్స్‌లో తూర్పు ఫేస్ 38x63 కొ||తో 270 చ||గ||లు అమ్మకం. రేటు చ॥గ॥ 42,000/- (నో బ్రోకర్స్) ✆ 93462 22427.

కంకిపాడు సబ్‌రిజిస్ట్రార్ కాసరనేనివారిపాలెం సర్వేనెం. 74/4లో ప్లాట్‌నెం. 9లో 119 గజాల స్థలం అమ్మకమునకు కలదు. ✆ 76758 74661.

గన్నవరం మండలం సూరంపల్లిలో నూజివీడు హైవేకి అతి సమీపమున 85 సెంట్ల భూమి అమ్మకమునకు కలదు. సంప్ర : 86969 62434.

తాడిగడప గణేష్ దేవాలయమునకు 2 ఫర్లాంగుల దూరంలో 195 చ.గ. పెనమలూరు to వణుకూరు వెళ్ళు తారురోడ్డుకు 1 ఫర్లాంగు దూరంలో 167 చ.గ. అమ్మబడును. ✆ 82472 18650.

VJA రామవరప్పాడు LP No: 62/2024, గేటెడ్ కమ్యూనిటీ ప్లాట్లు, హౌసెస్, విల్లాలు ★ బ్యాంక్‌లోన్ ★ స్పాట్ రిజి. ✆ 95531 29369, 97054 33765

VJA, పెనమలూరు CRDA LP No: 104/ 25, ప్లాట్లు, హౌసెస్, విల్లాలు ★ బ్యాంక్ లోన్ ★ స్పాట్ రిజి. ✆ 95531 29369, 97054 33765

కామినేని హాస్పిటల్ 100 అ. రోడ్డు పోరంకి, కానూరు, జనచైతన్య, రామవ ఎస్టేట్స్, ఈడుపుగల్లు, కంకిపాడు చుట్టుప్రక్కల ప్లాట్లు అ/కొ. ✆ 96665 21898

KANURU

కానూరు మురళీనగర్‌లో తూర్పుఫేస్ 174చ||గ||లు సెంటు 1350000/-లకే మరియు పటమటలో 98చ||గ||ల్లో 40వేలు అద్దెవచ్చు బిల్డింగ్ అమ్మకం. ✆85238 99999

PENAMALURU

200 అ|| బందరురోడ్డుకి దగ్గరగా ఈడుపుగల్లు శ్రీ భ్రమరా వారి ప్యారడైజ్ ఫేజ్-1 వెంచర్‌లో 200చ||గ||లు లేఅవుట్ ప్లాట్లు-2 అమ్మకం ✆ 86881 88809.

RAMAVARAPPADU

666 చ||గ|| కాంపౌండ్ వాల్ కట్టిన W/F స్థలము అమ్మకము. 100 మీ|| దూరంలో NH 65, రామవరప్పాడు ✆ 94404 93448, 94916 00690.

విజయవాడ సిటీ రామవరప్పాడులో 350ఎ|| మెగా గేటెడ్ కమ్యూనిటీలో 1st ఫేజ్‌నందు 258చ||గ|| నుండి CRDA లేఅవుట్ ప్లాట్లు అమ్మకం. ✆ 80966 13134

GANNAVARAM

గన్నవరం అవుటర్ రింగ్‌రోడ్ దగ్గరలో బెస్ట్‌ఇన్వెస్ట్‌మెంట్ 130 గ॥ నుండి 200 గ॥లు వరకు అమ్మబడును. రేటు: 7000/- ✆ 79817 54685.

NUNNA ROAD

నున్న ఇళ్ళ మధ్యలో నూతన వెంచర్‌నందు 30 అడుగుల రోడ్లతో తూర్పు, పడమర ఫేసింగ్‌తో ప్లాట్స్ కలవు. కొండేటి రాంబాబు, ✆ 98496 08527.

COMMERCIAL SPACE FOR SALE

365 S.Ft. Commercial proprity (with car parking) For sale @ FF6B Mahalakshmi Towers. Near Buckinghampet Post office. VJA. ✆ 98481 47063.

35 లక్షలకే విజయవాడ, గొల్లపూడి MG కాంప్లెక్స్ దగ్గర కమర్షియల్ షాప్స్ అమ్మకమునకు కలవు. Ready to occupy. సంప్ర ✆ 99851 51976.

పడమట NTR సర్కిల్ రవి స్వీట్స్ ప్రక్కన 233చ||గ|| ఖాళీ స్థలం, MedPlus నుండి 5వఇల్లు 228చ||గ||, 300చ||గ||లు, పంట కాలువ రోడ్డు 1st క్రాస్ కార్నర్ బిల్డింగ్ 290చ||గ||లు అమ్మకం. 63000 65270.

విజయవాడ ఆటోనగర్ 100అ|| రోడ్డులో 440చ||గ||ల్లో కమర్షియల్ బిల్డింగ్ 60,000 అద్దెలతో అమ్మకమునకు కలవు. ✆ 70750 66789.

SHOP FOR SALE

విజయవాడ గాంధీనగర్ శైలజ థియేటర్ రోడ్డులో, రవి పునుగులు ఎదురుగా 10X20 కొ.గల షాపులు-2 అమ్మకమునకు కలవు. ✆ 86606 77987.

LEASE/ RENT

G+4 Floors New Building
3000 S.Ft. Each Floor
East and West Roads
As Per Vaastu
Available for Lease to Offices etc.
in Currency Nagar
Behind Aayush Hospital.
✆ **83097 56283**

PROPERTY FOR SALE

సత్తెనపల్లి మెయిన్‌రోడ్డు బస్‌స్టాండ్ దగ్గరలో 291 చ||గ||లు (60'X44') 2640 చ||అ||లు S/E Face RCC బిల్డింగ్ అమ్మకానికి కలదు. బోర్ సౌకర్యము. No Brokers. ✆ 9603202764, 9948297379.

TO LET

Commercial (Go down) - GF & Residential (2BHK) - FF Satyanarayana puram, Vijayawada. ✆ 85005 44977

కస్తూరిబాయిపేట నవోదయ స్కూలు రోడ్డులో ఆఫీస్, హాస్టల్‌కు అనువుగా 4000 S.Ft మొత్తంగా లేక విడిగా అద్దెకు కలదు. సంప్ర. ✆ 98664 72288.

VJA - బందరురోడ్‌కు అతి సమీపంలో, E/F, 3BHK, 3 బాత్స్, 3rd ఫ్లోర్, కార్ పార్కింగ్‌తో అద్దెకు, సాయి కృష్ణ రెసిడెన్సీ, బృందావన కాలనీ ✆ 98494 54534

VJA, గొల్లపూడి D-మార్ట్ ఎదురు హైస్కూల్ వెనుక 2nd ఫ్లోర్ (201) D-బ్లాక్‌లో 3 BHK ఫ్లాట్ 2150 Sft. కారుపార్కింగ్‌తో అద్దెకుకలదు. ✆9246414272

3bhk flat with car parking at Maruthinagar. Employees with small families preferred. ✆ 99487 89554

2BHK Independent House 2nd floor for rent. Near Nalanda School, Beside Trendset Mall, Benzcircle, VJA. ✆ 99497 76210.

TRIPLEX VILLA
Luxury A Type 4 BHK Villa for Rent and available in Premium Gated Community Raintree Park. Opp Nagarjuna University.
9848112678

3BHK Flat 2nd Floor HR Plaza, Nara Chandrababu Naidu Colony, Benz Circle with full cubboards and car parking for rent. ✆ 98490 84055.

విజయవాడ గవర్నర్‌పేట జైహింద్ టాకీస్ దగ్గర 2300 sft కమర్షియల్ స్పేస్ బాడుగకు ఇవ్వబడును. సంప్ర. 94408 56182, 93631 19793.

రెసిడెన్షియల్ / కార్పొరేట్ ఆఫీస్‌కు అద్దెకు
3 BHK POSH FLAT
ఇండిపెండెంట్ విశాలమైన 3,500 S.Ft. 3rd ఫ్లోర్, లిఫ్ట్, Full సెక్యూరిటీతో టెలికామ్ కాలనీ, గొల్లపూడి.
✆ **94400 28770**

మొగల్‌రాజపురం, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ వెనుక, రామప్రియ అపార్ట్‌మెంట్, 2nd ఫ్లోర్, E/F, 3B/R ఫ్లాట్, లిఫ్ట్, కార్ పార్కింగ్ సౌకర్యంతో అద్దెకు. ✆78933 10948

3BHK 1800Sft ఫస్ట్‌ఫ్లోరు సాయినివాస్ నలందస్కూలు గేటుఎదురు ఆచార్య రంగానగర్‌లో VJA లిఫ్ట్, కార్ పార్కింగ్‌తో అద్దెకు. ✆ 94917 30619.

COMMERCIAL

Patamata: Commercial Office Space, Ground 600Sqft & 1200Sft in 2nd Floor. Furnished. Beside Nirmala Convent ✆ 70368 82222

కొండపల్లి IDAలో 20,000Sft గల షెడ్డు, బిల్డింగ్ మొత్తముగా లేదా విడివిడిగా అద్దెకు ఇవ్వబడును ✆ 98498 74444, 85238 99999.

2,600 S.Ft. Ground and 1st Floor Hospital/ Office Space for Rent. Near Suryaraopet, Vijayawada ✆ 91606 83161, 63052 76554.

GF consisting of 1800 sq.feet at Ratnamba street, Mogalraja puram. Ideally suitable to banks, clinics, offices. Available from 15th March-2026. Contact: 9703252203

కమర్షియల్ స్థలములు అద్దెకు
1) గుంటూరు ఇన్నర్ రింగు రోడ్డు ఫేసింగ్, డెకత్లాన్‌కి దగ్గర సువర్ణ కళ్యాణ మండపమునకు ఎదురుగా (గోరంట్ల వద్ద) కరెంటు, నీటి సౌకర్యముతో **5000** చ॥గ॥లు
మరియు
2) గుంటూరు శిల్పారామం దగ్గరలో నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళు మార్గములో కరెంటు సౌకర్యంతో **8300** చ॥గ॥లు అద్దెకు/ లీజుకు కలవు.
✆ **92999 91066**
91009 90648


Commercial Space available for rent 1600 S.Ft. Gunadala, VJA. Suitable for Banks and Offices. ✆ 94946 50162, 80087 17127.

2500 SF.t గ్రౌండ్ & 2500 Ist ఫ్లోర్ గోడౌన్‌లకు బ్యాంక్, ఆఫీస్, కాలేజీలకు అనుకూలం RTC వర్క్‌షాప్ రోడ్డు విద్యాధరపురం విజయవాడ - 12. ✆ 98491 48241.

500చ||గ||ల ఖాళీస్థలం-షెడ్ వాటర్ & పవర్‌తో అద్దెకు కలదు. RTC వర్క్‌షాప్ రోడ్డు, విద్యాధరపురం, విజయవాడ-12. ✆ 98491 48241.

MORE CLASSIFIEDS ON PAGES 9

ఈనాం భూముల సమస్య పరిష్కరించాలి



మంత్రి రామనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

నందిగామ (గ్రామీణ), జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈనాం భూముల సమస్యను పరిష్కరించాలని బాధితుల సంఘ నాయకులు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ ఆధ్వర్యంలో వారంతా శనివారం మంగళగిరి తెదేపా కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. 2016లోనే రాష్ట్రంలో 25 వేల ఎకరాల ఈనాం భూములున్నాయని 22ఎ(1సి)లో చేర్చారని, దీంతో 5 లక్షల మంది బాధితులయ్యారని తెలిపారు. ఈనాం భూముల బాధితుల సంఘ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఆర్.రామకోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ప్రసాద్, అమృతరామయ్య, సుధీర్, నరసింహారావు, రాంబాబు, చంద్రశేఖర్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరు మోము మురిసే.. చిరునవ్వు విరిసే!

- డా.పిన్నమనేనిలో 1800 గ్రహణం మొర్రి చికిత్సలు
- ఆపరేషన్ స్మైల్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహణ

న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

గ్రహణం మొర్రి చిన్నారుల పాలిట శాపంగా మారుతోంది. చిన్నారుల మోముపై చిరునవ్వులు మాయమవ్వడంతో పాటు కొందరు హేళనకు గురవుతున్నారు. దీంతో విద్యార్థులు ఒకింత చదువుకు దూరమవుతున్నారు. ఇలాంటి చిన్నారులకు చేయూతగా మేమున్నామంటూ 'ఆపరేషన్ స్మైల్' అనే సంస్థ ముందుకొచ్చింది. గన్నవరం మండలం చిన్నఅవుటపల్లిలోని డా.పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలతో ఒప్పందం కుదుర్చుకొని 18 సార్లు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి 1800 మందికి ఉచితంగా శస్త్రచికిత్స చేసింది. ఫలితంగా వారి భవిష్యత్తుకు నూతన బాటలు వేసింది. బాధిత చిన్నారుల ముఖాలపై చిరునవ్వులు తీసుకొచ్చింది.



చికిత్స అనంతరం చిన్నారితో డా.పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల డీజీ డా.చదలవాడ నాగేశ్వరరావు

బాధిత కుటుంబాలకు అండగా..

అమెరికాకు చెందిన బిల్ మాగీ, క్యాథీ మాగీ దంపతులు వైద్యరంగంలో సేవలందించేవారు. గ్రహణం మొర్రి బాధితుల కష్టాలు చూసి వారిని ఆదుకునేందుకు 'ఆపరేషన్ స్మైల్' పేరుతో సంస్థ ఏర్పాటు చేశారు. 2005లో పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. నాటి నుంచి నేటి వరకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి వందల మంది బాధితులకు శస్త్రచికిత్స చేసి నూతన జీవితాన్ని ఇచ్చినట్లు ఆపరేషన్ స్మైల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అభిషేక్‌సేన్ గుప్తా వెల్లడించారు. తాజాగా నవంబరు 23 నుంచి 30వ తేదీ వరకు మరో వంద మందికి ఆయా చికిత్సలు చేసినట్లు పేర్కొన్నారు.

సరైన సమయంలో చికిత్స అవసరం..

ప్రస్తుతం అధికారిక లెక్కల ప్రకారం దేశంలోని ప్రతి 500 మంది పిల్లల్లో ఓ చిన్నారి గ్రహణం మొర్రి సమస్యలు ఎదుర్కొంటున్నారని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్య ఉండటం గతంలో శాపంగా భావించేవారు. ఇటీవల అందుబాటులోకి వచ్చిన ఆధునిక చికిత్స పద్ధతులతో బాధితులంతా ముందుకొచ్చి సరైన సమయంలో శస్త్రచికిత్స చేయించుకుంటే పూర్తిగా తగ్గుతుందని వారు హామీ ఇస్తున్నారు. గ్రహణం మొర్రి ఉన్న వారికి చెవిలో తరచూ ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంటుంది. ఫలితంగా ద్రవ పదార్థాలు తీసుకునేటప్పుడు తీవ్ర ఇబ్బందులకు గురవ్వడంతో పాటు స్పష్టంగా మాట్లాడలేరని వైద్యులు చెబుతున్నారు. పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో తొలుత బాధితులకు ఉన్న సమస్యను స్క్రీనింగ్ చేసిన తర్వాత శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇదో బృహత్తర కార్యక్రమం

గ్రహణం మొర్రి శస్త్రచికిత్సలను ఆపరేషన్ స్మైల్‌తో కలిసి చేయడం ఓ బృహత్తర కార్యక్రమం. తాజాగా 270 మందికి స్క్రీనింగ్ చేయగా 85 మందికి శస్త్రచికిత్స చేసేందుకు నిర్ణయించాం. ఆపరేషన్ చేసేందుకు అమెరికా నుంచి ప్రత్యేక వైద్య బృందం వచ్చింది. వైద్యనిపుణులు, నర్సులు, నాన్ టెక్నికల్ సిబ్బంది కలిపి మొత్తం 50 మంది ఉంటారు. ఇందులో డా.పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందంగా ఉంది.

– డా.సీహెచ్ నాగేశ్వరరావు, కళాశాల డైరెక్టర్ జనరల్

పరీక్షా పే చర్చకు జనవరి 11 వరకు రిజిస్ట్రేషన్లు



అంగలూరు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినుల పేర్లను రిజిస్ట్రేషన్ చేస్తున్న లక్ష్మీనారాయణ, అధ్యాపకులు

అంగలూరు (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: ప్రధానమంత్రి నరేంద్రమోదీతో నేరుగా జరిగే ప్రత్యేక కార్యక్రమం పరీక్షా పే చర్చ-2026 తొమ్మిదో ఎడిషన్‌కు సంబంధించి ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో వచ్చే ఏడాది జనవరి 11 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించాలని డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం మండలంలోని అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినుల పేర్లను అధ్యాపక బృందంతో కలిసి ఆయన రిజిస్ట్రేషన్ చేయించారు. పీపీసీ-2026 పోర్టల్ ద్వారా అన్ని మండలాల పరిధిలోని పాఠశాలల్లో ఎంఈవోలు, ఉపాధ్యాయులు రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. 6-12 తరగతుల విద్యార్థులు అర్హులన్నారు. డీఈవో నోడల్ అధికారి కాగా, ప్రతి మండలానికి డైట్ అధ్యాపకులను నియమించడం జరిగిందన్నారు. కృష్ణా జిల్లాకు కోఆర్డినేటర్లుగా అధ్యాపకులు శివపార్వతి, ఎన్.జోజిబాబు, ఎన్టీఆర్ జిల్లాకు టి.రాజ్యలక్ష్మి, ఎన్.లక్ష్మీనాంచారమ్మను నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు వినయ్‌కుమార్, మోహినీకుమారి తదితరులు పాల్గొన్నారు.

పీజీ మెడికల్ ఇన్ సర్వీస్‌లో 167 సీట్ల భర్తీ

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-25 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని పలు వైద్య కళాశాలల్లో పీజీ మెడికల్ ఇన్ సర్వీస్ కన్వీనర్ కోటా సీట్ల ప్రవేశానికి నిర్వహించిన మొదటి విడత కౌన్సెలింగ్‌లో మొత్తం 167 సీట్లు భర్తీ అయినట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది. సీట్లు కేటాయింపు ఉత్తర్వులు వచ్చిన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3గంటల్లోగా ఆయా వైద్య కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. తరగతులు డిసెంబరు 22 వతేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.

ఉప్పొంగిన... యువోత్సాహం



కొనకళ్ల నారాయణరావును సత్కరిస్తున్న ఉపకులపతి రాంజీ తదితరులు



సిద్ధార్థ కళాశాల విద్యార్థుల మైమ్ ప్రదర్శన

కృష్ణా విశ్వవిద్యాలయం(మచిలీపట్నం), న్యూస్‌టుడే : యువత చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న కృష్ణాతరంగ్ కార్యక్రమ ముగింపు సభను శనివారం సాయంత్రం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కళలు, సాంస్కృతిక రంగాల్లో పట్టు సాధించడం ద్వారా చదువులో ఉత్తమ ఫలితాలు సాధించడానికి దోహదపడతాయన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భాజపా అధికార ప్రతినిధి, సామాజికవేత్త సాధినేని యామినీశర్మ, ఉపకులపతి కె.రాంజీ, వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి సీహెచ్.అప్పారావు, పుదుచ్చేరి విశ్వవిద్యాలయ ఆచార్యులు ఆర్.విశ్వనాథన్, రెక్టార్ ఎంవీ.బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఎన్.ఉష తదితరులు ప్రసంగించారు. కృష్ణాతరంగ్ కన్వీనర్ దిలీప్, సభ్యులు, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

☛మూడ్రోజుల పాటు నిర్వహించిన సాంస్కృతిక అంశాల ప్రదర్శనలో విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. నలంద కళాశాల రన్నరప్‌గా నిలిచింది. విజేతలతో పాటు వివిధ విభాగాల వారీగా నిర్వహించిన ప్రదర్శనల్లో ప్రతిభ చాటుకున్న వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఆయా కళాశాల విద్యార్థులు వారు దక్కించుకున్న బహుమతులతో పెద్దఎత్తున నినాదాలు చేస్తూ సందడి చేశారు.



ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌తో విజేతగా నిలిచిన పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు



వేదిక ముందు విద్యార్థుల సందడి

భవానీదీక్షల విరమణ ఏర్పాట్లలో అలసత్వం వద్దు

ఈనాడు, అమరావతి – ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లలో అలసత్వం వద్దని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ అధికారులకు సూచించారు. వేడుకల్లో భక్తుల సంతృప్తి స్థాయి పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఈనెల 11 నుంచి 15 వరకు శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో భవానీ మండల దీక్ష విరమణ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది భవానీ మాలధారులు తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లను పక్కాగా చేయాలన్నారు. ఆయన శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కనకదుర్గానగర్‌లోని ప్రసాదాల కౌంటర్లు, అన్నప్రసాద భవనం, కేశఖండనశాల, ఘాట్లలో పర్యటించారు. కనీసం 48 గంటల ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రామచంద్రమోహన్ మాట్లాడుతూ.. దసరా మాదిరిగానే భవానీ మాల విరమణ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పోలీసు, నగరపాలక సంస్థ సహా అన్ని ప్రభుత్వ విభాగాల సమన్వయంతో వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు కోరినంత లడ్డూ ప్రసాదం అందించేందుకు ముందుగానే మూడు వేదికల్లో సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. పెద్ద సంఖ్యలో తాత్కాలిక మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఘాట్లలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్, పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ రామచంద్రమోహన్, చిత్రంలో ఈవో శీనానాయక్, ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ

విస్తృతంగా వాలంటీర్ల సేవల వినియోగం..

భవానీమాల విరమణ దీక్షల్లో పెద్ద సంఖ్యలో వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని కమిషనర్ రామచంద్రమోహన్ సూచించారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే వాలంటీర్ల ఫోన్లకు సేవా కేటాయింపు సందేశాలను వెంటనే పంపించాలని ఆదేశించారు. ఇంద్రకీలాద్రిపై అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్నప్రసాద వితరణ, మంచి నీటి సరఫరా, వృద్ధులు, వికలాంగుల సేవకు వాలంటీర్లను పెద్దసంఖ్యలో నియమించాలని సూచించారు. గత భవానీదీక్షల్లో అందుబాటులో ఉంచిన లడ్డూ ప్రసాదం కంటే రెండింతలు సిద్ధం చేయాలని ఆదేశించారు. భక్తులు వేచి ఉండేందుకు కీలకమైన ప్రదేశాల్లో షామియానాలు, రైల్వే స్టేషన్, బస్టేషన్లలో సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

అగ్ని కీలలు.. క్షణాల్లో కారు దగ్ధం

తప్పిన పెను ప్రమాదం

సురక్షితంగా బయటపడిన తొమ్మిది మంది

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: 16వ జాతీయ రహదారిపై బాపులపాడు మండలం వీరవల్లి వద్ద కారు అగ్నికి ఆహుతైన ఘటన శనివారం స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడ వెళ్తున్న ఈ కారు హఠాత్తుగా పొగలు వచ్చి ఆగిపోవడం.. యజమాని కిందకు దిగిన వెంటనే అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమై అందరూ వాహనం నుంచి దిగిపోవడంతో తొమ్మిది మంది సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. సాంకేతిక కారణాలతో ముందుగా కారు ఆగిపోవడం వల్లే తొమ్మిది మంది ప్రాణాలతో బయటపడ్డారన్న వాదన వినిపిస్తుంది. కారు వేగంగా ప్రయాణిస్తున్న సమయంలో మంటలు చెలరేగి ఉంటే పరిస్థితి విషాదంగా మారేదంటున్నారు.



కారులో ప్రయాణించింది వీరే..

వివరాల్లోకి వెళితే.. జంగారెడ్డిగూడెంకు చెందిన పాలూరి గంగరాజు.. తన మారుతి ఎర్టిగా కారులో కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి బయలుదేరారు. ఉదయం 9 గంటల సమయంలో వీరి కారు వీరవల్లి ఫ్లైఓవర్‌పై ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా ఆగిపోయింది. ఇంజిన్ నుంచి పొగ వస్తుండడంతో కిందకు దిగిన గంగరాజు.. ఏమైందో గమనించే లోపుగానే మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన గంగరాజు కారులో ఉన్న తన బావమరిది తూటికుంట మంగరాజుతో పాటు, ఓ బాలుడు, ఆరుగురు మహిళల్ని కిందకు దింపేశారు. స్వల్ప వ్యవధిలోనే మంటలు వ్యాపించి కారు దగ్ధమైపోయింది. సమాచారం తెలుసుకున్న వీరవల్లి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంతో హనుమాన్‌జంక్షన్ నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే కారులో మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఆహారం ఆరోగ్యం



స్వాములకు సాత్వికాహారం



శబరిమల అయ్యప్ప దీక్ష తీసుకున్న భక్తులు 40 రోజులు నియమనిష్ఠలు పాటించడం తెలిసిందే. దీక్షా కాలంలో సాత్వికాహారమే తీసుకోవాలి. మాంసాహారం, ఉల్లి, వెల్లుల్లి, లవంగాలు, దాల్చినచెక్క మొదలైనవి నిషిద్ధం. స్వాముల కోసం సులభంగా చేసుకోగల, శరీరానికి శక్తి చేకూర్చే కొన్ని వంటలు...

మజ్జిగ పులుసు



కావలసినవి: సొరకాయ, బూడిదగుమ్మడి, క్యారెట్, టొమాటో ముక్కలు - 2 కప్పులు, పెరుగు - కప్పున్నర, ఉప్పు - రుచికి తగినంత, కొబ్బరి తురుము - 2 టేబుల్ స్పూన్లు, శనగపిండి - 3 స్పూన్లు, పచ్చిమిర్చి - 3, అల్లం ముద్ద - స్పూన్, కారం, పసుపు, ఆవాలు, జీలకర్ర - అర స్పూన్ చొప్పున, ఎండుమిర్చి - 2, కరివేపాకు - 3 రెబ్బలు, ఇంగువ - పావు స్పూన్, నూనె - 2 స్పూన్లు

తయారీ: కూరగాయ ముక్కలను ఉడికించి పక్కనుంచాలి. పెరుగును గిలకొట్టి.. కొబ్బరి తురుము, శనగపిండి, ఉప్పు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముద్ద, కారం, పసుపు వేసి.. ఉండలు కట్టకుండా బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కూరగాయ ముక్కల్లో చేర్చి.. కలియతిప్పుతూ ఉడికించాలి. కొంచెం చిక్కగా అయ్యాక సెగ తగ్గించాలి. ఐదారు నిమిషాల తర్వాత దించేయాలి. కడాయిలో నూనె వేడిచేసి.. ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, ఎండుమిర్చి, ఇంగువలతో తాలింపు వేసి మజ్జిగ పులుసులో కలిపితే.. ఘుమఘుమలాడిపోతుంది.


అరటికాయ మెంతికూర



కావలసినవి: పచ్చి అరటికాయలు - రెండు, మెంతికూర - 2 కప్పులు, ఉప్పు - రుచికి తగినంత, నూనె - 3 టేబుల్ స్పూన్లు, నెయ్యి - స్పూన్, కారం - ఒకటిన్నర స్పూన్లు, పసుపు - ముప్పావు స్పూన్, అల్లం మిర్చి పేస్టు - రెండున్నర స్పూన్లు, ధనియాలు, జీలకర్ర పొడులు - స్పూన్ చొప్పున, వేయించిన నువ్వుల పొడి - చారెడు

తయారీ: అరటికాయలను ఉడికించి, తొక్క తీసి ముక్కలు కోసి పక్కనుంచాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక.. ఆవాలు వేయాలి. అవి చిటపటలాడుతుండగా.. పసుపు, సన్నగా తరిగిన మెంతికూర చేర్చి తక్కువ సెగ మీద వేయించాలి. ఆకు మెత్తబడిన తర్వాత.. కారం, ఉప్పు, పసుపు, అల్లం మిర్చి పేస్టు, నువ్వులు, ధనియాలు, జీలకర్ర పొడులు జతచేసి కలియతిప్పాలి. అందులో అరటికాయ ముక్కలు, నెయ్యి జోడించి.. మధ్యమధ్యలో కలుపుతూ నాలుగు నిమిషాలుంచి దించేయాలి.

పొట్లకాయ పెసరపప్పు



కావలసినవి: లేత పొట్లకాయ ముక్కలు - 2 కప్పులు, పెసరపప్పు - 100 గ్రాములు, ఉప్పు - రుచికి తగినంత, కొబ్బరి తురుము - 4 టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి, ఎండుమిర్చి - 2 చొప్పున, కారం, ఆవాలు, శనగపప్పు, మినపప్పు, జీలకర్ర - స్పూన్ చొప్పున, పసుపు - అర స్పూన్, నూనె - 3 టేబుల్ స్పూన్లు, కరివేపాకు - 2 రెబ్బలు

తయారీ: పచ్చిమిర్చిలను కచ్చాపచ్చాగా నూరాలి. పెసరపప్పును వేయించి, ఎక్కువ మెత్తబడకుండా కాస్త ఉడికించి పక్కనుంచాలి. పొట్లకాయను పైపైన పీల్‌చేసి అంగుళమంత ముక్కలు కోసి.. కాస్త ఉప్పు వేసి ఉంచాలి. ఆ ముక్కలను ఐదు నిమిషాల తర్వాత వస్త్రంలో వేసి పిండి.. ఊరిన నీటిని తీసేయాలి. ప్యాన్‌లో నూనె వేడిచేసి.. ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు వేయాలి. అవి వేగాక.. పొట్లకాయ ముక్కలు, పసుపు జతచేయాలి. మూతపెట్టి మధ్యమధ్యలో కలియతిప్పుతుండాలి. ముక్కలు ఉడికాయనుకున్నాక.. పెసరపప్పు, నూరిన పచ్చిమిర్చి జోడించాలి. చివర్లో కారం, కొబ్బరి తురుము, ఉప్పు జతచేసి.. ఓ నిమిషం ఉంచి దించేస్తే సరిపోతుంది.

గోరుచిక్కుడు కొబ్బరి



కావలసినవి: కొబ్బరికాయ - ఒకటి, గోరుచిక్కుడు కాయలు - 300 గ్రాములు, ఉప్పు - రుచికి తగినంత, పల్లీలు - పావు కప్పు, నూనె - 2 టేబుల్ స్పూన్లు, ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, కారం - స్పూన్ చొప్పున, పసుపు - అర స్పూన్, కరివేపాకు - 2 రెబ్బలు, ఇంగువ - పావు స్పూన్, కొత్తిమీర తరుగు - గుప్పెడు

తయారీ: కొబ్బరి తురిమి సిద్ధంగా ఉంచుకోవాలి. గోరుచిక్కుడు కాయలను కాస్త పెద్ద ముక్కలుగా కోసి.. ఉడికించి పక్కనుంచాలి. పల్లీలను వేయించి చల్లారాక గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో నూనె వేడిచేసి.. ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, ఇంగువ ఒక్కొక్కటిగా వేయాలి. అవి వేగాక.. గోరుచిక్కుడు ముక్కలు, ఉప్పు, పసుపు చేర్చి.. సన్నసెగ మీదుంచాలి. మధ్యమధ్యలో కలియతిప్పుతూ నాలుగైదు నిమిషాల తర్వాత.. కొబ్బరి తురుము, కారం, పల్లీల పొడి జోడించాలి. చివర్లో కొత్తిమీర జతచేసి దించేయాలి.

ఉసిరి పులిహోర



కావలసినవి: బియ్యం - 2 కప్పులు, ఉసిరికాయలు - 200 గ్రాములు, ఉప్పు - రుచికి తగినంత, పచ్చిమిర్చి - 4, పసుపు - ముప్పావు స్పూన్, పల్లీలు - 2 టేబుల్ స్పూన్లు, ఆవాలు - స్పూన్, శనగపప్పు, మినప్పప్పు - రెండు స్పూన్ల చొప్పున, నూనె - 4 స్పూన్లు, ఎండుమిర్చి - 3, కరివేపాకు - 4 రెబ్బలు, ఇంగువ - పావు స్పూన్

తయారీ: బియ్యంతో అన్నం వండి సిద్ధంగా ఉంచాలి. ఉసిరికాయల్లో గింజలు తీసేసి. పచ్చిమిర్చి, ఉప్పు చేర్చి గ్రైండ్ చేయాలి. కడాయిలో నూనె వేడిచేసి.. ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, పల్లీలు, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ, పసుపు ఒక్కొక్కటిగా వేయాలి. అవి చక్కగా వేగాక.. ఉసిరి-మిర్చి ముద్ద జోడించి.. పచ్చి వాసన పోయే వరకూ వేయించి దించేయాలి. ఈ మిశ్రమాన్ని అన్నంలో కలిపితే ఉసిరి పులిహోర సిద్ధమైపోతుంది.

నోటికి హితవు.. పోషకాలకు నెలవు!

ఇది ఉసిరికాయల సీజన్. వీటితో ఊరగాయ, రోటిపచ్చడి, పప్పు, రసం ఏది చేసినా వారెవా అనిపిస్తుంది. పుల్లపుల్లటి ఆమ్లాతో వంటలు రుచే కాదు ఆరోగ్యం కూడా. ఉసిరిలో ఎన్ని ఔషధ గుణాలున్నాయో చూడండి...

● ఎ, సి, ఇ విటమిన్లు, ఐరన్, క్యాల్షియం, సోడియం, పీచు, ప్రొటీన్లతో ఆమ్లా మంచి పోషకాహారం. ● చుండ్రు, వెంట్రుకలు చిట్లడం, రాలడం, పిన్న వయసులోనే జుట్టు తెల్లబడటం వంటి సమస్యలకు చెక్‌పెట్టినట్లవుతుంది. కుదుళ్లు గట్టిపడి కురులు ఒత్తుగా, నల్లగా ఉంటాయి. ● చర్మం పొడిబారదు, ముడతలు పడదు. ముఖానికి మెరుపు వస్తుంది. వయసు మీదపడినట్లవదు. ● కొలెస్ట్రాల్ స్థాయి, రక్తపోటు అదుపులో ఉంటాయి. గుండెజబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది. ● మధుమేహం నియంత్రణలో ఉంటుంది. ● శరీరంలో చేరిన మలినాలు, వ్యర్థాలు తొలగుతాయి. ● వీటిలోని ఎ-విటమిన్ కంటిచూపును మెరుగుపరుస్తుంది. ● కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది. ● సి-విటమిన్ అధికంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ● జీర్ణ ప్రక్రియ సాఫీగా ఉంటుంది. మలబద్ధకం, కడుపుబ్బరం తగ్గుతాయి. ● ఎముకలు, దంతాలకు పటుత్వం వస్తుంది. ● యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉన్నందున జలుబు, జ్వరం వంటి వైరల్ ఇన్ఫెక్షన్లను, కొన్ని రకాల క్యాన్సర్లను నిరోధించినట్లవుతుంది. ● హాయిగా నిద్ర పడుతుంది. ● ఆమ్లాతో ముఖ్వాస్, మురబ్బా, జామ్, జ్యూస్, మిఠాయి, సబ్జీ, రైతా, కఢీ, క్యాండీ, ఫ్రైస్, ఖట్టా మీఠా, పులిహోర, చాక్లెట్లు, చాయ్.. ఇలా ఎన్నెన్నో వెరైటీలు చేయొచ్చు. ఒంట్లో నలతగా ఉన్నప్పుడు ఏవీ రుచించవు. అలాంటప్పుడు వేడి అన్నంలో కాస్తంత ఉసిరి కారం, నెయ్యి కలిపి తింటే నోటికి హితవుగానూ ఉంటుంది, అనారోగ్య లక్షణాలు మటుమాయమవుతాయి.

బండి మీద పీచుమిఠాయి అంటూ అరుపు వినిపించిందంటే.. అది కావాలంటూ మారాం చేయని పిల్లలుండరు. కానీ శుభ్రత ఉండదని... అది కొనివ్వడం మనకు నచ్చదు. చిన్నారుల కోసం కాటన్ క్యాండీ మనమే చేద్దామా...

క్షణాల్లో పీచుమిఠాయి



పీచుమిఠాయి చేయడానికి రెండు విధానాలున్నాయి... కప్పు పంచదార, చిటికెడు ఫుడ్ కలర్ తీసుకోవాలి. రెండూ కలిపి మెత్తగా గ్రైండ్ చేయండి. ఆ పొడిని తడి లేని పాలిథిన్ కవర్లో వేసి.. రబ్బర్ బ్యాండ్‌తో అంచులు బిగించండి. కొంత సేపటికి అది పీచుమిఠాయి అయిపోతుంది. ఇదొక పద్ధతి.

మరో పద్ధతి: పంచదారలో ఫుడ్‌కలర్ కలపండి. దీన్ని మైక్రోవేవ్ సేఫ్ బౌల్లో వేసి అవెన్‌లో అర నిమిషం వేడిచేయండి. కరిగిన పంచదారను బయటకు తీయండి. అందులో శుభ్రమైన మెటల్ స్ట్రా ఉంచి.. పంచదార ద్రవం సిలికాన్ మ్యాట్ మీద పడేలా ఊదండి. అంతే.. కాటన్ క్యాండీ తయారైపోతుంది. వెంటనే పాలిథిన్ కవర్లో వేయండి. కొంత ఊదాక పంచదార గట్టిపడితే.. మళ్లీ కొన్ని క్షణాలు అవెన్‌లో వేడిచేస్తే సరిపోతుంది. ఇంత సులువా అని ఆశ్చర్యపోతున్నారు కదూ. ఒకసారి చేసి చూడండి మరి.

బ్యాచిలర్స్ కిచెన్

కూరకు స్వస్తి!



నేను ఇంటర్ చదివే రోజుల్లో గుంటూరు కొరిటెపాడులో ఉండేవాణ్ని. గదిలో నాతో పాటు ఇంకో నలుగురు చేరారు. అన్నం వండటం తేలికే గానీ కూర చేయడం మాత్రం కష్టమనిపించేది. కుక్కర్ యాడ్‌లో చూపినట్లు తరిగిన కూరగాయముక్కలు సిద్ధంగా ఉంటే వంట తేలికే! కానీ మార్కెట్లో పుచ్చుల్లేని కూరగాయలు కొనడం, వాటిని కడగటం, ముక్కలు కోయటం, తాలింపులో వేసిన దగ్గర్నుంచీ కూర ఉడికిందా లేదా అని మాటికీ చూడటం.. ఎంత విసుగు! ఒకసారి చెయ్యి తెగుతుంది, ఇంకోసారి కాలిపోతుంది. కారం పేచీ లేదు కానీ ఉప్పు ఎక్కువౌతుందేమోనని ఎప్పుడూ కంగారే. ఇన్ని కష్టాలు పడినంతలో కూర కుదురుతుందన్న గ్యారంటీ లేదు. మాడటం, ఉడకకపోవటం, ఉప్పు ఎక్కువో తక్కువో అవడం.. ఎప్పుడూ ఏదో ఒక తంటా. ఇక ఇష్టం ఎగిరిపోయి కష్టంగా తినేవాళ్లం. అంతటితో అవుతుందా? తిన్న తర్వాత అంట్లు కడగాలి. అదింకా బద్ధకం. రోజుకొకరు పాత్రలు శుభ్రం చేయాలన్నది రూల్. ఎవరికి వాళ్లు- స్పెషల్ క్లాసుందని తప్పించుకునేవారు. నాకు మాత్రం తప్పేది కాదు. వాదులాటలూ, వాగ్వాదాల తలనొప్పి వద్దులెమ్మని కూరలకు స్వస్తిపలికేశా. అన్నం వండుకుని.. మెస్ నుంచి సాంబార్ తెచ్చుకునేవాళ్లం. బ్యాచిలర్ కుర్రాళ్లు.. అన్న సానుభూతితో కాబోలు.. బోల్డంత సాంబార్ ఇచ్చేవాడు. మెస్సాయనా జిందాబాద్!

– పామిశెట్టి కిరణ్ బాబు, పాటిబండ్ల, గుంటూరు

గూగుల్‌లో అత్యధికంగా వెతికిన వంటలివి!



నిన్నమొన్నటి వరకూ కొత్తవంటలు చేయాలంటే ఇంట్లో బామ్మలనే అడిగేవాళ్లం. ఇప్పుడలా కాదు.. ఆవకాయ నుంచి చికెన్ బిర్యానీ వరకూ గూగుల్‌నే అడుగుతున్నాం. ఈ ఏడాది మనదేశంలో గూగుల్‌లో అత్యధికంగా వెతికిన వంటకాల జాబితా వచ్చేసింది. అవేంటో చూసేద్దాం..





ఇడ్లీ: ఆవిరి మీద ఉడికించే ఇడ్లీ మంచిదే అయినా ఇంకొంచెం ఆరోగ్యాన్ని జోడించేందుకు నేటి వనితలు.. రాగి ఇడ్లీ, స్టఫ్ఢ్ ఇడ్లీ, ఇడ్లీ శాండ్‌విచ్ వంటి వంటకాలను ఎలా చేయాలని ఎక్కువగా వెతకడంతో ఇడ్లీ మొదటి స్థానంలో నిలిచింది.

మోదక్: వినాయకుడికి ఎంతో ఇష్టమైన ఈ మోదకాలను మహారాష్ట్రలో ఎక్కువగా చేస్తారు. బియ్యప్పిండిని పై పూతగా ఉపయోగిస్తారు. కొబ్బరి, బెల్లం, యాలకుల మిశ్రమాన్ని లోపల ఫిల్లింగ్‌గా ఉంచి ఆవిరి మీద ఉడికిస్తారు.

టెకువా: ఇది బిస్కెట్లను పోలిన బిహార్ వంటకం. పూజల సందర్భాల్లో ఎక్కువగా చేస్తారు. దీని తయారీలో గోధుమపిండి, బెల్లం, నెయ్యి, యాలకులు, కొబ్బరిపొడిని ఉపయోగించి నచ్చిన ఆకారంలో చేస్తారు. నూనెలో వేయించడాన కరకరలాడతాయి.

ఉగాదిపచ్చడి: తెలుగు రాష్ట్రాల సంవత్సరాది ఉగాదితో మొదలవుతుంది. ఈ పండుగకి కారం(మిరియాలు), ఉప్పు, తీపి(బెల్లం), వగరు(మామిడికాయ), చేదు(వేపపూత), పులుపు(చింతపండు).. ఇలా షడ్రుచుల ఉగాది పచ్చడి చేస్తాం కదా! షడ్రుచుల ఉగాది పచ్చడిలో ఏమేం ఉపయోగిస్తారని గూగుల్‌లో తెగ వెతికేశారు.

బీట్‌రూట్ కాంజీ: తెలుగు రాష్ట్రాల్లో అయితే కాంజీని గంజి అంటారు. ఉత్తర భారతాన బీట్‌రూట్ జ్యూస్, ఆవాలు, ఉప్పు, తీపి, పులుపులను కలిపి పులియబెడతారు. దీన్ని పంజాబ్‌లో ఎక్కువగా తీసుకుంటారు. చలికాలంలో తాగితే రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు దీంట్లో ఉండే ప్రోబయోటిక్స్ గట్‌హెల్త్‌కి చాలా మంచిది.

తిరువథిరై కాలీ: తమిళనాడులో తిరువాదిరై పండుగకు ఈ స్వీట్‌ని చేస్తారు. బియ్యం, పెసరపప్పులను వేయించి బరకగా గ్రైండ్ చేయాలి. బెల్లం లేతపాకం వచ్చాక ఆ రవ్వని జోడించాలి. మధ్యమధ్యలో నెయ్యి వేస్తూ కలపాలి. చివర్లో కొబ్బరిపొడి, వేయించిన జీడిపప్పు, యాలకుల పొడి కలపాలి.

యార్క్‌శాయర్ పుడ్డింగ్: ఇది బ్రిటిష్ వంటకం. గోధుమ పిండిలో గుడ్డు, పాలు, వెన్న వేసి కలుపుతారు. బన్ ఆకారాన్ని పోలి ఉండేలా ఈ పుడ్డింగ్‌ని సిద్ధం చేసి లేత గోధుమ రంగులోకి మారేవరకూ బేక్ చేస్తారు. పైన షుగర్ సిరప్ వేసి సర్వ్ చేస్తారు.

గోండ్ కతీరా: కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుతుంది గోండ్. చెట్టు నుంచి ఉత్పత్తి అయ్యే ఈ నేచురల్ ఎడిబుల్ గమ్‌ను ఆయుర్వేద చికిత్సలో వాడతారు. పంచదార పటికలా ఉండే ఈ గోండ్ కతీరా.. నీళ్లల్లో కలిపితే జిగురులా మారుతుంది. ఇది శరీర ఉష్ణోగ్రతను సక్రమంగా ఉంచుతుంది.

కోఝుకట్టాయి: ఇది చెట్టినాడ్‌లో బాగా ఫేమస్. వినాయక చవితికి ఎక్కువగా చేస్తారు. పైపొరకి బియ్యప్పిండి వాడతారు. కొబ్బరి హల్వాని లేదా కొబ్బరి-మిరియాల పొడిని ఫిల్లింగ్‌గా ఉపయోగించి ఆవిరిపై ఉడికిస్తారు.

ఇవండీ మనవాళ్లు గూగుల్‌లో అత్యధికంగా వెతికిన వంటకాలు. – వినితా హరి

చిత్రంగా..

మది దోచే నూడుల్స్!

ఇడ్లీపిండి సిద్ధంగా లేకపోయినా.. ఎక్కువ సమయం లేకున్నా టక్కున గుర్తొచ్చేది నూడుల్స్. అభిరుచీ ఆసక్తీ ఉండాలే గానీ నూడుల్స్‌లో వేర్వేరు కూరగాయలు చేర్చి ప్రయోగాలు చేయొచ్చు. నూడుల్స్‌తో భిన్నమైన రుచులే కాదు.. విభిన్నమైన ఆకృతులూ కల్పించవచ్చని.. ఇదిగో ఇలా నిరూపించారు. ఈ కళానైపుణ్యాన్ని మెచ్చుకోకుండా ఉండగలమా?!














ఘుమఘుమలాడే ఫిష్ ఫ్రై

షెఫ్ స్పెషల్

చేపలతో కూర, పులుసు సరే.. మసాలా ఫ్రై చేశారంటే మరీ మరీ నచ్చేస్తుంది. దీన్ని హోటల్ స్టయిల్లో ఇంట్లోనే చేయొచ్చు. ఘుమఘుమలాడే ఈ ఫ్రై కరకరలాడుతూ సూపర్ టేస్టీగా ఉంటుంది.

కావలసినవి: ఫిల్లెట్స్ (ముల్లు తీసేసిన చేపలు) - 4, ఉల్లిపాయ - ఒకటి, వెల్లుల్లి - 6 రెబ్బలు, కశ్మీరీ కారం - 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, పసుపు, జీలకర్ర పొడి, గరంమసాలా - స్పూన్ చొప్పున, మిరియాలు, ధనియాల పొడులు - అర స్పూన్ చొప్పున, నూనె - 3 టేబుల్ స్పూన్లు



తయారీ: ఒక పాత్రలో కారం, పసుపు, ఉప్పు, మిరియాలు, జీలకర్ర, ధనియాల పొడులు, గరంమసాలా వేసి బాగా కలపాలి. ఫిల్లెట్స్‌ను టిష్యూతో తుడిచి ఎక్కువ తేమ లేకుండా చేయాలి. చేప ముక్కల మీద సగం మసాలాపొడి చల్లాలి. రెండు నిమిషాల తర్వాత తిరగేసి.. మిగిలిన మసాలా చల్లి పక్కనుంచాలి. ఈలోగా.. ఉల్లిపాయను సన్నగా తరగాలి. వెల్లుల్లిని కచ్చాపచ్చా దంచాలి. ప్యాన్‌లో నూనె వేడిచేసి.. ఉల్లి తరుగు వేయాలి. అది కాస్త వేగాక.. వెల్లుల్లి ముద్ద చేర్చి.. పచ్చి వాసన పోయే వరకూ వేగనివ్వాలి. అందులో ఫిల్లెట్స్ జోడించాలి. ఒకవైపు మూడు నిమిషాలు వేగాక.. తిరగేయాలి. అటు కూడా వేయించి తీసేయాలి. ఇక వేడివేడిగా వడ్డించుకుని ఆస్వాదించండి.

చేదు కాయలతో కమ్మటి కూర

పాఠకవంట



కాకరకాయలతో వేపుడు, పులుసు సాధారణం. నువ్వులపొడితో చేయడం ఒక పద్ధతి. నేను కందిపప్పు జతచేసి.. ఇగురు చేస్తాను. మా వాళ్లకి నచ్చిన ఈ కూరను మీతో పంచుకోవాలనిపించింది..

దీని కోసం.. కాకరకాయ ముక్కలు - కప్పున్నర, కందిపప్పు - ఒక కప్పు, ఉప్పు - రుచికి తగినంత, నూనె - 3 స్పూన్లు, కరివేపాకు - 2 రెబ్బలు, ఎండు మిరపకాయలు - 2, ఇంగువ - చిటికెడు, చింతపండు - నిమ్మకాయంత, బెల్లంపొడి - చారెడు, కారం - ఒకటిన్నర స్పూన్లు, ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర - స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే... కందిపప్పును దోరగా వేయించి పక్కనుంచాలి. చింతపండును కడిగి నానబెట్టాలి. కాకరకాయ ముక్కల్లో కొన్ని నీళ్లు చేర్చి.. పొంగు వచ్చేదాకా ఎక్కువ సెగ మీద ఉడికించాక... సెగ తగ్గించాలి. కొద్దిగా ఉడికిన ముక్కల పైన వేయించిన కందిపప్పు, పసుపు జోడించి మూత పెట్టాలి. పది నిమిషాల తర్వాత ఉప్పు వేసి.. దించేయాలి. ఇప్పుడు కడాయిలో నూనె వేడిచేసి.. ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, ఎండు మిరపకాయలు, కరివేపాకు, ఇంగువ ఒకదాని తర్వాత ఒకటిగా వేయాలి. అవి వేగి మంచి వాసన వస్తుండగా.. చింతపండు గుజ్జు, బెల్లం వేసి కలియతిప్పాలి. నిమిషం తర్వాత.. కూర మిశ్రమాన్ని తాలింపులో వేసి ఇగరనివ్వాలి. అడుగంటకుండా మధ్యమధ్యలో కలుపుతుండాలి. చివర్లో కారం వేసి పొడిపొడి లాడుతున్నప్పుడు దించేయాలి. అంతే.. చేదు అనేది లేకుండా కమ్మటి ఇగురు సిద్ధమైపోతుంది. వేడి అన్నంలో నెయ్యి జోడించి తిన్నారంటే... సూపర్‌గా ఉంటుంది. ఒకసారి ప్రయత్నించి చూడండి!

– వేంకట పద్మజ శనగవరపు, హైదరాబాద్

వసుంధర

vasundhara@eenadu.in



ఒకమ్మాయి... ఫ్యాషన్ షోలో నడుస్తోంది. దాన్ని చూస్తూ వాళ్ల అమ్మానాన్నలు ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ అమ్మాయి పేరు **భవిత మండవ**. మన తెలుగమ్మాయే! అనుకోకుండా మోడలైన ఆమె... ఫ్యాషన్ వాక్‌ని ముందుండి నడిపించింది. ఇంతకీ ఆ ఫ్యాషన్ షో ఏంటో తెలుసా? ప్రముఖ సంస్థ షనెల్‌ది.

తెలుగమ్మాయి... అంతర్జాతీయ మోడల్!



భవిత

అదో సబ్ వే స్టేషన్! జీన్స్, టీ షర్టు ధరించి... తన రైలు కోసం ఎదురు చూస్తోందో అమ్మాయి. తన లోకంలో తను ఉన్న అమ్మాయి దగ్గరికి వచ్చాడు డిజైనర్ మాథ్యూ! 'మీరు చాలా అందంగా ఉన్నారు. మా ఫ్యాషన్‌లో మోడల్‌గా చేస్తారా' అని అడిగాడు. వింటోంటే... ఏదో సినిమా కథలా లేదూ? కానీ భవిత విషయంలో ఇది నిజమైంది. కెమెరా, లైట్, లగ్జరీ బ్రాండ్‌ల పరిచయం లేని సాధారణ అమ్మాయి భవిత. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లింది. అలాంటమ్మాయి జీవితం ఆ డిజైనర్ మాటతో ఒక్కసారిగా మారిపోయింది. ఉరుకుల పరుగుల జీవితం కాస్తా... ప్రముఖ, అంతర్జాతీయ రన్‌వేల్లో నడిచే స్థాయికి చేరింది.

భవితది హైదరాబాద్. జేఎన్‌టీయూ- హైదరాబాద్ నుంచి ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్స్ పూర్తిచేసింది. ఇంటరాక్టివ్ డిజైన్ అండ్ మీడియాలో మాస్టర్స్ కోసం అమెరికా వెళ్లింది. 2024లో ఫ్రెంచ్- బెల్జియన్ డిజైనర్ మాథ్యూ బ్లేజీ మోడలింగ్ అవకాశమిచ్చాక సరేనని ప్రయత్నించింది. కట్ చేస్తే రెండు వారాల్లోనే ఇటాలియన్ లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ 'బటేగా వనీటా' స్ప్రింగ్/ సమ్మర్-2025 ఫ్యాషన్ షోలో మోడల్‌గా మెరిసింది. తొలి షోలోనే మంచి పేరు తెచ్చుకుంది. అలాగని చదువునేం నిర్లక్ష్యం చేయలేదు. ఓవైపు చదువు, క్యాంపస్ ఉద్యోగం చేస్తూనే మోడలింగ్‌నీ కొనసాగించింది. న్యూయార్క్, పారిస్, మిలాన్, లండన్ ఫ్యాషన్ వీక్‌ల్లో డియోర్ వంటి ప్రముఖ సంస్థలకు పనిచేసింది.

ఇప్పుడెందుకు వైరలైంది?

తాజాగా న్యూయార్క్‌లో ఫ్రెంచ్ లగ్జరీ ఫ్యాషన్ సంస్థ 'షనెల్'... మేటియే డార్ 2026 పేరుతో ఫ్యాషన్ షో నిర్వహించింది. ఏ ఫ్యాషన్ షో అయినా ఓపెనింగ్ వాక్ కీలకం. ఇది కొనుగోలుదారులు, మీడియా, ఇన్‌ఫ్లుయెన్సర్లకి తొలి అభిప్రాయం ఏర్పడేలా చేస్తుంది. పూర్తి కలెక్షన్ మీదా ప్రభావం చూపుతుంది. అందుకే ఓపెనింగ్ వాక్‌కి అంత ప్రాధాన్యం. పైగా 2018 తరవాత షనెల్ తొలిసారిగా న్యూయార్క్‌లో షో చేస్తోంది. అలాంటి ప్రతిష్ఠాత్మక షోలో ఓపెనింగ్ వాక్ చేసింది భవిత. ఈ అవకాశం అందుకున్న తొలి భారతీయ మోడల్ తను. కాబట్టే, ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. తల్లిదండ్రుల్నీ ఆనందభాష్పాల్లో ముంచెత్తింది. తెలుగమ్మాయి కూడా కావడంతో ఆ వీడియో కాస్తా వైరలైంది.

అన్నట్టూ... ఈ ఫ్యాషన్ షో నేపథ్యమేంటో తెలుసా? సబ్ వే స్టేషనే! తను ధరించిన దుస్తులూ జీన్స్, టీ షర్టే. సరిగ్గా మోడలింగ్ ప్రారంభించిన ఏడాదికి ఈ షో చేసింది. షనెల్‌తో ఇదివరకే స్ప్రింగ్ 2026 షో చేసింది తను. ఇది రెండోది. అయితే ఓపెనింగ్ అవకాశం ఇంత త్వరగా అందుకోవడమే ప్రత్యేకం. అందుకే ఇది తనకో సెంటిమెంట్ అంటోంది భవిత. ఓ సాధారణ అమ్మాయి... గ్లోబల్ ఫ్యాషన్ ఐకాన్‌గా మారడం, అదీ అతి తక్కువ సమయంలో! విచిత్రమే కదూ! ఒక సాధారణ సంభాషణ, అనుకోని పరిచయం కూడా కొత్త భవిష్యత్తు మార్గాలను సృష్టించగలదు అనడానికి భవిత ప్రయాణమే ఉదాహరణ! ఏదేమైనా ఫ్యాషన్ ప్రపంచంలో ఇలాగే తనదైన ముద్ర వేస్తూ భవిత ముందుకు సాగిపోవాలని కోరుకుందామా?

బామ్మ చిట్కా



ఫంక్షన్లు, పండగలప్పుడు కాస్త ఎక్కువగా తిన్నాం... లేదంటే అరగట్లేదు అనిపిస్తుంటుంది కదా! చాలామంది అరగడానికి టానిక్‌లు, ట్యాబ్లెట్ల మీదా ఆధారపడుతుంటారు. ఈసారి ఈ చిట్కా ప్రయత్నించండి. పావు స్పూను చొప్పున ధనియాలు, జీలకర్ర, వాము తీసుకోండి. వీటన్నింటినీ రోట్లో వేసి, చిటికెడు ఉప్పునీ చేర్చి... కచ్చాపచ్చాగా దంచుకోండి. ఇప్పుడు ఒకగిన్నెలో గ్లాసు నీళ్లు పోసి వేడిచేయండి. ఆపై ఈ మిశ్రమాన్ని వేసి, నీళ్లు సగం అయ్యేవరకూ మరిగించండి. స్టవ్ కట్టేసి, గోరువెచ్చగా అయ్యాక చిటికెడు వంటసోడా, స్పూను నిమ్మరసం చేర్చి తాగితే సరి. జీర్ణప్రక్రియ మెరుగవ్వడమే కాదు, ఉపశమనమూ దొరుకుతుంది. కావాలంటే ప్రయత్నించండి.



మహిళల కెరియర్ నిర్మాణంలో సందేహాలు... నిపుణుల సలహాలు ఈనాడు వెబినార్!

ఈనాడు వసుంధర

కెరియర్‌లో ఉన్నతంగా స్థిరపడాలని ఏ మహిళకు ఉండదు? కానీ ఆ ప్రయాణంలో అతివలకు అడుగడుగునా సవాళ్లే. అవకాశాల కొరత, వేతనాల్లో వ్యత్యాసం, పదోన్నతుల్లో పక్షపాతం, నిత్యం మారే సాంకేతికత... ఇలాంటివెన్నో! కుటుంబ బాధ్యతలు, సామాజిక ఒత్తిళ్లు వీటికి అదనం. అలాగని రాజీపడుతూ కూర్చోలేం కదా! ముందడుగు వేయాల్సిందే. అందుకోసం ఏం చేయాలనేదే మీ సందేహమా?

అయితే, **'ఈనాడు- వసుంధర'** ఆధ్వర్యంలో డిసెంబరు 7న(ఆదివారం) ఉదయం 11 గం. నుంచి మధ్యాహ్నం 12:30 గం. వరకూ నిర్వహించే ఉచిత వెబినార్‌లో పాల్గొనండి. తమకు ఎదురైన సవాళ్లను అధిగమించి కెరియర్‌ను విజయవంతంగా నిర్మించుకున్న మహిళల నుంచి అమూల్యమైన సలహాలూ, సూచనలూ అందుకోండి. కెరియర్ ప్రారంభ, మధ్య దశలో ఉన్న ఉద్యోగినులకీ... డిగ్రీ చేస్తున్న, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నవాళ్లకీ ఇది అద్భుత అవకాశం.

07.12.2025
(ఆదివారం) నాడు...

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా https://hov.to/0f8f2cf2 వెబ్‌లింకు ఓపెన్ చేయండి. జూమ్ ఐడీ: 953 2585 8501 పాస్‌కోడ్: 352258 తోనూ జాయిన్ కావొచ్చు.

ఈ వెబినార్ యూట్యూబ్ లైవ్ కోసం స్కాన్ చేయండి.



లక్ష్మీకుట్టి

కరిచింది విషసర్పమా కాదా అన్నది తెలుసుకునేందుకు ఆమెకు ఎలాంటి కిట్ అవసరం లేదు. ఆ గాటుని బట్టి అదెలాంటి పాము, ఆ విషానికి విరుగుడుగా ఏ మందు వేయాలి... అడవిలో ఏ ఔషధ మొక్క ఎక్కడ ఉంటుందన్నది ఆమెకు కొట్టిన పిండి. అందుకే **లక్ష్మీకుట్టి**ని వన ముత్తస్సి(అడవికి అమ్మమ్మ) అని అంటుంటారు. ఇంతకీ ఎవరీమె?

అడవికి అమ్మమ్మ... గిరిజనుల డాక్టరమ్మ!



కాణి తెగకు చెందిన లక్ష్మీకుట్టి వయసు ఎనభైకి పైనే. కేరళ, వితురలోని కల్లార్ అటవీ ప్రాంతానికి చెందిన గిరిజన మహిళ. సుమారు 500 రకాల ఔషధ చికిత్సలు ఆమెకి కంఠోపాఠం. వీటితో ఏయే వ్యాధులు తగ్గించవచ్చో చక్కగా చెప్పగలరీమె. చదివింది ఎనిమిదో తరగతే. సంస్కృతం కూడా తెలుసు. 1950లలో ఆ ప్రాంతంలో పాఠశాలకు వెళ్లిన ఏకైక గిరిజన బాలిక. పట్టుదలగా తండ్రిని ఒప్పించి, పది కిలోమీటర్లు పైగా నడిచి వెళ్లి మరీ చదివిందీమె. వైద్యంలోనే కాదు, నాటికలు, కవితలు రాయడంలోనూ దిట్టే. కేరళ జానపద అకాడమీలో ఉపాధ్యాయురాలు. పద్మశ్రీ అవార్డు గ్రహీత కూడా.

యాభై ఏళ్లుగా...

'ప్రకృతి నిస్వార్థంగా మనకెన్నో ప్రసాదిస్తుంది. దాన్ని నిశితంగా గమనిస్తుంటా. అందుకే ఆ ప్రకృతి సూత్రాన్నే అందిపుచ్చుకున్నా. గత యాభై ఏళ్లుగా గిరిజనులకి సంప్రదాయ వైద్యం చేస్తున్నా' అంటారీమె. 1995లో కేరళ ప్రభుత్వం 'నాటు వైద్య రత్న' అవార్డుతో సత్కరించడంతో బయటి ప్రపంచానికీ ఈమె గురించి తెలిసింది. అప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాల్లోని విద్యాసంస్థల్లోనూ సహజ వైద్యం పట్ల అవగాహన కలిగిస్తున్నారీమె.

అడవిలో నిరాడంబరంగా ఒంటరిగా జీవిస్తోన్న ఈమె ఇంటి చుట్టూ ఔషధ మొక్కల్ని పెంచుతారు. మరికొన్నింటిని తెల్లవారుజామునే అడవిలోకెళ్లి సేకరిస్తారు. ఆ రోజుకి అవసరమైన కొన్ని ఆకులూ వేళ్లని మాత్రమే తుంచుతారు. వాటితో రాత్రివేళ కషాయాలు తయారుచేస్తారు. ఈమధ్యలో పాముకాటు మొదలుకొని విభిన్న అనారోగ్య సమస్యలతో వచ్చేవాళ్లందరికీ వైద్యం చేస్తారు.

ఎక్కువ తినకండి!

ఈమెకి ముగ్గురు కొడుకులు. ఒకరు ఏనుగు కారణంగా, మరొకరు పాముకాటుతో మరణించారు. కొంతకాలం క్రితం భర్తా కాలం చేశారు. మూడో అబ్బాయి రైల్వేలో ఉద్యోగం చేస్తున్నా లక్ష్మీకుట్టి మాత్రం ఒంటరిగా అడవిలోనే నివసిస్తున్నారు. అదేమంటే...'ఈ అడవే నాకు సర్వస్వం. ఇక్కడే పుట్టి పెరిగాను. సాధారణంగా గిరిజనులు ప్రకృతి వైపరీత్యాల వల్ల చనిపోరు. వాటినుంచి ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు. అడవి జంతువుల జోలికి వెళ్లనంతవరకూ అవీ హాని కలిగించవు. తెలిసో తెలియకో కొన్నిసార్లు మనిషి వాటికి ఆటంకం కలిగిస్తాడు. అందులో భాగంగానే వన్యప్రాణులు, విషసర్పాల వల్ల గిరిజనులు గాయపడి, మరణిస్తుంటారు. ఆసుపత్రికి తీసుకెళ్లే మార్గం ఉండదు. విషం శరీరమంతా వ్యాపించకుండా ఎంత త్వరగా తీయగలిగితే అంత మేలు. నా కొడుకూ పాముకాటుకి బలయ్యాడు. దాంతో విషానికి విరుగుడు మందు మీద మరింత దృష్టిపెట్టా. పాములు, విషకీటకాలు కుట్టిన వేల మందికి వైద్యం చేశా. మా అమ్మా గిరిజన వైద్యురాలే. మంత్రసాని కూడా. ఆమె దగ్గరే ఔషధ మొక్కల గురించి తెలుసుకున్నా. పైగా మా కాణి తెగకి చెందిన ఈ సంప్రదాయ వైద్యం అంతరించిపోతోంది. నా శక్తిమేరకు దీన్ని బతికించాలన్నదే నా తపన. అందుకే ఈ వయసులోనూ ఏ సంస్థ పిలిచినా వెళ్లి అవగాహన కల్పిస్తున్నా. నా దగ్గరకు వచ్చే రోగులకు నేను చెప్పేదొక్కటే... ఆహార నియమాల్ని 41 రోజులపాటు పాటించాలి. అవసరమైనదానికన్నా ఎక్కువ తినకండి. వీలైనంత ఎక్కువగా కదలండి. వ్యాయామం చేయండి. ప్రకృతిని ప్రేమించండి, దయతో మెలగండి, దైవిక భావనలతో జీవించండి. ఇవన్నీ కలిసి అద్భుత ఔషధంగా పనిచేస్తాయి' అంటోందీ వన ప్రేమికురాలు. అడవినే నమ్మి అడవి బిడ్డలకోసం తన వంతు కృషి చేస్తోన్న లక్ష్మీకుట్టి ఎందరికో ఆదర్శప్రాయమే కదూ!



బంగారం - వెండి

6న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,32,510	1,19,700	1,84,100
విజయవాడ	1,28,120	1,19,300	1,83,600
ప్రొద్దుటూరు	1,27,400	1,17,210	1,78,000
రాజమహేంద్రవరం	1,30,150	1,19,300	1,95,000
విశాఖపట్నం	1,30,160	1,19,300	1,85,000
తమిళనాడు	-----	1,20,400	1,99,000

ఆ టాటూ పోతుందా?

నేనొక అబ్బాయిని ప్రేమించా. పెళ్లికూడా చేసుకోవాలనుకున్నాం. ఆ సమయంలో నేను అతడి చిత్రాన్ని నడుముపై టాటూగా వేయించుకున్నా. ఇప్పుడు విభేదాలతో విడిపోయాం. దాన్ని నేనిప్పుడు తొలగించుకోవాలనుకుంటున్నా. సాధ్యమేనా? ఏమైనా ఇబ్బందులు వస్తాయా?

– శ్రీజ, హైదరాబాద్

తారల్ని చూసో, ఫ్యాషన్‌లో భాగమనో... పచ్చబొట్టు వేయించుకుంటున్న అమ్మాయిలు చాలామందే. కానీ, వీటిని వేయించుకునే ముందే భవిష్యత్తులో ఎదురయ్యే పర్యవసానాల్ని ఆలోచించుకోవాలి. ఎందుకంటే దాన్ని తొలగించడం అంత సులువైన ప్రక్రియ కాదు. ఖర్చుతో కూడుకున్నది.... పైగా పూర్తిగా పోతుందనీ చెప్పలేం. ముఖ్యంగా పచ్చబొట్టు వేయించుకున్న వెంటనే.. . అంటే దాన్ని నెలలోపే తీయించుకోవడం కుదరదు. కనీసం మూడు నెలలైనా ఆగాలి. టాటూ డిజైన్, దాన్ని వేసిన విధానం, పిగ్మెంట్ ఎంత లోపలికి చొచ్చుకుని ఉంది... వంటి విషయాలను బట్టి తొలగించడానికి ఎంత సమయం పడుతుందో నిర్ణయమవుతుంది. ఇందులో కూడా నలుపు, ఆకుపచ్చ రంగులు సులువుగా పోతాయి. ఎరుపు వర్ణం ఓ పట్టాన పోదు. సాధారణంగా టాటూలను తీసేయడానికి డెర్మాబ్రేషన్‌తో పాటు లేజర్ పద్ధతులను ఉపయోగిస్తారు. డెర్మాబ్రేషన్ ప్రక్రియలో లోపలి వరకూ చర్మాన్ని తొలగిస్తారు. ఆ ప్రాంతాన్ని స్కిన్‌గ్రాఫ్టింగ్ ద్వారా సరిచేస్తారు. అయితే, అక్కడ మచ్చ కనిపిస్తుంది. అలాకాకూడదంటే లేజర్‌ని ఎంచుకోవచ్చు. దీంట్లో ప్రధానంగా క్యూ స్విచ్ ఎన్‌డి యాగ్ విధానంలో ఫ్రాక్షనల్ లేజర్, పీకో సెకండ్ స్విచ్ లేజర్ వంటివి ఉన్నాయి. అంతేకాదు, ఈ చికిత్సలను అర్హతగల డెర్మటాలజిస్టుల దగ్గర చేయించుకోవడమే సురక్షితం. ముందు మీరోసారి సంబంధిత వైద్యుల్ని కలవండి. పరిష్కారాలు వారే సూచిస్తారు.

డియర్ వసుంధర



డా. పి.ఎల్.చంద్రావతి
డెర్మటాలజిస్ట్

డిస్లెక్సియాను జయించి...



ఆ ఇద్దరూ కవలలు... ఎక్కడికెళ్లినా అచ్చు గుద్దినట్లు ఒకేలా ఉన్న వారిపైనే అందరి చూపూ! కలిసి పుట్టడం, పెరగడమే కాదు... ఒకేరోజున ప్రభుత్వోద్యోగంలో చేరి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఇందులో ప్రత్యేకత ఏముంది అంటారా? వారిద్దరూ డిస్లెక్సియాను జయించి ఈ విజయాన్ని సాధించారు మరి. కేరళలోని కూరైకుండులోని భీమనాడి సవిత, సంగీతల స్వస్థలం. వీళ్ల తండ్రి జోసెఫ్ కేఎస్‌ఈబీలో సీనియర్ సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ చేశారు. తల్లి సుని జార్జ్ ప్రధానోపాధ్యాయురాలు. వీరికి ముగ్గురు సంతానం కాగా... ఈ ఇద్దరూ డిస్లెక్సియా బాధితులు. దీంతో చదవడంలో, రాయడంలో ఎంతో ఇబ్బందిని ఎదుర్కొన్నారట.. పాఠాలు ఓ పట్టాన అర్థంకాక మొదట్లో బడికి వెళ్లడానికీ భయపడ్డారు. ఆ సమయంలోనే కుటుంబ సభ్యులు వారికి తోడుగా నిలిచారు. ప్రభుత్వోద్యోగం సాధించాలనే ఆలోచనతో కఠోర సాధన చేశారు. ప్రాథమిక విద్య మొదలుకుని పీఎస్సీ పరీక్షతో సహా అన్నింటినీ స్క్రైబ్ సాయం లేకుండానే రాశారు. మంచి మార్కులతోనే ప్లస్‌టూ పూర్తి చేశారు. తర్వాత మల్టీమీడియా యానిమేషన్ కోర్సు పూర్తి చేశారు. పీఎస్సీ పరీక్షలపై దృష్టి సారించారు. అక్కడ గురువు బిపిన్ ఈ అక్కాచెల్లెళ్ల పరిస్థితిని అర్థం చేసుకున్నారు. వారి శక్తిసామర్థ్యాలకు తగినట్లు పాఠాలను బోధించడం ఆరంభించారు. వందకు పైగా ప్రాక్టీస్ పరీక్షలు రాయించి ఇద్దరినీ సిద్ధం చేశారు. కోరుకున్నట్లుగా సవిత హోస్దుర్గ్ సబ్ కోర్టులో, సంగీత హోస్దుర్గ్ మున్సిపల్ కోర్టులో ఒకేరోజు కొలువుల్లో చేరారు. యాదృచ్ఛికంగా, రెండు కోర్టులు ఒకే కాంపౌండ్‌లో ఉన్నాయి. మరి వాళ్లకి ఆల్‌ది బెస్ట్ చెబుదామా!

ఇల్లు... ఆనందం విరిసేలా!








సొంత ఇల్లు కట్టుకోవడం... దాన్ని తమకు నచ్చినట్టుగా తీర్చిదిద్దుకోవడం ప్రతి మహిళ కలే! ఈ క్రమంలో ప్రతిదీ ఒకటికి రెండుసార్లు చూసుకుని మరీ నిర్ణయించుకుని, కొంటాం. కానీ ఎప్పుడైనా గమనించారా? 'ఇది ఇంగ్లిష్ రంగు... ఇప్పుడిదే ట్రెండ్...' అని మనకి కొన్ని రిఫరెన్సులు ఇస్తుంటారు చాలామంది. వాటిలోంచి మనకు నచ్చింది ఎంచుకుంటూ ఉంటాం. తుది నిర్ణయం మనదే అయినా పూర్తిగా మన ఎంపిక కాదుగా! ఇదే భావన ఇప్పుడు చాలామందికి కలుగుతోంది. కాబట్టే ప్రపంచవ్యాప్తంగా 'డోపమైన్ డెకార్' ట్రెండ్‌ని అనుసరిస్తున్నారు.

మన గది లేదా ఇల్లు... లోపలికి అడుగుపెట్టామంటే ఆనందం చుట్టుముట్టేయాలి... ఇదే ఈ ట్రెండ్ ఉద్దేశం. సింపుల్‌గా చెప్పాలంటే ఆనందం, ఉత్సాహం, ప్రేరణ కలిగించేలా తమ నెలవు ఉండాలని కోరుకుంటున్నారు. ఇక్కడ మ్యాచింగ్, ఈస్థటిక్ వంటి రూల్స్ ఏమీ ఉండవు. మీలో సానుకూలతను నింపుతాయని భావించే రంగులు, బొమ్మలు, డెకరేటివ్ పీస్‌లు, ఫర్నిచర్‌లకు చోటివ్వొచ్చు. ఉదాహరణకు గులాబీ రంగు కుర్చీ మీకు నచ్చింది, ఇది గదిలో ఉంటే మీ మూడ్ సానుకూలంగా మారుతుంది అనిపిస్తే పెట్టేసుకోవచ్చు. మీకు నచ్చే వస్తువులన్నీ మీ గదిలో కళ్లముందే కనిపించాలా... మొక్కలు, బొమ్మలు, పుస్తకాలు... వేటికైనా చోటివ్వొచ్చు. రెయిన్‌బో లైట్స్, ఫ్లఫీ రగ్గు, మంచమ్మీద పోల్కా చుక్కల దుప్పటి, ఓ పక్కగా ఉయ్యాల... ఏదైనా మీ ఇష్టం. 'నాకు నచ్చాలి, నేను మెచ్చాలి. దానికి డెకార్ ప్రపంచంలో చోటు లేకపోయినా సరే! ఏ ట్రెండ్‌నీ అనుసరించకపోయినా పర్లేదు. నా ఇష్టమే ముఖ్యం, నాకు ఆనందం కలిగించడమే ప్రధానం' అనుకుంటూ అమ్మాయిలు ఈ ట్రెండ్‌ని అనుసరించేస్తున్నారు. తమ గదినీ ఇంటినీ డిజైన్ చేసుకుంటున్నారు. అలాగని చెత్త కుప్పలా ఉంచుకుంటారు అనుకునేరు. అసలే నీట్‌నెస్‌కి బ్రాండ్ అంబాసిడర్లు కదా! నచ్చినవి పెట్టుకుంటున్నారు అయితే మినిమలిజమ్‌కీ ఓటేస్తున్నారు. కాబట్టే, మెచ్చుతున్న అమ్మాయిలు పెరుగుతున్నారు. మరి మీ సంగతేంటి? ప్రయత్నిస్తారా?

అక్కడే ప్రశాంతత దొరుకుతుంది..!



ఇదివరకు ప్రయాణాలంటే... జలపాతాలు, కొండలోయల అందాల్ని చూడటానికి ఇష్టపడే అమ్మాయిలే ఎక్కువ. నచ్చిన ప్రాంతాల లిస్ట్ తయారుచేసుకుని... వీలున్నప్పుడు ప్లాన్ చేసుకుని వెళ్లేవారు. వాళ్ల కోరికల జాబితాలో సముద్రాలు, లోయలు తప్పక ఉండేవి. కానీ ఇప్పుడో... జీవనశైలిలో ఎదురవుతున్న ఇబ్బందుల్ని అధిగమించడానికి ట్రిప్పులకు వెళుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. దాంతో ఏ చిన్న అవకాశం వచ్చినా ట్రిప్పులు వెళ్లడానికి మక్కువ చూపిస్తున్నారు. ప్రయాణాల్లో ఓ ట్రెండ్‌ను సెట్ చేశారనే చెప్పాలి ఈతరం అమ్మాయిలు. అయితే వీళ్లంతా పర్యటకం రూపురేఖల్ని మార్చే పనిలో పడ్డారంటోంది గూగుల్ సెర్చ్. ఎందుకంటే... ఇండియా టాప్ ట్రావెల్ సెర్చ్ 2025 జాబితాలో ఆలయాలు, పురాతన కట్టడాల కోసం వెతికే యువత సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. 'ఆలయ నిర్మాణాల వెనక కథలు, కట్టడాల తీరు, వాటికి ఉన్న విశిష్టత, సైన్స్‌కు కూడా అంతుచిక్కని విశేషాలు మమ్మల్ని ఆకర్షిస్తున్నాయి. ఆలయ పర్యటన మాకో పాజిటివ్ వైబ్ ఇస్తుంది అని' అంటున్నారట. అందుకే వీటికోసం వెతికే వారి సంఖ్య పెరిగిందట. ఇంతకీ మీ ఎంపిక ఏంటి?

కిడ్స్ కార్నర్

ఆడుతూ పాడుతూ నేర్చుకుంటారు..!

అసలే శీతకాలం... బయట చలి, ఇంట్లో తేమ తగ్గిపోవడం అన్నీ ఒక్కసారిగా పిల్లల రోగనిరోధక శక్తి మీద దాడిచేస్తాయి. అందుకే పరిశుభ్రంగా ఉండటం చాలా అవసరం. తినే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలి, అనవసరమైనవి తాకకూడదు, టాయిలెట్ వాడాక శానిటైజ్ చేసుకోవాలి... వంటి ఎన్ని జాగ్రత్తలు చెప్పినా ఓ పట్టాన పాటించరు గడుగ్గాయిలు. ఈ చిన్ని నేస్తాల్ని వాళ్లకి ఇచ్చి చూడండి... పరిశుభ్రత వాళ్లకి అలవాటైపోతుంది.

బిగిస్తే చాలు...



ఇప్పుడు చాలా రకాల ట్యాప్ ఎక్స్‌టెండర్లు అందుబాటులోకి వస్తున్నాయి. గృహిణులు సౌకర్యం కోసం వీటిని అమర్చుకుంటున్నారు. వీటిల్లో 'కార్టూన్ ఎక్స్‌టెండర్లూ' అందుబాటులోకి వచ్చాయి. టామ్, జెర్రీ, డోరేమాన్, షిన్‌చాన్ వంటి కార్టూన్ల రూపంలో పిల్లల్ని ఆకట్టుకుంటున్నాయివి. కుళాయికి అతికిస్తే చాలు. వాటితో ఆడుకోవడానికి అయినా చేతులు శుభ్రం చేసుకోవడానికి వెళతారు.



బుజ్జి వేపర్స్...





బుజ్జాయిల చిన్ని చేతుల్లో సబ్బులు పట్టవు. వాటిని వాడేటప్పుడు సింక్‌లోకి జారిపోతుంటాయి. ఆ ఇబ్బంది లేకుండా ఈ 'మినీ సోప్ వేపర్స్'ను వాళ్లకిస్తే సరి. అవసరం అయినప్పుడు ఒక వేపర్ తీసి చేతులు శుభ్రం చేసుకుంటారు. వీటిల్లో కీ-చెయిన్ మోడళ్లూ అందుబాటులో ఉన్నాయి. నచ్చిన దాన్ని ఎంపిక చేసుకుని, వాడటమెలాగో చెప్పి, వాళ్ల బ్యాగులకు తగిలిస్తే సరి. ఎక్కడ కావాలంటే అక్కడ, ఎప్పుడు కావాలంటే అప్పుడు వినియోగిస్తారు.

కార్టూన్ శానిటైజర్లు...



కొవిడ్ నేర్పిన పాఠాల్లో ఇప్పటికీ ఎప్పటికీ మరచిపోకూడనిది శానిటైజర్ల వాడకం. పిల్లలకు శుభ్రత విషయంలో నేర్పాల్సిన మొదటి పాఠం కూడా ఇదే. క్రిములు, రోగనిరోధకశక్తి వంటి విషయాలన్నీ అర్థం చేసుకునే వారైతే పర్వాలేదు. అంతకన్నా చిన్నవాళ్లైతే వాళ్లకి అర్థమయ్యేలా ఎలా చెప్పేది. ఆకర్షణతోనే వాళ్లని ఆకట్టుకోవాలి. అందుకు ఉపయోగపడేవే ఈ 'కార్టూన్ శానిటైజర్లు'. చిన్న 30ఎం.ఎల్. ప్యాకెట్లకి పిల్లలు ఇష్టపడే కార్టూన్ బొమ్మల్ని అతికించి తయారు చేస్తున్నారు. కీ-చెయిన్ల రూపంలో దొరుకుతున్నాయివి. వీటిల్లో శానిటైజర్ నింపి బ్యాగుకు తగిలిస్తే సరి. చేతులు శానిటైజ్ చేసుకోవడం ఓ అలవాటుగా మారుతుంది. ఇవన్నీ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికల్లో దొరుకుతున్నాయి. నచ్చితే తెచ్చేసుకోండి మరి!



ఛాంపియన్స్





జైస్వాల్ 116 నాటౌట్

ప్రసిద్ధ్ కృష్ణ

టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్ తర్వాత టీమ్‌ఇండియా సామర్థ్యంపై ఎన్నో సందేహాలు! వన్డేల్లో అయినా ఫలితం మారుస్తారా అన్న ప్రశ్నలు! తొలి వన్డేలో 350 లక్ష్యాన్ని కాపాడుకోవడానికి ఆపసోపాలు పడి.. రెండో వన్డేలో 358 పరుగులను కూడా రక్షించుకోలేకపోయినప్పుడు.. నిర్ణయాత్మక పోరులో ఎలాంటి ఫలితం వస్తుందో అన్న అనుమానం! కానీ అచ్చొచ్చిన విశాఖపట్నంలో భారత జట్టు రెచ్చిపోయింది. రెండేళ్లకు పైగా, వరుసగా 20 వన్డేల్లో కలిసి రాని టాస్ ఇక్కడ టీమ్‌ఇండియానే వరించింది. భారీ స్కోరు చేసేలా కనిపించిన ప్రత్యర్థికి బౌలర్లు కళ్లెం వేశారు. ఇక బ్యాటర్లయితే మామూలుగా రెచ్చిపోలేదు. వన్డేల్లో తొలిసారి తన ముద్రను చాటుతూ యశస్వి జైస్వాల్ తొలి శతకం సాధిస్తే.. వెటరన్ స్టార్లు రోహిత్ శర్మ విరాట్ కోహ్లి జోరు కొనసాగిస్తూ మెరుపు అర్ధశతకాలు బాదారు. తిరుగులేని విజయంతో వన్డే సిరీస్‌ను సొంతం చేసుకున్న భారత్.. ఆత్మవిశ్వాసంతో టీ20 పోరుకు సిద్ధమైంది.

విశాఖలో విజయనాదం

271 పరుగుల లక్ష్యాన్ని ఊదేసిన భారత్

- దక్షిణాఫ్రికాను చిత్తు చేసి సిరీస్ కైవసం
- యశస్వి శతకం.. రోహిత్, కోహ్లి మెరుపులు

ఈనాడు - విశాఖపట్నం


టెస్టుల్లో తడబడినా.. వన్డేల్లో మాత్రం దక్షిణాఫ్రికాకు తలవంచలేదు టీమ్‌ఇండియా. దిగ్గజ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల రాకతో బలం పెంచుకున్న భారత్.. వన్డే సిరీస్‌ను 2-1తో చేజిక్కించుకుంది. శనివారం 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' యశస్వి జైస్వాల్ (116 నాటౌట్; 121 బంతుల్లో 12×4, 2×6) శతకానికి.. రోహిత్ (75; 73 బంతుల్లో 7×4, 3×6), కోహ్లి (65 నాటౌట్; 45 బంతుల్లో 6×4, 3×6) అర్ధశతకాలు తోడవడంతో 271 పరుగుల లక్ష్యాన్ని భారత్ ఒక్క వికెట్టే కోల్పోయి, 39.5 ఓవర్లలోనే ఛేదించేసింది. డికాక్ (106; 89 బంతుల్లో 8×4, 6×6) శతకం సాధించడంతో మొదట దక్షిణాఫ్రికా 270 పరుగులు చేసింది. ప్రసిద్ధ్ కృష్ణ (4/66), కుల్‌దీప్ (4/41) ప్రత్యర్థి జట్టును కట్టడి చేశారు. రెండు జట్ల మధ్య అయిదు టీ20ల సిరీస్ మంగళవారం కటక్‌లో మొదలవుతుంది.

అలవోకగా..: ఛేదనలో భారత్ ఎంతమాత్రం ఇబ్బంది పడలేదు. ఒక ప్రణాళిక ప్రకారం ఆడి అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది. లక్ష్యం పెద్దది కాకపోవడంతో ఓపెనర్లు రోహిత్, యశస్వి ఆచితూచి బ్యాటింగ్ చేశారు. ముఖ్యంగా శుభ్‌మన్, శ్రేయస్ గాయపడడంతో తనకు వన్డేల్లో లేక లేక వచ్చిన అవకాశాన్ని నిలబెట్టుకోవాలనే దృఢ నిశ్చయంతో యశస్వి కనిపించాడు. తొలి రెండు వన్డేల్లో 18, 22 పరుగులే చేసిన అతను.. ఈ మ్యాచ్‌లో పెద్ద ఇన్నింగ్స్ ఆడాలనే లక్ష్యంతో సాగాడు. అయితే కొన్ని ఓవర్ల పాటు సంయమనం పాటించిన ఓపెనర్లు.. తర్వాత బ్యాట్లు ఝుళిపించారు. పేసర్ ఎంగిడి బౌలింగ్‌లో ఇద్దరూ చెరో సిక్సర్ బాదారు. ఆ తర్వాత కూడా వీళ్లిద్దరూ అడ్డదిడ్డంగా ఏమీ షాట్లు కొట్టలేదు. 20వ ఓవర్లో రోహిత్ అర్ధశతకం (54 బంతుల్లో) పూర్తయింది. తర్వాత అతను దూకుడు పెంచాడు. బోష్ బౌలింగ్‌లో వరుస ఓవర్లలో సిక్సర్లు బాదాడు. మరోవైపు జైస్వాల్ 75 బంతుల్లో అర్ధశతకాన్నందుకున్నాడు. తర్వాత అతనూ జోరు పెంచాడు. సెంచరీ దిశగా సాగుతున్న రోహిత్‌ను కేశవ్ ఔట్ చేసినా.. భారత్‌కు ఏమాత్రం ఇబ్బంది లేకపోయింది. వరుసగా రెండు సెంచరీలు చేసి ఊపుమీదున్న కోహ్లి.. వచ్చీ రాగానే బ్యాటుకు పని చెప్పాడు. అలవోకగా ఫోర్లు, సిక్సర్లు బాదుతూ అతను స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో ఎలాంటి ఇబ్బందిలేకుండా భారత్ లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే యశస్వి 111 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. అతనా మైలురాయిని అందుకోగానే.. కోహ్లి ఫోర్లు, సిక్సర్లతో రెచ్చిపోయాడు. 61 బంతులుండగానే భారత్ ఛేదన పూర్తయింది.

డికాక్ దంచినా..: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికాకు ఓపెనర్ క్వింటన్ డికాక్ బలమైన పునాది వేసినా.. మిడిలార్డర్ వైఫల్యంతో దక్షిణాఫ్రికా భారీ స్కోరు సాధించలేకపోయింది. స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ గొప్పగా బౌలింగ్ చేయడం, మరోసారి ఎక్కువ పరుగులు ఇచ్చుకున్నప్పటికీ ప్రసిద్ధ్ కృష్ణ.. కీలక దశల్లో వికెట్లు తీయడంతో సఫారీ జట్టును ఓ మోస్తరు స్కోరుకు భారత్ కట్టడి చేయగలిగింది. రికిల్‌టన్ డకౌటైనా.. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ బవుమా (48; 67 బంతుల్లో 5×4)తో కలిసి డికాక్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. గత రెండు మ్యాచ్‌ల్లో 0, 8 పరుగులకే వెనుదిరిగిన డికాక్.. ఈ మ్యాచ్‌లో తనదైన శైలిలో చెలరేగిపోయాడు. 42 బంతుల్లోనే అతడి అర్ధశతకం పూర్తయింది. రెండో వికెట్‌కు 113 పరుగులు జోడించాక బవుమా ఔట్ కాగా.. బ్రీజ్కే (24)తో కలిసి మరో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు డికాక్. 28 ఓవర్లకు 167/2తో తిరుగులేని స్థితిలో నిలిచిన దక్షిణాఫ్రికా.. 350 స్కోరు చేసేలా కనిపించింది. కానీ ఈ దశలో ప్రసిద్ధ్ కృష్ణ.. ఒకే ఓవర్లో బ్రీజ్కే, గత మ్యాచ్ సెంచరీ వీరుడు మార్‌క్రమ్ (1)లను ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. తర్వాతి ఓవర్లో హర్షిత్ బంతికి సిక్సర్ బాది డికాక్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ కాసేపటికే అతణ్ని సైతం ప్రసిద్ధ్ ఔట్ (బౌల్డ్) చేయడంతో ఆట భారత్ వైపు మొగ్గింది. ప్రమాదకర బ్రెవిస్ (29), యాన్సెన్ (17) కాసేపు మెరుపులు మెరిపించినా.. వీళ్లిద్దరినీ కుల్‌దీప్ ఒకే ఓవర్లో ఔట్ చేయడంతో దక్షిణాఫ్రికా 300 ఆశలకు తెరపడ్డాయి. బోష్ (9)ను సైతం కుల్‌దీపే ఔట్ చేశాడు. లోయర్డార్లో కేశవ్ (20) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు. 13 బంతులుండగానే దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది.



రోహిత్ 75



డికాక్

రోహిత్ @ 20000

టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్లో 20 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. ప్రపంచ క్రికెట్లో ఈ ఘనత సాధించిన 14వ బ్యాటర్ రోహిత్. శనివారం దక్షిణాఫ్రికాతో మూడో వన్డేలో కేశవ్ మహరాజ్ వేసిన 14వ ఓవర్లో నాలుగో బంతికి రోహిత్ సింగిల్ తీసి 20 వేల క్లబ్బులో అడుగు పెట్టాడు. ఈ ఇన్నింగ్స్ తర్వాత అతడి పరుగులు 20,048కి చేరుకున్నాయి. వన్డేల్లో 11,516 పరుగులు సాధించిన హిట్‌మ్యాన్.. టెస్టుల్లో 4301, టీ20ల్లో 4231 పరుగులు చేశాడు.

కలిసొచ్చిన ఎడమ చేయి

వన్డేల్లో వరుసగా 20 టాస్‌లు ఓడిన భారత్ ఎట్టకేలకు గెలిచింది. విశాఖలో తాత్కాలిక కెప్టెన్ రాహుల్‌కు టాస్ కలిసొచ్చింది. ఈ మ్యాచ్‌లో అతనే టాస్ వేశాడు. అయితే అందుకోసం రాహుల్ ఎడమచేతిని ఉపయోగించాడు. టీమ్‌ఇండియా టాస్ పరాజయ పరంపరకు తెరపడడంతో స్టేడియం హోరెత్తింది.

"టెస్టుల్లో మాకు అనుకూలంగా ఫలితం రాకపోయేసరికి చాలామంది చాలా రకాలుగా మాట్లాడారు. విలేకరుల సమావేశాల్లో సాకులు వెతుకుతూ మాట్లాడటం నాకిష్టం ఉండదు. కానీ టెస్టు జట్టు సంధి దశలో ఉంది. సిరీస్ మధ్యలో కెప్టెన్‌ను కోల్పోయాం. కోల్‌కతా టెస్టులో మా కెప్టెన్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ బ్యాటింగ్ చేయని విషయాన్ని ఎవ్వరూ ప్రస్తావించకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. క్రికెట్‌తో సంబంధం లేని వాళ్లు వేర్వేరు ఫార్మాట్లకు వేర్వేరు కోచ్‌లను నియమించడం గురించి మాట్లాడారు. అది ఇంకా ఆశ్చర్యం కలిగించింది. జనాలు ఎవరి పరిధిలో వాళ్లుంటే మంచిది"

- గంభీర్

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (బి) ప్రసిద్ధ్ 106; రికిల్‌టన్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 0; బవుమా (సి) కోహ్లి (బి) జడేజా 48; బ్రీజ్కే ఎల్బీ (బి) ప్రసిద్ధ్ 24; మార్‌క్రమ్ (సి) కోహ్లి (బి) ప్రసిద్ధ్ 1; బ్రెవిస్ (సి) రోహిత్ (బి) కుల్‌దీప్ 29; యాన్సెన్ (సి) జడేజా (బి) కుల్‌దీప్ 17; బోష్ (సి) అండ్ (బి) కుల్‌దీప్ 9; కేశవ్ నాటౌట్ 20; ఎంగిడి ఎల్బీ (బి) కుల్‌దీప్ 1; బార్ట్‌మన్ (బి) ప్రసిద్ధ్ 3; ఎక్స్‌ట్రాలు 12 **మొత్తం:** (47.5 ఓవర్లలో ఆలౌట్) **270, వికెట్ల పతనం:** 1-1, 2-114, 3-168, 4-170, 5-199, 6-234, 7-235, 8-252, 9-258, **బౌలింగ్:** అర్ష్‌దీప్ 8-1-36-1; హర్షిత్ రాణా 8-2-44-0; ప్రసిద్ధ్ 9.5-0-66-4; జడేజా 9-0-50-1; కుల్‌దీప్ 10-1-41-4; తిలక్ వర్మ 3-0-29-0

భారత్ ఇన్నింగ్స్: యశస్వి నాటౌట్ 116; రోహిత్ (సి) బ్రీజ్కే (బి) కేశవ్ 75; కోహ్లి నాటౌట్ 65; ఎక్స్‌ట్రాలు 15 **మొత్తం:** (39.5 ఓవర్లలో వికెట్ నష్టానికి) **271; వికెట్ల పతనం:** 1-155; **బౌలింగ్:** యాన్సెన్ 8-1-39-0; ఎంగిడి 6.5-0-56-0; కేశవ్ మహరాజ్ 10-0-44-1; బార్ట్‌మన్ 7-0-60-0; కార్బిన్ బోష్ 6-0-53-0; మార్‌క్రమ్ 2-0-17-0

సచిన్ తర్వాత విరాటే..



కోహ్లి 65 నాటౌట్

ఇది మూడు మ్యాచ్‌ల సిరీసే అయినా.. కోహ్లి 302 పరుగులు చేయడం విశేషం. అందులో రెండు శతకాలు, ఓ అర్ధశతకం ఉన్నాయి. కోహ్లి సగటు 151. అతను వన్డేల్లో 12వ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అందుకున్నాడు. ఈ జాబితాలో జయసూర్య (11)ను అధిగమించి రెండో స్థానానికి చేరాడు. సచిన్ (15) అగ్రస్థానంలో ఉన్నాడు.

"చాలా సంతృప్తికరంగా ఉంది. గత రెండు మూడేళ్లుగా ఇలా ఆడలేదు. మనసు ప్రశాంతంగా ఉంది. నేనిలా ఆడితే మధ్య ఓవర్లలో ఎలాంటి పరిస్థితినైనా జట్టుకు అనుకూలంగా మార్చగలనని తెలుసు'

- విరాట్ కోహ్లి

గిల్ సిద్ధం

కటక్: దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో మెడ గాయానికి గురైన శుభ్‌మన్ గిల్ ఆటకు సిద్ధమయ్యాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసం, ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసిన అతడికి వైద్య బృందం మ్యాచ్ ఆడేందుకు అనుమతి ఇచ్చింది. ఫిట్‌నెస్ పరీక్ష పాసైతేనే ఆడతాడన్న షరతుతో.. దక్షిణాఫ్రికాతో అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. టీ20 జట్టుకు అతడు వైస్ కెప్టెన్ కూడా.

భళా గ్రీవ్స్.. శభాష్ రోచ్

- విండీస్ బ్యాటర్ల అద్భుత పోరాటం
- కివీస్‌తో తొలి టెస్టు డ్రా



గ్రీవ్స్

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ చేతిలో ఓటమి ఖాయమనుకున్న తొలి టెస్టును వెస్టిండీస్ డ్రాగా ముగించింది. ఆల్‌రౌండర్ జస్టిన్ గ్రీవ్స్ (202 నాటౌట్; 388 బంతుల్లో 19×4), బౌలర్ కీమర్ రోచ్ (58 నాటౌట్; 233 బంతుల్లో 8×4) అసాధారణ పోరాటంతో జట్టును గట్టెక్కించారు. వీళ్లిద్దరూ ఏకంగా 68.5 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేయడంతో మూడు టెస్టుల సిరీస్‌లో తొలి మ్యాచ్ డ్రాగా ముగిసింది. 531 పరుగుల లక్ష్యం ముందుండగా.. చివరి రోజు 212/4తో బ్యాటింగ్ కొనసాగించిన విండీస్.. తొలి సెషన్ చివర్లో షై హోప్ (140), ఇమ్లాక్ (4)ల వికెట్లు కోల్పోయింది. ఇక ఆ జట్టు ఓటమి లాంఛనమే అనుకున్నారంతా. కానీ గ్రీవ్స్, రోచ్ జంట అసాధారణంగా పోరాడడంతో విండీస్ 457/6తో ఆటను ముగించింది. గాయం కారణంగా నాలుగో రోజు 11 ఓవర్లే వేసిన హెన్రి మళ్లీ బౌలింగ్‌కు రాకపోవడం.. నాథన్ స్మిత్ అసలే బౌలింగ్ చేయకపోవడం విండీస్‌కు కలిసొచ్చింది. ఏదేమైనా విండీస్ టెస్టు క్రికెట్ చరిత్రలోనే అద్భుత పోరాటాల్లో ఇదొకటని చెప్పొచ్చు. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 231, వెస్టిండీస్ 167 పరుగులు చేశాయి. రెండో ఇన్నింగ్స్‌ను కివీస్ 466/8 వద్ద డిక్లేర్ చేసింది.

సురుచికి స్వర్ణం

షూటింగ్ ప్రపంచకప్ ఫైనల్

సంయమ్‌కు రజతం



సురుచి

దోహా: భారత యువ షూటర్ సురుచి సింగ్ షూటింగ్ ప్రపంచ కప్ ఫైనల్లో పసిడితో మెరిసింది. శనివారం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో స్వర్ణం సొంతం చేసుకుంది. భారత్‌కే చెందిన సంయమ్ సింగ్ రజతం గెలుచుకుంది. ఈ ఏడాది ప్రపంచకప్‌లో నాలుగు స్వర్ణాలు సొంతం చేసుకున్న సురుచి ప్రపంచకప్ ఫైనల్లోనూ అంచనాలను అందుకుంది. 12 మంది షూటర్ల మధ్య క్వాలిఫయింగ్‌లో 586 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఒలింపిక్ పతక విజేత, స్టార్ షూటర్ మను భాకర్ (578) ఆరో స్థానం, సంయమ్ (573) ఎనిమిదో స్థానంతో తుది పోరుకు అర్హత పొందారు. ఫైనల్లో సురుచి గురికి ఎదురులేకుండా పోయింది. ఒకటి రెండు స్థానాల కోసం సంయమ్‌తో పోటీపడిన సురుచి 245.1 స్కోరుతో స్వర్ణం కైవసం చేసుకుంది. సంయమ్ (243.3)కు రజతం దక్కింది. మను భాకర్ (179.2) ఆరో స్థానానికి పరిమితమైంది. స్వర్ణం సాధించిన సురుచి మను పేరిట ఉన్న జూనియర్ ప్రపంచ రికార్డు (244.7)ను తిరగరాసింది. పురుషుల విభాగంలో సమ్రాట్ కాంస్యం గెలుచుకున్నాడు. ఎనిమిది మంది మధ్య ఫైనల్లో అతడు 221.5 స్కోరుతో మూడో స్థానంలో నిలిచాడు. హు కై (చైనా) స్వర్ణం, క్రిస్టియన్ రీట్జ్ (జర్మనీ) రజతం నెగ్గారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో భారత షూటర్లు నిరాశపరిచారు. పురుషుల ఫైనల్లో రుద్రాంక్ష్ పాటిల్ నాలుగు, అర్జున్ బబుతా ఆరో స్థానాలకు పరిమితమయ్యారు. మహిళల విభాగంలో ఎలవెనిల్ వలరివన్ క్వాలిఫయింగ్ దశలో తొమ్మిదో స్థానంతో నిరాశపరిచింది.

జర్మనీని జయిస్తారా?


రాత్రి 8 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

- భారత్‌కు కఠిన సవాల్
- జూనియర్ ప్రపంచకప్ హాకీ

చెన్నై: తొమ్మిదేళ్ల విరామం తర్వాత జూనియర్ ప్రపంచకప్ హాకీ టైటిల్ సొంతం చేసుకోవాలనుకుంటున్న భారత జట్టుకు కఠిన సవాల్. కప్పు రేసులో నిలవాలంటే ముందు ఏడుసార్లు ప్రపంచ ఛాంపియన్, ఫేవరెట్ జర్మనీని ఓడించాలి. ఆదివారం ఆ జట్టుతో సెమీఫైనల్లో భారత్‌కు కఠిన సవాల్ తప్పదు. గ్రూప్ దశలో 29 గోల్స్‌తో అదరగొట్టిన యువ భారత్ బెల్జియంతో క్వార్టర్‌ఫైనల్లో అతికష్టంపై గెలిచింది. డిఫెన్స్‌లో విఫలమైన భారత బృందం నిర్ణీత సమయంలో 2-2తో సమానంగా నిలిచింది. షూటౌట్‌లో గోల్‌కీపర్ ప్రిన్స్‌దీప్ సింగ్ అడ్డుగోడలా నిలిచి జట్టుకు విజయాన్ని అందించాడు. గ్రూప్ దశలో చెలరేగిన ఫార్వర్డ్ ఆటగాళ్లు క్వార్టర్స్‌లో నిరాశపరిచారు. జర్మనీపై విజయం సాధించాలంటే మన్‌మీత్ సింగ్, దిల్‌రాజ్ సింగ్, అజీత్ యాదవ్, సౌరభ్, అర్ష్‌దీప్ సింగ్ రాణించాల్సిన అవసరముంది. మరోవైపు జర్మనీ కూడా క్వార్టర్స్‌లో ఫ్రాన్స్‌పై షూటౌట్‌లో విజయం సాధించి.. సెమీస్ చేరింది. మరి ఈ రెండు జట్లలో ఫైనల్ చేరేదెవరో. ఈ టోర్నీలో రెండుసార్లు విజేతగా నిలిచిన భారత్ చివరగా 2016లో టైటిల్ గెలిచింది. ఆదివారం జరిగే మరో సెమీస్‌లో స్పెయిన్‌ను అర్జెంటీనా ఢీకొంటుంది.

మరో ఓటమి దిశగా ఇంగ్లాండ్

- రెండో ఇన్నింగ్స్‌లో 134/6
- ఆసీస్‌కు 177 పరుగుల ఆధిక్యం
- టెస్టుల్లో స్టార్క్ అత్యధిక స్కోరు



స్టార్క్

బ్రిస్బేన్: యాషెస్ సిరీస్‌లో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అదే కథ! మ్యాచ్‌ను మెరుగ్గా ఆరంభించినప్పటికీ, తర్వాత పట్టువిడిచిన ఇంగ్లాండ్.. మరో ఓటమికి సిద్ధమైంది. ఆతిథ్య ఆస్ట్రేలియాకు తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగుల భారీ ఆధిక్యాన్ని సమర్పించుకున్న ఇంగ్లిష్ జట్టు.. రెండో ఇన్నింగ్స్‌లో తీవ్రంగా తడబడుతోంది. మూడో రోజు, శనివారం ఆట చివరికి ఆ జట్టు 134/6తో నిలిచింది. మిచెల్ స్టార్క్ (2/48), మైకెల్ నీసర్ (2/27), స్కాట్ బోలాండ్ (2/33) ఆ జట్టును దెబ్బ కొట్టారు. ఓపెనర్ జాక్ క్రాలీ (44) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు. తొలి ఇన్నింగ్స్ సెంచరీ వీరుడు జో రూట్ ఈసారి 15 పరుగులే చేశాడు. కెప్టెన్ స్టోక్స్ (4)తో కలిసి విల్ జాక్స్ (4) క్రీజులో ఉన్నాడు. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే ఇంగ్లాండ్ ఇంకా 43 పరుగులు చేయాలి. అంతకుముందు 378/6తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆసీస్.. అనూహ్యంగా 511 పరుగులు చేసి ఆలౌటైంది. బంతితో 6 వికెట్లు తీసిన స్టార్క్ బ్యాటుతోనూ రెచ్చిపోయాడు. 141 బంతులు ఎదుర్కొన్న అతను.. 77 (13×4) పరుగులు చేశాడు. స్టార్క్‌కిది టెస్టుల్లో అత్యధిక స్కోరు కావడం విశేషం. నీసర్ (16), బోలాండ్ (21), డాగెట్ (13) అతడికి సహకరించడంతో స్కోరు 500 దాటింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 334 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

వెర్‌స్టాపెన్‌కు పోల్



వెర్‌స్టాపెన్

అబుదాబి: ఈ ఏడాది ఫార్ములావన్ ఛాంపియన్‌ను నిర్ణయించే అబుదాబి గ్రాండ్‌ప్రిలో మాక్స్ వెర్‌స్టాపెన్ పోల్ పొజిషన్ సాధించాడు. ఆదివారం అగ్రస్థానం నుంచి అతడు రేసు ఆరంభిస్తాడు. 2015 నుంచి ఇక్కడ పోల్ పొజిషన్ సాధించిన వారే ప్రధాన రేసులోనూ విజేతగా నిలవడం విశేషం. వరుసగా అయిదోసారి ఎఫ్1 డ్రైవర్ టైటిల్ వెర్‌స్టాపెన్ సొంతమవ్వాలంటే ఈ రేసులో అతడు విజేత కావడంతో పాటు.. మెక్‌లారెన్ రేసర్ నోరిస్ టాప్-3లో నిలవకూడదు. నోరిస్ టాప్-3లో నిలిస్తే చాలు.. అబుదాబిలో ఎవరు గెలిచినా ఎఫ్1 ఛాంపియన్‌షిప్ అతడి సొంతం అవుతుంది. ప్రస్తుతం ఛాంపియన్‌షిప్ రేసులో నోరిస్ (408-మెక్‌లారెన్), వెర్‌స్టాపెన్ (396- రెడ్‌బుల్), పియాస్ట్రి (392-మెక్‌లారెన్) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

సూపర్ లీగ్‌కు ఆంధ్ర

లఖ్‌నవూ: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఆంధ్ర మరో మ్యాచ్ ఆడాల్సి ఉండగానే సూపర్ లీగ్‌కు అర్హత పొందింది. ఎలైట్ గ్రూప్-ఎలో తొలి రెండు స్థానాల్లో చోటు ఖాయం కావడంతో బెర్తు ఖరారైంది. శనివారం కేరళతో ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ఆంధ్ర 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కేరళను 119/7కు కట్టడి చేసిన ఆంధ్ర.. 12 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. శ్రీకర్ భరత్ (53; 28 బంతుల్లో 6×4, 3×6) చెలరేగడంతో ఆంధ్రకు విజయం తేలికైంది. అశ్విన్ హెబ్బర్ (27), అవినాశ్ (20) రాణించారు. అంతకుముందు ఆంధ్ర బౌలర్లు విజృంభించడంతో కేరళ బ్యాటర్లు తీవ్రంగా తడబడ్డారు. కెప్టెన్ సంజు శాంసన్ (73; 56 బంతుల్లో 8×4, 3×6) ఒంటరి పోరాటం చేశాడు. అతడు, నిదీశ్ (13) మినహా ఎవరూ రెండంకెల స్కోరు చేయలేదు. సత్యనారాయణ రాజు (2/24), సౌరభ్ కుమార్ (2/18) రెండేసి వికెట్లు తీశారు. గ్రూప్-ఎ నుంచి ఆంధ్ర (20 పాయింట్లు)తో పాటు ముంబయి తర్వాతి దశకు చేరింది.

హైదరాబాద్ దూకుడు: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హైదరాబాద్ జోరు కొనసాగుతోంది. ఎలైట్ గ్రూప్-బిలో అయిదో విజయాన్ని ఖాతాలో వేసుకున్న ఆ జట్టు సూపర్ లీగ్ బెర్తును దాదాపుగా ఖాయం చేసుకుంది. శనివారం హైదరాబాద్ 7 వికెట్ల తేడాతో బిహార్‌పై ఘన విజయం సాధించింది. తనయ్ త్యాగరాజన్ (3/21), చామా మిలింద్ (2/18) విజృంభించడంతో మొదట బిహార్ 8 వికెట్లకు 132 పరుగులే చేసింది. పియూష్ (34) ఆ జట్టులో టాప్‌స్కోరర్. లక్ష్యాన్ని హైదరాబాద్ 12.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (67 నాటౌట్; 42 బంతుల్లో 11×4, 1×6) చెలరేగి ఆడి, జట్టును విజయపథంలో నడిపాడు. ప్రజ్ఞయ్ రెడ్డి (29) రాణించాడు. తన చివరి మ్యాచ్‌లో విజయం సాధిస్తే గ్రూప్‌లో అగ్రస్థానంతో హైదరాబాద్ (20 పాయింట్లు) ముందంజ వేస్తుంది. ఓడితే.. మిగతా జట్ల ఫలితాల ఆధారంగా తర్వాతి దశకు చేరుతుంది.

గుజరాత్ ఒక వికెట్ తేడాతో: హైదరాబాద్‌లో ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ ఒక వికెట్ తేడాతో హిమాచల్ ప్రదేశ్‌ను ఓడించింది. మొదట హిమాచల్ 8 వికెట్లకు 193 పరుగులు చేసింది. కెప్టెన్ సురోచ్ (88) జట్టుకు భారీ స్కోరు అందించాడు. లక్ష్యఛేదనలో సమష్టిగా రాణించిన గుజరాత్ ఆఖరి బంతికి విజయాన్ని అందుకుంది. 9 వికెట్లు కోల్పోయిన ఆ జట్టును ఆఖర్లో హర్షల్ పటేల్ (12; 8 బంతుల్లో 2×4) గెలిపించాడు. ఉర్విల్ (39), ఆర్య దేశాయ్ (37), సౌరభ్ చౌహాన్ (35) రాణించారు. మరో మ్యాచ్‌లో పంజాబ్ 73 పరుగుల తేడాతో సర్వీసెస్‌ను ఓడించింది. అభిషేక్ శర్మ (62; 34 బంతుల్లో 8×4, 3×6), ప్రభ్‌సిమ్రన్ (28 బంతుల్లో 50), నమన్ ధీర్ (22 బందుత్లో 54) చెలరేగడంతో పంజాబ్ 6 వికెట్లకు 233 పరుగులు చేసింది. భారీ లక్ష్యఛేదనలో సర్వీసెస్ 19.4 ఓవర్లలో 160 పరుగులకు ఆలౌటైంది. అభిషేక్, సన్వీర్ సింగ్, హర్‌ప్రీత్ తలో రెండు వికెట్లు పడగొట్టి జట్టును గెలిపించారు.



అభిషేక్

ఫైనల్లో తన్వి

గువాహటి: గువాహటి మాస్టర్స్ సూపర్ 100 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత యువ షట్లర్ తన్వి శర్మ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతక విజేత 16 ఏళ్ల తన్వి సెమీస్‌లో 21-18, 21-16తో మూడో సీడ్ హినా అకెచి (జపాన్)ను ఓడించింది. ఫైనల్లో ఆమె టుంగ్ సియో టాంగ్ (చైనీస్ తైపీ)ను ఢీకొంటుంది. పురుషుల విభాగంలో టైటిల్ భారత్‌కు ఖాయమైంది. ఇద్దరు భారత కుర్రాళ్లు మిథున్ మంజునాథ్, సంస్కార్ సరస్వత్ ఫైనల్ చేరారు. సెమీస్‌లో సరస్వత్ 21-19, 21-9తో దెండి ట్రియాన్స్ (ఇండోనేషియా)ను ఓడించగా.. మంజునాథ్ 22-20, 21-8తో సహచరుడు తుషార్‌పై విజయం సాధించాడు.

అరుదైన ఖనిజాల క్లస్టర్‌గా విశాఖ

- బీచ్‌శాండ్ ప్రాజెక్టులను ప్రోత్సహించనున్న రాష్ట్రప్రభుత్వం
- టైటానియం పార్క్ అభివృద్ధి చేస్తామంటూ అదానీ సంస్థ ప్రతిపాదన
- భూ అయస్కాంత ఖనిజాల తయారీ కంపెనీలను ఆహ్వానించేలా కార్యాచరణ

ఈనాడు, అమరావతి: శ్రీకాకుళం నుంచి మచిలీపట్నం వరకు సముద్రతీరంలో బీచ్‌శాండ్ మినరల్స్ నిల్వలు ఉన్నాయి. ఇందులో అరుదైన ఖనిజాలు లభిస్తాయి. ఇప్పటివరకు ఇలాంటి ఖనిజాలపై చైనా గుత్తాధిపత్యం ఉంది. మన దేశంలో లభించే ఈ ఖనిజాలను సద్వినియోగం చేసుకోవడంపై కేంద్రం దృష్టి పెట్టింది. దీంతో ఏపీ ప్రభుత్వం కూడా కోస్తా జిల్లాల పరిధిలో బీచ్‌శాండ్ మినరల్స్ తవ్వి, శుద్ధి చేసి, వాటినుంచి అరుదైన ఖనిజాలను తయారుచేసే సంస్థలను ప్రోత్సహించేందుకు సిద్ధమైంది. దీనికోసం విశాఖ పరిధిలో అరుదైన ఖనిజాల క్లస్టర్ ఏర్పాటు చేయాలని, విజన్-2047 నాటికి ఎంతమేరకు ఖనిజాలు ఉత్పత్తి చేయాలనేదానిపై రోడ్‌మ్యాప్ రూపొందిస్తోంది.

రాష్ట్రానికి మంచి అవకాశం

★ శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు 16,600 హెక్టార్ల పరిధిలో బీచ్‌శాండ్ మినరల్స్ ఉన్నాయి. వీటిని 16 బ్లాక్‌లుగా గుర్తించారు. ఇందులో 21 కోట్ల టన్నుల బీచ్‌శాండ్ నిల్వలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

★ శ్రీకాకుళం జిల్లా గార, విశాఖపట్నం జిల్లా భీమిలి మండలాల పరిధిలో 2 బ్లాక్స్‌లో వెయ్యి హెక్టార్లను.. మూడు లీజులుగా ఏపీఎండీసీకి కేటాయించారు. మిగిలిన బ్లాక్స్ కూడా కేటాయిస్తే, పూర్తిస్థాయిలో కార్యకలాపాలు చేపడతామని రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది.

★ ఈ బీచ్‌శాండ్ మినరల్స్‌లో ఇలిమినైట్, రూటైల్, గార్నెట్, సిలిమనైట్, జిర్కాన్, మోనజైట్ లాంటి ఖనిజాలు లభిస్తాయి. వీటిలో ఇలిమినైట్, రూటైల్ నుంచి టైటానియం ముడిఖనిజం వస్తుంది. దాన్ని శుద్ధిచేస్తే టైటానియం ఆక్సైడ్ పిగ్మెంట్లు వస్తాయి.

★ మోనజైట్‌లో రేడియోధార్మికత కలిగిన థోరియం కంటెంట్ ఉంటుంది. దీనినుంచి భూఅయస్కాంత ఖనిజం లభిస్తుంది.

★ ఎలక్ట్రానిక్ వస్తువులు, సెన్సర్లు, రాకెట్లలో భూఅయస్కాంత ఖనిజాన్ని వినియోగిస్తారు.

సమీకృత కాంప్లెక్స్ ఏర్పాటుకు అదానీ సిద్ధం

ఏపీలో టైటానియం, అరుదైన ఖనిజాల తవ్వకాలు, శుద్ధి కోసం సమీకృత కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని అదానీ గ్రూప్‌నకు చెందిన అల్లూవియల్ హెవీ మినరల్స్ లిమిటెడ్ (ఏహెచ్‌ఎంఎల్) ప్రభుత్వానికి ప్రతిపాదన అందజేసింది. ఇప్పటికే ఈ సంస్థ ఏపీఎండీసీకి చెందిన మూడు లీజుల్లోని వెయ్యి హెక్టార్లలో బీచ్‌శాండ్ తవ్వకాలు, అందులోని ఆయా ఖనిజాలను వేరు చేయడం, శుద్ధిచేయడం, విలువ జోడించడం వంటివి చేసేలా మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్‌గా టెండరు దక్కించుకొని, ఇటీవలే ఒప్పందం కూడా చేసుకుంది. ఖనిజాలు వేరుచేసే ప్లాంట్, శుద్ధిచేసే ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దీనికితోడు ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామంది. ఈ ఖనిజాలను శుద్ధి చేయడం క్లిష్టతరమైన ప్రక్రియ. అనేక రక్షణ చర్యలు తీసుకోవాలి. వీటికోసం ఒకేచోట ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని తెలిపింది. ఇందుకు రూ.23వేల కోట్ల పెట్టుబడులు పెడతామని, దీనివల్ల 20వేల మందికి ఉపాధి దక్కుతుందని తన ప్రతిపాదనల్లో పేర్కొంది. దీనిని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

కేంద్ర పథకాన్ని వినియోగించుకునేలా..

అరుదైన ఖనిజాల కోసం విదేశాలపై ఆధారపడటం తగ్గించి, స్వదేశంలో లభించేవాటి తయారీని ప్రోత్సహించాలని కేంద్రం నిర్ణయించింది. దీనికోసం రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ (ఆర్ఈపీఎం) అనే పథకానికి కేంద్ర మంత్రివర్గం గతనెలలో ఆమోదం తెలిపింది. దీనికి రూ.7,280 కోట్లు కేటాయించింది. అంతర్జాతీయ స్థాయిలో బిడ్డింగ్ ద్వారా ఐదు ఔత్సాహిక కంపెనీలను ఎంపికచేసి, ఏడాదికి 1,200 టన్నుల సామర్థ్యంతో పనిచేసేలా ఒక్కో కంపెనీ అవకాశం కల్పించనున్నారు. వీటికి రాయితీల కింద కేంద్రం నిధులిస్తుంది. ఔత్సాహిక కంపెనీల్లో కొన్నింటిని ఏపీలో ప్లాంట్లు ఏర్పాటుచేసేలా ప్రయత్నాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు.. ఇటీవల ఏపీఎండీసీ, గనులశాఖ అధికారులను ఆదేశించారు.

గిరిజనుల ఆదాయం పెంపునకు చర్యలు తీసుకోవాలి

- అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం



ఈనాడు, అమరావతి: 'అడవిని నమ్ముకుని బతికే గిరిజనుల జీవన ప్రమాణాలు పెరిగేలా యంత్రాంగం పనిచేయాలి. వారి ఆదాయ మార్గాలు పెంచాలి. అందుకు తగినట్లు ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్, ఎకో టూరిజం, పర్యాటకం అంశాల ప్రాతిపదికగా గిరిజన యువతకు నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్‌లతో శనివారం మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో ఆ జిల్లా కలెక్టర్, ఎస్పీలుగా పనిచేసిన సుమిత్‌కుమార్, సతీష్‌కుమార్‌లు సైతం పాల్గొన్నారు. 'గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచాలి. అటవీ, ఆర్గానిక్ ఉత్పత్తులకు ఎంతో డిమాండ్ ఉంది. అడవిలో దొరికే వివిధ ఉత్పత్తుల సాగును ప్రోత్సహించాలి. గిరిజనుల్లో ఉత్తేజం నింపేలా కొత్త కార్యక్రమాలు రూపొందించాలి. యువతను ఆంత్రప్రెన్యూర్లుగా మార్చాలి. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు అందుబాటులోకి తీసుకురావాలి' అని పేర్కొన్నారు. ప్రతినెలా ఆయా అంశాలను సమీక్షిద్దామన్నారు.

లోకేశ్ కృషి అభినందనీయం

'విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురావాలనే దృఢ సంకల్పంతో అధునాతన సదుపాయాలు, పోషకాహారం, ఆహ్లాదకర వాతావరణంలో నాణ్యమైన విద్య అందించేందుకు విద్యా శాఖ మంత్రి లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయం' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. తాను మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు ఉప ముఖ్యమంత్రిని ఉద్దేశించి విద్యా శాఖ మంత్రి లోకేశ్ చేసిన ప్రకటనకు పవన్ కల్యాణ్ పైవిధంగా స్పందించారు. 'చిలకలూరిపేట శారదా జడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్, టీచర్ సమావేశానికి హాజరైన పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ఆ స్కూలు గ్రంథాలయానికి పుస్తకాలు, ర్యాక్‌లు, 25 కంప్యూటర్లు అందిస్తానని ప్రకటించిన పవనన్నకు ధన్యవాదాలు' అని లోకేశ్ ఎక్స్‌లో తెలిపారు.

'క్వాంటమ్' కోర్సుకు 51,820 రిజిస్ట్రేషన్లు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నెలకొల్పుతున్న ప్రభుత్వం... ఆ టెక్నాలజీల్లో నిపుణులైన మానవ వనరుల్ని సిద్ధం చేసేందుకు ప్రారంభిస్తున్న కోర్సుకు విశేష స్పందన లభించింది. 50 వేల మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుని నవంబరు 19న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించగా... శనివారం రాత్రి 9.30 గంటల సమయానికి 51,820 రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీరిలో యువతులే ఎక్కువగా ఉండటం విశేషం. 26,614 మంది యువతులు, 25,206 మంది యువకులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. డిసెంబరు 8న కోర్సు ప్రారంభం కానుండగా రెండు దశల్లో శిక్షణ ఉంటుంది. నాలుగు వారాల బేసిక్ కోర్సులో ప్రతిభ కనబరిచిన 3 వేల మందిని ఎంపిక చేసి ఫేజ్-2లో ఎడ్వాన్స్డ్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అమెరికా కంపెనీ వైజర్, హైదరాబాద్‌లోని క్యూబిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్ సంస్థలు సంయుక్తంగా రూ.500 ఫీజుకే ఈ ఆన్‌లైన్ కోర్సు అందజేస్తున్నాయి.

పట్నాలో తితిదే ఆలయ నిర్మాణానికి ఆమోదం

తిరుమల, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించడంతో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు కొంత కాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా బిహార్ రాష్ట్ర రాజధాని పట్నాలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందని తితిదే ఛైర్మన్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పట్నాలో 10.11 ఎకరాల భూమిని 99 ఏళ్లపాటు ఒక రూపాయి టోకెన్ లీజ్‌రెంట్‌పై కేటాయించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తితిదే ప్రతినిధులు త్వరలో సంప్రదింపులు ప్రారంభించి, ఆలయ నిర్మాణానికి సంబంధించిన తదుపరి చర్యలు చేపడతారని తెలియజేశారు. ఈ నిర్ణయంతో తితిదే ఛైర్మన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ అభినందించారు.

21 లక్షల బీసీల ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

అనంతపురం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా 21 లక్షల బీసీల ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో 7.48 లక్షల ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై కూడా వచ్చే ఏడాది మార్చిలోపు 415 మెగావాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ పనులు పూర్తి చేసేలా కార్యాచరణను వేగంగా చేపట్టాలని ఆదేశించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆయన శనివారం అనంత చేరుకున్నారు. కలెక్టరేట్‌లో ఆయనకు ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్, కలెక్టర్ ఆనంద్, జేసీ శివనారాయణ శర్మ, ఎస్పీ జగదీశ్, తదితరులు స్వాగతం పలికారు. ఆ తర్వాత పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్, ఎన్ఆర్ఈడీసీఏపీ ప్రాజెక్టుల పురోగతి, అమలు తీరును సీఎస్ సమీక్షించారు.

నేడు 'క్లాట్-2026' పరీక్ష

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా వచ్చే విద్యా సంవత్సరం(2026-27)లో ప్రతిష్ఠాత్మక న్యాయవిద్య విశ్వవిద్యాలయాల్లో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్-2026) ఆదివారం జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు/పట్టణాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నేషనల్ లా వర్సిటీల కన్సార్షియం తరఫున బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ ఈ పరీక్షను నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లోని నల్సార్ వర్సిటీ, విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా వర్సిటీలో సీట్లను కూడా ఈ పరీక్ష ర్యాంకర్లతో భర్తీ చేస్తారు. దేశవ్యాప్తంగా యూజీ, పీజీ సీట్లు సుమారు 4,500 వరకున్నాయి.



అతిగా ఆలోచించడమే అసలు సమస్య

అతిగా ఆలోచించడం వల్లే ఎక్కువ అనర్థం జరుగుతుంది. చాలా సార్లు అసలైన సమస్య కన్నా, దాన్ని మనం చూసే దృష్టికోణమే పరిస్థితులను జటిలంగా మారుస్తుంది. అందుకే అనవసరంగా ఆందోళన చెందకుండా, ప్రశాంతంగా కూర్చొని హేతుబద్ధంగా ఆలోచిస్తే వాస్తవ పరిస్థితి అవగతమవుతుంది. అప్పుడే సరైన నిర్ణయాలు తీసుకోగలం.

– క్రిస్ డోన్లీ, ఏఐ కన్సల్టెంట్

విశాఖకు పోలవరం నీళ్ల మళ్లింపులో సవాళ్లెన్నో!

- సంక్లిష్టంగా ఏలేరు కాలువ సామర్థ్యం పెంపు పనులు
- డ్రెడ్జింగ్‌కు ప్రత్యేకంగా ఎక్స్‌కవేటర్ రూపకల్పన
- పూడిక మట్టిని తరలించడానికీ అవస్థలే



ప్రత్యేక ఏర్పాట్లతో ఏలేరు కాలువలో పూడికతీత పనులు

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం నగరానికి గోదావరి జలాలు మళ్లించే పనులు ఎన్నో సంక్లిష్టతలతో అధికారులకు సవాలుగా మారాయి. విశాఖ నగరం తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు కలిపి 24 టీఎంసీల మేర పోలవరం ప్రాజెక్టు నుంచి తరలించనున్నారు. ఇప్పటికే ఏలేరు జలాశయం ఎడమ కాలువ ద్వారా విశాఖ తాగునీటి అవసరాలు కొంతవరకు తీరుస్తున్నారు. ఏడాదంతా ఈ కాలువ ప్రవహిస్తూనే ఉంటుంది. పోలవరం ఎడమ కాలువ నుంచి గోదావరి జలాలను విశాఖకు మళ్లించేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రధానంగా పోలవరం ఎడమ కాలువ, ఏలేరు కాలువతో అనుసంధానమైన తర్వాత చేపట్టాల్సిన పనులు అధికారులకు సవాలుగా మారాయి.

ఎన్నో సమస్యలు..

★ ఎప్పుడో తవ్విన ఏలేరు ఎడమ కాలువ నుంచి విశాఖనగరం తాగునీటి అవసరాలకు, స్టీల్‌ప్లాంటుకు నీటిని మళ్లిస్తున్నారు. ఈకాలువకు ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు వీలులేని పరిస్థితులున్నాయి. ఈ కాలువకు నీటిని నిలిపివేయాలంటే ఎన్నో సమస్యలు దాటాలి.

★ ఇప్పుడు పోలవరం ఎడమకాలువ 162.409 కి.మీ. వరకు వెళ్లిన తర్వాత ఏలేరు కాలువతో అనుసంధానమవుతుంది. అక్కడి నుంచి ఏలేరు కాలువ విశాఖలోని గాజువాక ప్రాంతానికి తాగునీరందించే కణితి జలాశయానికి జలాలు తీసుకువెళ్తుంది.

★ పోలవరం ఎడమ కాలువ ప్రవాహ సామర్థ్యం మేరకు ఏలేరు కాలువను తవ్వాలన్నది ప్రణాళిక. ఏలేరు కాలువను ఎక్కువ రోజులు మూసి ఉంచే ఆస్కారమే లేదు. విశాఖ నగరపాలక సంస్థ, స్టీల్‌ప్లాంట్ అధికారులు అంగీకారానికి వచ్చి, 40 రోజుల పాటు ఏలేరు కాలువను మూసివేసి.. పనులు చేపట్టేందుకు వీలు కల్పించారు. అప్పట్లో జలాశయం వద్ద కాలువకు నీటిని మళ్లించే గేటు మూసివేయడానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ఆ పరిమిత సమయంలో పనులు పూర్తిచేసే అవకాశం లేకుండా పోయింది.

★ పోలవరం ఎడమ కాలువ, ఏలేరు కాలువ అనుసంధానమైన తర్వాత నుంచి 10.9 కి.మీ. మేర గతంలోనే వెడల్పు చేశారు. 2,295 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి అనువుగా తవ్వారు. 10.9 కిలోమీటర్ల తర్వాత కుడి వైపునకు సాగునీటి కాలువ ఉంది. అది అనకాపల్లి జిల్లాలో 55 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తుంది. తర్వాత కణితి రిజర్వాయర్ వరకు సాగే కాలువను తాగునీటి కాలువగా పేర్కొంటారు.

డ్రెడ్జింగ్ పెను సవాల్

★ తాగునీటి కాలువను ఇప్పుడు 1,059 క్యూసెక్కులు ప్రవహించే సామర్థ్యానికి పెంచాల్సి ఉంది. దీన్ని వెడల్పు చేసే ఆస్కారమే లేదు. లోతు ఎక్కువ, వెడల్పు తక్కువ ఉంటుంది. దీన్ని పోలవరం ఎడమ కాలువ ప్రవాహ సామర్థ్యం మేరకు పూడిక తీసి తవ్వుతున్నారు.

★ దాదాపు 22 కి.మీ. మేర కాలువలో డ్రెడ్జింగ్ చేసేందుకు అనువైన పరికరాలు లేవు. కాలువ సన్నగా, లోతుగా ఉంది. ఇందుకోసం ప్రత్యేకంగా అక్కడి పరిస్థితులకు తగ్గట్లు డ్రెడ్జింగ్ ఏర్పాట్లు చేశారు. దీనికోసం ప్రత్యేకంగా యాంబిషన్ ఎక్స్‌కవేటర్ తయారు చేయాల్సి వచ్చింది. దీనికితోడు క్యారీ బ్యార్జెస్ వినియోగిస్తున్నారు. ఇలాంటివి మొత్తం మూడు పరికరాలు తయారు చేశారు.

★ పూడిక మట్టిని ఆ కాలువలోనే కొంత దూరం మళ్లించి.. అక్కడ ట్రాక్టర్‌కు లోడింగ్ చేసి, డంపింగ్ చేయాల్సి వస్తోంది.

ప్రత్యేకంగా చేస్తున్నాం..

ఏలేరు కాలువపై వంతెనలు ఎప్పుడో నిర్మించినవి కావడంతో ఆ యంత్ర పరికరాలను వంతెన కింది నుంచి కాలువ దాటించడమూ కష్టంగా ఉందని ఎనిమిదో ప్యాకేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఉమేష్ వెల్లడించారు. 'ప్రతి ఐదు కిలోమీటర్లకు ఏలేరు కాలువలో లెవెల్స్ మారిపోతుంటాయి. కాలువ గట్ల పొడవునా పెద్ద అడవిలా తయారైంది. ఆ చెట్లన్నీ కొట్టించి పనులు చేస్తున్నాం. పూడిక తీసిన మట్టిని కాలువలోనే మళ్లీ వెనక్కు తీసుకురావాల్సి వస్తోంది. ఈ విధానంలో ఒకే పనిని మూడుసార్లు చేసినట్లవుతోంది. ఇలా ప్రత్యేక ఎక్స్‌కవేటర్ తయారీకి, ఈ తరహాలో పనులు చేసేందుకు ముందే ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నాం' అని తెలిపారు. – ఉమేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు

కడప స్టీల్‌ప్లాంటు హామీ గాలికొదిలేసిన జగన్

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ఈనాడు, అమరావతి: కడపలో స్టీల్‌ప్లాంటు హామీని గాలికొదిలేసిన జగన్. విశాఖ స్టీల్‌ప్లాంటు విషయంలో తప్పుడు ప్రచారం చేయడం సరికాదని కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ధ్వజమెత్తారు. విజయవాడలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటుపరం చేస్తారన్న ప్రచారం అవాస్తవం. ఉద్యోగులు, కార్మికుల ప్రయోజనాలు కాపాడడంలో కేంద్ర- రాష్ట్రప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంది. కార్మికులు, వారి కుటుంబాల భద్రతకు ఎలాంటి నష్టం ఉండదు. డబుల్ ఇంజిన్ సర్కారు వచ్చాక రూ.11,500 కోట్ల ప్యాకేజీ ఇచ్చింది. జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లలో ప్యాకేజీ ఇప్పించగలిగిందా..?' అని ప్రశ్నించారు.

గాడిన పడడానికి సమయం: 'ఉత్పత్తి సామర్థ్యం లేనప్పుడు పెట్టుబడిని పక్కకు మళ్లించి విశాఖలో మూడో బ్లాస్ట్‌ఫర్నెస్ ఎందుకు పెట్టాలి? కేంద్రం ప్యాకేజీ ఇచ్చేవరకు దాన్ని ఎందుకు ప్రారంభించలేదు? మేం వచ్చాకే దాన్ని వినియోగంలోకి తెచ్చాం. అది గాడిన పడడానికి సమయం పడుతుంది. విశాఖ ఉక్కుకు ఒడిశాలో ఉన్న గనులు వినియోగంలోకి తేవాలి. రాయ్‌బరేలిలో అక్కడి ఎంపీని సంతృప్తిపరచడానికి అప్పట్లో అక్కడో యూనిట్ పెట్టారు. ఇలాంటి నిర్ణయాల వల్లే ఒక్క రూపాయి ఆదాయం రాకపోగా, నష్టం వచ్చింది' అని శ్రీనివాసవర్మ వ్యాఖ్యానించారు.

విభజన హామీలపై ఎంపీలు నోరు విప్పాలి

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: ప్రత్యేక హోదా, విభజన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదని, అయినా మన ఎంపీలకు ఏమీ పట్టడంలేదని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. రాష్ట్రం నుంచి 36 మంది ఎంపీలు ఉన్నారని, పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాలపై ఎవరైనా మాట్లాడతారా అని ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. శనివారం ఆంధ్రరత్న భవన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి, షర్మిల మాట్లాడారు. ఎంపీలందరూ పేరుకు మాత్రమే వేర్వేరు పార్టీలవారని, నిజానికి వారంతా భాజపాకు బినామీ ఎంపీలని ఆరోపించారు. రాజధాని నిర్మాణంలో కేంద్రం తన బాధ్యతను విస్మరిస్తోందని విమర్శించారు.

విద్యార్థిని గొలుసుతో బంధించిన ఉపాధ్యాయులు

ఒడిశాలో ఇద్దరిని సస్పెండ్‌చేసిన అధికారులు



రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లా బెగూనియా ప్రభుత్వ యూజీ ఎగువ ప్రాథమిక పాఠశాలకు చెందిన నాలుగో తరగతి విద్యార్థిని వసతి గృహంలో మంచానికి గొలుసుతో బంధించారు. ఇందుకు సంబంధించి వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో కలెక్టర్ సూర్యవంశీ మయూర్ బికాస్ దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సబ్‌కలెక్టర్ మధుస్మిత సామంత్రాయ్, జిల్లా సంక్షేమ అధికారి, సమితి విద్యాధికారి సత్యనారాయణ్ భూయాన్‌ల బృందం విచారణ జరిపింది. ఈ ఘటనకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘునాథ్ బుగుడాయి, ఉపాధ్యాయుడు జతిన్ పరిడాలను బాధ్యులుగా చేస్తూ శనివారం వారిని సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థిని ఎందుకు బంధించారన్న విషయమై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

11 నుంచి అటల్- మోదీ సుపరిపాలన యాత్ర

- 25న అమరావతిలో విగ్రహావిష్కరణ
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వెల్లడి

ఈనాడు, అమరావతి: మాజీ ప్రధాని వాజ్‌పేయీ దేశానికి అందించిన సేవలు, సుపరిపాలనను నేటి తరానికి గుర్తుచేస్తూ.. అందరిలో స్ఫూర్తిని నింపేందుకు ఆయన శత జయంతి ముగింపు సందర్భంగా సుపరిపాలన బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వెల్లడించారు. కూటమి నేతల భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఈ నెల 11 నుంచి 25 వరకు రెండు దశల్లో 'అటల్- మోదీ సుపరిపాలన యాత్ర' చేపట్టనున్నామని చెప్పారు. విజయవాడలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'బస్సు యాత్ర డిసెంబరు 11న ధర్మవరంలో ప్రారంభమవుతుంది. 12న అనంతపురం, కర్నూలులో.. 13న నంద్యాల, కడప.. 14న రాజంపేట, తిరుపతి.. 15న నెల్లూరు, ఒంగోలు.. 16న బాపట్ల, మచిలీపట్నం.. 19న శ్రీకాకుళం, విజయనగరం.. 20న విశాఖపట్నం, అనకాపల్లి.. 21న కాకినాడ, రాజమహేంద్రవరం.. 22న భీమవరం, ఏలూరుల్లో యాత్ర నిర్వహిస్తాం. డిసెంబర్ 25న వాజ్‌పేయీ జయంతి సందర్భంగా అమరావతిలో సుపరిపాలన దివస్ బహిరంగ సభ, వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ ఉంటాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంతులు, కూటమి నాయకులు పాల్గొంటారు. అమరావతిలో విగ్రహం వద్ద స్మృతివనం ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం' అని మాధవ్ వెల్లడించారు.

దేశం గర్వించదగ్గ నేత: కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ దేశం గర్వించదగ్గ నేత అని కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. 'వాజ్‌పేయీ నైతిక విలువలతో రాజకీయం చేసి, అభివృద్ధితో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. ఆయన స్ఫూర్తి నింపేలా ప్రధాన కూడళ్లలో కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలని భాజపా రాష్ట్ర శాఖ నిర్ణయించింది. రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొనే గొప్ప యాత్ర ఇది' అని పేర్కొన్నారు. యాత్ర పోస్టర్, లోగోలను నాయకులు ఆవిష్కరించారు.



చంద్రబాబుకు యాత్ర రూట్‌మ్యాప్ వివరిస్తున్న మాధవ్. చిత్రంలో పల్లా శ్రీనివాసరావు, నాగభూషణం, రమేష్‌నాయుడు, జయప్రకాశ్ తదితరులు

సుపరిపాలన యాత్ర ప్రారంభోత్సవానికి చంద్రబాబుకు ఆహ్వానం

ఈనాడు, అమరావతి: మాజీ ప్రధాని వాజ్‌పేయీ శత జయంతి వేడుకల్లో భాగంగా ఈ నెల 11 నుంచి భాజపా ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిర్వహించనున్న 'అటల్- మోదీ సుపరిపాలన యాత్ర' ప్రారంభోత్సవానికి హాజరుకావాలని ముఖ్యమంత్రి చంద్రబాబును భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆహ్వానించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సీఎంను శనివారం ఆయన కలిశారు. బస్సు యాత్ర రూట్ మ్యాప్, వాజ్‌పేయీ విగ్రహాల ఆవిష్కరణలు, బహిరంగ సభలు.. యాత్ర ముగింపులో భాగంగా అమరావతిలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభ ప్రతిపాదనలను వివరించారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కూడా యాత్రకు ఆహ్వానించారు.



సదస్సులో మాట్లాడుతున్న భానుశాలి

సీఈ చట్టం రద్దుకు పోరాడాలి

ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు దిలీప్ భానుశాలి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీఈ) చట్టమంటే.. వైద్య రంగాన్ని కార్పొరేట్‌కు అప్పగించడమేనని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జాతీయ అధ్యక్షుడు దిలీప్ భానుశాలి పేర్కొన్నారు. దీన్ని రద్దు చేసేవరకు ప్రభుత్వాలతో పోరాడాలని పిలుపునిచ్చారు. విజయనగరంలో శనివారం ఐఎంఏ ఆధ్వర్యంలో 'జీపీ-కాన్ 2025' పేరుతో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైద్య రంగంలో కృత్రిమ మేధతో సవాళ్లను అధిగమించాలన్నారు. వైద్యులపై పెరుగుతున్న భౌతిక దాడులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. సర్వైకల్ క్యాన్సర్ రాకుండా నిరోధించే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఐఎంఏ వైద్యుల పిల్లలకు 50 శాతం రాయితీపై ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. దిల్లీలో రూ.70 కోట్లతో అసోసియేషన్ కొత్త భవనాన్ని నిర్మించదలచామని వెల్లడించారు. దేశంలో 13 లక్షల మంది వైద్యులున్నా నాలుగు లక్షల మందే ఐఎంఏలో సభ్యత్వం తీసుకున్నారని, మిగిలినవారూ చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సీజీపీ హెడ్‌క్వార్టర్స్ డీన్ డా. వి.ఎస్.ప్రసాద్, సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు డా. జి.సమరం, సీజీపీ (ఎలక్ట్ డీన్) శోభా ఔజా, ఉపాధ్యక్షుడు డా. గురులింగప్ప తదితరులు పాల్గొన్నారు.

గుచ్ఛంలాంటి పుష్పం!



పుష్పగుచ్ఛమో.. కళాకారులు తీర్చిదిద్దిన కళాఖండమో కాదిది. ఇది ఎండిపోయిన పుష్పం. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి పరిధిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో పెరిగే పైనస్ రాక్స్‌బర్గయ్ వృక్షాల పువ్వు. శంఖం ఆకారంలో ఉండి.. ఎండిన తర్వాత గుచ్ఛంలా కనువిందు చేస్తుంది. ఇందులోనే విత్తనాలు ఉంటాయని కొవ్వూరు పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ తెలిపారు. చూడటానికి ఆకర్షణీయంగా ఉండటంతో వీటిని దుకాణాలు, ఇళ్లల్లో అలంకరణకు వాడుతున్నారని తెలిపారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

రోజుకు 50 ప్రమాదాలు.. 23 మరణాలు

ఈ ఏడాది రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల లెక్కలివి


ప్రకాశం జిల్లాలో తీవ్రత ఎక్కువ

ఐదేళ్లుగా సగటున ఏటా 19 వేల ప్రమాదాలు

వీటిలో 8 వేల మంది మృతి

దేశంలో టాప్ 100 జిల్లాల్లో.. ఏపీ నుంచి ఆరు

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్న మోర్త్

రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఏడాది నవంబరు ఐదో తేదీ వరకు ఉన్న వివరాలు పరిశీలిస్తే.. సగటున రోజుకు 50 ప్రమాదాలు జరుగుతుంటే.. వాటిలో 23 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. 53 మంది క్షతగాత్రులవుతున్నారు. వాహనాలు అతివేగంతో దూసుకెళ్లడంతోనే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ముఖ్యంగా గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాలను..అధిక ప్రమాదాలతో క్లిష్టమైన జిల్లాలుగా కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) గుర్తించింది. వీటిలో ప్రమాదాలు తగ్గించేలా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది.

నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఎక్కువ మరణాలు

- ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకు చూస్తే.. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో దాదాపు 400 మంది ప్రాణాలు కోల్పోయారు.
- 200 మందిలోపు మరణాలు చోటుచేసుకున్న జిల్లాల జాబితాలో విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పశ్చిమగోదావరి ఉన్నాయి.
- మిగిలిన జిల్లాల్లో 200-400 మంది ప్రాణాలు కోల్పోయారు.
- విశాఖపట్నం, కోనసీమ, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో సగటున 600కుపైగా ప్రమాదాలు జరిగాయి.

సాయంత్రం దాటాకే అధిక ప్రమాదాలు..

గత మూడేళ్లలో ప్రమాదాలు జరిగిన సమయాలను విశ్లేషిస్తే.. సాయంత్రం దాటిన తర్వాత ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు.

- మూడేళ్లలో సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య 11,867 ప్రమాదాలు జరిగాయి.
- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 9,606 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.
- ఉదయం 6 నుంచి 9 గంటల వరకు 5,990 ప్రమాదాలు, 9 నుంచి 12 గంటల వరకు 7,740 ప్రమాదాలు, మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య 8,318 ప్రమాదాలు జరిగాయి.
- అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు మాత్రం కొంత తక్కువగా 2,453 ప్రమాదాలు సంభవించాయి.
- 2021 నుంచి 2025 వరకు ఐదేళ్ల లెక్కలు చూస్తే.. ఏటా సగటున 19 వేల ప్రమాదాలు జరుగుతుంటే, వాటిలో 8 వేల మంది చనిపోతుండగా, 20 వేల మంది గాయపడుతున్నారు.

మోర్త్ దేశవ్యాప్తంగా అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్న టాప్ 100 జిల్లాలను గుర్తించి ర్యాంకులు ఇవ్వగా, ఇందులో రాష్ట్రం నుంచి ఆరు జిల్లాలు ఉన్నాయి.

- ప్రకాశం-65, గుంటూరు-71, నెల్లూరు-75, అనంతపురం-81, కడప-87, చిత్తూరు-96 వ ర్యాంకులో ఉన్నాయి.
- ఈ జిల్లాల్లో ఎందుకు ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయో తెలుసుకునేందుకు చెన్నైకి చెందిన సేవ్‌లైఫ్ ఫౌండేషన్‌తో మోర్త్ అధ్యయనం చేయించింది. అనంతరం పలు సూచనలు చేసింది.
- మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగించకపోవడంపై పోలీసులు ముమ్మరంగా తనిఖీలు జరపాలని తెలిపింది.
- వాహనాల ఫిట్‌నెస్‌లు పరిశీలించాలని, ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలపై రవాణాశాఖ అధికారులు కేసులు నమోదు చేయాలని, సరకు, ప్రజా రవాణా వాహనాల డ్రైవర్లకు శిక్షణ ఇప్పించాలని పేర్కొంది.
- ప్రమాదాలు జరిగితే వెంటనే నగదు రహిత చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలని, హైవేలపై ట్రామాకేర్ సెంటర్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయాలని, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని సూచించింది.
- రహదారులపై బ్లాక్‌స్పాట్‌లను వెంటనే సరిచేయాలని, రహదారి భద్రత ఆడిట్ నిర్వహించాలని, రోడ్లపై వివిధ సూచికలు, క్రాష్ బ్యారియర్ల వంటివి ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ విభాగాలకు తెలిపింది.
- మద్యం దుకాణాలను జాతీయ, రహదారులకు ఆనుకొని లేకుండా ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

- ఈనాడు, అమరావతి


సంగీత కచేరి నిర్వహిస్తున్న ఎల్లా వెంకటేశ్వరరావు, అనంతకృష్ణ తదితరులు

భారతీయ కళలు, సంస్కృతికి పునర్వైభవం

- కృష్ణవేణి సంగీత నీరాజనంలో మంత్రి దుర్గేష్

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: భారతీయ కళలు, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే ప్రక్రియలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు నిర్వహించే 'కృష్ణవేణి సంగీత నీరాజనం-2025' మూడో దశ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. కేంద్ర, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలు, సంగీత నాటక అకాడమీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ వేడుకలను మంత్రి దుర్గేష్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు సంగీత వైభవాన్ని దేశవ్యాప్తంగా ప్రతిధ్వనింపజేసే లక్ష్యంతో కృష్ణవేణి సంగీత నీరాజనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు సంగీత పరంపరను మరింత ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. మనమైన కళారూపాల గొప్పతనాన్ని నేటి తరానికి వివరించి, వాటిపై ఆసక్తి కలిగించే బాధ్యతను అందరం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, కేంద్ర పర్యాటక శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ వెంకటరమణ హెగ్డే, సాంస్కృతిక శాఖ సంచాలకుడు రేగుళ్ల మల్లికార్జునరావు, ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్(ఆశా) అధ్యక్షుడు రామిశెట్టి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు, యువ కళాకారులు, వాయిద్యకారులు కర్ణాటక సంగీత శైలిలో ప్రదర్శనలు ఇచ్చారు.


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, సంగీత విద్వాంసుడు మల్లాది రవికుమార్, నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, కేంద్ర పర్యాటక శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ వెంకటరమణ హెగ్డే, కలెక్టర్ లక్ష్మీశ

15న విచారణకు రావాలని పీవీ సునీల్‌కుమార్‌కు నోటీసు

ఈనాడు, అమరావతి: నాటి నరసాపురం ఎంపీ, ప్రస్తుత ఉపసభాపతి రఘురామకృష్ణరాజును వైకాపా ప్రభుత్వ హయాంలో సీఐడీ పోలీసుల కస్టడీలో హింసించిన కేసులో ప్రధాన నిందితుడి (ఏ1)గా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌ను డిసెంబరు 15న విచారణకు రావాలని దర్యాప్తు అధికారి, విజయనగరం ఎస్పీ దామోదర్ నోటీసు ఇచ్చారు. గుంటూరులోని సీసీఎస్ పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. ఈ నెల 4న విచారణకు రావాలని నవంబరు 26న ఆయనకు నోటీసు ఇవ్వగా... కుటుంబ సభ్యుల అనారోగ్యంతో ఉన్నందున మూడు వారాల గడువు కావాలని సునీల్ కుమార్ కోరిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో డిసెంబరు 15న రావాలని తాజాగా నోటీసులిచ్చారు.

నకిలీ మద్యం తయారీ కేంద్రాలు పెట్టించింది జోగి రమేషే

(మొదటి పేజీ తరువాయి)

■ వైకాపా హయాంలో అద్దేపల్లి జనార్దన్‌రావు, జగన్మోహన్‌రావులు జోగి రమేష్ అండదండలతోనే తెలంగాణలో తక్కువ ధరకు మద్యం కొని ఏపీకి తీసుకొచ్చి వేరే బాటిళ్లలో నింపి అధికధరకు విక్రయించేవారు. జనార్దన్‌రావుకు అడ్డొస్తే తీవ్ర పరిణామాలుంటాయని జోగి రమేష్, రాములు తెలంగాణ మద్యం సిండికేట్‌లో భాగస్వాములైన షేక్ షరీఫ్, మహాంకాళి పూర్ణచంద్రరావు, తుంగల సుధాకర్ తదితరుల్ని బెదిరించారు.

■ జోగి రమేష్ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన అండదండలతోనే అద్దేపల్లి జనార్దన్‌రావు ఇబ్రహీంపట్నంలోని పాత ఏఎన్ఆర్ బార్‌లో నకిలీ మద్యం తయారీ కేంద్రం ఏర్పాటుచేశారు.

■ అద్దేపల్లి జనార్దన్‌రావు, ఆయన సోదరుడు జగన్మోహన్‌రావులు... జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాములకు రెండు నెలలకోసారి రూ.3-5 లక్షల చొప్పున డబ్బు ముట్టజెప్పేవారు. రాజకీయ అండదండలు, అధికారుల దాడులు లేకుండా చూసేందుకు ఈ మొత్తాలు అందించేవారు.

■ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నిఘా పెరగడంతో నకిలీ మద్యం తయారీని జనార్దన్‌రావు ఆపేశారు.

ఆఫ్రికాకు పంపించింది జోగి రమేషే

■ తంబళ్లపల్లె నుంచి గత ఎన్నికల్లో పోటీచేసిన జయచంద్రారెడ్డి ఇంజినీరింగ్‌లో తన క్లాస్‌మేట్ కావటంతో అద్దేపల్లి జనార్దన్‌రావు అప్పట్లో ఆయన తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ విషయం జోగి రమేష్‌కు తెలుసు. దీంతో కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వంపై బురదచల్లాలనే కుట్రతో.. జనార్దన్‌రావును ముందుపెట్టి జోగి రమేష్ తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువులో తొలుత నకిలీ మద్యం తయారీ కేంద్రం ఏర్పాటు చేయించి.. దానిలో స్టాక్ సిద్ధమయ్యాక దాన్ని దాడి చేయించారు.

■ సెప్టెంబరు 15, 16 తేదీల్లో జోగి రమేష్, రాములు జనార్దన్‌రావును సంప్రదించి జయచంద్రారెడ్డి ఎక్కడున్నారని ఆరాతీశారు. ఆఫ్రికాలో ఉన్నట్లు చెప్పగా.. ఆ దేశానికి వెళ్లిపోవాలని ఆదేశించారు. సెప్టెంబరు 23 ఉదయం 8.30 గంటలకు జనార్దన్‌రావు జోగి రమేష్ ఇంటికి వెళ్లారు. రూ.3 కోట్లు ఇస్తామని రమేష్ ప్రలోభపెట్టడంతో సెప్టెంబరు 24న జనార్దన్‌రావు ఆఫ్రికా వెళ్లారు. తర్వాత కొద్దిరోజులకు రమేష్.. ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేంద్రం గురించి సమాచారం బయటకు వ్యాప్తిచేయించి ప్రభుత్వంపై దుష్ప్రచారం మొదలుపెట్టారు. ఆయినా ప్రభుత్వంపై వ్యతిరేకత రాకపోవడంతో ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం కేంద్రం సమాచారమిచ్చి దాడులు చేయించారు.

8 మందిపై అభియోగాలు..

నకిలీ మద్యం తయారీ కేంద్రాలు ఏర్పాటుచేసిన అద్దేపల్లి జనార్దన్‌రావు (ఏ-1), అద్దేపల్లి జగన్మోహన్‌రావు (ఏ-2)తో పాటు వాటికి అవసరమైన ముడి సరుకులు సమకూర్చిన, ఈ నేరంలో భాగస్వాములైన కట్టా రాజు (ఏ-4), బదలేటి కల్యాణ్ (ఏ-7), ప్రదీప్ దాస్ (ఏ-8), దొండేటి శ్రీనివాసరెడ్డి (ఏ-11), అంగలూరు వెంకటకల్యాణ్ (ఏ-12), తిరుమలశెట్టి శ్రీనివాసరావు (ఏ-13)లపై సిట్ అభియోగాలు మోపింది. దర్యాప్తు కొనసాగుతోంది.

బీఈడీ విద్యార్థినిపై ప్రొఫెసర్ లైంగిక దాడి

- గర్భం దాల్చిన బాధితురాలు!
- తిరుపతి సంస్కృత వర్సిటీలో ఘటన

తిరుపతి (ఎస్వీయూ, నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో బీఈడీ విద్యార్థినిపై ఓ ఆచార్యుడు లైంగికదాడికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితురాలు గర్భం దాల్చగా, ఆమెను బెదిరించి సొంత రాష్ట్రానికి పంపించినట్లు సమాచారం. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు వర్సిటీలో ఓ విద్యార్థినిని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణకుమార్ కొంతకాలంగా లైంగికంగా వేధించారు. మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ శేఖర్‌రెడ్డి వీడియో తీసి ఆమెను లైంగికంగా వేధించే దుశ్చర్యకు యత్నించారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి వీసీ రజనీకాంత్ శుక్లా తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఇద్దరు ఆచార్యుల సెల్‌ఫోన్లు సీజ్ చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.

విద్యార్థుల ఆరోపణ: ఈ ఘటనపై బాధిత విద్యార్థిని పది రోజుల కిందటే వీసీ కృష్ణమూర్తికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దాంతో లైంగిక దాడి ఆరోపణలను ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ లక్ష్మణకుమార్‌ను ఈ నెల 1న సస్పెండ్ చేశారు. 2 నుంచి ఆయన విధులకు రావట్లేదని వర్సిటీ విద్యార్థులు చెబుతున్నారు. ఆయనపై విచారణకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ)ని సైతం వర్సిటీ నియమించినట్లు తెలిసింది.



క్రమశిక్షణ లేనివారు వాటికి బానిసలు

క్రమశిక్షణను ఒక్క మాటలో చెప్పాలంటే- మీకు ఇప్పుడేం కావాలన్నది పక్కనపెట్టి, జీవితంలో ఏం కోరుకుంటున్నారన్నదానికే ప్రాముఖ్యత ఇవ్వడం. క్రమశిక్షణను అలవర్చుకున్నప్పుడే తాత్కాలిక కోరికలను జయించి మెరుగైన భవిష్యత్తు కోసం పనిచేయగలం. చాలా మంది క్రమశిక్షణ వల్ల స్వేచ్ఛను కోల్పోతామనుకుంటారు. కానీ క్రమశిక్షణ లేనివారే ఆకర్షణలకు, వ్యసనాలకు బానిసలుగా మారుతారు.

- రాజ్ శమానీ, పాడ్‌కాస్టర్

చిన్న చోరీ కాదు.. మహా పాపం చేశా

- పరకామణిలో ఎంతో పెద్ద తప్పు చేశా
- చోరీ కేసు నిందితుడు రవికుమార్ వీడియో

ఈనాడు డిజిటల్, తిరుపతి; న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): 'పరకామణిలో 2023 ఏప్రిల్ 29న మహాపాపం చేశాను. పెద్ద తప్పు చేశాను. ఎంత మహాపాపం చేశానో అని నేను, నా భార్యాపిల్లలు తలుచుకుని బాధపడని రోజు లేదు. దయచేసి అర్థం చేసుకోండి. మా కుటుంబం ఆ తప్పును మహాపాపంగా భావిస్తున్నాం. నేను కేబుల్, స్థిరాస్తి వ్యాపారాలు చేశాను. మా ఆస్తిలో 90% ప్రాయశ్చిత్తంగా శ్రీవారికి రాసిచ్చాను' అని వెక్కి వెక్కి ఏడుస్తూ.. పరకామణిలో చోరీ కేసు నిందితుడు రవికుమార్ వీడియోలో వేడుకున్నారు. 'పరకామణిలో చిన్న చోరీ' చేశారంటూ మాజీ సీఎం జగన్ ఇటీవల చెప్పిన తర్వాత పెద్ద తప్పు చేశానంటూ అతడే వీడియోలో పేర్కొనడం సంచలనంగా మారింది. లోక్ అదాలత్‌లో రాజీ తర్వాత, ఏడాదిగా అజ్ఞాతంలో ఉంటూ.. ఇటీవల హైకోర్టు ఆదేశాల మేరకు సీఐడీ అధికారుల విచారణకు హాజరైన తర్వాత.. తొలిసారి 2.31 నిమిషాల వీడియో ద్వారా రవికుమార్ బయటకు వచ్చారు. 'కొందరు నన్ను బెదిరించి ఆస్తులు రాయించుకున్నట్లు ప్రచారాలు చేస్తున్నారు. నన్ను బ్లాక్‌మెయిల్ చేసిన వారిపై కేసులు పెట్టాను. నా శరీరంలోని ప్రైవేటు భాగాల్లో శస్త్రచికిత్సలు చేయించుకుని అక్కడ నగదు దాచిపెట్టినట్లు మూడేళ్లుగా జరుగుతున్న అసభ్య ప్రచారంతో మా కుటుంబం మనోవేదనకు గురవుతోంది. అలా చేయలేదని నిరూపించేందుకు న్యాయస్థానం ఎలాంటి వైద్య పరీక్షలకు ఆదేశించినా సహకరిస్తా' అని చెబుతూ రవికుమార్ వెక్కి వెక్కి ఏడ్చారు. ఆయన మాట్లాడుతున్న ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో శనివారం వైరలైంది. 'తిరుమల పెద్ద జీయర్‌స్వామి మఠంలో గుమస్తాగా పనిచేశాను. నాపై కొందరు ఒత్తిడి తెచ్చి ఆస్తులు కాజేశారనే ప్రచారంలో వాస్తవం లేదు. నా ఆస్తులు ఇతరులకు ఎందుకు ఇస్తాను? కొందరు బ్లాక్‌మెయిల్ చేసినమాట వాస్తవం' అంటూ వీడియోలో రవికుమార్ కంటతడి పెట్టారు. ఈ వీడియో విడుదలైన ఓ యూట్యూబ్ ఛానల్‌లో మాజీ సీఎం జగన్, తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. తదితర వైకాపా నాయకుల వీడియోలే ఎక్కువగా ఉన్నాయి.


వీడియోలో మాట్లాడుతున్న రవికుమార్

ఎస్ఏలకు పదోన్నతులు కల్పించాలి: ఎన్‌టీఏ

ఈనాడు, అమరావతి: స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో కోరారు. "ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నేరుగా నియామకాలు లేక.. ఎస్ఏలను పదోన్నతులపై తీసుకోకపోవడంతో విద్యా సంస్థలు నిర్వీర్యమవుతున్నాయి. హైస్కూల్ ప్లస్‌ల్లో పీజీటీ పోస్టుల కొరతపై పలు మార్లు వినతిపత్రాలు ఇచ్చినా చర్యలు తీసుకోవడం లేదు. స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించి, జూనియర్ లెక్చరర్లుగా తీసుకోవడం వల్ల బోధన పోస్టుల సమస్య పరిష్కారమవుతుంది" అని పేర్కొన్నారు.

మూడు విమానాలకు బాంబు బెదిరింపు

శంషాబాద్, న్యూస్‌టుడే: విదేశాల నుంచి హైదరాబాద్‌కు టేకాఫ్ తీసుకున్న రెండు అంతర్జాతీయ విమాన సర్వీసులకు శనివారం బాంబు బెదిరింపు సందేశాలు వచ్చాయి. బ్రిటిష్ ఎయిర్‌లైన్స్ బీఏ-277 విమానం లండన్ నుంచి శంషాబాద్‌కు బయలుదేరింది. దానిలో బాంబులున్నాయని ఆర్జీఐఏ కస్టమర్ సపోర్ట్‌కు ఈ-మెయిల్ వచ్చింది. శంషాబాద్‌లో ల్యాండింగ్ కాగానే పరిశీలించగా, ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని తేలింది. ఇదే తరహాలో సింగపూర్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఎస్‌ఏ-518, కువైట్ నుంచి టేకాఫ్ తీసుకున్న కువైట్ ఎయిర్‌లైన్స్ కేయు-373 విమాన సర్వీసుల్లో బాంబులు ఉన్నాయని ఈ-మెయిళ్లు పంపారు. తనిఖీల్లో సింగపూర్ విమానంలో పేలుడు పదార్థాలు దొరకలేదు. కువైట్ విమానాన్ని పైలట్ దారి మళ్లించి మస్కట్‌లో ల్యాండింగ్ చేశారు.

దేవుడి హుండీలనూ వైకాపా వదల్లేదు

- జగన్ ఎప్పటికీ మాఫియా నాయకుడే
- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ధ్వజం



ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వంలో వేంకటేశ్వరస్వామి మీద నమ్మకం లేని గ్యాంగ్‌ని అందలం ఎక్కించి తిరుమల పవిత్రతను అప్పటి సీఎం జగన్ దిగజార్చారని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ధ్వజమెత్తారు. తిరుమలను ఆక్రమార్జనకు వనరుగా మార్చుకున్న జగన్ పేరు పలికితే పాపం చుట్టుకుంటుందని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆనం రామనారాయణరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'దేవుడి సొమ్ము దోపిడీ చిన్న విషయమా? కేవలం 9 నోట్లు దొంగతనం చేస్తే.. రూ.14 కోట్లు ఎలా రాసిచ్చారు..? రూ.వందల కోట్ల ఆస్తులు వైకాపా నేతల పేరిట రాయించుకుని లోక్ అదాలత్‌లో రాజీచేయించుకున్నారు. రవికుమార్ ఆస్తులు వైకాపా పెద్దల పేర్లతో ఎలా మారాయి? ఎవరి ఒత్తిడితో లోక్ అదాలత్‌లో రాజీ జరిగింది? విదేశీ కరెన్సీ దోపిడీ సాక్ష్యాలున్న కేసులో నిందితుడితో ఎలా ఒప్పందం చేసుకున్నారు? రూ.వందల కోట్ల దోపిడీ వీడియో సాక్ష్యాలతో బయటపడితే చిన్న దొంగతనమని కొట్టిపారేసిన జగన్ దృష్టిలో పెద్ద దొంగతనం అంటే ఏమిటో చెప్పాలి?" అని ప్రశ్నించారు. "జగన్ అధికారం చేపట్టిన మొదటి రోజు నుంచే రాష్ట్రంలో మత్తు పదార్థాలు, మద్యం, ఎర్రచందనం, భూ కబ్జా మాఫియాలు పెట్రేగిపోతున్నాయని చెప్పినా ఏనాడూ పట్టించుకోలేదు. జగన్ ఎప్పటికీ మాఫియా నాయకుడిగానే ఉంటారు. రాజకీయ నాయకుడు కాలేరు" అని మంత్రి ఆనం ఆగ్రహం వ్యక్తంచేశారు. "తిరుమలలో జరిగిన అపరాధాలు బయటపడిన రోజే ముఖ్యమంత్రి చంద్రబాబు దేవాలయాలపై పర్యవేక్షణ పెంచి ఆలయాల పరిరక్షణ, ఆస్తుల రక్షణ, భక్తుల సౌకర్యాలు, ప్రసాదాల నాణ్యతపై దృష్టిపెట్టారు. తిరుమలలో మాఫియా ప్రమేయాన్ని పూర్తిగా తొలగించారు." అని పేర్కొన్నారు.

విలీన మండలాలకు చిరునామా చింత!

సమస్యను పరిష్కరించాలని స్థానికుల వినతి

చింతూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం, చింతూరు డివిజన్లతో కొత్తగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో విలీన మండలాలు కొత్త జిల్లాలోకి వెళ్లనున్నాయి. తరచూ చిరునామాల మార్పుతో ఇక్కడి ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు ఈ సమస్యపై దృష్టిపెట్టి పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

● చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఖమ్మం జిల్లాలో ఉండేవి. ● 2014లో జరిగిన రాష్ట్ర విభజనతో వీటిని తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేశారు. ● వైకాపా ప్రభుత్వం పార్లమెంటు నియోజకవర్గాల ప్రాతిపదికన జిల్లాల పునర్విభజన చేయడంతో విలీన మండలాలు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోకి వెళ్లాయి. ● కూటమి ప్రభుత్వం తాజాగా రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడంతో కొత్త జిల్లాలోకి రానున్నాయి.

■ రాష్ట్ర విభజన తర్వాత తూర్పుగోదావరి జిల్లాలోకి నాలుగు మండలాలను విలీనం చేసినప్పటి నుంచి స్థానికులకు సరైన చిరునామా లేకుండా పోయింది. ఈ మండలాలకు తపాలా శాఖ పిన్ కోడ్ మార్చినా ఇది ఉత్తరాల బట్వాడా వరకే పరిమితమైంది. ఆన్‌లైన్‌లో కొత్త పిన్‌కోడ్‌ను అన్వేషిస్తే చిరునామా చూపడం లేదు. ఈ-కామర్స్ సైట్లు.. ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేయాలంటే ఖమ్మం జిల్లాలోని పిన్‌కోడ్‌లే ఈ మండలాలకు చిరునామాగా ఉంటున్నాయి. జిల్లాలు మారినప్పుడల్లా ఆధార్‌లో చిరునామా మార్చుకోవడానికి వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

పంచాయతీలకు 'రూర్బన్' హంగులు

- ప్రాథమికంగా 359 గ్రామాల ఎంపిక
- వార్షికాదాయం రూ.కోటి కంటే ఎక్కువ ఉన్నవి గుర్తింపు
- పురపాలక తరహా సేవలు త్వరలో అందుబాటులోకి

ఈనాడు-అమరావతి: రాష్ట్రంలో పట్టణ తరహా సదుపాయాలతో 359 రూర్బన్ పంచాయతీలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. పది వేలకు పైగా జనాభా, రూ.కోటి కంటే ఎక్కువ వార్షికాదాయం కలిగిన పంచాయతీలను రూర్బన్‌లుగా మార్చాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. వచ్చే నెలలో దీనికి మార్గదర్శకాలు వెలువడనున్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల నిర్వహించిన సమీక్షలో రూర్బన్ పంచాయతీల ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. ఇందులో భాగంగా క్లస్టర్ విధానం రద్దు చేసి ఒక స్పెషల్‌తోపాటు మరో మూడు కేటగిరీలుగా పంచాయతీలను విభజించారు. స్పెషల్ పంచాయతీలే రూర్బన్‌గా మారనున్నాయి.

కార్యదర్శులుగా డిప్యూటీ ఎంపీడీవోలు!

డిప్యూటీ ఎంపీడీవోలు పలువుర్ని రూర్బన్ పంచాయతీల్లో కార్యదర్శులుగా నియమించనున్నారు. నిబద్ధత, నిజాయతీ గల 359 మందిని ఎంపిక చేయనున్నారు. పంచాయతీలు అంటే అక్రమ వసూళ్లకు, అడ్డగోలు పనులకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి వార్షిక ఆదాయం ఎక్కువ ఉన్న పంచాయతీల్లో ఇలాంటివి ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. దీంతో డిప్యూటీ ఎంపీడీవోలుగా పని చేస్తున్న, పదోన్నతులు పొందిన వారిలో నుంచి రూర్బన్ పంచాయతీలకు కార్యదర్శులుగా ఎంపిక చేయనున్నారు.

పర్యవేక్షణకు ప్రాంతీయ అధికారులు

రూర్బన్ పంచాయతీలపై పర్యవేక్షణకు ప్రాంతీయ అధికారులను నియమించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. మూడు, నాలుగు ఉమ్మడి జిల్లాలకు ఒక అధికారిని నియమించనున్నారు. జడ్పీ సీఈవో క్యాడర్ స్థాయి అధికారులను ప్రాంతీయ పర్యవేక్షణాధికారులుగా నియమించే వీలుంది. విశాఖ, రాజమహేంద్రవరం, గుంటూరు, అనంతపురంలో ప్రాంతీయ కార్యాలయాలు ఉంటాయి. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్‌కు ప్రాంతీయ అధికారులు జవాబుదారీగా ఉంటారు.

ప్రజల సేవలో నాలుగు విభాగాలు

రూర్బన్ పంచాయతీల్లో పురపాలికల తరహాలో కొత్తగా నాలుగు విభాగాలు అందుబాటులోకి రానున్నాయి.

1) ప్రజారోగ్య విభాగం: శానిటేషన్ పనులకు 10-25 మంది కార్మికుల సేవలు వినియోగించనున్నారు. వీరితో ఇళ్ల నుంచి చెత్త సేకరణతో పాటు మురుగు కాలువలను శుభ్రం చేయించనున్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ నుంచి సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ వరకు ప్రజారోగ్య విభాగానిదే బాధ్యత.

2) ఇంజినీరింగ్ విభాగం: ఆర్థిక సంఘం, ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. పాడైన రహదారులకు మరమ్మతులు, కొత్తవి నిర్మాణం ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ బాధ్యత కూడా ఇంజినీరింగ్ విభాగానిదే.

3) గ్రామీణ ప్రణాళికా విభాగం: కొత్త నిర్మాణాలకు అనుమతులు, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాల నియంత్రణ వంటివి ప్లానింగ్ కార్యదర్శి ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. రూర్బన్ పంచాయతీలకు ప్రత్యేకంగా బృహత్తర ప్రణాళికలు (మాస్టర్ ప్లాన్) రూపొందించనున్నారు. ప్రణాళికాబద్ధంగా పంచాయతీలను అభివృద్ధి చేయాలన్నది ప్రధాన ఉద్దేశం.

4) రెవెన్యూ విభాగం: ప్రజల నుంచి ఆస్తి పన్ను వసూలు, కొత్త నిర్మాణాలకు విధిగా పన్ను విధించనున్నారు. పన్నేతర ఆదాయం వసూళ్లు సక్రమంగా చేపట్టడం, ఆదాయం పెరిగేలా చూడటం విభాగం ప్రధాన ఉద్దేశం. పన్నుల వసూళ్లలోనూ పారదర్శకత కోసం ఆన్‌లైన్ చెల్లింపులు చేయనున్నారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా జనన, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లు కూడా జారీ చేయనున్నారు.

పోలవరం-నల్లమలసాగర్‌పై సుప్రీంకోర్టులో తెలంగాణ వ్యాజ్యం!

ఈనాడు, హైదరాబాద్: ఏపీ చేపడుతున్న పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు(పీఎన్ఎల్‌పీ)ను అడ్డుకునేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. శనివారం ఆయన పలు ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. సీడబ్ల్యూసీ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీలు అభ్యంతరం వ్యక్తం చేసినా ఏపీ పీఎన్ఎల్‌పీ విషయంలో ముందుకెళ్తోందని, దీన్ని తీవ్రంగా పరిగణించి ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

స్క్రబ్ టైఫస్‌తో జీజీహెచ్‌లో వృద్ధురాలి మృతి

ఈనాడు, అమరావతి: స్క్రబ్ టైఫస్‌తో గుంటూరు జీజీహెచ్‌లో శనివారం ప్రకాశం జిల్లా యర్రగొండపాలేనికి చెందిన పి.ధనమ్మ (61) మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. తీవ్ర జ్వరం, విరేచనాలతో అపస్మారక స్థితిలో ఆమె నవంబరు 18న జీజీహెచ్‌లో చేరారు. అప్పటి నుంచి చికిత్స అందిస్తోన్న వైద్యులు.. అన్ని రకాల పరీక్షలు చేశారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ధనమ్మ మృతి చెందారు. ఫలితాల్లో స్క్రబ్ టైఫస్ నిర్ధారణ అయినట్లు జీజీహెచ్ వర్గాలు తెలిపాయి.

అనారోగ్యాన్ని పార్సిల్ చేస్తున్నారు!



పొగలు కక్కుతున్న టీని ప్లాస్టిక్ కవర్లలో పార్సిల్ చేస్తున్నారు. సలసల మరిగే సాంబారు, రసం ప్లాస్టిక్ పాత్రలో పోసి నిల్వ ఉంచుతున్నారు. కర్రీ పాయింట్లలో వేడివేడి కూరలు, అన్నం.. కవర్లలో కట్టేసి అమ్మేస్తున్నారు. ఆర్డర్ చేయగానే వేడి వేడిగా బిర్యానీలు, ఇతర ఆహార పదార్థాలు ప్లాస్టిక్ డబ్బాల్లో ఇంటికి పంపిస్తున్నారు. మొత్తంగా చూస్తే... మైక్రోప్లాస్టిక్ కోరల్లో మనల్ని బందీ చేస్తున్నారు.

వద్దని ఎంత చెబుతున్నా.. ప్లాస్టిక్ వినియోగం అంతకంతకూ పెరుగుతుందే గానీ తగ్గడంలేదు. ప్లాస్టిక్ పాత్రల్లో నిల్వచేసిన వేడి ఆహారం తినడం ప్రాణాంతకమని నిపుణులు హెచ్చరిస్తున్నా కొందరు లెక్కచేయడంలేదు. కీలక వ్యవస్థలూ ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించలేక చేతులెత్తేస్తున్నాయి. ఈ ప్రమాదకర పరిస్థితులు కొనసాగితే భవిష్యత్‌లో ప్రజారోగ్యం మరింత ప్రమాదంలో పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

అధ్యయనాలు.. హెచ్చరికలు..

ప్లాస్టిక్ పాత్రల్లోని వేడి ఆహారం తినడంతో శరీరంపై దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావం పడుతుంది.
- ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) హెచ్చరిక

వేడి ఆహారం ప్లాస్టిక్ డబ్బాల్లో, కవర్లలో వెయ్యడం వల్ల ఆ రసాయనాలు ఆహారంలో కలిసి క్యాన్సర్, ఇతర అనారోగ్య సమస్యలు ఎదువుతాయి
- భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) నివేదిక.

ప్లాస్టిక్ పాత్రల్లోని రసాయనాలు వేడికి కరిగి ఆహారంలో కలుస్తాయి. ఈ ఆహారం తింటే నాడీ వ్యవస్థ, మూత్రపిండాలు, కాలేయం మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది.
- నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్- అమెరికా) అధ్యయనం.

ప్లాస్టిక్ పాత్రల్లో తింటే?

- వేడిగా ఉన్న ఆహారం ప్లాస్టిక్ కవర్లు, పాత్రల్లో ప్యాక్ చేయడం.. నిల్వ ఉంచడం, ఆ ఆహారం తినడం ఆరోగ్యానికి హానికరం.
- ప్లాస్టిక్‌లో అత్యంత హానికరమైన బిస్ఫినాల్-ఎ (బీపీఏ) రసాయనం ఉంటుంది. ప్లాస్టిక్‌ను మృదువుగా మార్చడానికి థాలేట్స్ అనే రసాయనం వాడుతారు. కొన్ని ప్లాస్టిక్ కవర్ల తయారీలో పాలీవినైల్ క్లోరైడ్ (పీవీసీ) వినియోగిస్తారు.



- ఈ హానికారక రసాయనాలు శరీరంలో కలిస్తే ఈస్ట్రోజెన్ వంటి హార్మోన్ల పనితీరు, పునరుత్పత్తి వ్యవస్థ, మెదడు ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. పిల్లలు, గర్భిణీలపై ప్రభావం అధికంగా ఉంటుంది.
- హార్మోన్ల అసమతుల్యత వల్ల మధుమేహం, అధిక బరువు వంటి సమస్యలూ తలెత్తుతాయి. మగ వారిలో వీర్యకణాల ఉత్పత్తి తగ్గడం, మహిళల్లో గర్భధారణ సమస్యలు ఎదురవుతాయి.
- ప్లాస్టిక్ కణాలు శరీరంలోని రక్త ప్రసరణ వ్యవస్థ పనితీరుని దెబ్బతీస్తుంది. గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువ.
- పొట్టలోని సున్నితమైన పొరను దెబ్బతీయడంతో జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి.
- ఊపిరితిత్తులు, జీర్ణ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. రోగనిరోధక వ్యవస్థ, కాలేయం పనితీరును దెబ్బతీస్తుంది.
- ప్లాస్టిక్‌లోని రసాయనాలు శరీరంలో ఎక్కువ కాలం పేరుకుపోతే క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయి.



ప్రత్యామ్నాయ పాత్రలు మేలు..

- హోటళ్ల నుంచి వేడి ఆహారం తెచ్చుకోవాలంటే ఇంట్లో నుంచి స్టీలు టిఫిన్ బాక్సులు, క్యారేజీలు తీసుకెళ్లండి.
- ఇంట్లో ఆహారం భద్రపరుచుకోవడానికి, తినడానికి స్టీలు, గాజు, ఇత్తడి, పింగాణీ, హానిచేయని పేపర్ ఆధారిత పాత్రలు వాడడం మేలు.

అప్రమత్తం కాకపోతే క్యాన్సర్ ముప్పు

– డాక్టర్ సింధు కిలారు, డీఎం మెడికల్ ఆంకాలజిస్ట్, విజయవాడ

ప్లాస్టిక్ బాక్సుల్లో పార్సిళ్లలో వస్తున్న ఆహారాన్ని మైక్రో ఓవెన్‌లో మళ్లీ వేడిచేసి తింటున్నారు. ప్లాస్టిక్‌లోని బీపీఏ, థాలేట్స్ రసాయనాలు ఆహారంలో కరిగి క్యాన్సర్‌కు కారణం అవుతాయి. పిల్లలకు వాడే పాల సీసాలు సైతం హానికారకాలు లేవని గుర్తింపు పొందినవే వాడాలి. లేదంటే వేడి పాలలో హానికారక రసాయనాలు కలిసి బ్లడ్ క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉంది. పీవీసీ పైపుల్లో వచ్చే నీరు తాగడం వల్ల కాలేయ సమస్యలు, క్యాన్సర్ వచ్చే ఆస్కారం ఉంది. ప్రస్తుతం మైక్రోప్లాస్టిక్ పెను ముప్పుగా మారింది. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

- ఈనాడు, అమరావతి

మొక్కల అందం పెంచే చక్కని దీపాలు!




ఇంటి ముందు, పెరడులో పెంచే మొక్కలకు మరింత అందం తెచ్చే దీపాలు ఇవి. మొక్క పాదుల్లో పెడితే చాలు సౌర శక్తితో రాత్రి పూట వెలుగులు పంచుతాయి. సోలార్ ప్యానెళ్లు అమర్చిన వీటిని మట్టిలో గుచ్చితే చాలు పగలంతా ఛార్జింగ్ అవుతాయి. ఒక్కో సోలార్ బల్బు 1,500 గంటలు పని చేస్తుంది. పార్కుల్లో, లాన్‌లో కాలిబాటలకు ఇరువైపులా వీటిని పెట్టుకోవచ్చు. పొలాల్లో రాత్రిపూట కాలిబాటలు గుర్తించేందుకూ వీటిని పెట్టుకోవచ్చు. రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడ సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో వీటిని ఉంచారు.

– ఈనాడు, అమరావతి

అంజనాద్రికి నృత్య నీరాజనం!





20 నిమిషాలు ఏకబిగిన ఎక్కితే కానీ చేరుకోలేని గిరి శిఖరాన్ని ఓ అమ్మాయి నాట్యం చేస్తూ 8.54 నిమిషాల్లోనే అధిరోహించి అబ్బురపరిచింది. కర్ణాటకలోని కొప్పళ జిల్లాలో ఉన్న అంజనాద్రిపైనే హనుమంతుడు పుట్టాడని స్థానికుల విశ్వాసం. అంజనాద్రి సముద్ర మట్టం నుంచి 550 అడుగుల కన్నా ఎక్కువ ఎత్తులో ఉంటుంది. ఈ కొండపైకి వెళ్లే 575 మెట్లు చాలా నిటారుగా ఉండటంతో సాధారణ ప్రజలు మామూలుగా ఎక్కడానికే చాలా కష్టపడుతుంటారు. హొసపేటకు చెందిన హర్షిత (19) మాత్రం నాట్యం చేస్తూ అంజనాద్రిని ఎక్కాలని సంకల్పం తీసుకుంది. అలా 8.54 నిమిషాల్లోనే నాట్యం చేస్తూ మెట్లు ఎక్కి శిఖరానికి చేరుకుంది. హనుమంతుడికి అత్యంత ఇష్టమైన రామనామం జపించడంతో అలసట తెలియలేదని చెప్పింది. ఏడేళ్ల వయసు నుంచే భరతనాట్యం అభ్యసిస్తున్నానని.. గురువు డాక్టర్ మంజరీ చంద్ర శిక్షణలో మరింత సాధన చేస్తానని వివరించింది.

– న్యూస్‌టుడే, బెంగళూరు (గ్రామీణం)

వలస పక్షులు కులాసాగా ఉండాలని..

ఈటీవీ భారత్: అస్సాంలోని మోరీగావ్ జిల్లా జుర్గావ్ గ్రామం నిశ్శబ్దానికి మారుపేరు. ఈ గ్రామంలో టపాసులు కాల్చకూడదు, వాహనాలు హారన్లు మోగించకూడదు. వేడుకల్లో డీజేలు, పెద్ద శబ్దాలనిచ్చే బ్యాండ్ల వంటివి పెట్టకూడదు. ఈ గ్రామంలో తివా తెగకు చెందిన 121 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరంతా పక్షుల ప్రేమికులే. జుర్గావ్ చుట్టూ పచ్చని వెదురు తోటలు ఉన్నాయి. పొడవైన వెదురుపై పక్షులు గూళ్లు పెట్టుకుంటాయని కత్తిరించకుండా అలాగే వదిలేస్తారు. వేటగాళ్లను, చెట్లను కొట్టే వ్యక్తులను గ్రామంలోకి రానివ్వరు. చిత్తడి నేలలు, పుష్కలంగా ఉన్న నీటి వనరులతో వలస పక్షులకు అడ్డాగా మారిన జుర్గావ్‌లో సాయంత్రమైతే పక్షుల అరుపులు ఆహ్లాదంగా వినిపిస్తాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో వలస పక్షులు సంతానోత్పత్తి కోసం ఇక్కడికి వస్తుంటాయి.

శనివారం వాహనాలకు సెలవు!



నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే కృష్ణా జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణం శనివారం వస్తే చాలు ఎంతో ప్రశాంతంగా మారుతోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'స్వర్ణాంధ్ర...స్వచ్ఛాంధ్ర'లో భాగంగా ప్రతి శనివారం కలెక్టరేట్‌కు వాహనాలు వేసుకొని రావద్దని ప్రతినబూనారు. దీంతో కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు మొదలుకొని అధికారులు, ఉద్యోగులూ సైకిల్‌పై లేదా నడిచి వస్తున్నారు. తెలియక ఎవరైనా వాహనం వేసుకొచ్చినా గేటు వద్ద ఒకరు వారికి అవగాహన కల్పిస్తున్నారు. కొన్ని వారాలుగా ఈ విధానం అమలవుతోంది.

– ఈనాడు, కృష్ణా

జిలేబీల జంక్షన్



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృత్తాకారాలు ఎవరో చేసినవి కావు. ఇవి తిలాపియా చేపల నివాసాలు. నీటి అడుగున తిరిగే ఇవి ఇలా గూళ్లు ఏర్పాటు చేసుకుంటాయి. బాపట్ల జిల్లా ఇంకొల్లులోని నాగుల చెరువులో కనిపించాయి. వృత్తాకార స్థావరాలు ఏర్పాటు చేసుకుని, వాటిలో గుడ్లు పెట్టి సంతానాన్ని వృద్ధి చేసుకుంటాయి. ఇటీవల చెరువు నీటిని బయటకు వదలడంతో ఇవి వెలుగుచూశాయి. కొన్ని వందల గూళ్లు ఉండటంతో ప్రజలు వీటిని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 'ఈ చేపలను స్థానికులు జిలేబి చేపలు అంటారు. అవి బురద లోపలికి చొచ్చుకెళ్లి వృత్తాకార ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటాయి. అవే ఇలా కనిపిస్తాయి. అధికంగా గుడ్లు పెడతాయి' అని చీరాల మత్స్యశాఖ అధికారి తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇంకొల్లు

కిలిమంజారో ఎంగేజ్‌మెంట్ జంటకు ఆలయంలో పెళ్లి



ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వతాల్లో ఒకటైన కిలిమంజారోపై ఎంగేజ్‌మెంట్ చేసుకున్న అంకిత్, శ్వేతా సింగ్‌ల జంట ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్‌లో ఉన్న త్రియుగినారాయణ్ ఆలయంలో వివాహం చేసుకున్నారు. వారి వివాహానికి ఊరి జనమంతా వచ్చి ఆశీర్వదించారు. అంకిత్ దేహ్రాదూన్‌లోని క్లెమెంట్ టౌన్‌కు చెందినవారు. శ్వేతా సింగ్ దిల్లీవాసి. ఆమె పదేళ్లప్పుడు చూపు కోల్పోయారు. అయినా ధైర్యంతో ప్రతి సవాలును స్వీకరించారు. డిగ్రీ కూడా పూర్తి చేశారు. ప్రకృతి ప్రేమికురాలైన ఆమెకు ట్రెక్కింగ్ అంటే చాలా ఇష్టం. పర్వతాలను అధిరోహించాలని కోరుకునేవారు. అయితే పర్వతారోహక శిక్షణ సంస్థలు ఆమెకు శిక్షణ ఇచ్చేందుకు తిరస్కరించాయి. దిల్లీలో జరిగిన పర్వతారోహక శిబిరానికి ఆమె హాజరైనప్పుడు అంకిత్‌తో పరిచయం ఏర్పడింది. ఆయన శ్వేతకు పర్వతారోహణలో శిక్షణ ఇచ్చారు. ఇద్దరూ కలిసి కిలిమాంజారోను ఇటీవల అధిరోహించారు. అక్కడే ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. అక్కడి నుంచి భారత్‌కు తిరిగివచ్చి తాజాగా పెళ్లి చేసుకున్నారు.

తల్లి కలలకు కోవెల రూపం



తల్లి కన్న కలలను నిజం చేసి చూపించారు.. మధ్యప్రదేశ్‌లోని సాగర్‌కు చెందిన ఇద్దరు సోదరులు. ఆమె కోరిక మేరకు మంగళ్‌గిరి ప్రాంతంలో 58 ఎకరాల్లో జైన ఆలయాన్ని రూ.4 కోట్లు వెచ్చించి నిర్మించారు.. హర్ష్, గౌరవ్ షరాఫ్‌లు. అందులో 24 మంది జైన తీర్థంకరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. సాగర్‌కు చెందిన అనిల్ షరాఫ్, ఆయన సతీమణి అభా షరాఫ్‌లు మంగళ్‌గిరి ప్రాంతంలో జైన మందిరాన్ని నిర్మించాలని ఆశించారు. వారు తమ కోరికను కుమారులకు తెలిపారు. దీంతో హర్ష్, గౌరవ్‌లు.. తల్లి కలను నెరవేర్చాలని నిర్ణయించి నిర్మించారు.

ఇల్లెక్కిన ట్రక్కు!



'కష్టకాలంలో మన వెంట నిలిచిన వారిని ఎన్నటికీ మరవకూడదు. అది మనిషి అయినా సరే, యంత్రమైనా సరే..' అని అంటున్నారు మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ గ్రామానికి చెందిన ట్రక్కు డ్రైవర్ అమర్‌కాంత్ పటేల్. ఒకనాడు పేదరికంతో చదువుకు అర్ధాంతరంగా స్వస్తిచెప్పి ఉపాధి కోసం క్లీనర్‌గా మారిన ఆయన...ట్రక్కుకు యజమానిగా మారి జీవితంలో స్థిరపడ్డారు. తన ఉన్నతికి దోహదపడిన వాహనాన్ని ఎంతో ఖర్చుపెట్టి నిర్మించుకున్న సొంత ఇంటిపైకి ఎక్కించి కృతజ్ఞత చాటుకుంటున్నారు. 'ఈ ట్రక్కు నా జీవితాన్నే మార్చేసింది. నేను జీవించి ఉన్నంత కాలం నాతో పాటే ఉండాలి. ఇప్పటి వరకూ నా జీవిత భారాన్ని అది మోసింది. కాబట్టి ఇప్పుడు దాని భారాన్ని మోసి రుణం తీర్చుకుంటాను' అని అమర్‌కాంత్ భావోద్వేగానికి గురయ్యారు.

- ఈటీవీ భారత్

తరతరాలకు అంబేడ్కర్ ప్రేరణ

- 69వ వర్ధంతి సందర్భంగా రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని నివాళి



పార్లమెంటు ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

దిల్లీ, ముంబయి: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నివాళులర్పించారు. పార్లమెంటు ఆవరణలోని ప్రేరణ స్థల్‌లో ఆయన విగ్రహంవద్ద పుష్పాంజలి ఘటించారు. 'మహాపరినిర్వాణ్ దివస్ సందర్భంగా భారత రత్నకు వినమ్రంగా నివాళులర్పిస్తున్నా. భారత రాజ్యాంగ నిర్మాతల్లో ఆయన అత్యంత ముఖ్యుడు. సామాజిక న్యాయానికి కర్త' అని ఉప రాష్ట్రపతి ఎక్స్‌లో పేర్కొన్నారు. 'అంబేడ్కర్ దార్శనిక నాయకత్వం, న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువలపై ఆయన అచంచల నిబద్ధత.. దేశాన్ని నడిపిస్తూనే ఉంటుంది' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రజాస్వామిక విలువలను నిలబెట్టడంలో ఆయన తరతరాలకు ప్రేరణగా నిలుస్తున్నారని కొనియాడారు. వికసిత్ భారత్ నిర్మాణంలో ఆయన ఆలోచనలు మార్గదర్శకాలవుతాయని తెలిపారు.

- 'రాజ్యాంగాన్ని రక్షించడంలో అంబేడ్కర్ కాలాతీత ఘన వారసత్వం నాకు బలాన్నిస్తోంది' అని రాహుల్ పేర్కొన్నారు.
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. 'ఆయన జీవితమంతా ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు, స్వేచ్ఛకు, సమానత్వానికి, సౌభ్రాతృత్వానికి, న్యాయానికి కట్టుబడ్డారు. ఆయన జీవిత విలువలు ఇప్పటికీ మనకు అతి పెద్ద బహుమతి' అని ఖర్గే కొనియాడారు. ముంబయిలోని దాదర్‌లో ఉన్న అంబేడ్కర్ స్మృతివనంలో వేల మంది బాబాసాహెబ్‌కు నివాళులర్పించారు.

ఉక్రెయిన్‌పైకి 653 డ్రోన్లు, 51 క్షిపణులు

- విరుచుకుపడిన రష్యా



కీవ్‌లోని ఓ డిపోలో ధ్వంసమైన రైళ్లు

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా ఆకస్మిక దాడి చేసింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. అమెరికా, ఉక్రెయిన్‌ మధ్య శాంతి చర్చలు జరుగుతున్న వేళ ఈ దాడి జరగడం గమనార్హం. ఉక్రెయిన్‌లోని విద్యుత్తు కేంద్రాలు, ఇంధన సదుపాయాలపై రష్యా దాడులు చేసింది. ఈ దాడుల కారణంగా జపోరిజియాలోని అణు విద్యుత్తు కేంద్రంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. రష్యా దాడులతో కీవ్ ప్రాంతంలోని ఫాస్టివ్ పట్టణంలో ఉన్న రైల్వే స్టేషన్ దగ్ధమైంది. 653 డ్రోన్లు, 51 క్షిపణులను రష్యా వినియోగించింది. దీంతో ఉక్రెయిన్ అంతటా గగనతల అప్రమత్తత ప్రకటించాల్సి వచ్చింది. 585 డ్రోన్లు, 30 క్షిపణులను కూల్చేశామని ఉక్రెయిన్ ప్రకటించింది. ఈ దాడుల్లో 8 మంది గాయపడ్డారు.

బానిస మనస్తత్వం నుంచి బయటపడాలి: మోదీ

దిల్లీ: బానిస మనస్తత్వం నుంచి పదేళ్లలో మనదేశం బయటపడేలా చూడాలని ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. దేశంలో ప్రతి రంగం ఆ దిశగా వెళ్తూ సరికొత్త ఘనతలు సాధిస్తోందన్నారు. శనివారం దిల్లీలో 'హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమిట్'లో ఆయన ప్రసంగించారు. "భారత్‌లో బానిసత్వ భావనలకు మూలమైన మెకాలే సిద్ధాంతం 2035 నాటికి 200 ఏళ్లు పూర్తి చేసుకుంటుంది. అంటే మరో పదేళ్లుంది. ఈ వ్యవధిలో యావద్దేశాన్నీ ఆ ఛాయల నుంచి బయట పడేసేలా మనమంతా ముందుకు రావాలి. భారత్ నెమ్మదిగా అభివృద్ధి చెందడానికి హిందూ సంస్కృతి కారణమని రుజువు చేసేందుకు ఒక ప్రయత్నం జరిగింది. అన్నింటికీ మతం రంగు పులుముతున్న ఈనాటి మేధావులకి ఆనాడు వాడుకలోకి వచ్చిన 'హిందూ పురోగతి రేటు'లో అలాంటిదేమీ కనిపించలేదు. అధిక వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణానికి మన దేశం ఒక నమూనా. ప్రపంచ వృద్ధి 3%, జీ7 దేశాల్లో సగటు వృద్ధి 1.5% ఉంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో భారత్‌లో 8.2% వృద్ధి నమోదైంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చోదకశక్తిగా భారత్ మారుతోందని ఇది చాటుతోంది" అని మోదీ వివరించారు.

ఏ బంధాన్నైనా నిలబెట్టేది ఒక్కటే..



అన్ని బంధాలూ ఏదో ఒక దశలో బోరింగ్‌గా అనిపిస్తాయి. అలాంటప్పుడు వాటిని నిలబెట్టేది ఒకే ఒక్కటి. అదే నిబద్ధత. ప్రేమ అనే భావన కన్నా అది ఉన్నతమైనది. సరదాలు, సంతోషాల్లో మాత్రమే తోడుండటం కాదు- క్లిష్టపరిస్థితుల్లోనూ వెన్నంటి ఉంటూ భావోద్వేగపరమైన మద్దతును అందించడమే అసలైన బంధానికి నిర్వచనం.

– లెవిస్ హొవెస్, రచయిత

బెంగాల్‌లో బాబ్రీ తరహా మసీదుకు శంకుస్థాపన

- రిబ్బన్ కట్ చేసిన హుమయూన్



బెల్‌డంగాలో బాబ్రీ తరహా మసీదుకు శంకుస్థాపనలో ఇటుకలు మోస్తున్న స్థానికులు

బహ్రాంపుర్: పశ్చిమబెంగాల్‌లో బాబ్రీ తరహా మసీదు నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. సమస్యాత్మక ప్రాంతమైన ముర్షిదాబాద్ జిల్లాలోని బెల్‌డంగా ప్రాంతంలో శనివారం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) బహిష్కృత ఎమ్మెల్యే హుమయూన్ కబీర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేల మంది మద్దతుదారుల సమక్షంలో పలువురు మతాధికారులతో కలిసి ఒక వేదికపై ఆయన లాంఛనంగా రిబ్బన్ కట్ చేశారు. మసీదు నిర్మించతలపెట్టిన ప్రాంతం.. అక్కడికి కిలోమీటరు ప్రాంతంలో ఉంది. ఈ చర్య ద్వారా కబీర్.. రాష్ట్రంలో రాజకీయ వేడి పెంచారు. ఈ నేపథ్యంలో చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ ఎత్తున పోలీసులు, కేంద్ర బలగాలు మోహరించాయి. ఎట్టిపరిస్థితుల్లోనూ మసీదును నిర్మించి తీరుతానని కబీర్ స్పష్టంచేశారు. "నా చర్య రాజ్యాంగవిరుద్ధమేమీ కాదు. ప్రార్థనా స్థలాన్ని నిర్మించడం రాజ్యాంగ హక్కు. బాబ్రీ మసీదును నిర్మిస్తా" అని పేర్కొన్నారు. పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక పారిశ్రామికవేత్త ఈ మసీదు నిర్మాణానికి రూ.80 కోట్లు విరాళమివ్వడానికి అంగీకరించారని తెలిపారు. అందువల్ల ఈ ప్రాజెక్టుకు నిధుల కొరత ఉండబోదన్నారు. ఆ ప్రాంగణంలో ఒక ఆసుపత్రి, వైద్య కళాశాల, విశ్వవిద్యాలయం, హోటల్, హెలిపాడ్ కూడా ఉంటాయని తెలిపారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.300 కోట్లు కావొచ్చన్నారు.

కాలుష్య రహితం జూనాగఢ్



ప్రపంచంలో కోట్ల మందిని కాలుష్యం ఇబ్బంది పెడుతోంది. దిల్లీలోని ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయితే గుజరాత్‌లోని జూనాగఢ్‌లో మాత్రం కాలుష్య జాడలే లేవు. అక్కడ కాలుష్యం సున్నా స్థాయిలో ఉంది. దీనికి ప్రధాన కారణం.. ఆ పట్టణంలోగానీ, జిల్లాలోగానీ కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమల్లేవు. అటవీ ప్రాంతం కారణంగా అక్కడి చెట్లు కాలుష్యాన్ని తగ్గించడానికి కారణమవుతున్నాయి. దీపావళి సమయంలో బాణసంచా, జనం అధికంగా రావడంవల్ల కొంత ఇబ్బందులేర్పడతాయి. మిగిలిన కాలంలో ఇక్కడ కాలుష్యమనేదే కనిపించదు.

ఈటీవీ భారత్

'బంగారు' తపాలా బిళ్లలు



పంజాబ్ లుధియానాలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో అరుదైన స్టాంపులు ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడ బంగారు తాపడంతో ఉన్న స్టాంపులతోపాటు విదేశీ స్టాంపులు వేలకొద్దీ కొలువుదీరాయి. భారతీయ సంస్కృతి, వారసత్వం, వన్యప్రాణులు, మతాలు, చరిత్ర, ప్రముఖులకు సంబంధించిన స్టాంపులను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తున్నారు. మాజీ కర్నల్ హర్‌బక్ష్ సింగ్‌కు చెందిన 24 క్యారెట్ల బంగారు తాపడంతో చేసిన స్టాంపు ఇక్కడ కొలువుదీరింది. మొత్తం 7,500 బంగారు స్టాంపులను ఇక్కడ ఏర్పాటు చేశారు.

దక్షిణాఫ్రికా బార్‌లో కాల్పులు.. 11 మంది మృతి

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాలోని ప్రిటోరియా సమీపంలో శనివారం దారుణ ఘటన చోటు చేసుకుంది. సాల్స్‌విల్ టౌన్‌షిప్‌లో అనుమతులు లేని ఓ బార్‌లో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో 11 మంది మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు పిల్లలున్నారు. మరో 14 మందికి గాయాలయ్యాయి. వారికి సంబంధించిన పూర్తి సమాచారం అధికారులు వెల్లడించలేదు. కాల్పులకు ఎందుకు పాల్పడ్డారన్నది తెలియరాలేదు.

సూడాన్‌లో పాఠశాలపై డ్రోన్ దాడి.. 50 మంది మృతి

మృతుల్లో 33 మంది చిన్నారులు

కైరో: సూడాన్‌లోని దక్షిణ కొర్డోఫాన్ రాష్ట్రంలో రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్) ప్రయోగించిన ఓ డ్రోన్ శిశుపాఠశాలపై పడటంతో 50 మంది చనిపోయారు. మృతుల్లో 33 మంది చిన్నారులే ఉన్నారు. బాధితులకు ప్రథమ చికిత్స అందించేందుకు వచ్చిన వైద్యులపైనా రెండో దాడి జరిగినట్లు వైద్యుల సంఘం తెలిపింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

ఎయిడెడ్ పాఠశాలల తనిఖీలకు కమిటీల ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలల తనిఖీలకు పాఠశాల విద్యాశాఖ కమిటీలు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య? పోస్టులు? సదుపాయాలను ఈ కమిటీలు పరిశీలిస్తాయి. పిల్లల సంఖ్య ఆధారంగా కొత్తగా ఉపాధ్యాయుల అవసరం ఉందా? అనేదాన్ని కమిటీలు సిఫార్సు చేస్తాయి. చాలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నా గతంలో మంజూరైన పోస్టులు భర్తీ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ యాజమాన్యాలు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల తనిఖీలకు విద్యాశాఖ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో మండల విద్యాధికారి, క్లస్టర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఉంటారు.

పిల్లలకు క్విజ్ పోటీలు 12 నుంచి

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు క్విజ్ పోటీలు(స్పెల్ బీ) నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. మండలం, జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిల్లో ఈ పోటీలు నిర్వహిస్తారు. మండల స్థాయిలో 12, జిల్లా స్థాయి పోటీలు 27, జోనల్ జనవరి 22, రాష్ట్ర స్థాయి జనవరి 31న నిర్వహిస్తారు. ఈ పోటీల నిర్వహణకు జిల్లాకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

దేవుడి దగ్గర డిజిటల్ చెల్లింపులు వద్దా!

- దర్శనం, ప్రసాదాలు వేటికైనా నగదు చెల్లించాల్సిందేనా
- డిజిటల్ చెల్లింపులకు ఆలయ యంత్రాంగాల ససేమిరా
- నెలలో రూ.114 కోట్ల రాబడి.. అందులో రూ.8.67 కోట్లే ఆన్‌లైన్ లావాదేవీలు

◆ విజయవాడకు చెందిన ముగ్గురు భక్తులు ద్వారకాతిరుమల వెళ్లారు. వేంకటేశ్వరస్వామి దర్శనం ముగించుకుని లడ్డూ, పులిహోర ప్రసాదం కొనడానికి వెళ్లారు. చిల్లర లేదని, ఫోన్‌పే లేదా గూగుల్‌పే చేస్తానని భక్తులు అడిగారు. ఆ అవకాశం లేదని, నగదు ఉంటేనే ప్రసాదం టికెట్లు ఇస్తానంటూ కౌంటర్‌లోని ఉద్యోగి బదులిచ్చారు.

◆ ఒంగోలుకు చెందిన దంపతులు శ్రీశైలం వెళ్లారు. రూ.100 దర్శన టికెట్ల కోసం రూ.500 నోటు ఇచ్చారు. చిల్లర లేదని, రూ.200 ఇవ్వాలని కౌంటర్‌లో ఉద్యోగి అడిగారు. డిజిటల్ చెల్లింపు చేస్తానని భక్తుడు కోరగా ఆ ఉద్యోగి నిరాకరించారు. తమ దగ్గర ఆ సదుపాయం లేదని బదులిచ్చారు. దీంతో క్యూలైన్‌లో ఉన్న ఇతర భక్తుల వద్ద చిల్లర తీసుకొని టికెట్లు కొనాల్సి వచ్చింది.

ఈనాడు – అమరావతి

రోడ్డు పక్కన దుకాణంలో టీ తాగినా కూడా రూ.10 డిజిటల్ చెల్లింపు చేస్తున్న ఈ రోజుల్లో రాష్ట్రంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని పేరుమోసిన ఆలయాల్లో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. ప్రధాన ఆలయాలైన విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీశైలం, అన్నవరం, శ్రీకాళహస్తి, కాణిపాకం, ద్వారకాతిరుమల, సింహాచలం దేవాలయాలతోపాటు, ఇతర ముఖ్య ఆలయాలకు నిత్యం వేలల్లో భక్తులు తరలివస్తారు. దర్శనాలు, వివిధ పూజలు, సేవలు, ప్రసాదాల కోసం కౌంటర్ల వద్దకు వెళితే నగదు ఉంటేనే టికెట్లు ఇస్తున్నారు. డిజిటల్ చెల్లింపులకు ససేమిరా అంటుండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తుంటే ఆలయాల్లో మాత్రం ఇంకా నగదు లావాదేవీలే జరపడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు.

ఆన్‌లైన్ బుకింగ్స్ మాత్రమే

◆ రాష్ట్రంలో గత నెల రోజుల్లో అన్ని ప్రధాన, ముఖ్య ఆలయాల్లో వివిధ టికెట్ల రూపంలో వచ్చిన రాబడి లెక్కలు చూస్తే నగదు లావాదేవీలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టమవుతుంది.

◆ గత నెల రోజుల్లో దర్శనాలు, సేవలు, ప్రసాదాలు, కల్యాణకట్టల్లో టికెట్ల విక్రయాలు, గదుల కేటాయింపు ద్వారా రూ.114.30 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో కేవలం రూ.8.67 కోట్లు (7.5%) మాత్రమే డిజిటల్ చెల్లింపులు. అవి కూడా ఆన్‌లైన్‌లో ముందుగా దర్శనాలు, పూజలు, గదులు బుక్ చేసుకున్న భక్తులు చెల్లించినవే.

◆ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.29.32 కోట్లు, కల్యాణకట్టల వద్ద తలనీలాల సమర్పణ టికెట్ల ద్వారా రూ.1.79 కోట్లు వచ్చాయి. ఇవన్నీ నగదు రూపంలో తీసుకున్నవే.

ఈవోలకు బాధ్యత లేదా?

డిజిటల్ చెల్లింపుల స్వీకరణకు ఒక్క రోజులో ఏర్పాట్లు చేయొచ్చు. దీనివల్ల భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. కానీ ఏ ఆలయ ఈవో కూడా పట్టించుకోవడం లేదు. దేవాదాయశాఖ ఉన్నతాధికారులు సైతం దీనిపై నిర్లక్ష్యం చూపిస్తున్నారు.

'మామ' సూపర్!



సూపర్‌మూన్ శుక్ర, శనివారాల్లో కనువిందు చేసింది. కక్ష్యలో భూమికి చేరువగా ఉండే ప్రాంతంలోకి చంద్రుడు వచ్చినప్పుడు ఈ పరిణామం చోటుచేసుకుంటుంది. ఆ సమయంలో పుడమికి, జాబిల్లికి మధ్య దూరం సుమారు 3.57 లక్షల కిలోమీటర్లు. రెండింటి మధ్య ఉండే సరాసరి దూరం కన్నా ఇది 10-14 శాతం తక్కువ. ఈ కారణంగా సాధారణ పౌర్ణమి రోజుతో పోలిస్తే శుక్ర, శనివారాల్లో చందమామ మరింత పెద్దగా, దేదీప్యమానంగా కనిపించింది. శనివారం ఉదయం 6 గంటలకు తెలంగాణలోని కరీంనగర్ జ్యోతినగర్‌లో పెద్దగా వెండి రంగులో వెలుగులీనుతూ ఇలా దర్శనమిచ్చాడు.

–ఈనాడు, కరీంనగర్

పెద్దిరెడ్డి అనుచరుడి కోసం సీఐడీ గాలింపు

ఈనాడు, కడప: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ దస్త్రాల దహనం కేసులో కీలక నిందితుడైన వంకరెడ్డి మాధవరెడ్డి కోసం సీఐడీ పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. మదనపల్లెకు చెందిన మాధవరెడ్డి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రధాన అనుచరుడు. ఈ ఏడాది ఏప్రిల్ 25న అరెస్టు చేయడానికి సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకోగా.. రిమాండ్ విధించకుండా కోర్టు నుంచి అప్పట్లో తాత్కాలికంగా ఉపశమనం పొందాడు. ఆ తర్వాత న్యాయస్థానం సీఐడీ పోలీసులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో మాధవరెడ్డిని అరెస్టు చేసేందుకు సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ నేతృత్వంలో సీఐ రాజకుమార్, ఎస్సై రంగస్వామి మదనపల్లెలోని అతడి నివాసానికి శనివారం ఉదయం చేరుకున్నారు. ఆ సమయంలో అతడు అక్కడ లేకపోవడంతో వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపడుతున్నారు.



మదనపల్లెలోని మాధవరెడ్డి నివాసం నుంచి తిరిగి వస్తున్న సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ తదితరులు

ఉన్నత చదువులకు వెళ్లి తిరిగిరాని లోకాలకు

- అమెరికాలో అగ్నిప్రమాదం.. హైదరాబాద్ యువతి మృతి



సహజారెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన హైదరాబాద్ యువతి అగ్నిప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం గుంటూరుపల్లికి చెందిన ఉడుముల జయాకర్‌రెడ్డి ఐటీ ఉద్యోగి. భార్య శైలజ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. వారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని శ్రీనివాసపురంలో నివాసం ఉంటున్నారు. దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె సహజారెడ్డి(24) 2021లో ఎంఎస్ చదవడానికి అమెరికా వెళ్లారు. న్యూయార్క్‌లోని అల్బనీ ప్రాంతంలో అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి ఆమె ఉంటున్న అపార్ట్‌మెంట్ పక్కనున్న భవనంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ మంటలు వేగంగా యువతి ఉంటున్న భవనంలోకి వ్యాపించాయి. ఆ సమయంలో నిద్రలో ఉన్న ఆమె మంటల్లో చిక్కుకొని మృతి చెందినట్లు అక్కడి అధికారులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఎన్నో ఆశలతో ఉన్నత చదువులకు వెళ్లిన తమ కుమార్తె ఇక లేదన్న వార్త తెలిసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఘటనపై అమెరికాలో భారత ఎంబసీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఆ కుటుంబంతో సంప్రదింపులు జరుపుతున్నామని అవసరమైన సాయం అందిస్తామని పేర్కొంది. అదే అపార్టుమెంటులో ఉంటున్న మరికొందరు గాయపడినట్లు సమాచారం.

పదో తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం

ఈనాడు, అమరావతి: పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా సెలవుల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నందున ఆ రోజుల్లో కూడా మధ్యాహ్న భోజనం అందించనున్నారు. ఇందుకు అనుమతిస్తూ మధ్యాహ్న భోజనం పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. రెండో శనివారం రెగ్యులర్ శనివారం అందించే మెనూ, ఆదివారం.. సోమవారం మెనూ వడ్డించాలని సూచించారు.

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు ఏపీ భక్తుల దుర్మరణం
- డీఎంకే నేత కారు డ్రైవరూ మృతి



ప్రమాదానికి గురైన ఏపీ కారు



అప్పలనాయుడు ★ రామకృష్ణ ★ రాము ★ చంద్రరావు

చెన్నై (ప్యారిస్), దత్తిరాజేరు, గజపతినగరం, న్యూస్‌టుడే: ఆగి ఉన్న కారును వేగంగా దూసుకొచ్చిన మరో కారు ఢీకొట్టడంతో ఏపీకి చెందిన నలుగురు అయ్యప్ప భక్తులు, మరో డ్రైవర్ ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన తమిళనాడులోని రామనాథపురంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం కె.కొత్తవలస సమీపంలోని అయ్యప్ప సన్నిధానం నుంచి అయిదుగురు భక్తులు ఈ నెల 1న కారులో శబరిమల బయలుదేరారు. 5న శబరిమలలో దర్శనం అనంతరం రామేశ్వరం పయనమయ్యారు. శనివారం తెల్లవారుజామున విశ్రాంతి తీసుకునేందుకు రామనాథపురం సమీపం కీళక్కరై బీచ్ రోడ్డు కుంబిడుమదురై వద్ద రోడ్డు పక్కన కారు ఆపారు. ఆ సమయంలో అతి వేగంగా దూసుకొచ్చిన కీళక్కరై మున్సిపల్ ఛైర్మన్(డీఎంకే నేత)కు చెందిన కారు.. అయ్యప్ప భక్తుల వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో విజయనగరం జిల్లాకు చెందిన మార్పిన అప్పలనాయుడు(33), వంగర రామకృష్ణ (54), బండారు చంద్రరావు (35), డీఎంకే నేత కారు డ్రైవరు ముస్తాక్ అహ్మద్(30) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన ఎనిమిది మందిని రామనాథపురం ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు. అక్కడ మరో అయ్యప్ప భక్తుడు మరడ రాము(50) చనిపోయారు. డీఎంకే నేత కారులోని ఆరుగురు, విజయనగరం జిల్లాకు చెందిన బెవర శ్రీరాం చికిత్స పొందుతున్నారు. ఘటనపై కీళక్కరై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

EENADU Vol: 52, Issue: 117 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు బిజినెస్ వారాంతం

కస్టమ్స్ సుంకాలనూ సరళీకరిస్తాం

తదుపరి మా కీలక సంస్కరణ అదే: ఆర్థిక మంత్రి సీతారామన్



దిల్లీ: జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ, ఆదాయపు పన్ను రేట్ల కోత అనంతరం మరో కీలక సంస్కరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కస్టమ్స్ సుంకాలను కూడా సరళీకరించనుంది. తమ ప్రభుత్వ తదుపరి అజెండా అదేనని ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 'కస్టమ్స్‌లో విస్తృత మార్పులు అవసరం. కస్టమ్స్ నిబంధనలను పాటించడాన్ని ఒక భారంగా ప్రజలు భావించకూడదంటే.. దాన్ని సరళీకరించాలి. మరింత పారదర్శకతనూ తీసుకురావాల'ని ఆమె అభిప్రాయపడ్డారు. కాగా.. రాబోయే బడ్జెట్లో కస్టమ్స్ సరళీకరణపై ఒక ప్రకటన వెలువడొచ్చు. ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ప్రకటించే అవకాశం ఉంది. ప్రజల చేతిలో మరింత నగదు ఉండేలా చూడటం ద్వారా వినియోగాన్ని పెంచాలనే ఉద్దేశంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌టీ, ఆదాయపు పన్ను రేట్లను ప్రభుత్వం తగ్గించిన సంగతి తెలిసిందే. 'గత రెండేళ్లుగా కస్టమ్స్ సుంకాలను తగ్గించుకుంటూ వస్తున్నాం. అయితే కొన్ని వస్తువుల విషయంలో సుంకాలు కాస్త ఎక్కువగా ఉన్నాయని మేం అనుకుంటున్నాం. వాటిని కూడా తగ్గిస్తాం. ఇప్పుడు నా ముందున్న అతిపెద్ద పని అదే' అని మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ వృద్ధి 7 శాతం లేదా అంతకుమించి నమోదు కావొచ్చనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు.

ఇంట్లో ఉన్న వెండి అమ్మేస్తున్నారు





- వారంలోనే 100 టన్నులు విక్రయం
- ధర నిలబడదనే ఆందోళన

బంగారంతో పోటీపడుతూ వెండి ధరలు పెరుగుతున్నాయి. పేదవారి బంగారంగా పేర్కొనే వెండి ధర కిలోకు రూ.1,83,000 పలుకుతోంది. అందువల్లే ధర తక్కువగా ఉన్నప్పుడు వెండిని కిలోల లెక్కన కొని పెట్టుకున్న వారు, వినియోగించని వెండి రూపులు-ఆభరణాలు ఉన్నవారు విక్రయిస్తున్నారు.

ధరలు భారీగా పెరిగినందునే

వెండి ధర మూడేళ్లలోపే మూడింతలకు పైగా పెరిగింది. 2010కి ముందు కిలో వెండి రూ.30,000 లోపే ఉండేది. తదుపరి 2020లో ధరలు దూసుకెళ్లి, కిలో రూ.70,000 వరకు పెరిగింది. అప్పుడు కూడా కిలో రూ.లక్షకు చేరుతుందనే అంచనాల నేపథ్యంలో, భారీ ఎత్తున పలువురు కొనుగోలు చేశారు. అయితే ధరలో భారీ దిద్దుబాటు వచ్చి కిలో రూ.40,000 లోపునకు వచ్చింది. 2020 కొవిడ్ పరిణామాల ముందు వరకు ఇవే ధరలున్నాయి. 2020 ఆగస్టు సమయంలో మళ్లీ కిలో వెండి రూ.70,000 సమీపానికి వెళ్లినా, స్వల్ప వ్యవధిలోనే తగ్గింది. 2022 వరకు రూ.55,000 సమీపంలోనే ఉంది. 2023 నుంచి వెండి ధర పెరుగుతూ వచ్చి రూ.80,000 సమీపానికి, 2024లో రూ.95,000కు చేరింది. ఈ ఏడాది జనవరిలోనే తొలిసారిగా రూ.లక్షను మించింది. తదుపరి పెరుగుతూ వచ్చి ఇప్పుడు రూ.1.80 లక్షలను మించింది. దీపావళి సమయంలోనూ వెండి ధర ఈ స్థాయిలకు చేరినా, నిలబడలేదు. గత నెలలో రూ.1.50 లక్షల సమీపానికి తగ్గింది. మళ్లీ ఇప్పుడు ధర పెరిగినందున, గతంలో తక్కువ ధరలో కొనుగోలు చేసిన వారు, విక్రయిస్తున్నారు. గతవారంలోనే ఇలా 100 టన్నుల వెండి అమ్మకానికి వచ్చిందని ది ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) తెలిపింది. ఇంత భారీ మొత్తంలో వెండి అమ్మకానికి రావడంపై బులియన్ దుకాణదారులు ఆశ్చర్యపోతున్నారు.

సాధారణంగా 10-15 టన్నులు మాత్రమే

ధరలు పెరిగాక పాత బంగారు, వెండి ఆభరణాలు మార్చుకుని, కొత్తవి తీసుకోవడం పెరిగింది. తమ దగ్గర నగదు ఉన్నప్పుడు కొనుగోలు చేసిన మేలిమి వెండి దిమ్మెలను, వినియోగించని వెండి వస్తువులను.. ఆభరణాల తయారీదార్లకు పలువురు విక్రయిస్తుంటారు. ఇలా ప్రతినెలలో సగటున 10-15 టన్నుల పాత వెండి విపణిలోకి వస్తుంటుంది. ఈసారి మాత్రం సాధారణ నెలవారీ సగటుకు 10 రెట్లు అధిక వెండి వారంలోనే అమ్మకానికి వచ్చిందని ఐబీజేఏ జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా తెలిపారు. లాభాల స్వీకరణకు ఎక్కువమంది ప్రయత్నించడమే ఇందుకు కారణమని వివరించారు. పెళ్లిళ్ల సీజన్, శీతాకాలం విహార యాత్రలకు వెళ్లేందుకు నగదు కోసం.. ఇంట్లో నిల్వ ఉన్న వెండిని, పాత ఆభరణాలనూ అమ్ముతున్నారనీ పేర్కొన్నారు. కిలో వెండి రూ.2 లక్షలకు చేరుతుందనే అంచనాలతో కొనుగోలు చేసినవారు కూడా, ఇటీవలి ధరల దిద్దుబాటును చూస్తూ.. 'వచ్చిన మేరకు లాభాలు పొందుదాం. ధర తగ్గితే కొన్నేళ్ల పాటు వేచి చూడాల్సి వస్తుంది' అనే భావనతోనే విక్రయిస్తున్నారు.

వెండి ధరలపై ప్రభావం చూపే అంశాలు

వెండి ఉత్పత్తి నేరుగా జరగడం తక్కువే. పసిడి తవ్వకాల్లో భాగంగా వెండినీ ఉత్పత్తి చేస్తుంటారు. ఇదేవిధంగా సీసం, జింక్ తవ్వకాల సమయంలోనూ వెండి లభిస్తుంటుంది. 2025లో చూస్తే గనుల నుంచి వెలికితీసిన వెండి మొత్తం 813 మిలియన్ ఔన్సులు (ఔన్సు 31.10 గ్రాములు) మాత్రమే. మెక్సికో, రష్యాల నుంచి అధికంగా అందుబాటులోకి వచ్చింది. పెరూ, ఇండోనేసియాల్లో ఈ ఉత్పత్తి తగ్గింది. పాత వెండితో కలిసి అంతర్జాతీయంగా 1.022 బిలియన్ ఔన్సుల వెండి అందుబాటులో ఉంటుందని, గిరాకీ 1.117 బిలియన్ ఔన్సులు ఉండొచ్చన్నది మార్కెట్ వర్గాల అంచనా.

- ఈనాడు వాణిజ్య విభాగం

రష్యా విపణిలోకి పతంజలి ఉత్పత్తులు



దిల్లీ: బాబా రామ్‌దేవ్ నేతృత్వంలోని పతంజలి గ్రూపు రష్యా విపణిలోకి అడుగు పెట్టబోతోంది. ఇందుకు గాను ఆ దేశ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఆరోగ్యం, సంరక్షణ, వైద్య పర్యాటకాన్ని ప్రోత్సహించడం, నైపుణ్య మానవ వనరుల బదిలీ, పరిశోధన సంబంధిత కార్యకలాపాలు లాంటి లక్ష్యాలు ఈ ఒప్పందంలో భాగంగా ఉన్నాయి. ఎంఓయూపై పతంజలి గ్రూపు తరపున బాబా రామ్‌దేవ్, ఇండో-రష్యా బిజినెస్ కౌన్సిల్ ఛైర్మన్, రష్యా మంత్రి సెర్గీ చెర్మిన్ సంతకాలు చేశారు. పతంజలి ఆయుర్వేద్, పతంజలి ఫుడ్స్ ద్వారా ఆయుర్వేదిక్, ఎఫ్‌ఎమ్‌సీజీ ఉత్పత్తులను పతంజలి గ్రూపు విక్రయిస్తున్న సంగతి తెలిసిందే. రష్యాతో ప్రారంభించి సుమారు 200 దేశాలకు పతంజలికి చెందిన వెల్‌నెస్ సేవలను విస్తరించాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని రామ్‌దేవ్ తెలిపారు. ఈ ఎంఓయూ కింద భారత్‌కు చెందిన ప్రముఖ బ్రాండ్లను రష్యాలో, రష్యా బ్రాండ్లను భారత్‌లో ప్రమోట్ చేస్తారు.

కోడి గుడ్లు

7న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	651
వరంగల్	653
విజయవాడ	670
తూ/ప గోదావరి	650
విశాఖపట్నం	640
చిత్తూరు	663

అందరికీ ఆర్థిక సేవలతో పేదరిక నిర్మూలన

'ఆస్కి' వ్యవస్థాపక దినోత్సవంలో కేంద్ర ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి ఎం.నాగరాజు



ఈనాడు, హైదరాబాద్: మన దేశంలో పేదరికం కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు, ఎంతో నిర్మాణాత్మకమైన సవాలు అని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి ఎం.నాగరాజు అన్నారు. అందరికీ ఆర్థిక సేవలు అందించడం (ఫైనాన్షియల్ ఇంక్లూజన్) దీనికి ఒక పరిష్కారమని అభిప్రాయపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికాభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు 'ఫైనాన్షియల్ ఇంక్లూజన్'ను ఒక ముఖ్య సాధనంగా గుర్తిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఆస్కి) 69వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఆయన దిల్లీ నుంచి వర్చువల్ పద్ధతిలో మాట్లాడారు. 'అందరికీ ఆర్థిక సేవలు అందించడం అంటే కేవలం ఒక బ్యాంకు ఖాతా తెరవడం కాదు. ఒక కుటుంబానికి పొదుపు, రుణ సదుపాయాల కల్పన, ఆకస్మిక సంఘటనలను ఎదుర్కొనే శక్తి, విద్య-వైద్యం-ఉపాధిపై పెట్టుబడి పెట్టగల సత్తా కల్పించడం' అని ఆయన వివరించారు.

సమూల మార్పులు: 2014లో ప్రారంభించిన 'పీఎం జన్ ధన్ యోజన' వల్ల గత దశాబ్దకాలంలో అందరికీ ఆర్థిక సేవలు అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా ప్రజల ఆర్థిక ముఖచిత్రం సమూలంగా మారిందని ఆయన వివరించారు. దీంతో కోట్లాదిమంది ప్రజలకు బ్యాంకు ఖాతా తెరిచే అవకాశం కలిగిందన్నారు. 'జన్ ధన్ ఖాతాల్లో రూ.2.75 లక్షల కోట్ల నిల్వ ఉంది. ఒక్కో ఖాతాలో సగటున రూ.4,815 ఉన్నాయి. ఈ ఖాతాల్లో 78.2 శాతం గ్రామీణ, సెమీఅర్బన్ ప్రాంతాలకు చెందిన వారివే'నని అన్నారు. ఇంకా జామ్ (జన్ ధన్, ఆధార్, మొబైల్), బ్యాంకింగ్ టచ్ పాయింట్లు, యూపీఐ, కేంద్రం ప్రారంభించిన ముద్రా రుణాలు, అసంఘటిత రంగంలోని ప్రజలకు ఉపాధి కల్పించే పథకాలు, జన్ సురక్ష బీమా, పింఛను పథకాలు... ఫైనాన్షియల్ ఇంక్లూజన్‌ను మరింతగా విస్తరించినట్లు అభిప్రాయపడ్డారు.

'ప్రజలకు కేవలం ఆర్థిక సేవలు అందిస్తేనే సరిపోదు. సేవల నాణ్యత, అధిక వినియోగం, భద్రత, దీర్ఘకాలిక ఆర్థిక సత్తా కల్పన వంటివి కీలక అంశాలుగా ఉన్నాయి. రుణ సదుపాయాలను విస్తరించే దిశగా సంస్థలను బలోపేతం చేయాల్సి ఉంది. తద్వారా ప్రజలకు మెరుగైన ఆర్థిక భవిష్యత్తును సాధించటానికి వీలుకలుగుతుంద'ని అభిప్రాయపడ్డారు. ఫైనాన్షియల్ ఇంక్లూజన్ వల్ల అందరికీ అభివృద్ధి ఫలాలు అందుతాయని, అసమానతలు తగ్గుతాయని, సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆస్కి డైరెక్టర్ జనరల్ ఎన్.రమేష్ కుమార్ వందన సమర్పణ చేశారు.

బయోకాన్‌లో బయోకాన్ బయోలాజిక్స్ విలీనం



దిల్లీ: బయోకాన్ బయోలాజిక్స్‌ను విలీనం చేసుకుంటున్నట్లు బయోటెక్నాలజీ దిగ్గజ సంస్థ బయోకాన్ తెలిపింది. ప్రతిపాదిత విలీన ప్రక్రియలో భాగంగా బయోకాన్ బయోలాజిక్స్‌లో సీరమ్ ఇన్‌స్టిట్యూట్ లైఫ్ సైన్సెస్, టాటా కేపిటల్ గ్రోత్ ఫండ్ 2, యాక్టివ్ పైన్ ఎల్‌ఎల్‌పీకి చెందిన వాటాను బయోకాన్ కొనుగోలు చేయనుంది. బయోకాన్ బయోలాజిక్స్ విలువను 5.5 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ.50,000 కోట్లు) పరిగణించి షేర్ల స్వాప్ ద్వారా ఈ వాటా కొనుగోలును పూర్తి చేయనున్నట్లు ఎక్స్ఛేంజీలకు బయోకాన్ తెలిపింది. షేర్ల మార్పిడి నిష్పత్తి కింద ప్రతి 100 బయోకాన్ బయోలాజిక్స్ షేర్లకు గాను 70.28 బయోకాన్ షేర్లను రూ.405.78 ధర వద్ద జారీ చేయనున్నట్లు పేర్కొంది.

- అలాగే బయోకాన్ బయోలాజిక్స్‌లో మైలాన్ ఇంక్ వద్ద ఉన్న మిగతా వాటాను కూడా 815 మి.డాలర్లతో (సుమారు రూ.7,300 కోట్లు) కొనుగోలు చేయనుంది. ఇందులో 400 మి.డాలర్లను (సుమారు రూ.3,600 కోట్లు) నగదు రూపేణా, 415 మి.డాలర్ల (రూ.3,700 కోట్లు)ను షేర్ల స్వాప్ ద్వారా మైలాన్‌కు చెల్లించనున్నట్లు బయోకాన్ తెలిపింది.
- ఈ విలీన ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేందుకు కిరణ్ మజుందార్‌షా నేతృత్వంలో గవర్నెన్స్ కౌన్సిల్‌తో పాటు, బయోకాన్ బయోలాజిక్స్ సీఈఓ, ఎండీ శ్రీహాస్ తాంబే నేతృత్వంలో ట్రాన్సిషన్, ఇంటిగ్రేషన్ మేనేజ్‌మెంట్ కమిటీని బయోకాన్ ఏర్పాటు చేస్తోంది.
- ఆదాయపరంగా ప్రపంచంలోని అతిపెద్ద 5 బయోసిమిలర్ సంస్థల్లో బయోకాన్ బయోలాజిక్స్ ఒకటి. బయోకాన్‌లో ఈ సంస్థ విలీనం 2026 మార్చి 31 కల్లా పూర్తయ్యే అవకాశం ఉంది. సంబంధిత అనుమతులన్నీ లభిస్తే బయోకాన్ బయోలాజిక్స్ విలీనానంతర బయోకాన్‌కు సీఈఓ, మేనేజింగ్ డైరెక్టరుగా తాంబే, ముఖ్య ఆర్థిక అధికారిగా కేదార్ ఉపాధ్యాయ్ బాధ్యతలు చేపడతారు. ప్రస్తుతం బయోకాన్‌కు సీఈఓ, ఎండీగా ఉన్న సిద్ధార్థ మిత్తల్ బయోకాన్ గ్రూపులోనే ఏదేని నాయకత్వ హోదా బాధ్యతలకు బదిలీ అవుతారని బయోకాన్ వెల్లడించింది.

12 నుంచి ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ఐపీఓ

దిల్లీ: ఐసీఐసీఐ బ్యాంక్ అనుబంధ సంస్థ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రావడానికి సన్నద్ధమవుతోంది. ఈ ఐపీఓ ఈ నెల 12న మొదలై 16న ముగియనుందని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించిన ముసాయిదా పత్రాల్లో కంపెనీ తెలిపింది. ఈ ఐపీఓ ద్వారా సుమారు రూ.10,000 కోట్ల నిధులను సమీకరించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మొత్తం ఇష్యూ ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలోనే ఉండనుంది. ఇందులో భాగంగా 4.89 కోట్ల ఈక్విటీ షేర్లను బ్రిటన్‌కు చెందిన ప్రమోటర్ ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్ విక్రయించనుంది. అంటే సేకరించిన మొత్తం నిధులు సంస్థకు కాకుండా వాటాదారుకే వెళ్తాయి. ప్రస్తుతం సంస్థలో ఐసీఐసీఐ బ్యాంక్‌కు 51 శాతం వాటా ఉండగా.. మిగిలిన 49 శాతం వాటా ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్ చేతిలో ఉంది.

మరోసారి భారత్-అమెరికా వాణిజ్య చర్చలు

ఈ నెల 10 నుంచి 3 రోజుల పాటు



దిల్లీ: భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలు ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మూడు రోజుల పాటు సాగే ఈ చర్చల్లో మొదటి విడత ఒప్పందంపై దృష్టి సారించనున్నారు. దిల్లీలో జరగబోయే ఈ చర్చలకు అమెరికా తరపున హాజరవుతున్న బృందానికి డిప్యూటీ యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) రిక్ స్విట్జర్ నేతృత్వం వహించనున్నారు. భారత ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. చివరిసారి అగ్రరాజ్య ప్రతినిధులు సెప్టెంబరు 16న చర్చల కోసం మన దేశానికి వచ్చారు. అనంతరం అదే నెల 22న వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని బృందం అమెరికాకు వెళ్లింది. ఈ ఏడాదిలోనే అమెరికాతో తొలి దశ వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఇటీవల వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. భారత ఎగుమతిదారులకు లబ్ధి చేకూరేలా సుంకాల అంశాన్ని ప్రస్తావిస్తామని తెలిపారు. అలాగే టారిఫ్‌ల సమస్య పరిష్కారానికి ఓ దఫా.. పూర్తిస్థాయి వాణిజ్య ఒప్పందం దిశగా మరో విడత చర్చలు జరుపుతామని చెప్పారు. 2025 డిసెంబరు నాటికి వాణిజ్య చర్చలు పూర్తి కావాలని ఇరు దేశాలు నిర్దేశించుకున్నాయి. ఆ దిశగా ఇప్పటి వరకు ఇరు దేశాల ప్రతినిధులు ఆరుసార్లు సమావేశమయ్యారు. ప్రస్తుతం భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 191 బిలియన్ డాలర్లుగా ఉంది. 2030 నాటికి దీన్ని 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఎవరీ పీటర్ ఎల్బర్స్?

ర్యాంప్ సూపర్‌వైజర్ నుంచి ఇండిగో సీఈఓ దాకా..



ఇండిగో విమాన సర్వీసుల రద్దు వ్యవహారం దేశ వ్యాప్తంగా విమానయాన వ్యవస్థను గందరగోళంలోకి నెట్టింది. దీంతో సంస్థ సీఈఓ పీటర్ ఎల్బర్స్ స్వయంగా వీడియో సందేశం ద్వారా ప్రయాణికులకు క్షమాపణలు చెప్పారు. అలాగే శనివారం కూడా అసౌకర్యానికి చింతిస్తూ కంపెనీ ఓ ప్రకటన విడుదల చేసింది. మరో వైపు ప్రయాణికుల పాట్లు తీవ్రమవటంతో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో కంపెనీ సీఈఓపై వేటు తప్పదేమోననే విశ్లేషణలు వెలువడుతున్నాయి. దీంతో పీటర్ ఎల్బర్స్ ఎవరు? ఆయన నేపథ్యం ఏంటనే చర్చ జరుగుతోంది.

ఏవియేషన్‌లో సుదీర్ఘ అనుభవం: ఒక ర్యాంప్ సూపర్‌వైజర్‌గా కెరీర్ ప్రారంభించిన పీటర్ ఎల్బర్స్ అంచెలంచెలుగా ఎదుగుతూ 2022లో ఇండిగో సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు దాదాపు మూడు దశాబ్దాల పాటు కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్‌లో పనిచేశారు. అక్కడ 2014 నుంచి 2022 వరకు ప్రెసిడెంట్, సీఈఓ హోదాలో బాధ్యతలు నిర్వర్తించారు. 2011-2014 మధ్య చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా ఉన్నారు. అంతకుముందు నెట్‌వర్క్ అండ్ అలయన్సెస్ విభాగానికి సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు.

- కేఎల్ఎం గ్రూప్ తరపున జపాన్, గ్రీస్, ఇటలీలో జనరల్ మేనేజర్‌గా పీటర్ బాధ్యతలు నిర్వర్తించారు. 1995 నుంచి 1999 మధ్య రూట్ నెట్‌వర్క్ ప్లానింగ్‌లో పనిచేశారు. 1992 నుంచి 1995 వరకు ఆమ్‌స్టర్‌డ్యామ్ ఎయిర్‌పోర్టులో ర్యాంప్ సూపర్‌వైజర్‌గా చేశారు. ● 2006లో కొలంబియా బిజినెస్ స్కూల్‌లో ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ పూర్తి చేశారు. ● 'ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్' బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌లో సభ్యుడిగానూ ఉన్నారు. 2024 జూన్‌లో అదే బోర్డుకు ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు.

2030 కల్లా ఈపీసీ రంగంలో 2.5 కోట్ల ఉద్యోగాలు

సీఐఈఎల్ హెచ్‌ఆర్ నివేదిక



ముంబయి: దేశీయ ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) రంగంలో 2030 నాటికి 2.5 కోట్లకు పైగా ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని సీఐఈఎల్ హెచ్‌ఆర్ రూపొందించిన 'ఈపీసీ సెక్టార్ టాలెంట్ స్టడీ 2025' నివేదిక వెల్లడించింది. దేశంలో మౌలిక సదుపాయాల వృద్ధి విస్తరిస్తుండటం ఇందుకు మద్దతు ఇస్తుందని పేర్కొంది. దేశంలో ఉద్యోగాల సృష్టిలో అత్యంత శక్తిమంతమైన రంగాల్లో ఈపీసీ కూడా ఒకటిగా నిలుస్తుందని తెలిపింది. నివేదిక ప్రకారం..

- 2020 నుంచి ఈ రంగంలో నియామక గిరాకీ బలంగా ఉండటంతో 51 శాతం వృద్ధి నమోదైంది. దేశ ఈపీసీ రంగంలోని సంఘటిత, అసంఘటిత రంగాల్లో 8.5 కోట్ల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారు. ఇందులో అగ్రశ్రేణి సంస్థలు నియమించే ఈపీసీ శ్రామిక శక్తిలో సుమారు 70-80 లక్షల మంది నిపుణులు ఉన్నారు.
- 'దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి విస్తరిస్తున్న కొద్దీ నియామకాల్లో పెరుగుదల కొనసాగుతుంది. 2030 నాటికి ఈపీసీ రంగం 2.5 కోట్లకు పైగా ఉద్యోగాలను సృష్టిస్తుందని అంచనా. ప్రతి సంవత్సరం లక్షలాది మంది కార్మిక సమూహంలోకి ప్రవేశిస్తున్నందున, ఈ రంగం భారత శ్రామిక శక్తిలో గణనీయమైన వాటాను కొనసాగిస్తూనే ఉంటుంద'ని సీఐఈఎల్ హెచ్‌ఆర్ ఎండీ, సీఈఓ ఆదిత్య నారాయణ్ మిశ్రా వెల్లడించారు.
- 'ఈపీసీ సెక్టార్ మార్కెట్ అవుట్‌లుక్ 2025 అధ్యయనం' అనేది నిర్మాణాత్మక విధానంపై ఆధారపడి చేశారు. 2024 జులై నుంచి 2025 ఆగస్టు వరకు ప్రముఖ జాబ్ పోర్టళ్లలో 2,27,000 ఉద్యోగ పోస్టింగ్‌ల నుంచి నియామక గిరాకీ ఆధారంగా ఈ నివేదికను సీఐఈఎల్ హెచ్‌ఆర్ రూపొందించింది.
- కృత్రిమ మేధ (ఏఐ)తో ఈపీసీ ఉద్యోగాలకు ఎలాంటి ముప్పు వాటిల్లదని అధ్యయనం స్పష్టం చేసింది. ప్రాజెక్ట్ సైట్లలో ఏఐ వల్ల ఇంకా సామర్థ్యం పెరుగుతుందని, ప్రణాళిక-ఇంజినీరింగ్ వర్క్‌ఫ్లోలను బలోపేతం చేస్తుందని తెలిపింది. ఏఐ.. సరఫరా చైన్ నిర్వహణను మెరుగుపరుస్తుందే కానీ శ్రామిక శక్తి గిరాకీని తగ్గించదని వివరించింది.
- పెద్ద పెద్ద మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఈపీసీ ఉద్యోగాలకు ప్రథమ శ్రేణి నగరాల నుంచే 80 శాతం గిరాకీ ఉంది. ముంబయి 23 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, దిల్లీ 22 శాతంతో రెండో స్థానంలో ఉంది. మిగిలిన 20 శాతం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచి వస్తోంది. లఖ్‌నవూ, జయపుర, కోయంబత్తూర్, విశాఖపట్నంలో ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్ నిర్వహణ, ఫీల్డ్ ఆపరేషన్స్ ఉద్యోగాలకు గిరాకీ బాగా ఉంది.
- రోడ్లు, రహదారుల విభాగంలో అత్యధికంగా 26 శాతం నియామక గిరాకీ ఉంది. విద్యుత్ సరఫరా, పంపిణీ రంగంలో 15 శాతం, రెన్యువబుల్స్‌లో 14 శాతం గిరాకీ కనిపించింది.

ఓలాలో 1,000 ఉద్యోగాలు




దిల్లీ: ఓలా ఎలక్ట్రిక్ సుమారు 1000 మంది సీనియర్ సర్వీస్ టెక్నీషియన్లు, ప్రత్యేక వృత్తి నిపుణులను నియమించుకునే యత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. మలివిడత హైపర్‌సర్వీస్ కార్యక్రమంలోకి అడుగుపెట్టనున్న నేపథ్యంలో ఈ నియామకాలు చేపట్టనుందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. విక్రయేతర సిబ్బందిని గణనీయంగా పెంచుకునేందుకు, సత్వర సేవలను అందించేందుకు ఈ నియామకాలు కంపెనీకి ఉపయోగపడనున్నాయి. ఉద్యోగుల సంఖ్యను పెంచుకోవాలన్న ఉద్దేశంతో కాకుండా.. సత్వర, సమగ్ర వాహన మరమ్మతు సేవలను అందించే లక్ష్యంతో అనుభవజ్ఞులకు, ప్రత్యేక నిపుణులకు ఈ నియామకాల్లో ఓలా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా ఈవీ డయాగ్నోస్టిక్స్ నిపుణుల దగ్గర నుంచి సర్వీస్ సెంటర్ మేనేజర్లు, వినియోగదార్ల అడ్వయిజర్స్ వరకు ఈ నియామకాల్లో ఉండనున్నట్లు తెలిపాయి.

లిక్విడేటర్ నియామక హక్కు రుణదాతల కమిటీదే: ఎన్‌సీఎల్‌ఏటీ

దిల్లీ: రుణ కష్టాల్లో ఉండి దివాలా స్మృతి ఎదుర్కొంటున్న కంపెనీకి లిక్విడేటర్‌ను నియమించే హక్కు రుణదాతల కమిటీకే ఉంటుందని నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) వెల్లడించింది. ఇందులో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) జోక్యం చేసుకోరాదని తెలిపింది. దివాలా స్మృతి ఎదుర్కొంటున్న రెండు కంపెనీలకు ఎన్‌సీఎల్‌టీ లిక్విడేటర్లను నియమించడంపై ఎన్‌సీఎల్‌ఏటీ జోక్యం చేసుకుని లిక్విడేటర్ల నియామకం రుణదాతల కమిటీ హక్కు అని, ఎన్‌సీఎల్‌టీ నియామకాలను పక్కనపెట్టింది.

ఆహార శుద్ధి రంగంలో అపరిమిత అవకాశాలు

- కార్పొరేట్లు పెట్టుబడులు పెంచాలి
- ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శి ఏపీ దాస్ జోషి




దిల్లీ: ఆహార శుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్) రంగంలో అపరిమిత అవకాశాలున్నందున, కార్పొరేట్లు పెట్టుబడులు పెంచాలని ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శి ఏపీ దాస్ జోషి కోరారు. ప్రస్తుతం 12 శాతంగా ఉన్న మన ఆహార ప్రాసెసింగ్ స్థాయిని విస్తరించాలని, శుద్ధి చేసిన ఆహారాన్ని విదేశాలకు మరింతగా ఎగుమతి చేయాలని విజ్ఞప్తి చేశారు. 'శుద్ధి చేసిన ఆహారం మంచిది కాదనే అపోహను తొలగించాలి. ఇటీవలి లేబర్ కోడ్ సంస్కరణలు ఈ రంగానికీ ప్రయోజనం చేకూరుస్తాయి. హెచ్ఎఫ్ఎస్ఎస్ (అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు), ఎఫ్ఓపీఎన్ఎల్ (ఫ్రంట్-ఆఫ్-ప్యాక్ న్యూట్రిషన్ లేబులింగ్)కు సంబంధించిన సమస్యలు ప్రభుత్వం పరిశీలనలో ఉన్నాయి. వీటిపై త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంద'ని తెలిపారు. 'దేశ వ్యాప్తంగా ఈ రంగంలో 24 లక్షల యూనిట్లు ఉన్నాయి. వీటిల్లో 2 శాతమే వ్యవస్థీకృతంగా ఉన్నాయి. పరిశ్రమ లీడర్ల నుంచి ఈ రంగంలో అధిక పెట్టుబడుల కోసం ఎదురుచూస్తున్నాం. ఎఫ్‌డీఐ, ప్రైవేటు దేశీయ పెట్టుబడులకు ఈ రంగంలో భారీ అవకాశం ఉంద'ని జోషి వివరించారు.

- మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో ప్రాసెస్ చేసిన ఆహారం వాటా 2014-15లో 11% కాగా, ప్రస్తుతం 22 శాతానికి పెరిగింది. 2030 నాటికి ఈ వాటా 30-32 శాతానికి చేరుకోవచ్చని అంచనా.

సైబర్ భద్రతా కంపెనీల ఆదాయం 2026 కల్లా రూ.54,000 కోట్లకు..

భారత డేటా భద్రతా మండలి అంచనా



దేశంలో సైబర్ భద్రతా ఉత్పత్తులను అందిస్తున్న కంపెనీల ఆదాయం 2026 నాటికి 6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.54,000 కోట్ల)కు చేరొచ్చని ఐటీ పరిశ్రమ సమాఖ్య నాస్కామ్ డేటా భద్రత అనుబంధ సంస్థ భారత డేటా భద్రత మండలి (డీఎస్‌సీఐ) అంచనా వేసింది. 2025లో ఇది 4.46 బి.డాలర్లు (సుమారు రూ.40,000 కోట్లు)గా ఉండొచ్చని తెలిపింది. 'భారత సైబర్ భద్రతా ఉత్పత్తుల కంపెనీల ఆదాయం 2026లో 5.98 బి.డాలర్లకు చేరే అవకాశం కనిపిస్తోంద'ని వార్షిక సమాచార భద్రత సమిట్ 2025లో డీఎస్‌సీఐ సీఈఓ వినాయక్ గాడ్సే వెల్లడించారు. గత 5 ఏళ్లలో ఈ విభాగం 4 రెట్ల వృద్ధిని నమోదు చేసిందని పేర్కొన్నారు. 2025లో ఈ విభాగం వార్షిక ప్రాతిపదికన 25% వృద్ధిని నమోదు చేయొచ్చని తెలిపారు. ఈ విభాగంపై కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం బాగా ఉందని వెల్లడించారు. భారత సైబర్ భద్రతా కంపెనీలు తొలుత దేశీయంగా, అమెరికా విపణుల్లో ఉత్పత్తులు విక్రయిస్తున్నాయని, పశ్చిమాసియా దేశాలు కొత్త గమ్యస్థానాలు కాబోతున్నాయని వివరించారు. 'కర్ణాటక, దిల్లీ, మహారాష్ట్రల్లో ఎక్కువ శాతం సైబర్ భద్రతా ఉత్పత్తుల కంపెనీలు ఉన్నాయి. దేశ వ్యాప్తంగా 400కు పైగా ఇలాంటి సంస్థలు ఉన్నాయ'ని డీఎస్‌సీఐ లీడ్ రీసెర్చర్ అండ్ ఇన్‌సైట్స్ నేహా మిశ్రా వెల్లడించారు.

రూపాయి పతనం.. ఎగుమతిదార్లకు ప్రయోజనకరమే

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

రూపాయి పతనం పూర్తిగా ప్రతికూలమేమీ కాదని, ఇలాంటి పరిస్థితులు ఎగుమతిదార్లకు ప్రయోజనకరమేనని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 'ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగా ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కంటే.. ఇప్పుడు ఆర్థికవ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉంది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రూపాయిపై చర్చ జరగాల'ని అభిప్రాయపడ్డారు. 'రూపాయి విలువ తగ్గినప్పుడు.. మన ఎగుమతిదారులు దానిని సద్వినియోగం చేసుకుంటున్నారని నేను కచ్చితంగా చెప్పగలను. మన ఉత్పత్తులపై సుంకాల వేళ.. ఇది కాస్త సానుకూలమే. రూపాయి కదలికలతో పాటు ఆర్థిక వ్యవస్థ బలాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కరెన్సీ హెచ్చుతగ్గులు ఆర్థిక వ్యవస్థ పనితీరును నిర్ణయించలేవ'ని అన్నారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితులు, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి కారణాలతో భారత రూపాయి మారకం విలువ అమెరికన్ డాలర్‌తో పోలిస్తే జీవనకాల కనిష్ఠాలకు పతనమవుతోంది. రూపాయి విలువ 90.70-91 స్థాయిని తాకనుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఊబకాయమా.. ఏఐ సలహాలిస్తాం

హెల్దీఫై - నొవో నార్డిస్క్ భాగస్వామ్యం

ఆరోగ్య, ఫిట్‌నెస్ ప్లాట్‌ఫామ్ హెల్దీఫైతో, డెన్మార్క్ ఔషధ సంస్థ నొవో నార్డిస్క్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఊబకాయంతో బాధపడే వారికి కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో జీవనశైలి సూచనలు అందించే కార్యక్రమాన్ని నొవో నార్డిస్క్ ఇండియా, హెల్దీఫై సంయుక్తంగా తీసుకొచ్చాయి. రోగుల చికిత్స తీరు, ఫలితాలను మెరుగుపరచడమే ఈ భాగస్వామ్య లక్ష్యమని ఇరు కంపెనీలు తెలిపాయి. మొత్తం చికిత్స సమయంలో, రోగులు తమ పోషకాహారానికి సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు ఏఐ అసిస్టెంట్ సాయం చేస్తుంది. ఊబకాయ చికిత్సలో జీఎల్‌పీ-1 థెరపీతో పాటు సరైన జీవనశైలి తోడ్పాటు అవసరమని హెల్దీఫై సహవ్యవస్థాపకుడు, సీఈఓ తుషార్ వశిష్ఠ్ తెలిపారు. ఊబకాయులు సరైన పద్ధతిలో చికిత్స పొందడంతో పాటు, దీర్ఘకాలంలో ఆరోగ్యకర అలవాట్లతో గడిపేలా సాయం చేయడమే తమ లక్ష్యమని వివరించారు. కృత్రిమ మేధ సాయంతో, డైటీషియన్ నేతృత్వంలో మార్గదర్శకాలు అందిస్తామన్నారు. జీఎల్‌పీ-1 ఆవిష్కరణల్లో అగ్రగామిగా ఉన్నామని, తాజా భాగస్వామ్యంతో మరింత మెరుగైన సేవలు అందించనున్నట్లు నొవో నార్డిస్క్ ఇండియా ఎండీ విక్రాంత్ శ్రోత్రియా పేర్కొన్నారు.

ఈనాడు సినిమా

జపాన్ అభిమానుల కోరిక నెరవేరింది

- రాజమౌళి

ప్రభాస్ కథానాయకుడిగా ప్రముఖ దర్శకుడు రాజమౌళి తెరకెక్కించిన 'బాహుబలి' రెండు భాగాల్ని కలిపి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో రూపొందించిన సంగతి తెలిసిందే. ఇటీవలే ఇండియాలో విడుదలైన ఈ సినిమా ఇప్పుడు ఈ నెల 12న జపాన్ ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే జపాన్‌లో సందడి చేస్తూ.. అక్కడి అభిమానులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు ప్రభాస్. ఈ సందర్భంగా జపాన్ అభిమానుల కోరిక ఇప్పుడు నెరవేరిందంటూ ఆయనకు ఓ లేఖ రాశారు రాజమౌళి. దీన్ని సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకున్నారు ప్రభాస్. ' 'జపాన్‌లో అభిమానులకు నువ్వంటే ఎంత ఇష్టమో ఇప్పటికే నీకు అర్థమై ఉంటుంది. నీకు వారి అభిమానం చూసి ఆనందబాష్పాలు వస్తాయని నాకు తెలుసు. నేను జపాన్‌కి నాలుగు సార్లు వెళ్లాను. వెళ్లిన ప్రతిసారీ అందరూ నన్ను 'ప్రభాస్ ఎప్పుడు వస్తారు?' అని ఒక్కటే ప్రశ్న అడిగేవారు. ఇన్ని రోజులకు నా బాహుబలి అక్కడ సందడి చేస్తున్నాడు. జపాన్‌లోని మా అభిమానుందరికీ మరోసారి ధన్యవాదాలు తెలుపుతున్నా" అంటూ ఆ లేఖలో రాసుకొచ్చారు రాజమౌళి. ప్రస్తుతం ఈ లెటర్ సోషల్ మీడియాలో సందడి చేస్తుంది.

నేడు ఈటీవీలో 'లిటిల్ హార్ట్స్'



చదువంటే అంతగా ఆసక్తి చూపించని ఓ టీనేజ్ జంట మధ్య సాగే కథతో తెరకెక్కి ప్రేక్షకుల్లో నవ్వులు పూయించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్‌లో రూపొందిన ఈ సినిమాలో మౌళి తనూజ్, శివానీ నాగారం జంటగా నటించారు. సాయి మార్తాండ్ దర్శకత్వం వహించారు. ఆదిత్య హాసన్ నిర్మాత. యువతను ఆకట్టుకునే అంశాలతో తీర్చిదిద్దిన ఈ సినిమా ఇటీవలే విడుదలై విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. ఇప్పుడీ యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ఈరోజు సాయంత్రం 6.30గంటలకు ఈటీవీలో ప్రసారం కానుంది.

అన్న రియల్‌హీరో



కార్తి

సమాజానికి ఒక రియల్ హీరో అవసరమైనప్పుడల్లా అన్నగారిలా వచ్చే ఆ పోలీసు కథేమిటో తెలియాలంటే 'అన్నగారు వస్తారు' చూడాల్సిందే. కార్తి కథానాయకుడిగా నటించిన చిత్రమిది. కృతిశెట్టి కథానాయిక. నలన్ కుమారస్వామి దర్శకుడు. స్టూడియో గ్రీన్ పతాకంపై కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్, కామెడీ కథతో రూపొందిన ఈ సినిమా ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు హరీశ్‌శంకర్ శనివారం ఈ సినిమా ట్రైలర్‌ని ఎక్స్ వేదికగా విడుదల చేశారు. థియేటర్లో చూడాలనే ఆసక్తిని రేకెత్తించేలా ట్రైలర్ ఉందని ఆయన చిత్ర బృందాన్ని అభినందించారు. ఇందులో కార్తి పోలీసు అధికారిగా కనిపించనున్నారు. ఆ పోలీసు కథకీ, తెలుగు వాళ్లంతా అన్నగారు అని పిలుచుకునే ఎన్టీఆర్‌కీ సంబంధమేమిటన్నది ఈ సినిమాలో ఆసక్తికరమైన విషయమని ట్రైలర్ చాటుతోంది.



'ది రాజా సాబ్'

పండగలో కితకితలే!

● నవ్వులు పంచడమే లక్ష్యంగా సంక్రాంతి సినిమాలు

సంక్రాంతికి రానున్న సినిమాలేమిటో దాదాపు ఖరారైనట్టే. ఇప్పటికే ఐదు సినిమాలు విడుదలను పక్కా చేసుకున్నాయి. పొరుగు భాషల నుంచి ఒకట్రెండు అనువాద చిత్రాలు కూడా తోడయ్యాయంటే ఇక రోజుకొకటి చూసినా వారానికి సరిపడా సినిమాలు. మన ముగ్గుల పండగంటే సినిమాల పండగే అని బాక్సాఫీస్ మరోమారు రుజువు చేసినట్టవుతుంది. అయితే ఈసారి పండగకు వస్తున్న సినిమాలకు ఓ ప్రత్యేకత ఉంది. అన్నీ కూడా ప్రేక్షకుల్ని నవ్వించడమే లక్ష్యంగా చేసుకున్నవే. థియేటర్లలో కావల్సినన్ని కితకితలన్నమాట.

అసలు సిసలు పండగ సినిమా మాదే అంటూ ప్రత్యేకంగా ప్రచారం చేసుకుంటూ ప్రేక్షకుల్ని ఆకర్షిస్తుంటారు దర్శకనిర్మాతలు. గతేడాది 'సంక్రాంతికి వస్తున్నాం' అదే తరహాలోనే ప్రేక్షకుల ముందుకొచ్చి వసూళ్లని కొల్లగొట్టింది. ఈసారి విడుదల కానున్న 'మన శంకరవరప్రసాద్‌గారు', 'ది రాజాసాబ్', 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', 'అనగనగా ఒక రాజు'... ఇలా అన్ని చిత్రాలూ అసలు సిసలైన పండగ సినిమాల్లానే కనిపిస్తున్నాయి. ఇంటిల్లిపాదినీ అలరించే వినోదంతోనే ఈ సినిమాలు రూపొందుతున్నాయని ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు చాటుతున్నాయి. శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారి' కూడా ఈ పండగనే లక్ష్యంగా చేసుకుని విడుదలకు ముస్తాబవుతోంది. అది కూడా కుటుంబ వినోదం ఉన్న సినిమానే.

ఆ రెండూ కూడా...


ఈ సంక్రాంతికి వస్తున్న రవితేజ, నవీన్ పొలిశెట్టి చిత్రాలు 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', 'అనగనగా ఒక రాజు' కూడా ఇంటిల్లిపాదికీ నచ్చే వినోదానికి హామీనిస్తున్నాయి. ప్రచార చిత్రాలు, పాటల సందడి ప్రేక్షకుల్ని ఆకర్షిస్తున్నాయి. కిశోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. స్వచ్ఛమైన కథలతోనూ, బలమైన హాస్యంతోనూ ఆయన సినిమాలు రూపొందుతుంటాయి. రవితేజ, ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి ప్రధాన పాత్రధారులుగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రం పేరుతోనే కట్టిపడేసింది. ఇక యువ కథానాయకుడు నవీన్ పొలిశెట్టి అంటే హాస్యానికి గ్యారెంటీ. వరుస విజయాలతో దూసుకెళుతున్న ఆయన కాస్త విరామం తీసుకుని చేసిన సినిమానే 'అనగనగా ఒక రాజు'. మారి దర్శకత్వం వహిస్తుండగా సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రం జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. వీటితోపాటు, శర్వానంద్ కథానాయకుడిగా నటించిన 'నారీ నారీ నడుమ మురారి' కూడా సంక్రాంతి బరిలో నిలిచింది. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు.

చిరు... ప్రభాస్... ఇద్దరిదీ అదే దారి

సంక్రాంతి హీరోలే కాదు, సంక్రాంతి దర్శకులు కూడా ఉంటారని రుజువు చేస్తున్నారు అనిల్ రావిపూడి. గతేడాది వెంకటేశ్ కథానాయకుడిగా 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాన్ని తెరకెక్కించి ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు. ఈసారి కూడా పండగకు వస్తున్నారు... అంటూ చిరంజీవి కథానాయకుడిగా 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో మరో అగ్రహీరో వెంకటేశ్ ఓ కీలక పాత్ర పోషించారు. హారర్ కామెడీ కథలపై పట్టున్న దర్శకుడు మారుతి. మరోమారు ఆ తరహా కథనే ఎంచుకుని, అగ్ర తార ప్రభాస్ కథానాయకుడిగా పాన్ ఇండియా హంగులతో 'ది రాజాసాబ్' చిత్రాన్ని తెరకెక్కించారు. తాత, మనవడు నేపథ్యం, హవేలీ ప్యాలెస్ చుట్టూ సాగే హారర్ కామెడీ, విజువల్ గ్రాండియర్ ఈ సినిమాకి కీలకమని తెలుస్తోంది. జనవరి 9న విడుదలకానున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి.



'మన శంకరవరప్రసాద్‌గారు'



'భర్త మహాశయులకు విజ్ఞప్తి'



'అనగనగా ఒక రాజు'



'నారీ నారీ నడుమ మురారి'

మిస్టీరియస్ థ్రిల్లర్.. 'కామాఖ్య'



'కామాఖ్య'

సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రధారులుగా అభినయ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'కామాఖ్య'. వడ్డేపల్లి శ్రీవాణీనాథ్, యశ్వంత్ రాజ్ నిర్మిస్తున్నారు. శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ను తెలంగాణ మంత్రి సీతక్క విడుదల చేశారు. "వినూత్నమైన కథతో మిస్టీరియస్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి.



నన్నపనేని రాజకుమారి, మురళీమోహన్, మండలి బుద్ధప్రసాద్, ప్రియాంకాదత్, వెంకయ్యనాయుడు, సంజయ్‌కిషోర్, బొల్లినేని కృష్ణయ్య, నాగసుశీల, విజయచాముండేశ్వరి, గోవిందరావు, స్వప్నదత్

సావిత్రి ఎప్పటికీ మహానటే..

● జయంత్యుత్సవంలో ఎం.వెంకయ్యనాయుడు

'సినిమా కళాత్మకమైన వ్యాపారం.. దానికి సామాజిక బాధ్యత ఉందనే విషయాన్ని దర్శకనిర్మాతలు గుర్తు పెట్టుకోవాలి. సావిత్రి జీవితాన్ని ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ కుమార్తెలు స్వప్నదత్, ప్రియాంకాదత్‌లు నిర్మాతలుగా, అల్లుడు నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ఎంతో మనోహరంగా, కళాత్మకంగా తెరకెక్కించిన తీరు అభినందనీయం' అని అన్నారు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు. మహానటి సినిమా చూస్తుంటే ఒక్కసారి పాత్రలన్నీ కళ్లముందు కదలాడుతుంటాయి. ఇలాంటి కథలు నిర్మించడం గొప్ప సాహసమే. ప్రతి నిర్మాత ఇదే విధంగా ఆలోచించాలన్నారు. శనివారం రాత్రి హైదరాబాద్ రవీంద్రభారతిలో సంగమం ఫౌండేషన్, సావిత్రి కుమార్తె విజయచాముండేశ్వరి ఆధ్వర్యంలో మహానటి సావిత్రి 90వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహానటి నిర్మాతలు ప్రియాంకాదత్, స్వప్నదత్, సంగమం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సినీ పరిశోధకుడు సంజయ్‌కిషోర్‌ను వెంకయ్యనాయుడు సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సావిత్రి జీవితం నుంచి నటీనటులు, నవతరం, సాధారణ వ్యక్తులు నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. నటిగా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతూ.. ముందుకు సాగిన ఆమె జీవితం ఆదర్శప్రాయం. కంటితో కోటి భావాలు, నవరసాలు పలికించే సహజనటి ఆమె. సావిత్రి తెరపై నటిస్తుంటే పాత్ర మాత్రమే కనిపించేది. తెరపై ఆమె చేసిన మాయ ప్రత్యేకమైంది. ప్రస్తుతం అలాంటి నటీమణులు పెద్దగా కనిపించడం లేదు. ఉన్నా.. వారికి తగిన ప్రాధాన్యం దొరకడం లేదు. ఈరోజుల్లో సినిమాల్లో కథానాయికలకు ప్రాధాన్యం తగ్గిపోయింది. కథానాయకుడి పక్కన ఒక అమ్మాయి ఉండాలనే తపన తప్ప.. ఆ పాత్రకు గుర్తింపు రావడం లేదు. కారణం.. కుటుంబ విలువలున్న చిత్రాలు తగ్గిపోవడమే. నాటితరం కథానాయికలు అంజలీదేవి, షావుకారు జానకి, సావిత్రి, జమున, వాణిశ్రీ, కృష్ణకుమారి లాంటి ఎందరో తరాలుగా కథానాయికలుగా నిలిచారంటే వారి అభినయకౌశలమే. సినీ నిర్మాత, దర్శకులు ఆలోచన చేయాలి. కథానాయికలకు ప్రాధాన్యం ఉండాలి. ఆ పాత్రకు తగిన అభినయం కలిగిన కథానాయికలను మాత్రమే ఎంపిక చేసుకోవాలి. మనవైన కథలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల ఈటీవీ వారు తమ ఓటీటీ వేదిక ఈటీవీ విన్ నుంచి కథాసుధ పేరిట అనేక కథలను లఘుచిత్రాలుగా తీసుకొస్తున్నారు. అంతకుముందే అమరావతి, ప్రాంతీయ కథలను డీడీ ధారావాహికంగా రూపొందించింది. తెలంగాణకు చెందిన ప్రముఖ దర్శకుడు శ్యామ్‌బెనగల్ అమరావతి కథను హిందీలో రూపొందించారు. అలాంటి కథలు తెలుగు సాహిత్యంలో ఎన్నో ఉన్నాయి. ఈతరానికి ధారావాహికంగా అందజేసే ప్రయత్నం చేయాలి. అగ్ర నిర్మాతలు ఆ దిశగా ఆలోచన చేయాలి. నేను సినిమాలు చూడనని అనుకుంటారేమో.. మంచి సినిమా అయితే నేనే కాదు.. ఎవరైనా చూస్తారు. ఇటీవల దగ్గుబాటి రాణా నిర్మించిన 'ఇది చిన్న కథ కాదు..' దిల్‌రాజు కుమార్తె హర్షితరెడ్డి నిర్మించిన 'బలగం', కొణిదెల నిహారిక నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు,' సుకుమార్ కుమార్తె సుకృతి నటించిన గాంధీ తాత చెట్టు సినిమా ప్రేక్షకాదరణ పొందడమే కాదు.. అవార్డులు సాధించుకున్నాయి. పెద్ద నిర్మాతలు పెద్ద సినిమాలు తీయండి. అలాగే సాహిత్యం, కళలను బతికేలా కూడా సినిమాలు తీయండి. వినోదంతో పాటు సందేశానికి ప్రాముఖ్యం ఇవ్వాలి. సందేశమిస్తే సినిమా ఎవరు చూస్తారని అంటారు. రామోజీరావు తీసిన ప్రతి సినిమాలో సందేశం ఉంది. 'సీతారామయ్యగారి మనవరాలు' లాంటి సినిమాలు ఆడలేదా.. వెకిలి చేష్టలు లేనిదే సినిమా ఆడదనే తప్పుడు అభిప్రాయం నుంచి బయటపడాలి. దేశంలో నేటికీ మన సంస్కృతి, సంప్రదాయాలకు మంచి ఆదరణ ఉంది. వాటిని ఆదరించేలా సినిమాలు తీయాలి. నేటి యువతకు మంచి సందేశాన్ని ఇచ్చే బాధ్యత తీసుకోవాలి. సావిత్రి లాంటి మహానటికి మరణం లేదు. మరో మహానటి పుట్టలేదు. సావిత్రి ఎప్పటికీ మహానటే. ఆమె నటనను అధిగమించడానికి ఎంతో మంది ప్రయత్నించారు. కానీ సాధ్య పడలేదు అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సావిత్రి వ్యక్తిత్వాన్ని, గొప్పతనాన్ని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి, ఆమె భర్త గోవిందరావు, నటుడు మురళీమోహన్, రాజకీయవేత్త నన్నపనేని రాజకుమారి, నటి రోజారమణి, శివపార్వతి, అక్కినేని నాగేశ్వరరావు కుమార్తె నాగసుశీల, బొల్లినేని కృష్ణయ్య, నటుడు తనికెళ్ల భరణి తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, రవీంద్రభారతి

గుమ్మడి నర్సయ్య జీవితం యువతకు ఆదర్శం

-మంత్రి కోమటిరెడ్డి



శివరాజ్‌కుమార్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, గుమ్మడి నర్సయ్య, నందిని

తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి నుంచి దేశ ప్రధాని నరేంద్రమోదీ వరకు 'గుమ్మడి నర్సయ్య' సినిమా ప్రజాప్రతినిధులందరికీ చూపిస్తానని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో 'గుమ్మడి నర్సయ్య' సినిమా ప్రారంభోత్సవాన్ని శనివారం నిర్వహించారు. మంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని కెమెరా స్విచ్చాన్ చేసి చిత్రీకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల మనిషిగా పేరు తెచ్చుకున్న నర్సయ్య ఐదుసార్లు ఇల్లెందు ఎమ్మెల్యేగా ఆదర్శవంతమైన పాలన అందించారని ఆయన జీవితం యువతకు ఆదర్శమన్నారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి రహిత నాయకుడికి ప్రతిరూపం గుమ్మడి నర్సయ్య అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, కథానాయకుడు శివరాజ్‌కుమార్, సినిమా నిర్మాత నల్లా సురేశ్‌రెడ్డి, డైరెక్టర్ పరమేశ్వర్ హివ్రాలే, సమాచారహక్కు చట్టం కమిషనర్ పి.వి శ్రీనివాసరావు, గద్దర్ కుమార్తె వెన్నెల, కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, పాల్వంచ

నిర్మాతలు అలా చేస్తే తప్ప సక్సెస్ రావడం లేదు!



దామోదర్ ప్రసాద్

'మూఢనమ్మకాలు, ఆత్మలు లాంటి అంశాలతో ముడిపడిన హారర్ చిత్రం 'ఈషా'. ఇది కచ్చితంగా ప్రతిఒక్కర్నీ భయపెడుతుంది" అన్నారు నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్. ఆయన సమర్పణలో నిర్మితమైన ఈ సినిమాని శ్రీనివాస్ మన్నె తెరకెక్కించారు. అఖిల్ రాజ్, త్రిగుణ్, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 12న విడుదల కానున్న నేపథ్యంలో నిర్మాత దామోదర్ ప్రసాద్ శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ "సాధారణంగా ప్రతి హారర్ థ్రిల్లర్‌లో డ్రామా ఎక్కువ ఉంటుంది. సినిమాటిక్ లిబర్టీ ఎక్కువ తీసుకుంటుంటారు. కానీ, ఈ చిత్రం వాస్తవికతకు చాలా దగ్గరగా ఉంటుంది. సినిమా చివరికి వచ్చే సరికి ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా ఓ అనుభూతి లభిస్తుంది. థియేటర్ నుంచి బయటకొచ్చేటప్పుడు ఓ వాస్తవ కథను చూసిన ఫీల్‌తో బయటకొస్తారు. లాక్‌డౌన్ తర్వాత సినిమా వ్యాపారంలో చాలా మార్పులొచ్చాయి. నిర్మాతలు కంఫర్ట్ జోన్ నుంచి బయటకొచ్చి సినిమాలు చేస్తే తప్ప సక్సెస్ రావడం లేదు. మా సంస్థలో ఏడాదికి మూడు నాలుగు చిత్రాలు చేసిన సందర్భాలున్నాయి. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. 'అఖండ 2' చిత్రానికి ఎదురైన పరిస్థితి గత కొన్నేళ్ల తెలుగు సినిమా చరిత్రలో చాలా చిత్రాలకి జరిగింది. ఆ విషయంలో సమస్యను ఆయా నిర్మాతలే పరిష్కరించుకోవాలి గానీ చిత్ర పరిశ్రమ పరంగా.. నిర్మాతల మండలి పరంగా చేసేందుకేమీ ఉండద'ని చెప్పారు.

రాజిరెడ్డి పాత్రతో పునరాగమనం



కల్యాణ్ చక్రవర్తి

1980ల్లో కథానాయకుడిగానూ, కీలకపాత్రలతోనూ ప్రేక్షకుల్ని అలరించిన నటుడు... నందమూరి కల్యాణ్ చక్రవర్తి. ఈయన రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ కెమెరా ముందుకొచ్చారు. 'ఛాంపియన్' సినిమాలో రాజిరెడ్డి అనే ఓ కీలక పాత్రలో నటించారు. సహజత్వంతో కూడిన ఆ పాత్ర, భావోద్వేగాలు ఆకట్టుకునేలా ఉంటాయని సినీ వర్గాలు తెలిపాయి. రోషన్ కథానాయకుడిగా... ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమే 'ఛాంపియన్'. అనస్వర రాజన్ కథానాయిక. స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని క్రిస్మస్ సందర్భంగా ఈ నెల 25న విడుదల చేయనున్నారు. నందమూరి కల్యాణ చక్రవర్తి పోషించిన రాజిరెడ్డి పాత్ర లుక్‌ని శనివారం విడుదల చేశాయి నిర్మాణ వర్గాలు.

ఓకే... గురు



ఉషశ్రీ, మెహర్ రమేశ్, చరణ్, మణికంఠ

సాయి చరణ్, ఉషశ్రీ జంటగా మణికంఠ తెరకెక్కించిన చిత్రం 'ఇట్స్ ఓకే గురు'. క్రాంతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. దర్శకుడు మెహర్ రమేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "ఓకే గురు అనేది ఒక మంత్ర. ఎన్ని సమస్యలొచ్చినా 'ఇట్స్ ఓకే' అని ముందుకెళ్లిపోతే జీవితం చాలా ఆనందంగా ఉంటుంది. దాన్నే ఈ చిత్రంలో చూపించాం. కచ్చితంగా ఇది అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుంది" అన్నారు దర్శకుడు మణికంఠ. నిర్మాత క్రాంతి ప్రసాద్ మాట్లాడుతూ.. "మంచి ప్రేమకథతో పాటు అన్ని రకాల భావోద్వేగాలున్న చిత్రమిది. ఒత్తిడిలో ఉన్న వాళ్లు ఈ సినిమా చూస్తే దాంట్లో నుంచి బయటకొచ్చేస్తారు" అన్నారు. ఈ కార్యక్రమంలో సాయి చరణ్, మోహిత్, దామోదర్ ప్రసాద్, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కర్మ సిద్ధాంతంతో..



నవీన్ చంద్ర, వరలక్ష్మీ

నవీన్ చంద్ర, వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రధారులుగా సంజీవ్ మేగోటి తెరకెక్కించిన చిత్రం 'పోలీస్ కంప్లైంట్'. బాలకృష్ణ మహరాణా నిర్మాత. రవిశంకర్, శరత్ లోహితశ్వ, పృథ్వీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఇటీవల చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ.. "కర్మ సిద్ధాంతంతో ముడిపడిన హారర్ థ్రిల్లర్ ఇది. సినిమా చాలా బాగా వచ్చింది. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్లింగ్ అనుభూతిని అందిస్తుంది. త్వరలో నిర్మాణానంతర పనులు పూర్తి చేసి విడుదల తేదీని ప్రకటిస్తాం" అన్నారు. ఈ సినిమాకి సంగీతం: ఆరోహణ సుధీంద్ర, సుధాకర్ మారియో, సంజీవ్ మేగోటి, ఛాయాగ్రహణం: ఎస్ ఎన్

'ఘంటసాల ది గ్రేట్' మరో 'శంకరాభరణం' అవుతుంది



అనంత శ్రీరామ్, సి.హెచ్.రామారావు. కృష్ణచైతన్య, తనికెళ్ల భరణి, చదలవాడ శ్రీనివాస్‌రావు

"మహాగాయకుడు ఘంటసాల గురించి ఈతరానికి తెలియాలనే తపనతో ఎంతో కష్టపడి తీసిన సినిమా 'ఘంటసాల ది గ్రేట్'" అన్నారు దర్శకుడు సి.హెచ్.రామారావు. భారతదేశ చరిత్రలో ఇలా ఒక గాయకుడి బయోపిక్ రావడం ఇదే ప్రథమం అని.. ఆ ఖ్యాతి ఘంటసాలకు దక్కిందని తెలిపారు. దిగ్గజ సంగీత దర్శకుడు, గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితకథతో రూపొందిన ఈ సినిమాలో కృష్ణచైతన్య టైటిల్ పాత్ర పోషించారు. దీనికి రామారావు దర్శకత్వం వహించగా.. సి.హెచ్.ఫణి నిర్మించారు. ఈ సినిమా ఈనెల 12న విడుదల కానున్న నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ "ఘంటసాల జీవితకథను తెరపైకి తీసుకొచ్చే అవకాశం దక్కడం నా అదృష్టం" అన్నారు. నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. "ఈ సినిమా మరో 'శంకరాభరణం' అవుతుందని నమ్మకంగా ఉంది" అన్నారు. ఈ చిత్ర తొలి టికెట్‌ను నిర్మాత చదలవాడ శ్రీనివాస్‌రావు రూ.1లక్షకు కొనుగోలు చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ, రేలంగి నరసింహారావు, జేకే భారవి, అనంత శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

'స్వరాజ్' కానుక కాదు.. ప్రజల స్వయం వ్యక్తీకరణ!

జాతీయ ఉద్యమం నాటి చర్చలు, నాయకుల ఆలోచనలు, నాటి అంశాలు రాజ్యాంగంపై ప్రభావం చూపాయి. ఉన్నతమైన విలువలు, ఆదర్శాలు, సిద్ధాంతాలను క్రోడీకరించి భావిభారత పౌరుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు అవసరమయ్యేలా ఒక మౌలిక శాసనాన్ని రూపొందించారు. భారతదేశాన్ని ఒక ప్రజాస్వామిక దేశంగా, ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు ఆలంబనగా నిలిచి, ప్రజలకు ప్రాథమిక హక్కులను ప్రసాదించే ఉన్నత రాజ్యాంగం రూపొందించడానికి రాజ్యాంగ సభ కృషి చేసింది.

భారత రాజ్యాంగ పరిషత్

- భారతదేశ రాజ్యాంగాన్ని రూపొందించి, ఆమోదించింది - రాజ్యాంగ పరిషత్
- ప్రపంచంలో మొట్టమొదటి రాజ్యాంగ పరిషత్ - అమెరికాలోని ఫిలడెల్ఫియా కన్వెన్షన్ (1787)
- రాజ్యాంగ పరిషత్ అనే భావన మొట్టమొదటిసారిగా వ్యక్తీకరించినవారు - ఎం.ఎన్.రాయ్
- రాజ్యాంగ పరిషత్ కోసం మొట్టమొదటిసారిగా డిమాండ్ చేసిన పార్టీ - స్వరాజ్ పార్టీ
- స్వరాజ్ అనే పదాన్ని మొదటగా ఉపయోగించిన జాతీయ ఉద్యమ నాయకుడు - దాదాభాయ్ నౌరోజీ




రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

భారతీయ ప్రజాప్రతినిధులతో కూడిన రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేయాలని 1918 డిసెంబరులో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో స్వయం నిర్ణయాధికారం అనే భావనతో ఒక తీర్మానం చేశారు.

✦ 1922 జనవరి 5న మహాత్మా గాంధీ 'యంగ్ ఇండియా' పత్రికలో స్వరాజ్ అనేది బ్రిటిష్‌వారు ఇచ్చే కానుక కాదని, అది ప్రజల స్వయం వ్యక్తీకరణ అని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాణ సభతోనే భారత ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని గాంధీజీ సూచించారు.

✦ 1924లో జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో భారతీయుల ప్రయోజనాలను సంరక్షించేందుకు ప్రజలందరికీ ప్రాతినిధ్యం కల్పించే ఒక కమిటీని ఏర్పాటు చేసి, చట్టాన్ని రూపొందించాలని తీర్మానించారు.



✦ 1925లో అనిబిసెంట్ బ్రిటిష్ పార్లమెంట్‌లో 'కామన్వెల్త్ ఆఫ్ ఇండియా' బిల్లును ప్రవేశపెడుతూ, ఐర్లాండ్ ప్రజల మాదిరిగానే భారతీయులకు శాశ్వత ప్రాతిపదికన హక్కులు కల్పించాలని సూచించారు.

✦ 1927లో బాంబే సమావేశంలో మోతీలాల్ నెహ్రూ రాజ్యాంగ రచన ఆవశ్యకతను ప్రస్తావించారు.

నెహ్రూ నివేదిక

1927లో సైమన్ కమిషన్‌ను వ్యతిరేకిస్తున్న భారతీయులను ఉద్దేశిస్తూ భారత వ్యవహారాల కార్యదర్శి లార్డ్ బిర్కెన్ హెడ్ మాట్లాడుతూ... 'అందరికీ సమ్మతమైన రాజ్యాంగాన్ని భారతీయులు రూపొందించగలరా?' అని సవాల్ విసిరాడు.

- లార్డ్ బిర్కెన్ హెడ్ సవాల్‌ను స్వీకరించిన భారతీయ నాయకులు 1928 ఫిబ్రవరిలో 29 పార్టీలతో ఢిల్లీలో ఒక అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.
- 1928 మే 19న భారత జాతీయ కాంగ్రెస్ డా. ఎం.ఎ.అన్సారీ అధ్యక్షతన బొంబాయిలో నిర్వహించిన సమావేశంలో రాజ్యాంగ రచన కోసం ఉపసంఘం ఏర్పాటు చేసింది. దీనికి మోతీలాల్ నెహ్రూ అధ్యక్షత వహించగా, లాలాలజపతిరాయ్, తేజ్‌బహదూర్ సప్రూ, సుభాష్‌చంద్రబోస్, జి.ఆర్.ప్రధాన్, షోయబ్‌ఖురేషి, జయకర్, సర్దార్ మంగళ్‌సింగ్, సర్ అలీ ఇమాం, ఎం.ఎన్.అణె సభ్యులుగా ఉన్నారు.
- ఈ ఉపసంఘం 1928 ఆగస్టు 10న తన నివేదికను సమర్పించింది. ఈ నివేదిక 'గొప్ప రాజనీతిజ్ఞత ఉన్నవారు తయారు చేసినట్లుందని' ప్రశంసలు పొందడమే కాకుండా, 'నెహ్రూ రిపోర్ట్'గా ప్రసిద్ధిగాంచింది.
- నెహ్రూ నివేదికలో భారతీయుల హక్కులు, వర్గాల ప్రయోజనాలు, ప్రభుత్వ పరిపాలన గురించి పేర్కొన్నారు.
- జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన 1929 డిసెంబరులో జరిగిన లాహోర్ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ 'సంపూర్ణ స్వరాజ్' సాధనే తన లక్ష్యమని ప్రకటించింది.
- 1929 డిసెంబరు 31న లాహోర్‌లోని రావి నది తీరంలో భారత స్వాతంత్ర్య త్రివర్ణ పతాకాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఎగరవేశారు.
- 1930 జనవరి 26న 'స్వరాజ్య దినం'గా నిర్వహించుకోవాలని భారత జాతీయ కాంగ్రెస్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. 1935లో భారత జాతీయ కాంగ్రెస్ మొదటిసారిగా అధికార పూర్వకంగా రాజ్యాంగ పరిషత్ డిమాండ్‌ను ప్రకటించింది.
- 1938లో జవహర్‌లాల్ నెహ్రూ స్వతంత్ర భారతదేశ రాజ్యాంగం ఇతరుల జోక్యం లేకుండా సార్వత్రిక ఓటుహక్కుతో ఎన్నుకునే రాజ్యాంగ నిర్మాణసభ ద్వారా రూపొందించాలని ప్రతిపాదించారు.
- భారతీయులతో రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేసినట్లయితే కుల, మత, వర్గాల సమస్యలు అంతమవుతాయని హరిజన్ పత్రికలో (1939లో) గాంధీజీ పేర్కొన్నారు.
- రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఆగస్టు ప్రతిపాదనలు - 1940 రూపకల్పనలో సూత్రప్రాయంగా రాజ్యాంగ పరిషత్ ఏర్పాటును బ్రిటిష్‌వారు ప్రస్తావించారు. అయితే దీన్ని భారతీయులు ఆమోదించకపోవడంతో 1942లో క్రిప్స్ ప్రతిపాదనల ద్వారా బ్రిటిష్‌వారు అధికారికంగా మొదటిసారిగా రాజ్యాంగ పరిషత్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. 1946లో కేబినెట్ మిషన్ సూచనను అనుసరించి రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేశారు.

రాజ్యాంగ పరిషత్ నిర్మాణం

ప్రొ. రాబర్ట్ రిచర్డ్ నాయకత్వంలో బ్రిటిష్ పార్లమెంట్ సభ్యుల బృందం భారతదేశంలో పర్యటించి (1946 జనవరి 5 నుంచి ఫిబ్రవరి 8 వరకు) 'భారతీయులు స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నారు' అని తమ నివేదిక ద్వారా తెలియజేశారు.

▼ 1946 జూన్ - జులై మధ్య పరోక్ష పద్ధతిలో రాజ్యాంగ పరిషత్ ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర శాసనసభకు ఎన్నికైన సభ్యులు రాజ్యాంగ పరిషత్ సభ్యులను ఎన్నుకున్నారు.

▼ నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో ఏక ఓటు బదిలీ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. దీంతో రాష్ట్రాల్లో కేవలం 28.5% ఓటర్లు మాత్రమే ఎన్నికల్లో పాల్గొనగలిగారు.

▼ రాజ్యాంగ పరిషత్‌లో ప్రతి 10 లక్షల జనాభాకు ఒక సభ్యుడి చొప్పున ప్రాతినిధ్యం కల్పించారు.

▼ బ్రిటిష్ పాలిత ప్రాంతాల్లో ముస్లింలు, సిక్కులు, జనరల్ కేటగిరీ వారికి జనాభా దామాషా మేరకు స్థానాలను కేటాయించారు. ప్రిన్స్‌లీ సభ్యులను వయోజన ఓటు ద్వారా కాకుండా నామినేషన్ పద్ధతిలో నియమించారు.

దేశ విభజనకు ముందు రాజ్యాంగ పరిషత్‌లో ప్రాంతాలవారీగా కేటాయించిన స్థానాలు:


- 11 బ్రిటిష్ పాలిత ప్రాంతాల నుంచి ఎన్నుకున్న సభ్యుల సంఖ్య - 292
- స్వదేశీ సంస్థానాల నుంచి ప్రాతినిధ్యం వహించినవారు - 93
- 4 చీఫ్ కమిషనరేట్ ప్రాంతాల నుంచి ప్రాతినిధ్యం వహించినవారు - 04

చీఫ్ కమిషనరేట్ ప్రాంతాలు: 1) ఢిల్లీ 2) అజ్మీర్ 3) మేవార్ 4) కూర్గ్



- దేశ విభజన కంటే ముందు రాజ్యాంగ పరిషత్ సభ్యుల సంఖ్య - 389
- దేశ విభజన తర్వాత భారత రాజ్యాంగ పరిషత్‌లో సభ్యుల సంఖ్య - 299
- బ్రిటిష్ పాలిత రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించినవారు - 229
- స్వదేశీ సంస్థానాల నుంచి ప్రాతినిధ్యం వహించినవారు - 70
- రాజ్యాంగ పరిషత్‌కు నామినేట్ చేసిన సభ్యుల సంఖ్య - 15
- రాజ్యాంగ పరిషత్‌లో సభ్యత్వం లేని ప్రముఖ జాతీయోద్యమ నాయకుడు - గాంధీజీ
- దేశ విభజన కారణంగా రాజ్యాంగ పరిషత్ సభ్యత్వం కోల్పోయిన ఏకైక కమ్యూనిస్టు సభ్యుడు - **సోమనాథ్ లహరి**
- వేవెల్ సూచనలు అనుసరించి 1946 డిసెంబరు 9న రాజ్యాంగ పరిషత్ మొదటి సమావేశాన్ని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో నిర్వహించారు.

- రాజ్యాంగ పరిషత్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, నియమితులైన వ్యక్తి డా. శ్యామాప్రసాద్ ముఖర్జీ. బెంగాల్ నుంచి ఎన్నికైన అంబేడ్కర్ దేశ విభజన వల్ల తన సభ్యత్వాన్ని కోల్పోగా, శ్యామాప్రసాద్ ముఖర్జీని బొంబాయి నుంచి ఎన్నుకున్నారు.



Word of the Day 853

Largesse

Telugu meaning: దాతృత్వం, ఉదారత

English meaning: The word largesse (లార్జెస్) is a noun that refers to generous giving of money or gifts, especially to those in need.

Synonyms: Generosity, Munificence

Antonyms: Stinginess, Meanness

Usage: 1. The charity survived largely due to the largesse of wealthy patrons who supported its mission.

2. Through his unexpected largesse, several students received scholarships they never dreamed of.

నోటిఫికేషన్స్

ప్రాజెక్ట్ ఇంజినీర్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన కోల్‌కతా, ముంబయి, న్యూదిల్లీ, చెన్నై జోన్‌లలో ప్రాజెక్ట్ ఇంజినీర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 23. ఇంటర్వ్యూ తేదీ 2025 డిసెంబరు 16.

సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) పోస్టులు

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు, హైదరాబాద్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టుల కోసం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, రిక్రూట్‌మెంట్ బై ట్రాన్స్‌ఫర్ (బదిలీ ద్వారా నియామకం) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ నెం. 45/2025 విడుదల చేసింది. మొత్తం పోస్టుల సంఖ్య 94. దరఖాస్తు ఫీజు రూ.1,250. అర్హులైన అభ్యర్థులు 2025, డిసెంబరు 29లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ముంబయిలోని ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (ఐఐబీఎఫ్) జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 10. దరఖాస్తు ఫీజు రూ.700. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ 28 డిసెంబరు 2025.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ అప్రెంటిస్ పోస్టులకు నేడే (డిసెంబరు 7) చివరి తేదీ

- బీఈసీఐఎల్‌లో 18 పోస్టులు. పదో తరగతి, ఇంటర్, పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో అప్రెంటిస్ పోస్టులు. డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.
- విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో డెంటల్ సర్జన్ పోస్టులు. ఎంబీబీఎస్, బీడీఎస్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.
- తూర్పు గోదావరి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాలు. టెన్త్/డిగ్రీ/బీఈడీ (కామర్స్/ఫైనాన్స్)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం

డిసెంబరు 7 | చరిత్రలో ఈనాడు

అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏఓ) స్థాపనకు గుర్తుగా ఏటా డిసెంబరు 7న 'అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం'గా (International Civil Aviation Day) నిర్వహిస్తారు. దేశాల సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో అంతర్జాతీయ పౌర విమానయానం పాత్రను తెలియజేయడంతోపాటు సురక్షిత గగనతల రవాణాను ప్రోత్సహించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

గణాంకాలు

ప్రపంచవ్యాప్తంగా విమాన ప్రయాణికుల రద్దీ గురించి ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) వరల్డ్ 2025, సెప్టెంబరులో 'వరల్డ్ ఎయిర్ ట్రాఫిక్ రిపోర్ట్ (డబ్ల్యూటీఆర్)' పేరుతో ఒక నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం -

✦ 2024లో మొత్తం విమాన ప్రయాణికుల రద్దీ (passenger traffic) 9.4 బిలియన్లకు చేరుకుంది. ఇది 2025లో 9.8 బిలియన్లుగా ఉంటుందని అంచనా.

చారిత్రక నేపథ్యం

1944 నాటికి అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏఓ) ఏర్పడి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఏటా డిసెంబరు 7న 'అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం'గా జరపాలని ఐసీఏఓ సభ్య దేశాలు తీర్మానించాయి. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం దీన్ని నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1996లో ఈ దినోత్సవాన్ని అధికారికంగా గుర్తించింది.




దేశంలో తొలి విమానాశ్రయాన్ని ఎక్కడ ఏర్పాటు చేశారు? వాయు రవాణాను ఎప్పుడు జాతీయం చేశారు? తదితర సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

మహిళలపై హింస - చట్టపరమైన సంరక్షణ

ఆదిమ సమాజంలో ఆహారం, రక్షణ, వేట కోసం పురుషుడిపై స్త్రీ ఆధారపడాల్సి వచ్చేది. ఆధునిక యుగంలో అనేక వృత్తులు ఏర్పడి మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నప్పటికీ లింగపరమైన వివక్ష, శ్రమ విభజన కనిపిస్తూనే ఉన్నాయి. సామాజిక, సాంస్కృతిక హింస స్థానంలో శారీరక, లైంగిక హింస, పనిచేసే చోట వేధింపులు, సైబర్ నేరాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి.



హింస రూపాలు

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హై కమిషనర్ రూపొందించిన డిక్లరేషన్ ఆన్ ది ఎలిమినేషన్ ఆఫ్ వయొలెన్స్ ఎగైనెస్ట్ ఉమెన్ 1993 (డిసెంబరు 20) ప్రకారం, మహిళలపై జరుగుతున్న హింస అంటే శారీరక, లైంగిక, మానసిక వేధింపులు, మహిళల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో పాటు వారి వ్యక్తిగత జీవితాన్ని ఇబ్బందిపెట్టే చర్యలుగా పేర్కొంది.

నేర స్వభావాన్ని బట్టి హింస రకాలు

1. నేరపూరిత హింస (క్రిమినల్ వయొలెన్స్)
2. గృహసంబంధిత హింస
3. సామాజికపరమైన హింస

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం స్త్రీల జీవితంలో హింస ప్రధాన దశలు, మహిళలపై జరుగుతున్న నేరాల తీవ్రత, ఘటనలు - అత్యధిక కేసులు నమోదైన ప్రాంతాలు, మహిళా సంక్షేమం కోసం చేసిన రాజ్యాంగపరమైన ఏర్పాట్లు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



Russian President Vladimir Putin met Prime Minister Narendra Modi in New Delhi on 5 December 2025. Both countries exchanged sixteen agreements in areas related to defence, trade, economy, healthcare, academics, culture and media.

✦ Modi and Putin also participated in the 23rd India-Russia Annual Summit in New Delhi.

The Fifth edition of the Joint Military Exercise "Exercise Harimau Shakti -2025" commenced in Mahajan Field Firing Range, Rajasthan, on 5 December 2025. The exercise concludes on 18 December 2025. The aim of the exercise is to jointly rehearse conduct of Sub Conventional Operations under Chapter VII of United Nations Mandate. The scope of the exercise includes synergising joint responses during counter-terrorist operations.

Fitch Ratings on 4 December 2025 revised India's GDP growth forecast for FY26 to 7.4%, up from its earlier estimate of 6.9%, citing strong domestic demand and the positive impact of recent tax reforms. It said private consumption remains the primary engine of growth this fiscal year, supported by "strong real income dynamics, improved consumer sentiment, and the benefits of goods and services tax reforms."

India and the Netherlands held the 13th round of Foreign Office Consultations (FOC) in New Delhi on 4 December 2025, reviewing progress across key areas of the bilateral partnership and exploring new domains of cooperation.

For more Current Affairs: Scan QR code

Railway Exams
Reasoning

Seating Arrangement

Directions (Qs. 1 - 13): *Read the questions carefully and answer the following*

1. There are six persons namely G, H, K, J, I, L sitting in a circular arrangement all facing towards the centre. K sits between J and I. G is sitting second to the right of K. L sits second to the left of J. Then who is the third to the right of H?

A) I B) K C) J D) G

2. There are five persons namely E, G, H, I, F sitting in a circular arrangement all facing away from the centre. I is immediately to the left of H. E sits between G and F and G sits immediately right of H. Who is sitting third to the left of F.

A) I B) H C) E D) G

3. There are four friends namely L, M, O, N sitting in a circular arrangement. Three facing away from the centre and one is facing towards the centre. O who is facing away from the centre is second to the left of M who is also facing away from the centre. L who is facing towards the centre is immediate left to M. Who is sitting immediate right to M?

A) O B) L C) N D) None

4. There are six friends sitting in a circular arranged. Their names are Miru, Liru, Chiru, Ravi, Siru, Kiru. All are facing away from the centre. Miru is sitting in between Ravi and Kiru. Ravi is left of Miru. Chriu is sitting between Siru and Liru. Then who is sitting fourth to the left of Chiru?

A) Liru B) Ravi C) Kiru D) Miru

5. There are six friends namely Navya, Saya, Raya, Jaya, Laya, Maya who are sitting in a circular arrangement facings towards the centre. Navya is sitting between Jaya and Laya. Saya sits immediate left to laya. Maya sits second to the right of Navya. Then who is sitting third to the left of Laya?

A) Maya B) Saya C) Raya D) Navya

6. There are five friends namely P, Q, T, S, R who are sitting around a square table. All are facing towards the centre. S sits between T and R. P is immediate left to T. Q sits second to the right of S. Who is sitting between T and Q?

A) R B) S C) P D) None

7. There are five friends namely G, I, J, H, K sitting around a square table. All are facing away from the centre. G sits opposite to I. H sits opposite to K. J sits second to the right of H. Then who sits third to the left of K?

A) J B) G C) H D) I

8. There are five persons namely Sohi, Mahi, Rahi, Mintu and Tintu who went to a cafe for a business deal and they sat on a square table and everyone were facing towards the centre. Mahi was sitting immediate right to Rahi. Sohi sits second to the right of Rohi. Tintu sits exactly opposite to Mahi. Mintu is sitting exactly opposite to Rahi. Then who is sitting third to the left of Rahi?

A) Mintu B) Sohi
C) Mahi D) Tintu

9. There are five persons namely Chole, Joy, Max, Srav, Bittu. All are sitting around a sqaure table all are facing away from the centre. Max sits between Chole and Joy. Bittu sits second to the left of Chloe. Joy and Srav are sitting opposite. Who is sitting immediate left to Chloe?

A) Max B) Srav C) Bittu D) Joy

10. There are six friends namely Om, Sus, Priya, Ram, Gayi Sam are sitting in a row. Sus, Priya, Gayi are facing rowards south and remaining are facing north. Ram sits between Om and Sam. Priya sits between Sus and Gayi. Sam sits immediate right to Sus.Then who is sitting third to the right of Ram?

A) Sus B) Priya C) Gayi D) Om

11. There are six friends namely G, H, C, P, Q, M sitting in a row all facing north. G sits first from the left. M sits between H and C. Q sits first from the right. P sits immediate left to Q. Then who is sitting third to the right of M?

A) H B) C C) P D) Q

12. Five persons namely M, R, T, J, K are sitting in a row all facing towards north. M is sitting first from the left and T sits first from the right. K sits between J and R. K sits immediate right to J. Then who is sitting second to the left of R?

A) J B) K C) M D) T


13. There are five persons namely John Joy, kathy, Jenny, Max sitting in a row all facing towards north. John sits second to the left of Joy. Jenny sits second to the right of Joy. Max sits between John and Joy. Who sits second to the left of Jenny?

A) John B) Max
C) Joy D) Kathy

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

కరెంట్ అఫైర్స్



◆ యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) నూతన డైరెక్టర్ జనరల్‌గా ఇటీవల ఎవరు ఎన్నికయ్యారు? (అరబ్ దేశాల నుంచి ఈ పదవికి ఎన్నికైన మొదటి వ్యక్తిగా ఈయన వార్తల్లో నిలిచారు.)

జ: ఖలీద్ ఎల్-ఎనానీ (ఈజిప్ట్ మాజీ పర్యాటక శాఖ మంత్రి)

◆ న్యూదిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏ రోజున (PM-SETU)- పీఎం సేతు (ప్రైమ్ మినిస్టర్స్ స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ అండ్ టెక్నికల్ అప్‌గ్రెడేషన్) పథకాన్ని ప్రారంభించారు? (రూ.60 వేల కోట్ల బడ్జెట్‌తో పీఎం సేతు పథకం దేశ వ్యాప్తంగా 1000 పారిశ్రామిక శిక్షణా సంస్థలను (ఐటీఐలు) ఆధునీకరించడమే లక్ష్యంగా పెట్టుకుంది.)

జ: 2025 అక్టోబరు 4

మాదిరి ప్రశ్నలు

◆ భూ పరిపాలన విపత్తు నిర్వహణ పై 2025 అక్టోబరు 3, 4 తేదీల్లో జాతీయ సమావేశాన్ని ఎక్కడ నిర్వహించారు?

జ: గాంధీనగర్

◆ ఏ నాలుగు రాష్ట్రాల్లో రూ.24,634 కోట్లు విలువైన నాలుగు ప్రధాన రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఇటీవల ఆమోదం తెలిపింది?

జ: మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్

మరింత సమాచారం



దరఖాస్తు చేశారా?

☛ ఆర్‌బీఐలో మెడికల్ కన్సల్టెంట్ పోస్టులు
చివరి తేదీ: 2025 డిసెంబరు 11

☛ ఐపీఆర్‌ఐలో ఎస్ఆర్ఎఫ్ ఖాళీలు
చివరి తేదీ: 2025 డిసెంబరు 10

అస్పష్ట ప్రశ్నలు.. అసంపూర్ణ ప్రకటనలు!

జనరల్ స్టడీస్ – రీజనింగ్

ఒక నెలలో అమ్మకాలు పెరిగాయో లేదో తెలుసుకోవాలంటే వ్యాపారికి కొంత సమాచారం కావాలి. లాభాలు ఎక్కువ కావడం, ధరలు పెంచడం మొదలైన వివరాలు ఉంటే అమ్మకాలు పెరిగాయా, తగ్గాయా అనే ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా జవాబు కనుక్కోవచ్చు. అభ్యర్థుల్లో ఆ విధమైన నైపుణ్యాలను, పరిమిత సమాచారంతో సరైన నిర్ణయం తీసుకోగలిగిన సామర్థ్యాన్ని, విశ్లేషణాత్మక ఆలోచన తీరును, సమస్యా పరిష్కార శక్తిని అంచనా వేయడానికి రీజనింగ్‌లో డేటా సఫీషియన్సీ విభాగం నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందులో అస్పష్ట ప్రశ్నలు, అసంపూర్ణ వాక్యాలు లేదా ప్రకటనలు ఇస్తారు. వాటికి సమాధానాన్ని కనుక్కోవాల్సిన అవసరం లేదు. కానీ ఇచ్చిన సమాచారం జవాబును కనుక్కోడానికి సరిపోతుందో లేదో గుర్తించగలిగితే చాలు. ఈ అధ్యాయంపై పట్టు పెంచుకోవాలంటే బంధాలు, ర్యాంకింగ్, దిక్కులు, కోడింగ్, డీకోడింగ్, నిష్పత్తి, అనుపాతం, శాతాలు, సగటులు తదితర ప్రాథమిక భావనలను నేర్చుకొని, బాగా ప్రాక్టీస్ చేయాలి.



డేటా సఫీషియన్సీ

'డేటా సఫీషియన్సీ' అధ్యాయంలో ప్రతి ప్రశ్నకు రెండు లేదా మూడు ప్రకటనలు ఇస్తారు. ప్రశ్నకు సమాధానాన్ని కనుక్కోవాల్సిన అవసరం లేకుండా కచ్చితమైన జవాబు రావడానికి ఏయే ప్రకటనలు అవసరం అవుతాయో అభ్యర్థి గుర్తించాల్సి ఉంటుంది. అరిథ్‌మెటిక్, రీజనింగ్, ప్యూర్ మ్యాథ్స్ అంశాలపై మంచి పట్టు కలిగి ఉంటే ఈ డేటా సఫీషియన్సీ ప్రశ్నలను సులువుగా సాధించవచ్చు.

మాదిరి ప్రశ్నలు

కింద ఒక ప్రశ్న, రెండు ప్రకటనలు ఇచ్చారు. కేవలం ప్రకటన-I ద్వారా ప్రశ్నకు సమాధానం గుర్తించినప్పుడు సమాధానం 1గా, కేవలం ప్రకటన-II ద్వారా ప్రశ్నకు సమాధానం గుర్తించినప్పుడు సమాధానం 2గా, రెండు ప్రకటనలు కలిపి ప్రశ్నకు సమాధానం గుర్తించినప్పుడు సమాధానం 3గా, రెండు ప్రకటనల ద్వారా సమాధానం గుర్తించలేనప్పుడు సమాధానం 4గా రాయండి.

1 Aకి ఎంతమంది పిల్లలు ఉన్నారు?

ప్రకటనలు: I) B అనునది Xకి ఒకే ఒక కుమార్తె, ఆమె Aకి భార్య.

II) C, D లు Aకి సోదరులు.

వివరణ: ప్రకటనలు I, II లను కలిపితే Aకి ఎంతమంది పిల్లలో చెప్పలేం. **జ: 4**



2 కంపెనీ మొత్తం అమ్మకాలు (రూ.లలో) ఎంత?

ప్రకటనలు: I) కంపెనీ రూ.25 ధర కలిగిన A అనే వస్తువును 8 వేల యూనిట్లను అమ్మగలిగింది.

II) కంపెనీ కేవలం A అనే వస్తువులను మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతుంది.

వివరణ: ప్రకటన I నుంచి

మొత్తం అమ్మకాలు = 8000 × 25 = 2,00,000


∴ ప్రకటన I, IIల నుంచి కంపెనీ మొత్తం అమ్మకాలు రూ.2,00,000 **జ: 3**

3 ఒక బాలుర వరుసలో P, Q ల మధ్య ఎంత మంది పిల్లలున్నారు?

ప్రకటనలు: I) ఆ వరుసలో P అనే వ్యక్తి ఎడమ నుంచి 15వ స్థానంలో ఉన్నాడు.

II) Q అనే వ్యక్తి సరిగ్గా మధ్యలో ఉన్నాడు. తనకు కుడివైపున 10 మంది బాలురు ఉన్నారు.

వివరణ: ప్రకటన-I నుంచి



ప్రకటన -II నుంచి Q సరిగ్గా మధ్యలో ఉన్నాడు కాబట్టి తనకు ఎడమవైపు 10 మంది, కుడివైపు 10 మంది ఉన్నారు. అంటే Q యొక్క స్థానం ఎడమవైపు నుంచి 11వ స్థానం. ప్రకటన-I నుంచి P ఎడమ నుంచి 15వ స్థానం అంటే ప్రకటన-I, IIల నుంచి P, Q ల మధ్యలో ముగ్గురు బాలురు ఉన్నారు. **జ: 3**

4 పట్టణంలో ప్రాక్టీస్ చేస్తున్న వైద్యులు ఎంత మంది?

ప్రకటనలు: I) ప్రతి 700 మంది పౌరులకు ఒక డాక్టర్ ఉన్నారు.

II) ఆ పట్టణంలో 16 వార్డులు ఉన్నాయి. ప్రతి వార్డులో మొత్తం వార్డుల సంఖ్యకు సమానమైన డాక్టర్లు ఉన్నారు.

వివరణ: ప్రకటన-I నుంచి మొత్తం పౌరుల సంఖ్య తెలియదు. కాబట్టి డాక్టర్ల సంఖ్యను కనుక్కోలేం.

ప్రకటన-II నుంచి పట్టణంలోని మొత్తం వార్డులు = 16

ప్రతి వార్డులో ఉన్న డాక్టర్లు = 16

∴ మొత్తం ప్రాక్టీస్ చేస్తున్న డాక్టర్లు = 16 × 16 = 256 మంది **జ: 2**

5 A, Bల వేతనాల మధ్య నిష్పత్తి 4 : 3. అయితే A వేతనం ఎంత?

ప్రకటనలు: I) B వేతనం, A వేతనంలో 75%.

II) B వేతనం రూ.4500.

వివరణ: ప్రకటన-I నుంచి A, B ల వేతనాల మధ్య నిష్పత్తి

A : B = 100 : 75 = 4 : 3

ప్రకటన-II ద్వారా B వేతనం 3 భాగాలు కాబట్టి

3 — 4500

4 — ?

$\frac{4}{3} \times 4500$

$= 4 \times 1500 =$ రూ.6000

∴ A వేతనం రూ.6000




జ: 2

6 అభినవ్ ఏ దిశకు అభిముఖంగా ఉన్నాడు?

ప్రకటనలు: I) అభినవ్ మొదట తన కుడివైపునకు, తర్వాత మళ్లీ కుడివైపునకు తిరగగా ఉత్తర దిశకు అభిముఖంగా ఉన్నాడు.

II) అభినవ్ మొదటగా ఎడమవైపునకు, కుడివైపునకు, ఎడమవైపునకు తిరిగి చివరగా కుడివైపునకు తిరిగి గమ్యస్థానం చేరాడు.

వివరణ: ప్రకటన-I నుంచి రెండుసార్లు కుడివైపునకు తిరిగాక ఉత్తరానికి అభిముఖంగా ఉన్నాడు. అంటే మొదట తాను దక్షిణ దిశకు అభిముఖంగా ఉన్నాడు.





ప్రకటన-II నుంచి అభినవ్ మొదటగా ఎడమ, కుడి, ఎడమ చివరగా కుడివైపునకు తిరిగి గమ్యస్థానం చేరాడు. కానీ దిశ తెలియదు. **జ: 1**

7 P, Q, R, S, T అనే పాఠశాలల్లో గరిమ ఏ పాఠశాలలో చదువుతుంది?

ప్రకటనలు: I) మనూర్య, చరిష్మా చదువుతున్న పాఠశాలలో గరిమ చదవడంలేదు.

II) మనూర్య, చరిష్మాలు R, Tలు అనే పాఠశాలల్లో చదువుతున్నారు.

వివరణ: ప్రకటన-I, IIల నుంచి మనూర్య చదివే పాఠశాల R, చరిష్మా చదివే పాఠశాల Tలుగా తెలుస్తుంది. కానీ మిగతా పాఠశాలల్లో గరిమ ఎందులో చదువుతుందో తెలియదు. **జ: 4**

8 'NO' అనే పదానికి కోడ్ ఏది?

ప్రకటనలు: I) ఒక సంకేత భాషలో 'Ne Pa Sic Lo' అంటే 'But No None And ', 'Pa Lo Le Ne' అంటే 'If None And But' అని అర్థం.

II) ఒక సంకేత భాషలో 'Le Se Ne Sic' అంటే 'If No None Will', 'Le Pi Se Be' అంటే 'Not None If All' అని అర్థం.

వివరణ: ప్రకటన-I నుంచి

Ne Pa Sic Lo → But No None And

Pa Lo Le Ne → If None And But

పై రెండు వాక్యాల్లో Ne, Pa, Lo లు ఉమ్మడిగా ఉన్నాయి. కాబట్టి Sic అంటే No అని అర్థం. **జ: 1**



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

సీనియర్ ఇంటర్ – భౌతికశాస్త్రం
కిరణ దృశాశాస్త్రం, దృగ్ సాధనాలు

ఫైనల్ పరీక్షలు 2026 – ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

2 మార్కులు

1. ఒక పుటాకార కటకం నాభ్యాంతరం, వక్రతా వ్యాసార్థాలను నిర్వచించండి.

జ: **నాభ్యాంతరం (F):** కటకం దృశ్యా కేంద్రం నుంచి ప్రధాన నాభి మధ్య ఉన్న దూరాన్ని కటకం నాభ్యాంతరం అంటారు.

వక్రతా వ్యాసార్థం: గోళంలో భాగంగా తీసుకున్న వక్రతల వ్యాసార్థాన్ని వక్రతా వ్యాసార్థం అంటారు.

2. వక్రతల దర్పణాల పరావర్తన సూత్రాలు ఏమిటి?

జ: ★ పరావర్తన కోణం, పతన కోణానికి సమానం.

★ పతన కిరణం, పరావర్తన కిరణం, పరావర్తన తలానికి గీసిన లంబం ఒకే తలంలో ఉంటాయి.

3. కుంభాకార కటక సామర్థ్యాన్ని నిర్వచించండి. దాని ప్రమాణాన్ని పేర్కొనండి.

జ: కుంభాకార కటకం నాభ్యాంతరం యొక్క విలోమాన్ని కుంభాకార కటక సామర్థ్యం అంటారు.

$\therefore$ కటకం సామర్థ్యం $(P) = \frac{1}{F\ (\text{మీటర్లలో})}$

ప్రమాణం — డయాప్టర్ (D)

4. 4° స్వల్పకోణం ఉన్న పట్టకం ఒక కాంతి కిరణాన్ని 2.48°తో విచలనం చేస్తుంది. పట్టకం వక్రీభవన గుణకాన్ని కనుక్కోండి?

జ: $A = 4^\circ, D_m = 2.48^\circ \Rightarrow D_m = A(\mu - 1)$

$\mu - 1 = \frac{D_m}{A} = \frac{2.48}{4} = 0.62$

$\mu = 1 + 0.62 \Rightarrow \mu = 1.62.$

5. విక్షేపణం అంటే ఏమిటి? సాపేక్షంగా ఏ రంగు అధికంగా విక్షేపణం చెందుతుంది?

జ: పట్టకం ద్వారా తెల్లని కాంతిని పంపినప్పుడు ఏడు రంగులుగా విడిపోతుంది. ఈ దృగ్విషయాన్ని విక్షేపణం అంటారు. ఊదా రంగు గరిష్ఠంగా విచలనం చెందుతుంది.

6. కంటి హ్రస్వదృష్టి అంటే ఏమిటి? దీన్ని ఏవిధంగా సవరించాలి?

జ: హ్రస్వదృష్టి: ఒక వస్తువు నుంచి కంటి కటకం వద్దకు వచ్చే కాంతి అంతఃపటలం (రెటీనా) ముందు భాగంలో ఒక బిందువు వద్ద కేంద్రీకృతమవుతుంది. ఈ రకపు దోషాన్ని హ్రస్వదృష్టి (దగ్గరి దృష్టి) అంటారు. దీన్ని సవరించడానికి ఒక పుటాకార కటకాన్ని వాడతారు.

7. కంటి దూరదృష్టి అంటే ఏమిటి? దీన్ని ఏవిధంగా సవరించాలి?

జ: కంటి కటకం తనపై పతనమైతే కాంతిని అంతఃపటలం వెనుక భాగంలోకి ఒక బిందువు వద్ద కేంద్రీకరింప చేసిన దృష్టి దోషాన్ని దూరదృష్టి అంటారు. దీనిని సవరించడానికి ఒక కుంభాకార కటకాన్ని వాడతారు.

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు




రచయిత: అల్లు రాంబాబు

అక్కడ సంధ్యాకాలం ఉండదు.. సంగీతం వినపడదు!

ఇండియన్ జాగ్రఫీ

సౌర కుటుంబం



సూర్యుడు, సూర్యుడి గురుత్వాకర్షణ పరిధిలో తిరుగుతున్న ఖగోళ వస్తువుల సమూహమే సౌర కుటుంబం. సూర్యుడి చుట్టూ నిర్ణీత కక్ష్యలో తిరిగే ఎనిమిది గ్రహాలు, వాటి ఉపగ్రహాలు, మరుగుజ్జు గ్రహాలు, గ్రహశకలాలు, తోకచుక్కలు తదితరాలు ఎన్నో ఇందులో ఉన్నాయి. సూర్యుడి స్వరూపం, ఒక్కో గ్రహం పరిమాణం, సూర్యుడి నుంచి అవి ఉన్న దూరం, భౌతిక స్వభావం, భ్రమణ, పరిభ్రమణ సమయాలపై పోటీ పరీక్షార్థులకు పరిజ్ఞానం ఉండాలి. శాస్త్రీయంగా, విశ్వాసాల పరంగా సౌరవ్యవస్థలోని పలు గ్రహాలకు ఉన్న పేర్లు, వాటి ప్రత్యేకతలతో పాటు చంద్రుడిపై వాతావరణం గురించి ప్రాథమిక అంశాలను తెలుసుకోవాలి.

1. కిందివాటిలో సూర్యుడికి సంబంధించిన వాక్యాలు సరిచూడండి.
   ఎ) సూర్యుడిలో ప్రధానంగా హైడ్రోజన్ వాయువు 73.5% వరకు ఉంటుంది. తర్వాత స్థానాల్లో హీలియం, ఆక్సిజన్, కార్బన్ ఉన్నాయి.
   బి) సూర్యుడు దాదాపుగా ప్రతి సెకనుకు 40 లక్షల టన్నుల హైడ్రోజన్‌ను మండిస్తూ ఉంటాడు.
   సి) సూర్యుడి భ్రమణానికి సరాసరిగా 27 రోజులు పడుతుంది. ఈ సమయం ధ్రువాల వద్ద 30 రోజులు, భూమధ్యరేఖ వద్ద 24 రోజులుగా ఉంటుంది.
   డి) సూర్యుడి అయస్కాంత క్షేత్రం దాదాపు 11 ఏళ్లకు ఓసారి పూర్తిగా తిరుగుతుంది.
   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి, సి, డి సరైనవి.
   3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   4) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు.

2. కిందివాటిని జతపరచి సమాధానం గుర్తించండి.

గ్రహం	సూర్యుడి నుంచి ఉన్న దూరం
ఎ) బుధుడు	1) 228 మిలియన్ కి.మీ.
బి) శుక్రుడు	2) 157 మిలియన్ కి.మీ.
సి) భూమి	3) 58 మిలియన్ కి.మీ.
డి) అంగారకుడు	4) 108 మిలియన్ కి.మీ.

   1) ఎ-4, బి-3, సి-2, డి-1
   2) ఎ-4, బి-1, సి-3, డి-2
   3) ఎ-3, బి-4, సి-2, డి-1
   4) ఎ-1, బి-4, సి-3, డి-2

3. కింది వాక్యాలు సరిచూడండి.
   ఎ) సౌరకుటుంబంలో గ్రహశకలాల సముదాయం అంగారకుడు, బృహస్పతి మధ్య విస్తరించి ఉంటుంది.



   బి) గ్రహశకలాల సముదాయం మొత్తం గ్రహాలను అంతర గ్రహాలు, బాహ్య గ్రహాలుగా విభజిస్తుంది.
   సి) హేలీ అనే తోకచుక్క ప్రతి 76 ఏళ్లకు ఒకసారి భూమికి దగ్గరగా వస్తుంది.
   డి) సూర్యుడి మధ్యలో శక్తి ఉత్పత్తి అవుతుంది. ఇది పూర్తిగా అతుకులు అతుకులుగా ఉంటూ ఉపరితలానికి ఉద్భవిస్తుంది. దీన్నే గ్రాన్యూల్స్ అంటారు.
   1) ఎ, బి, సి, డి సరైనవి.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
   4) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.

4. కిందివాటిని జతపరచి సమాధానం గుర్తించండి.

గ్రహాలు	పరిభ్రమణానికి పట్టే సమయం
ఎ) బుధుడు	1) 11 సంవత్సరాల 11 నెలలు (12 సంవత్సరాలు)
బి) శుక్రుడు	2) 687 రోజులు
సి) అంగారకుడు	3) 255 రోజులు
డి) బృహస్పతి	4) 88 రోజులు

   1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-1, బి-4, సి-3, డి-2
   3) ఎ-4, బి-3, సి-1, డి-2 4) ఎ-4, బి-3, సి-2, డి-1

5. కిందివాటిలో గురుగ్రహం (బృహస్పతి)కి సంబంధించిన వాక్యాలు సరిచూడండి.
   ఎ) గురుగ్రహంపై వాతావరణం మొత్తం హైడ్రోజన్, హీలియం వాయువులతో నిండి ఉంటుంది.
   బి) సౌరకుటుంబంలో అతిపెద్ద గ్రహం. తక్కువ భ్రమణ సమయం ఉంటుంది.
   సి) దీని అతిపెద్ద ఉపగ్రహం 'గనీమెడ్'. ఇది బుధ గ్రహం కంటే పెద్దది.
   డి) భూమి కంటే గురు గ్రహ పరిమాణం దాదాపు 1300 రెట్లు ఎక్కువ.
   1) ఎ, బి, సి, డి సరైనవి.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
   4) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.

6. కిందివాటిని జతపరచి సమాధానం గుర్తించండి.

గ్రహాలు	గ్రీకులో వాటి పేర్లు
ఎ) బుధుడు	1) సారవంతమైన గ్రహం
బి) శుక్రుడు	2) సందేశ దేవుడు
సి) అంగారకుడు	3) శృంగార దేవుడు
డి) భూమి	4) యుద్ధానికి అధిపతి

   1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-3, బి-4, సి-2, డి-1
   3) ఎ-2, బి-3, సి-4, డి-1 4) ఎ-1, బి-4, సి-2, డి-3

7. శని గ్రహానికి సంబంధించిన వాక్యాలు సరిచూడండి.
   ఎ) సౌరకుటుంబంలోనే అత్యధిక ఉపగ్రహాలు (82) ఉన్న గ్రహం.
   బి) శని గ్రహం చుట్టూ ఉన్న అందమైన రింగుల వలయాలను గెలీలియో గుర్తించాడు.
   సి) ఈ గ్రహం చాలా తేలికగా, తక్కువ సాంద్రతతో ఉంటుంది.
   డి) సౌర కుటుంబంలో బృహస్పతి తర్వాత రెండో పెద్ద గ్రహం. బాహ్య గ్రహాల్లోనూ రెండో పెద్ద గ్రహం.
   1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   3) ఎ, బి, సి, డి సరైనవి.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

8. కిందివాటిని జతపరచండి.

గ్రహాలు	భ్రమణ సమయం
ఎ) బృహస్పతి	1) 16 గంటల 7 నిమిషాలు
బి) శని	2) 17 గంటల 14 నిమిషాలు
సి) ఇంద్రుడు	3) 10 గంటల 40 నిమిషాలు
డి) వరుణుడు	4) 9 గంటల 56 నిమిషాలు (10 గంటలు)

   1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-4, సి-2, డి-3
   3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-4, బి-3, సి-1, డి-2

9. శుక్ర గ్రహానికి సంబంధించిన వాక్యాలు సరిచూడండి.
   ఎ) శుక్ర గ్రహం పరిమాణం, సాంద్రతలో భూమిని పోలి ఉండటంతో దీన్ని భూమికి కవల గ్రహంగా పిలుస్తారు.
   బి) ఈ గ్రహంపై సూర్యుడు పశ్చిమాన ఉదయిస్తాడు. కారణం దీనికి భ్రమణం తూర్పు నుంచి పశ్చిమానికి ఉండటం.
   సి) అత్యంత ప్రకాశవంతమైన గ్రహం. చంద్రుని తర్వాత అంత ప్రకాశవంతంగా కనిపిస్తుంది.
   డి) ఈ గ్రహంపై సౌరకుటుంబంలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉంటాయి. అక్కడి వాతావరణంలో 95% వరకు కార్బన్ డై ఆక్సైడ్ ఉండటమే అందుకు కారణం.
   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   4) ఎ, బి, సి, డి సరైనవి.

10. కిందివాటిని జతపరచి సమాధానం గుర్తించండి.

గ్రహాలు	సూర్యుడికి, గ్రహాలకి మధ్య దూరం
ఎ) బృహస్పతి	1) 4496 మిలియన్ కి.మీ.
బి) శని	2) 2869 మిలియన్ కి.మీ.
సి) ఇంద్రుడు	3) 778 మిలియన్ కి.మీ.
డి) వరుణుడు	4) 1427 మిలియన్ కి.మీ.

   1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-3, బి-4, సి-2, డి-1
   3) ఎ-1, బి-4, సి-2, డి-3 4) ఎ-4, బి-3, సి-2, డి-1

11. అంగారక గ్రహానికి సంబంధించిన వాక్యాలు సరిచూడండి.
   ఎ) అంగారక గ్రహ ఉపరితలం ఐరన్ ఆక్సైడ్‌తో నిండి ఉండటంతో ఎరుపు రంగులో కనిపిస్తుంది.
   బి) ఈ గ్రహంపై ఒలంపస్ మాన్ అనే విలుప్త అగ్ని పర్వతం ఉంది. దీని ఎత్తు దాదాపు 25 కి.మీ.లు, పొడవు 600 కి.మీ.లు.
   సి) ఇస్రో 2014, సెప్టెంబరు 24న మార్స్ ఆర్బిటార్ మిషన్‌ను అంగారక కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.
   డి) దీన్ని ఆర్యదేవత అయిన మంగళ పేరుతో కూడా పిలుస్తారు. అందుకే ఇస్రో ఈ గ్రహంపై అన్వేషణకు మంగళయాన్ అనే పేరు పెట్టింది.
   1) ఎ, బి, సి, డి సరైనవి.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

12. కిందివాటిని జతపరచి సమాధానం గుర్తించండి.

గ్రహాలు	గ్రీకు పేర్లు
ఎ) బృహస్పతి	1) సముద్ర దేవుడు
బి) శని	2) స్వర్గానికి అధిపతి
సి) ఇంద్రుడు	3) దేవతలకు దేవుడు
డి) వరుణుడు	4) వ్యవసాయానికి అధిపతి

   1) ఎ-1, బి-4, సి-2, డి-3 2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-3, బి-4, సి-2, డి-1

13. కింది వాక్యాలు సరిచూడండి.
   ఎ) చంద్రుడికి, భూమికి మధ్య సరాసరి దూరం 3,84,400 కి.మీ. భూమి వ్యాసంలో 4వ వంతు వ్యాసంతో చంద్రుడు ఉంటాడు.



   బి) చంద్రుడిపై ఉన్న దుమ్ము, ధూళితో ఏర్పడిన మైదానం సీ ఆఫ్ ట్రాంక్విలిటీ. ఇక్కడ 1969, జులై 21న నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అడుగుపెట్టాడు.
   సి) చంద్రుడిపై సంగీతం వినబడదు. సంధ్యాకాలాలు ఉండవు. కారణం వాతావరణం లేకపోవడం.
   డి) చంద్రుడికి, భూమికి మధ్య తక్కువ దూరాన్ని పెరీజి (3,63,104 కి.మీ) అంటారు. అధిక దూరాన్ని అపోజి (4,05,696 కి.మీ) అంటారు.
   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి, సి, డి సరైనవి.
   3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   4) ఎ, సి సరైనవి; బి, డి సరికావు.

14. కిందివాటిని జతపరచి సమాధానం గుర్తించండి.

గ్రహాలు	ఇతర పేర్లు
ఎ) శుక్రుడు	1) గ్రీన్ ప్లానెట్
బి) బృహస్పతి	2) గోల్డెన్ ప్లానెట్
సి) శని	3) వేగుచుక్క
డి) ఇంద్రుడు	4) నక్షత్ర గ్రహం

   1) ఎ-3, బి-4, సి-2, డి-1 2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-1, బి-2, సి-3, డి-4

15. కింది వాక్యాలు సరిచూడండి.
   ఎ) సౌరకుటుంబంలో వరుణ గ్రహ పరిభ్రమణానికి సరాసరిగా 164 సంవత్సరాలు పడుతుంది.
   బి) ఇటలీకి చెందిన ఖగోళ శాస్త్రవేత్త గెలీలియో టెలిస్కోపు కనుక్కోవడంతో విశ్వంపై ఒక శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం మొదలైందని చెప్పవచ్చు.
   సి) సౌరకుటుంబంలో ప్రస్తుతం 8 గ్రహాలు ఉండగా, 2006కు ముందు 9 గ్రహాలు ఉండేవి. ఆ 9వ గ్రహమే ప్లూటో.
   డి) సూర్యుడు దాదాపుగా తన భ్రమణ సమయంలో 7.25 డిగ్రీలు వంగి తిరుగుతాడు.
   1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   3) ఎ, బి, సి, డి సరైనవి.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

16. కిందివాటిని జతపరచి సమాధానం గుర్తించండి.

గ్రహాలు	వాటి వ్యాసం
ఎ) బృహస్పతి	1) 6800 కి.మీ.
బి) శని	2) 12,112 కి.మీ.
సి) శుక్రుడు	3) 1,43,000 కి.మీ.
డి) అంగారకుడు	4) 1,21,000 కి.మీ.

   1) ఎ-3, బి-4, సి-2, డి-1 2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-1, బి-4, సి-2, డి-3
   4) ఎ-4, బి-1, సి-3, డి-2



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-2; 2-3; 3-1; 4-4; 5-1; 6-3; 7-3; 8-1; 9-4; 10-2; 11-1; 12-4; 13-2; 14-1; 15-3; 16-1.

గాంధీ విగ్రహం సూక్ష్మ నమూనా వేలానికి!

లండన్: సెంట్రల్ లండన్ స్క్వేర్‌లోని ప్రసిద్ధ మహాత్మా గాంధీ విగ్రహానికి సంబంధించిన సూక్ష్మ నమూనా ప్రతిమను వచ్చే వారం ఇంగ్లాండ్‌లో వేలానికి పెట్టనున్నారు. దాని విలువ దాదాపు రూ.7,20,000 నుంచి రూ.9,60,000 మధ్య పలకనున్నట్లు అంచనా వేస్తున్నారు. 27 సెంటీ మీటర్ల ఈ కాంస్య ప్రతిమ లండన్ బ్లూమ్స్‌బరీలోని టావిస్టాక్ స్క్వేర్ వద్ద 1968లో ఏర్పాటుచేసిన గాంధీ విగ్రహానికి సంబంధించిన మొదటి సూక్ష్మ నమూనా. దీన్ని పోలండ్ శిల్పి ఫ్రెడా బ్రిలియంట్ తయారు చేశారు.

అఫ్గాన్-పాక్ మధ్య మళ్లీ కాల్పులు

ఇస్లామాబాద్: అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ సరిహద్దులోని చమన్ వద్ద శుక్రవారం ఇరుదేశాల బలగాల మధ్య తీవ్రస్థాయిలో కాల్పులు జరిగినట్లు వార్తలు వెలువడుతున్నాయి. దీనిపై ఇరుదేశాలు పరస్పరం ఆరోపణలు గుప్పించుకుంటున్నాయి. కాల్పుల్లో ప్రాణనష్టం లేదు కానీ, ఓ మహిళ సహా ముగ్గురికి గాయాలయ్యాయి. కాల్పులపై అటు పాకిస్థాన్, ఇటు అఫ్గానిస్థాన్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు.



భారత్‌కు అధునాతన ఇజ్రాయెలీ తుపాకులు

జెరూసలెం: నిరుడు కుదిరిన కాంట్రాక్టు కింద భారతదేశానికి అందించాల్సిన 40,000 లైట్ మెషీన్ గన్స్ (ఎల్‌ఎంజీల)లో తొలి విడత తుపాకులను వచ్చే ఏడాది ఆరంభం నుంచి సరఫరా చేస్తామని ఇజ్రాయెల్ వెపన్ ఇండస్ట్రీస్ (ఐడబ్ల్యూఐ) సీఈఓ షుకి ష్వార్జ్ తెలిపారు. మొత్తం అయిదేళ్లలో అన్ని ఎల్‌ఎంజీలను అందిస్తామని ప్రకటించారు. వీటికితోడు శత్రువుతో దగ్గర నుంచి పోరాడటానికి ఉపకరించే 1,70,000 కార్బైన్స్‌లో 40 శాతం తుపాకుల సరఫరాకు కూడా కాంట్రాక్టు కుదరనున్నదని చెప్పారు. మిగతా 60 శాతం కార్బైన్స్ సరఫరాకు భారత్ ఫోర్జ్ ఒప్పందం కుదుర్చుకోనుంది. తమ కార్బైన్స్‌ను అదానీ గ్రూపునకు చెందిన పీఎల్‌ఆర్ సిస్టమ్స్ భారత్‌లోనే తయారుచేస్తుందని ఆయన తెలిపారు. మేక్ ఇన్ ఇండియా పథకం కింద భారత గడ్డపై ఆయుధాలు తయారీకి తాము ముందుకొచ్చామన్నారు. తమ పిస్టల్స్, రైఫిల్స్, మెషీన్ గన్స్‌ను విక్రయించడానికి ఐడబ్ల్యూఐ భారత హోం శాఖకు చెందిన వివిధ సంస్థలతో సంప్రదింపులు జరుపుతోందని ష్వార్జ్ తెలిపారు.

మోదీ, పుతిన్‌ల మధ్యలో ఉన్న
ఆ మొక్క ప్రత్యేకతలేంటి?



దిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ప్రధాని మోదీ మధ్య శుక్రవారం హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక భేటీ జరిగిన సంగతి తెలిసిందే. ఈ భేటీ సమయంలో ఇరు దేశాధినేతల మధ్యలో ప్రత్యేకంగా కనిపించిన ఓ మొక్క అందరి దృష్టిని ఆకర్షించింది. ఎరుపు, పసుపు రంగులతో ఉన్న ఆ మొక్క పేరు, ప్రత్యేకతలను తెలుసుకునేందుకు నెటిజన్లు గూగుల్‌ను తెగ వెతికేస్తున్నారు. ఇంతకీ ఆ మొక్క పేరు హెలికోనియా. సానుకూల శక్తికి సూచికగా దీన్ని పేర్కొంటారు. వృద్ధి, శ్రేయస్సు, సమతుల్యత, సామరస్యాలతో పాటు నూతన ప్రారంభాలకు శుభపరిణామంగా ఈ మొక్కను భావిస్తారు. సాధారణంగా అత్యున్నతస్థాయి దౌత్య సమావేశాల కోసం సిద్ధంచేసే గదుల్లో ఏ వస్తువైనా సరే యాదృచ్ఛికంగా ఉంచరు. పూలు, రంగులు, సీట్ల ఏర్పాటు, బ్యాక్‌గ్రౌండ్ వంటివి పక్కాగా ఉండేలా చూసుకుంటారు. ఈ మొక్క కూడా కేవలం అలంకరణ కోసం మాత్రమే పెట్టింది కాదు. భారత్, రష్యా మధ్య స్నేహ బంధానికి, ద్వైపాక్షిక సహకార పురోగతికి ప్రతీకగా హెలికోనియా మొక్కను ఏర్పాటుచేసి ఉంటారని నెటిజన్లు భావిస్తున్నారు.

వచ్చే ఏప్రిల్‌లో అయోధ్యలో మసీదుకు శంకుస్థాపన!

లఖ్‌నవూ: అయోధ్యలో కొత్త మసీదు నిర్మాణ పనులు వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ ప్రార్థనా మందిర నిర్మాణ బాధ్యతలను చూస్తున్న ఇండో-ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ (ఐఐసీఎఫ్) ఛైర్మన్ జుఫార్ ఫారుఖీ పేర్కొన్నారు. అయోధ్యకు 25 కిలోమీటర్ల దూరంలోని ధన్నిపుర్‌లో మసీదు సిద్ధమవుతుందని చెప్పారు. సవరించిన లేఔట్ ప్లాన్‌ను ఈ నెలాఖరుకు అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ (ఏడీఏ)కి సమర్పిస్తామని చెప్పారు. తొలుత తాము సమర్పించిన ప్లాన్‌ను ఏడీఏ తిరస్కరించిందని తెలిపారు. దాన్ని వెనక్కి తీసుకోవాలని తాము కూడా అంతకుముందు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆధునిక డిజైన్‌పై ముస్లింల నుంచి అభ్యంతరాలు రావడమే ఇందుకు కారణమని చెప్పారు. సంప్రదాయ డిజైన్‌ను ఎంపిక చేశామన్నారు.

అయోధ్యలో వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్న 2.77 ఎకరాల భూమిని రామమందిర నిర్మాణానికి అప్పగిస్తూ 2019 నవంబరు 9న సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పిన సంగతి తెలిసిందే. అలాగే మసీదు నిర్మాణానికి అయోధ్యలో ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని స్పష్టంచేసింది. "న్యాయస్థాన తీర్పునకు అనుగుణంగా ధన్నిపుర్‌లో మాకు ఐదు ఎకరాల భూమిని కేటాయించారు. అయితే సాంకేతిక అంశాల వల్ల నాలుగు ఎకరాలు మాత్రమే వినియోగ స్థితిలో ఉంది. అందువల్ల మసీదు ప్రాజెక్టు ఒకటి కన్నా ఎక్కువ చోట్ల రావొచ్చు" అని ఫారుఖీ చెప్పారు.

శౌర్య దివస్‌గా అభివర్ణించిన భాజపా నేతలు

అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత దినాన్ని పురస్కరించుకొని భాజపా శనివారం సామాజిక మాధ్యమంలో ఒక వీడియో క్లిప్‌ను పోస్ట్ చేసింది. ఇందులో రామజన్మభూమి ఉద్యమానికి సంబంధించిన కొన్ని దృశ్యాలను ప్రదర్శించింది. ఈ రోజును 'శౌర్య దివస్'గా అభివర్ణించింది. రామ మందిర నిర్మాణం కోసం ప్రాణాలు అర్పించినవారికి నివాళులర్పించింది. 1992 డిసెంబరు 6న కరసేవకులు.. 16వ శతాబ్దం నాటి బాబ్రీ మసీదును కూల్చివేసిన సంగతి తెలిసిందే. మరో వైపు ముస్లింలు ఈ రోజును 'బ్లాక్ డే'గా అభివర్ణిస్తారు.

భారత్‌కు అమెరికా క్షమాపణలు చెప్పాలి

- మునీర్‌ను అప్పుడే అరెస్టు చేసి ఉండాల్సింది
- ట్రంప్ తీరుపై పెంటగాన్ మాజీ అధికారి కీలక వ్యాఖ్యలు

వాషింగ్టన్: పాకిస్థాన్ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్ ఇటీవల అమెరికాకు వచ్చినప్పుడు గౌరవించడానికి బదులు అరెస్టు చేసి ఉండాల్సిందని పెంటగాన్ మాజీ అధికారి మైఖెల్ రూబిన్ వ్యాఖ్యానించారు. ఈ ఏడాది జూన్‌లో మునీర్‌కు వైట్‌హౌస్‌లో దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విందు ఇవ్వడాన్ని ఆయన తప్పుపట్టారు. గత ఏడాది కాలంగా తప్పుడు విధానాలను అనుసరిస్తున్నందుకు, 50 శాతం దిగుమతి సుంకాలను విధించినందుకు భారత్‌కు అమెరికా మౌఖిక క్షమాపణలు చెప్పాలన్నారు. ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా, ప్రపంచ ప్రజాస్వామిక దేశాల ప్రయోజనాలే వ్యక్తి అహంభావం కంటే చాలా ముఖ్యమైనవన్నారు. అహంభావాన్ని పక్కన పెట్టి, ట్రంప్ క్షమాపణలు చెప్పాలన్నారు. ట్రంప్ సర్కారు భారత్ లాంటి మిత్రదేశాన్ని వదిలేసి, పాకిస్థాన్ లాంటి దేశాన్ని అక్కున చేర్చుకోవడంలో వ్యూహాత్మకమైన తార్కికత ఏదీ లేదన్నారు. నాటోయేతర అమెరికా ప్రధాన మిత్రదేశం అయ్యే అర్హత పాక్‌కు లేదని రూబిన్ అభిప్రాయపడ్డారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషించే దేశంగా పాకిస్థాన్‌ను గుర్తించి తీరాలని డిమాండ్ చేశారు. ఒకవేళ మళ్లీ మునీర్ అమెరికాకు వస్తే, అరెస్టు చేయాలన్నారు.

భారత్‌ను రష్యాకు వదిలేయడాన్ని అమెరికన్లు స్వాగతించరు

'భారత్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాజా పర్యటన.. అమెరికా సర్కారు అసమర్థత, వైఫల్యంగానే కనిపిస్తోంది. అమెరికాలో మెజారిటీ ప్రజలు ట్రంప్‌ను ఇష్టపడటం లేదు. ట్రంప్‌ను వ్యతిరేకించే అమెరికన్లు దాదాపు 65 శాతం ఉన్నారని ఇటీవలే సర్వేలలో వెల్లడైంది. భారత్ లాంటి మిత్రదేశాన్ని రష్యాకు ట్రంప్ వదిలేయడాన్ని అమెరికన్లు అసలు స్వాగతించరు' అని రూబిన్ చెప్పారు.

వెంటిలేటర్‌పై ఇండియా కూటమి: ఒమర్

దిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి వెంటిలేటర్ మీద ఉందని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చెప్పారు. శనివారం హిందుస్థాన్ టైమ్స్ పత్రిక నిర్వహించిన నాయకత్వ శిఖరాగ్ర సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలవడానికి భాజపా అనుక్షణం శ్రమిస్తుంటే, ఇండియా కూటమి అంతఃకలహాలలో మునిగి తేలుతోందని ఆయన వ్యాఖ్యానించారు. "నీతీశ్ కుమార్‌ను మనమే ఎన్డీయే కూటమిలోకి నెట్టాం. ఝార్ఖండ్ ముక్తిమోర్చాను కలుపుకొని పోలేకపోయాం. ఇలాంటి వైఫల్యాలే బిహార్ ఎన్నికల్లో ఇండియా కూటమిని దెబ్బతీశాయి. మోదీ బృందం ఒక రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన వెంటనే తదుపరి ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో విజయం కోసం కృషి మొదలుపెడుతుంది. ఎన్నికలకు రెండు నెలల ముందు ఇండియా కూటమి తీరిగ్గా ప్రయత్నాలు ఆరంభిస్తుంది. ఈ లోపాన్ని సరిదిద్దుకోవాలి" అని చెప్పారు. తాను భాజపా రాజకీయాలను వ్యతిరేకిస్తున్నా భారత ప్రభుత్వంతో కలసి పని చేస్తానని అబ్దుల్లా వివరించారు.

కిర్గిస్థాన్‌లో చిక్కుకున్న 12 మంది భారతీయులు

- పని కోసం వెళ్లి హింసలకు గురవుతున్నామని ఆవేదన

పీలీభీత్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని పీలీభీత్ జిల్లాకు చెందిన 12 మంది కూలీలు పని కోసం కిర్గిస్థాన్ వెళ్లి ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. తమను పశువుల కంటే హీనంగా హింసిస్తున్నారని వారు బంధువులకు వీడియో మెసేజ్‌లు పంపుతున్నారు. సరైన ఆహారం ఇవ్వట్లేదని, స్వదేశానికి పంపేందుకు నిరాకరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు రాష్ట్ర హోం విభాగం కేసు దర్యాప్తును ఎస్పీకి అప్పగించింది. జిల్లా అధికారులు ఆ 12 మందికి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదికను హోం శాఖకు సమర్పించారు. వారిని స్వదేశానికి తీసుకువచ్చేందుకు ఆ నివేదిక ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. తమ వారిని కిర్గిస్థాన్ పంపిన స్థానిక సంస్థపై బాధిత కుటుంబాల వ్యక్తులు కేసు నమోదు చేశారు. స్వదేశానికి తిరిగి తీసుకురావడానికి స్థానిక ఏజెంట్లు రూ. 2 లక్షలు డిమాండ్ చేశారని ఆరోపించారు.

భర్త ఎమ్మెల్యే.. భార్య అంగన్‌వాడీ టీచర్..

- సాధారణ జీవితం వీడని దంపతులు




ప్రస్తుత రోజుల్లో వార్డు పంచాయతీ సర్పంచి అయితే చాలు భార్య దర్పం ఎంతో మారిపోతోంది. కానీ, భర్త ఎమ్మెల్యే అయినప్పటికీ ఓ అంగన్‌వాడీ టీచర్ సాధారణ జీవితాన్ని గడుపుతూ చిన్నారుల సంరక్షణే నిజమైన బాధ్యతగా భావిస్తున్నారు. కర్ణాటకలోని ఖానాపుర్ ఎమ్మెల్యే విఠల్ హలగేకర్.. ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన 4 నెలలకే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన భార్య రుక్మిణి అంగన్‌వాడీ టీచర్. భర్త ఎమ్మెల్యే అయినా ఆమె ఆ ఉద్యోగాన్ని వీడలేని బాధ్యతగా భావిస్తున్నారు. పైగా మునుపటి కంటే మరింత బాధ్యతతో విధులు నిర్వర్తిస్తున్నారు. 'భర్త ఎమ్మెల్యే అయినందుకు చాలా గర్వంగా, సంతోషంగా ఉంది. ఆయన పేరును దుర్వినియోగం చేయను. అంగన్‌వాడీ ఉద్యోగం మానేయమని చాలా మంది సలహా ఇచ్చారు. కానీ నేను వదల్లేదు. నాకు సంతానం లేదు. విద్యార్థుల్లోనే నా పిల్లలను చూసుకుంటాను' అని రుక్మిణి తెలిపారు.



ఆమె 1992 నుంచి బాలవాడీ, అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. 'భర్త ఎమ్మెల్యే అయ్యాక నా ఉద్యోగాన్ని వదిలిపెట్టలేదు. సాటి అంగన్‌వాడీ టీచర్ల మాదిరిగానే ఉదయం 9 గంటలకు కేంద్రానికి వెళ్తాను. పిల్లలకు పాఠాలు బోధిస్తాను. భోజనం వడ్డిస్తాను. ఆటలు ఆడిస్తాను. సాయంత్రం 4.30 గంటలకు ఇంటికి తిరిగి వస్తాను. ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేస్తున్నాను' అని తెలిపారు. ఆమె విఠల్ హలగేకర్ అనారోగ్యానికి గురికావడంతో తన కిడ్నీ దానం చేసి భర్త ప్రాణాలు కాపాడారు రుక్మిణి. ఇదే విషయంపై ఎమ్మెల్యే భావోద్వేగానికి గురయ్యారు. 'కొత్త జీవితాన్ని ఇచ్చిన భార్య రుణం తీర్చుకోలేను. ఆమె వల్లే ఇంకా బతికున్నాను. అధికారం శాశ్వతం కాదు. పదవిలో ఉన్నంత కాలం ప్రజలకు మంచి చేయాలి' అని విఠల్ హలగేకర్ తెలిపారు.

దివ్యాంగ ఖైదీల కోసం ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ ఏర్పాటు చేయండి

- రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం



దిల్లీ: దివ్యాంగులైన ఖైదీల కోసం స్వతంత్ర, సులభంగా అందుబాటులో ఉండేలా ఒక ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాలంటూ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రతిపాదిత వ్యవస్థలో ఫిర్యాదుల నమోదు, సమర్థ పర్యవేక్షణ, సకాలంలో పరిష్కారానికి ఏర్పాట్లు ఉండాలంది. వ్యవస్థీకృత నిరాదరణ, దూషణ, వివక్ష వంటి వాటి నుంచి ఈ తరహా ఖైదీలను రక్షించడానికి ఇది అవసరమని స్పష్టంచేసింది. జైలు వ్యవస్థలోని విద్యా సౌకర్యాలను వారు పొందగలగాలని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. "వైకల్యం కారణంగా విద్యను పొందలేని పరిస్థితి ఏ ఖైదీకీ ఎదురుకాకూడదు. వారికి అవకాశం కల్పించేందుకు అవసరమైన సర్దుబాట్లు చేయాలి" అని నిర్దేశించింది. దివ్యాంగ ఖైదీలు కుటుంబ సభ్యులతో ములాఖత్ కావడానికి మరింత వెసులుబాటు ఉండాలని స్పష్టంచేసింది. తద్వారా వారు కుటుంబ తోడ్పాటు, భావోద్వేగపరంగా ప్రశాంతత పొందడంతోపాటు తమ ప్రత్యేక అవసరాలపై నిరంతర పర్యవేక్షణను చేపట్టగలరని పేర్కొంది. ఈ అంశంలో గతంలో ఇచ్చిన ఆదేశాలను ప్రస్తావించింది. చక్రాల కుర్చీల కదలికకు వీలుగా జైలు ప్రాంగణాలు ఉండాలని తెలిపింది. అలాగే దివ్యాంగుల వినియోగానికి అనుగుణంగా మరుగుదొడ్లు ఉండాలని, ర్యాంపులు ఏర్పాటు చేయాలని స్పష్టంచేసింది.

రాజ్యాంగం నుంచి లౌకికవాదం, సామ్యవాదం పదాలను తొలగించాలని ప్రైవేట్ బిల్లు

- రాజ్యసభలో ప్రవేశపెట్టిన భాజపా ఎంపీ

దిల్లీ: రాజ్యాంగ ప్రవేశిక నుంచి లౌకికవాదం, సామ్యవాదం అనే పదాలను తొలగించాలని రాజ్యసభలో ప్రైవేట్ బిల్లు దాఖలైంది. ఈ పదాలను ఎమర్జెన్సీ రోజుల్లో అప్రజాస్వామిక పద్ధతుల్లో చేర్చారని పేర్కొంటూ భాజపా ఎంపీ భీంసింగ్ ఈ బిల్లు ప్రవేశపెట్టారు. ఈ పదాలు రాజ్యాంగంలో మొదటి నుంచీ లేవనీ, తర్వాత చేసిన మార్పు వల్ల చాలా సందర్భాల్లో అయోమయం ఎదురవుతోందని బిల్లులో పేర్కొన్నారు. "1976లో ఎమర్జెన్సీ ప్రకటించారు. అప్పటి ప్రతిపక్ష నేతలు వాజ్‌పేయీ, ఆడ్వాణీ, జార్జ్ ఫెర్నాండెజ్ తదితరులు జైలులో ఉన్న సమయంలో.. 42వ సవరణ ద్వారా ఈ పదాలను ఇందిరాగాంధీ చేర్పించారు. వీటిని తీసేసి రాజ్యాంగ నిర్మాతలు రాసిన అసలు ప్రవేశికనే కొనసాగించాలి' అని పేర్కొన్నారు. 'సెక్యులరిజం పదాన్ని చేర్చడంపై అంబేడ్కర్ ఉన్నప్పుడే చర్చ జరిగింది. మొత్తం రాజ్యాంగమే సెక్యులర్ అయినందున ఆ పదాన్ని చేర్చాల్సిన అవసరం లేదని ఆయన అప్పుడే స్పష్టంచేశారు. అంబేడ్కర్ సోషలిజంపైనా తన అభిప్రాయాన్ని పంచుకుంటూ ఈ రోజు మనం ఒక ఆర్థికవిధానాన్ని దేశం మీద రుద్దితే.. భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయి. పేదలకు ప్రభుత్వం అండగా ఉండటమే సామ్యవాదం అయితే దానికి రాజ్యాంగంలో చాలా పరిష్కారాలున్నాయని వివరించారు' అని భీం సింగ్ గుర్తుచేశారు.

డీప్‌ఫేక్ నియంత్రణకు లోక్‌సభలో...



కృత్రిమ మేధ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో డీప్‌ఫేక్ నియంత్రణకు సంబంధించిన బిల్లు శుక్రవారం లోక్‌సభ ముందుకువచ్చింది. వీటి కట్టడికి చట్టబద్ధ వ్యవస్థను రూపొందించేలా ప్రైవేట్ మెంబర్ బిల్లును శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే ప్రవేశపెట్టారు. ఇలాంటి కంటెంట్ రూపొందించేందుకు అవతలి వ్యక్తుల నుంచి ముందస్తు అనుమతిని తప్పనిసరి చేయాలన్నారు. 'వేధింపులు, మోసం, తప్పుడు సమాచారం కోసం డీప్‌ఫేక్‌ను దుర్వినియోగం చేయడం పెరిగిపోయింది. దీని నియంత్రణకు వెంటనే చర్యలు చేపట్టాలి. తప్పుడు కంటెంట్‌ను రూపొందించే వ్యక్తులకు జరిమానాలు విధించాలి. విద్య, వినోదం, సృజనాత్మక రంగాల్లో కృత్రిమ మేధతో ప్రయోజనం చేకూరుతున్నప్పటికీ.. అది దుర్వినియోగమైతే మాత్రం వ్యక్తిగత గోప్యత, దేశ భద్రత, ప్రజా విశ్వాసాలకు తీవ్రమైన ముప్పు కలిగిస్తుంది. దీన్ని నియంత్రించేందుకు డీప్‌ఫేక్ టాస్క్‌ఫోర్స్‌ను రూపొందించాలి. డీప్‌ఫేక్ ద్వారా రూపొందించిన కంటెంట్‌ను గుర్తించే సాంకేతికతల్ని అభివృద్ధి చేయాలి' అని శిందే పేర్కొన్నారు.

భారత్ బంధాలను
వీటో చేసే అధికారం ఏ దేశానికీ లేదు

- విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్



దిల్లీ: ప్రపంచంలో ఏ దేశంతోనైనా సంబంధాలు ఏర్పరచుకునే హక్కు, స్వేచ్ఛ భారత్‌కు ఉన్నాయని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ అన్నారు. భారత్ సంబంధాలను వీటో చేసే అధికారం ఏ దేశానికీ లేదని శనివారం ఓ జాతీయ మీడియా ఏర్పాటుచేసిన శిఖరాగ్ర సమావేశంలో జైశంకర్ వ్యాఖ్యానించారు. రష్యాతో బంధం కారణంగానే అమెరికా-భారత్‌ల వాణిజ్య ఒప్పందం మరింత క్లిష్టంగా మారిందా? అని విలేకరి ప్రశ్నించారు. దీనికి విదేశాంగ మంత్రి బదులిస్తూ.. "వీలైనంత ఎక్కువ దేశాలతో సహకారాన్ని కొనసాగించడం భారత్‌కు ఎంతో కీలకం. ప్రపంచంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఎవరితో సంబంధాలు కొనసాగించాలో ఎంపిక చేసుకునే స్వేచ్ఛ మనకు ఉంది. గత 70-80 ఏళ్లుగా ప్రపంచం చాలా ఎత్తుపల్లాలు చూసింది. కానీ, భారత్-రష్యాల మధ్య బంధం స్థిరంగా కొనసాగుతుంది. దౌత్యం అంటే మరొకరిని సంతోషపెట్టడం కాదు" అని తెలిపారు. అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయన్నారు. త్వరలోనే ఓ ఒప్పందం కూడా జరుగుతుందని చెప్పారు. భారత ప్రయోజనాలకు అనుగుణంగానే ఇది ఉంటుందని తెలిపారు. సరిహద్దుల్లో శాంతి కోసం భారత్- చైనా సంబంధాలు కీలకమన్నారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా అప్పగింతపై ఆయన మాట్లాడుతూ.. భారత్‌లో ఉండటం ఆమె వ్యక్తిగత విషయమని చెప్పారు.



టేకాఫ్‌కు సిద్ధమవుతుండగా విమానంలో మంటలు

బ్రెజిల్: టేకాఫ్‌కు సిద్ధమవుతుండగా, ఓ విమానంలో అగ్నిప్రమాదం సంభవించి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ ఘటన బ్రెజిల్‌లోని గ్వారుల్హోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. లాటమ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానంలో 180 మంది ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ప్రయాణికులను కిందకు దించేశారు. ఆ తర్వాత అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

జమ్మూకశ్మీర్‌లో సోదాలు.. నిషేధిత వస్తువులు స్వాధీనం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో వేర్పాటువాద సంస్థ పోస్టర్లు, నిషేధిత వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉపా కింద నమోదైన ఓ కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) న్యాయస్థానం జారీచేసిన సెర్చ్ వారెంట్ ఆధారంగా లిట్టర్ పుల్వామాకు చెందిన మహమ్మద్ అమీర్ రథర్ అనే వ్యక్తి దుకాణంలో పోలీసులు సోదాలు నిర్వహించారు. దీనిలో జమ్మూకశ్మీర్ డెమోక్రటిక్ ఫ్రీడమ్ పార్టీ (జేకేడీఎఫ్‌పీ) పోస్టర్లు, నిషేధిత పుస్తకాలు దొరికాయని పోలీసులు తెలిపారు.

లోకేశ్ పర్యటన భరోసా కల్పించాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: అమెరికాలో హెచ్1బీ వీసాలతో ఉన్న ఉద్యోగులు, విద్యార్థులకు భరోసా కల్పించేందుకు మంత్రి లోకేశ్ అమెరికా పర్యటన దోహదపడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. "మంత్రి లోకేశ్ ఈనెల 10 వరకు అమెరికాలో పర్యటించనున్నట్లు తెలిసింది. పెట్టుబడులు ఆహ్వానించేందుకు వెళ్తున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో అమెరికాలో తెలుగు వారు ఐటీ తదితర ఉద్యోగాలు చేస్తున్న వారు, చదువుకుంటున్న వారు అభద్రతా భావంతో జీవిస్తున్నారు. వారికి ఉద్యోగ, జీవన భద్రత కోసం అమెరికా ప్రభుత్వంతో మాట్లాడాలి" అని కోరారు.

సామాన్యుల కోసమే సుప్రీంకోర్టు

- సాధారణ ప్రజల పిటిషన్లకు ప్రాధాన్యం
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



దిల్లీ: సామాన్యుల కోసమే సుప్రీంకోర్టు ఉందనే సందేశాన్ని స్పష్టంగా, బలంగా వినిపించాలని భావిస్తున్నామని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా వ్యాజ్యాలు పరిష్కారమయ్యేలా చూడటం, ఏకీకృత జాతీయ న్యాయ విధానం, పెండింగ్ కేసుల్లో శరవేగంగా తీర్పులు వచ్చేలా చేయడం తన ప్రాధాన్యాలుగా వివరించారు. దిల్లీలో శనివారం ఆయన 'హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్'లో ప్రసంగించారు. సాధారణ పౌరులు దాఖలు చేసే పిటిషన్లకూ సుప్రీంకోర్టులో తగినంత ప్రాధాన్యం, సమయం లభించి తీరాలన్నారు. దీనిపై తాను దృష్టిసారిస్తానని తెలిపారు. కక్షిదారులపై ఆర్థిక భారాన్ని తగ్గించేలా చూస్తామన్నారు. న్యాయ స్వతంత్రతపై ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ... 'భారత రాజ్యాంగంలో అధికారాల విభజనలు విస్పష్టంగా ఉన్నాయి. న్యాయ, శాసన, కార్యనిర్వాహక వర్గాలకు వాటి పరిధులు, పరిమితులు తెలుసు' అని తెలిపారు. వివాదాల సత్వర పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. డిజిటల్ అరెస్టులు, సైబర్‌నేరాలు వంటి సరికొత్త సవాళ్లు ఎప్పటికప్పుడు తలెత్తుతూనే ఉంటాయని, వాటిని ఎదుర్కోవడానికి న్యాయవ్యవస్థ సన్నద్ధమవుతూనే ఉండాలన్నారు. కాలానుగుణంగా భారతీయ న్యాయవ్యవస్థ కూడా మారుతోందని చెప్పారు. న్యాయమూర్తుల నియామకాల్లో అన్ని ప్రాంతాలకు, వర్గాలకు, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. భిన్నత్వం, సమ్మిళితం ద్వారా సుప్రీంకోర్టుకు సుసంపన్న సంస్కృతి సమకూరుతుందని అభిప్రాయపడ్డారు. భారతీయ న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్య వ్యవస్థలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలిపారు.

జనవరిలో 9వ విడత 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం

- వచ్చే నెల 11 వరకూ రిజిస్ట్రేషన్ల కొనసాగింపు

దిల్లీ: పరీక్షల ఒత్తిడిని విద్యార్థులు ఎదుర్కోవడానికి, వారిలో భయం పోగొట్టడానికి ప్రధాని మోదీ ఏటా పాల్గొనే 'పరీక్షా పే చర్చా' 9వ విడత కార్యక్రమం జనవరిలో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు వచ్చే నెల 11 వరకూ కొనసాగుతాయని కేంద్ర విద్యా శాఖ అధికారులు తాజాగా వెల్లడించారు. దేశ, విదేశాల్లోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవచ్చు. వీరికి ఆన్‌లైన్‌లో బహుళ ఐచ్ఛిక ప్రశ్నల ద్వారా పోటీ పరీక్ష పెడతారు. అందులో ఎంపికైన వారు పరీక్షల ఒత్తిడి గురించి ప్రధాని మోదీతో నేరుగా చర్చించవచ్చని అధికారులు పేర్కొన్నారు. 'పరీక్షా పే చర్చా' 8వ విడత కార్యక్రమం ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రసారమైంది. ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు, సైనిక్, సీబీఎస్‌ఈ స్కూళ్లు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ బడులకు చెందిన మొత్తం 36 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. అలాగే క్రీడలు, క్రమశిక్షణ, మానసిక ఆరోగ్యం, పోషకాహారం, సాంకేతికత, ఆర్థిక, సృజనాత్మకత, ఆశావాదం వంటి అంశాలపై ప్రముఖులతో నిర్వహించిన ఏడు ప్రత్యేక ఎపిసోడ్‌లూ ప్రసారమయ్యాయి. 245కు పైగా దేశాల నుంచి విద్యార్థులు, 153 దేశాల నుంచి ఉపాధ్యాయులు, 149 దేశాల నుంచి తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని ఆకర్షించి '2025 పరీక్షా పే చర్చా' కార్యక్రమం గిన్నిస్ రికార్డు సాధించిన విషయం తెలిసిందే.



కేరళలోని శబరిమలలో అయ్యప్పస్వామి దర్శనం కోసం శనివారం పోటెత్తిన భక్తులు



అంబేడ్కర్‌కు సీఎం చంద్రబాబు నివాళి

ఈనాడు, అమరావతి: పేదలు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందంటే, వారి స్వరం బలంగా వినిపిస్తుందంటే, వారు తగిన రక్షణ, గౌరవం పొందుతున్నారంటే దానికి అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే కారణమని సీఎం చంద్రబాబు కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆ మహనీయుడి స్మృతికి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా నివాళి అర్పించారు. అంబేడ్కర్ అణగారిన వర్గాల్లో సాంఘిక, రాజకీయ, విద్యా చైతన్యాన్ని రగిలించారని ప్రస్తుతించారు.

అంబేడ్కర్ పాటించిన విలువలు గొప్పవి

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: రాజ్యాంగ రచనలో అంబేడ్కర్, ఆయన బృందం పాటించిన విలువల గురించి ఈ తరం తెలుసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం ఓ ప్రకటనలో ఆయనకు నివాళులు అర్పించారు. 'విశాల భారతంలో సామాజిక సంస్కరణలు పాదుకొల్పిన మహనీయుడు అంబేడ్కర్. ప్రపంచంలో అతిపెద్ద రాజ్యాంగం రూపకల్పనలో మూలస్తంభంగా నిలిచిన ఆయనకు హృదయపూర్వకంగా అంజలి ఘటిస్తున్నా' అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

దార్శనికుడు, మేధావి: జగన్

ఈనాడు, అమరావతి: దేశ నిర్మాణం అంటే ప్రజలకు అవకాశాలు, హక్కులు, గౌరవం ఇవ్వడమేనని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మాజీ ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. 'ఆ స్ఫూర్తితో అణగారిన వర్గాల ఆశలను రాజ్యాంగంగా మలిచిన దార్శనికుడు అంబేడ్కర్. నేడు ఆ రాజ్యాంగ నిర్మాత వర్ధంతి సందర్భంగా నివాళులు' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

భారత్ జట్టుకు సీఎం అభినందనలు

ఈనాడు, అమరావతి: దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్ క్రికెట్ జట్టుకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. "యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల అద్భుత ప్రదర్శనకు ప్రత్యేక అభినందనలు. ఈ చరిత్రాత్మక మ్యాచ్‌కు విశాఖ వేదిక అవడం ఆనందంగా ఉంది" అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.